# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక జూలై, 2013 ₹ 20



వసంతవేళ

# మిసిమి

మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**
*- Dammapada.*

**సంపుటి 24** **జూలై 2013** **సంచిక 7**



*ప్రధాన సంపాదకుడు*
చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*
వల్లభనేని అశ్వినీకుమార్

*సహాయ సంపాదకుడు*
కాంద్రేగుల నాగేశ్వరరావు

*సమాలోచక మండలి*
డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి
డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి
కుర్రా జితేంద్రబాబు
నందిగం కృష్ణారావు

*సంస్థాపక సంపాదకులు*
**రవీంద్రనాథ్ ఆలపాటి**



*Printed & Published by*

**Bapanna Alapati**
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
e-magazine : www.kinige.com/misimi

ప్రతి : ₹20 సంవత్సరానికి : ₹240
విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25

(Library of Congress Control Number)
LCCN 91-903060


# ఈ నెల...


కమ్మతెమ్మెరలు ........................................ 3

21వ శతాబ్దంలో తెలుగు నవల ........................ 5
 – *అంపశయ్య నవీన్*

అమృతం కురిసిన రాత్రి ................................ 14
 – *ప్రొఫెసర్ రావినూతల సత్యనారాయణ*

తెలుగు భాషా వైశిష్ట్యం ................................ 20
 – *ఆచార్య యల్.బి. శంకరరావు*

మన ఇరుగుపొరుగు దేశాల కవిత్వం ................ 25
 – *ముకుంద రామారావు*

ఇచ్చింది, దోచుకొన్నది విజయనగర రాజులే......... 38
 – *దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి*

తిరునామాలు – శ్రీరామానుజులు ...................... 42
 – *డాక్టరు యస్.ఏ.టి. రాజ్యలక్ష్మి*

ఆంధ్రప్రదేశ్‌లో మాలదాసరి సంప్రదాయం........... 48
 – *కొంకే గౌరీశ్వరరావు*

కూచిపూడి కళానికేతన్.................................. 51
 – *వేదాంతం వెంకట నాగచలపతిరావు*

సప్తస్వర వీణాపాణి శ్రీపాద పినాకపాణి .............. 55
 – *సి. యస్. రావు*

హిందూస్థానీ–కర్ణాటక : ఆచార్య బృహస్పతి వాదం ...... 57
 – *నండూరి పార్థసారథి*

త్రిపుర కథాంతం... .................................... 61
 – *తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి*

తెనాలిలో రావూరి భరద్వాజ .......................... 64
 – *డాక్టరు వెలగా వెంకటప్పయ్య*

తెలుగు జాతి శిల్ప కళావైభవం ....................... 66
 – *శ్రీమతి ఎ.శ్రీదేవి*

పూరించిన తెలుగు శంఖం ............................ 76
 – *సి. ధర్మారావు*

చదవండి (పుస్తక పరిచయం).......................... 78

నవ్వులు ................................................ 80


*ముఖచిత్రం* : ఊహల ఉయ్యాల
*రెండవ అట్ట* : వసంత వేళ
*మూడవ అట్ట* : ఆనంద హేల
*నాల్గవ అట్ట* : మధూహాలు

*... చిత్రకారుడు :*
*శిశిర్ సహాన*

(*వివరాలు : 47...*)

రెండు సంవత్సరాలుగా గత దశాబ్దపు నవలాసాహిత్యాన్ని పరిశీలించమని విమర్శకులను, నవలా రచయితలను విశ్వవిద్యాలయాల ఆచార్యులను ఎందరినో వేడుకున్నాం- కొందరు కుదరదన్నారు. మరి కొందరు చూద్దాం అన్నారు. కొద్దిమంది చేద్దాం అన్నారు. కాని చివరికి మా మాట మన్నించి - ఆ కార్యాన్ని నెరవేర్చింది ప్రముఖ నవలా రచయిత అంపశయ్య నవీన్. వీరికి ధన్యవాదాలు.

కొన్ని నెలలుగా పురస్కార సాహిత్యం శీర్షికన కేంద్ర సాహిత్య పురస్కారం పొందిన గ్రంథాలను పరిచయం చేస్తున్నాం- రావినూతల సత్యన్నారాయణ శ్రమకోర్చి నెలనెలా అందిస్తున్నారు. ఈ శీర్షికకు ఉత్సాహం వున్న వారెవ్వరైనా రచనలను పంపవచ్చు.

గత ఆరుమాసాలుగా 'తూర్పు గాలి' శీర్షికతో మనకు తూర్పు దేశాల కవితారీతులను, కవులను పరిచయం చేస్తున్నారు ముకుంద రామారావు. ఈ ప్రయత్నం ఎందరి మన్ననలనో పొందింది. తెలుగులో ఇది మొదటి ప్రయత్నం, మంచి ప్రయత్నం. ఇలాంటి రచనలను మరిన్ని ఆహ్వానిస్తున్నాం.

**మిసిమి** ప్రతిభకు ఎప్పుడూ ఆహ్వానం పలుకుతుంది. ప్రమాణాలకు రాజీ పడదు. మా అభ్యర్థన మేరకు కొన్ని రచనలు వస్తుంటాయి. ఇంకా ఎన్నో రచనలు **మిసిమి**కి ప్రతి నెలా అందుతూనే వుంటాయి. సంపాదక వర్గ సమావేశాల్లోనే వాటి ప్రచురణార్హతను నిర్ణయించి అవకాశాన్ని బట్టి ప్రచురిస్తుంటాం. దీనికి సమయం కనీసం రెండు - మూడు నెలలు పట్టవచ్చు - మాకు చేరే రచనలు ఎక్కువగా ఈ మెయిల్ ద్వారానే వస్తున్నాయి. అంతవరకు వెంటనే అందినట్లు సమాధానం పంపు తుంటాం. ఇక పోస్టులో వచ్చేవన్నీ పరిశీలించి జాగ్రత్త చేస్తుంటాం - ఎప్పుడు ప్రచురించేది, అసలు ప్రచురించలేనిదీ కూడా ముందుగా తెలియజేయటంలో మా యిబ్బందులను రచయితలు సహనంతో గమనించ వలసిందిగా కోరుతున్నాం. ఇప్పటి నుంచి రచన అందినట్లు పోస్ట్ కార్డు పంపటానికి ఏర్పాట్లు చేస్తున్నాం.

పట్టుమని పది కథలు కూడా రాయని త్రిపుర తెలుగు కథకు కొత్త ఆయతం అందించారు. ఆయన ఎప్పుడో రాశారు. ఎక్కడో రాశారు. ఎప్పుడో రాయటం ఆపేశారు. కాని త్రిపురను ఎలా నిర్లక్ష్యం చేయగలం - ఆయన 'గదిలోకి వెళ్ళితలుపులు వేసుకున్నా' సరే - ఆయన్ని మరిచిపోలేము-



'సంగీతం', 'నాట్యం', 'నాటకం', 'సమాజ చరిత్ర', 'శిల్పకళ', 'చిత్రకళ' ఈ శీర్షికలపై రచనలు ఆహ్వానిస్తున్నాం.

**- సంపాదకులు**

# కమ్మతెమ్మెరలు

✶ "...శీలం, శాంతం, సేవాధర్మం, సహనం, సంస్కారం జంట శక్తులుగా భాసిల్లిన బుద్ధదేవుని చరితం, ఆయన స్థాపించిన బౌద్ధమత వైశిష్ట్యం వెన్నెలలా చల్లనిది, సంపంగిలా సౌరభం కలది. అట్టి మహనీయుని మానవత్వానికి ప్రోది అయిన బౌద్ధమతం గురించిన వివిధ శీర్షికలతో ***మిసిమి*** పదహారు వన్నెల పసిమి బంగారంతో ధగధగా మెరిసింది... దాదాపు పదునాలుగు వైవిధ్యమైన శీర్షికలతో విరాజిల్లిన సంచిక సముచిత చిత్రాలతో, చక్కని ముద్రణతో, ఇంపైన శైలితో ఇంద్రధనుస్సులా సప్తవర్ణ శోభితమైంది...సంకల్ప ప్రయత్నంతో మానవుడు తన జీవితాన్ని మలుచుకోగలడు అని చక్కగా చెప్పిన *జీవిత మర్మం బౌద్ధ ధర్మం*లో డి. చంద్రశేఖర్ వ్యాఖ్యానించిన తీరు శీర్షికలలో మకుటాయమానమైంది... మార్గం తెలుసుకొన్నవారే మరొకరికి మార్గం చూపగలరు అని గువ్వల కోటయ్య *మార్గదర్శి*లో చక్కగా చర్చించారు... డాక్టర్ శ్రీనివాసరెడ్డి *మానసిక వైద్యుడు* వ్యాసంలో మానసిక రుగ్మతలకు చేయదగ్గ వైద్య వివరాలను ఆసక్తికరంగా వివరించారు... మల్లంపల్లి గారి *ఆంధ్రదేశంలో బౌద్ధ సంప్రదాయాలు* తెలుసుకోదగ్గ విషయాలతో జిజ్ఞాస రేకెత్తించేదిగా వుంది... కొసమెరుపు నవ్వులు పేజీలో ఐన్‌స్టీన్, చాప్లిన్ హాస్య చతురోక్తులు సంచికకు అందమైన ముగింపు నిచ్చాయి..." **– డాక్టర్ శివభూషణం,** కర్నూలు.



✶ "...మీరు ప్రచురించిన బుద్ధపూర్ణిమ ప్రత్యేక సంచిక పలు విలువైన విషయాలతో కూడి భాషాపరంగా కూడా కదు రమ్యంగా ఉంది. వీటిలో తియ్యగూర సీతారామిరెడ్డి గారు రాసిన *థేరగాథలు* విపశ్యనా సాధకులైన మాకు చాలా ఉపయుక్తంగా ఉన్నాయి. అన్ని అనుకూల, అననుకూల పరిస్థితులనూ సమభావంతో స్వీకరిస్తూ నిరంతరం ఆనందదాయకంగా ఉండే విపశ్యనాసాధకుల మనోభావాలు సాధకులకు మార్గదర్శకంగా ఉన్నాయి. ఇందులో పేర్కొన్న గాథల తెలుగు అనువాదాలు సులభము, సరళమైన భాషలో చిరకాలం గుర్తుపెట్టుకొనేలా ఉన్నాయి. ఈ తెలుగు పద్యాలు ఏ పుస్తకంలో లభ్యమవుతాయో తెలియజేస్తే ఇంకా బావుండేది...ఈ ప్రత్యేక సంచికను వెలువరించిన మీకు మా హృదయపూర్వక అభినందనలు..." **– నరహరి పెద్ద సుబ్రహ్మణ్యం,** హైదరాబాదు.



✶ "...నిత్యనూతనంగా భాసించే ***మిసిమి*** మే సంచిక కూడా కొత్త అందాలతో, బుద్ధ భగవానుని జీవితానికి సంబంధించిన చిత్రాలతో మనోహరంగా అలరించింది. అలనాడు అమితమైన భక్తి భావంతో బాలసరస్వతి పాడిన "ఆ తోటలో నొకటి ఆరాధనాలయము. ఆ ఆలయములోని అందగాడెవరే..అందగాడెవరే?" పాటలోని జగన్మోహనుడైన ఆ సిద్ధార్థుని ఆ చిత్రాలలో అనేక కోణాలలో మాకు దర్శింపజేసినందుకు ముందుగా మీకు మరొక మారు మనః పూర్వక ధన్యవాదాలు. ముఖ్యంగా సిద్ధార్థుని జీవిత ఘట్టాలను ప్రతిబింబించే ఆ నాలుగు చిత్రాలు జీవం పోసుకుని పత్రిక స్థాయిని మరింత పెంచాయనిపించింది. అవి ఒకదానికొకటి మిన్నగా భాసించినవి. అందులో ముఖ్యంగా, మూడవ చిత్రం 'భూమి స్పర్శ'లో బుద్ధభగవానుని హావభావాలను చిత్రకారుడు ఎంత భక్తితో, తాదాత్మ్యతతో జీవం పోశారో – మాటలలో చెప్పలేను. అందులో, ఆయన భూమివైపు చూసే చూపు, ఆ పై వస్త్రంలోని మడతలు, భూమిలో ఆయన గమనిస్తున్న వైవిధ్య భరితమైన పొరలు, ఓహ్! అన్నీ కన్ను తిప్పుకోలేని విధంగా అమరినాయి. సంచిక లోపల వేసిన చిత్రాలు కూడా, ముఖ్యంగా 'సిద్ధార్థుని కళ్యాణ' ఘట్టం. నయనానందకరంగా ఉంది. 'సిద్ధార్థుని గృహ త్యాగ' ఘట్టం హృదయాన్ని కదిలించింది. ఇది ఎవరి జీవితంలోనైనా సాధ్యమా, సిద్ధార్థునికి తప్ప? యశోధర బిడ్డ పరిష్వంగంలో, ఆదమరచి నిద్రించటం చూస్తూ కూడా దుఃఖ పూరితమైన ఈ సంసార బంధాన్ని విడిచి, జ్ఞానార్థియై పోతున్న సిద్ధార్థుని మనోభావాలను ఎవరికి వారు ఊహించుకోవలసిందే! 'బాల సిద్ధార్థుని ప్రథమ ధ్యానం' మరింత ఆలోచనాత్మకం. ఇన్ని అపూర్వ చిత్రాలను 'నిష్కామ' భావంతో అందించిన ఆ 'అజ్ఞాత చిత్రకారునికి' నా శతకోటి కృతజ్ఞతలు అందజేయండి! ఆయన ధన్యుడు...



...మనం ఆలోచిస్తే, ఈ లోకంలో అష్టైశ్వర్యాలతో, అందమైన భార్యాబిడ్డలతో ఆనందంగా గడిపే ఒక యువరాజు, అలా యవ్వనదశలో, ఈ సంసారాన్ని, జనన-మరణ, సుఖ-దుఃఖాది రూపమే అని ఎంచి, తృణప్రాయంగా తిరస్కరించి విరాగియై, శాశ్వత శాంతి మార్గాన్ని అన్వేషిస్తూ ఇల్లు, *'ఇల్లాలిని విడిచి పోయినవారెవరూ లేరు కదా!'* జ్ఞానసిద్ధి తరువాత, ఆనాటి మూర్ఖ సమాజంలోని అనేక వైరుధ్య వాదులతో తర్కించి, ఏ కులాలకూ, వర్గాలకూ, మతాలకూ వాదాలకూ చెందని మానవత్వం ఎంత ఉన్నతమైనదో, సర్వమానవ ప్రేమ ఎంత గొప్పదో, సాధారణ జీవనం ఎంత స్వచ్ఛమైనదో, ఎక్కువ తక్కువలు ఎంచని సమదృష్టి, ఎంత ఆదర్శమైనదో, సామాన్యుని నుండి మహారాజుల వరకూ, తనదైన వినూత్న శైలిలో బోధించిన మహోన్నత మానవతామూర్తి *బుద్ధ భగవానుడు.* నా దృష్టిలో బుద్ధుడు, ఒక చారిత్రిక అవసరం! నాటి సామాజిక రుగ్మతలకు విరుగుడుగా ఆయన సుదీర్ఘ కాలం 'తపస్సు' చేసి, జ్ఞానసిద్ధి పొంది, సార్వజనీనమైన, సార్వకాలికమైన సిద్ధాంతాలతో, సూత్రాలతో మానవులను చైతన్యపరచిన మహాద్భుత మార్గదర్శి ఉత్తమోత్తమ గురుదేవుడు! *Buddha was the Greatest Teacher on The Earth* అనే సత్యవాక్కును, ***మిసిమి*** మే 2013 సంచికలో వ్రాసిన బుద్ధ భగవానుని బోధల గురించి వివిధ వ్యాసాలు నొక్కి చెపుతున్నాయి... 2557వ *బుద్ధ జయంతి ప్రత్యేక సంచిక* సర్వాంగ సుందరంగా బౌద్ధం గురించిన విశేష వ్యాసాలతో రూపొందించి, మా కందించిన మీ సంపాదక వర్గానికి నా అభినందనలు..."

**– గీతాంజలి మూర్తి,** హైదరాబాదు.

✶ "...చరిత్రనభిమానించే వారికి, చరిత్ర ఎడల జిజ్ఞాస వున్న వారికి ఆసక్తి గొల్పేట్లు జూన్ నెల ***మిసిమి*** "కట్టుబాట్లతో కాపురం- అదే *అక్బరు అంతఃపురం"* అందించింది. ఆంగ్ల సాహిత్యం – చరిత్ర చదువుకోడానికి అవకాశం లేని నాబోంట్లకు పై రచన పరమాన్నమే అయింది. ఆరగా ఆరగా చదువుకొని ఆనందించాను....చిన్నతనం నుండి యవ్వనంలోకి ప్రవేశిస్తున్నప్పుడు – అప్పుడప్పుడు పనివుండి కింగ్‌కోఠి నజ్రీన్ బాగ్ (ఆఖరు నిజాం అంతఃపురం) ప్రక్కనుండి వెళ్తుండడం తటస్థించేది. ప్రత్యేకించి అటువైపు నుండే వెళ్లాలనుకోవడానికి ఓ కారణముంది. ఆ అంతఃపుర భవనం వెంటిలేటర్ల నుండి వందలాదిగా కనిపించే ఆ రెండు కళ్ళ వరుసను చదవడం కోసం ఆ వైపు వెళ్లడం అలవాటయింది. ఆ చూపుల్లో నిరాశ-నిస్పృహలు, దైన్యం, ఆకలి, దేనికోసమో – ఎందుకోసమో నిరీక్షణ, నిర్జీవం కనిపించి ఆలోచనల్లో మునిగిపోయేవాణ్ణి. కాని అంతఃపురాన్ని పర్యవేక్షించే నజీర్‌లు వూర్కుంటారా? ఫలితంగా – ఆ పొడుగూతా కనిపించే వెంటిలేటర్లన్నింటినీ, బయటి నుండే చెక్కలతో మూసివేయించారు. దీన్ని భరించలేని ఖ్వాయిష్‌మంద్‌లు ఆ చెక్కల్ని పీకివేయడంతో, కొంతకాలం, తర్వాత అలా కాదని లోపలిభాగం నుండే చెక్కలను బిగించి ఆ సౌందర్యవతుల రెండు కళ్లకు నజర్ బందు చేయించారు. అప్పటకీ, యిప్పటికీ వెంటిలేటర్ల చెక్కల సీలు బందులు తీసివేయనేలేదు. ఒక వేళ అలా జరిగితే ఆ విశాల నేత్రాల సౌందర్యవతులే శిక్షలకు గురవుతారు...

...ఇప్పుడీ పై రచన చదివాక గతమంతా నెమరుకు వచ్చింది. ఇన్నాళ్ళకు, యిన్నేళ్లకు, ***మిసిమి,*** రాజుల, అంతఃపుర విన్యాసాలపై – రహస్యాలపై అందించిన ఓ చక్కని రచనను చదివి మది రసప్లావితమే అయింది. కారణం, రాజుల, చక్రవర్తుల, అధికారమధోన్మత్తులు, సంపన్నుల ఆంతరంగిక జీవితాలలో వున్న డొల్లతనాన్ని – కర్కశత్వాన్ని, వైక్లబ్యాన్ని, అక్రమాలను, దోపిడీలను తెలుసుకోవాలన్న యిచ్ఛ యిందుకు కారణం కావచ్చు!... అబ్బో! 50 సం॥ రాజ్యాన్ని పరిపాలించిన ఘనుల్లో అక్బరు పాదుషా ఒకరు. అక్బర్ అంతఃపురం ఆసాంతం శృంగార రసాన్విత కాసారమన్న విషయం,పాదుషాకు నలుగురు కాదు, 12 మంది భార్యలని కూడా యిప్పుడే తెలిసింది. అక్బరు, శృంగార సార్వభౌముడే కాదు- సర్వమత సహనమున్న వాడు కూడా. అందుకే సకల ప్రజలకూ యిష్టుడైనాడు....

...ఇంతేనా! అతిలోక సుందరిగా పేర్వడసిన, అబుల్‌వసీ భార్య పట్ల మోజు పడి, అక్బర్, ఆమెతో భర్తకు విడాకులిప్పించి, పెళ్లాడిన శృంగార శ్రీనాథుడూ, రసార్ణవ సుధాకరుడే అయినాడు. సకల కళా కోవిదుడు అక్బర్. తండ్రి పోలికలే కొడుకు జహంగీర్‌కూ అబ్బడంలో విచిత్రమేమీ లేదు... రచయితలూ- ఇకనైనా చరిత్రను తవ్వి ***మిసిమి***లో రాసులు పోయండి. ***మిసిమి*** పాఠకులైన నా లాంటి వాళ్లకు ఆంగ్లంలో చదవలేక పోయిన చరిత్ర పుటలను మరింతగా తెలుగులో పరిచయం చేయగోర్తాను..."

**– జి.యస్.రావు,** హైదరాబాదు.

✦ **మంచి ఉత్తరానికి ఒక మంచి పుస్తకం బహుమతి!** ✦



నవీన్

## 21వ శతాబ్దంలో
# తెలుగు నవల

*- అంపశయ్య నవీన్*

"ఇప్పుడు నవలెవరు చదువుతున్నారు?" అన్నమాట ఈ రోజుల్లో తరచుగా వినిపిస్తున్నది. పంథొమ్మిది వందల 50లలో, 60లలో, 70లలో, 80లలో తెలుగు సాహిత్యంలో నవలే రాజ్యమేలింది. ఆ రోజుల్లో నవలలు విరివిగా వెలువడటం, అలా వెలువడిన నవలల్ని లక్షలమంది పాఠకులు విరివిగా చదవడం జరుగుతుండేది. నవలల్ని సీరియల్స్‌గా ప్రచురించిన వారపత్రికలు, వాటిని ప్రచురించిన ప్రచురణ సంస్థలు, వాటిని అద్దెకిచ్చిన చిన్న చిన్న నగర వీధుల పక్కన వెలసిన దుకాణాల వారు నవలల వల్ల ఎంతో లాభపడ్డారు. అయితే 90వ దశకం నుండి ఈ పరిస్థితి మారింది.

తొంభైయ్యవ దశకంలో నూతన ఆర్థిక విధానం పేరుతో భారతదేశపు ఆర్థిక వ్యవస్థలో మౌలికమైన మార్పులు జరిగాయి. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ లాంటి విధానాల వల్ల ప్రజల సాంఘిక జీవితం మారిపోయింది. సెల్‌ఫోన్లు, టీ.వీల్లో వందల చానళ్ళు, కంప్యూటర్లు, ఇంటర్నెట్‌లు, వెబ్‌సైట్లు లాంటి ఆధునిక పరికరాలన్నీ మధ్యతరగతి కుటుంబాల వారికి కూడా అందుబాటులో కొచ్చాయి.

ప్రపంచమంతా ఒక కుగ్రామంగా మారిపోయింది. ప్రజల జీవితం వేగవంతమయ్యింది. వందలకొద్ది టీవీచానెళ్ళ వల్ల మధ్యతరగతి కుటుంబాల వాళ్ళకు చక్కని కాలక్షేపం లభించింది. ఒకప్పుడు మధ్యతరగతి కుటుంబాల వాళ్ళే నవలల్ని చదివేవాళ్ళు. ముఖ్యంగా గృహిణులకు నవలల వల్ల చాలా చక్కని కాలక్షేపం అవుతుండేది. అలాంటి వాళ్ళందరికి ఇప్పుడు టీ.వీ. చానెళ్ళలో వచ్చే సీరియల్స్ చాలా సులభతరమైన కాలక్షేప సాధనాలయ్యాయి. నవలంటే ఒకచోట కూర్చొని గంటల తరబడి చదివి అర్థం చేసుకోవాలి. దానికి కొంత తీరిక సమయం, చదివే ఓపిక, చదివి అర్థం చేసుకునే శక్తి ఉండాలి. కానీ టీ.వీ. సీరియల్స్ చూడటానికి యివేవీ అక్కర్లేదు. అన్నీ అరటిపండు వొలిచి నోట్లో పెట్టినంత తేలికగా అర్థమయ్యేలా టీ.వీ. సీరియల్స్ ఉంటాయి. నవలలు చదువుతున్నప్పుడు పాత్రలు ఎలా ఉంటారో ఊహించు కోవాలి. టీ.వీ. సీరియల్స్‌లో పాత్రల రూపాలు స్పష్టంగా కనిపిస్తాయి. ముందేం జరుగుతుందోనన్న ఉత్కంఠ వుంటుంది. ఇలా ఆసక్తికరమైన, ఆకర్షణీయమైన పాత్రలు, అందమైన ఒక స్వాప్నిక ప్రపంచం టీ.వి. సీరియల్స్‌లో వస్తాయి. అలాగే ఇవ్వాళ్టి టీ.వీ.ల్లో సిరియల్స్‌తో పాటు యే సినిమా కావాలంటే ఆ సినిమా చూసే సౌకర్యం కూడా వుంది. ఈ కారణం వల్ల ఒకప్పుడు నవలల్ని చదివిన వాళ్ళంతా ఇవ్వాళ టీ.వీ.లకు అంకితమైపోయారు. ఈ కారణం వల్ల నవలలు చదివే వాళ్ళ సంఖ్యతోబాటు రాసేవాళ్ళ సంఖ్య కూడా తగ్గిపోయిందని చెప్పాలి.

అయితే ఇప్పుడెవరూ నవలల్ని చదవటం లేదా? అంటే కొందరు సీరియస్ రీడర్స్ ఇప్పుడూ నవలల్ని చదువు తున్నారు. నవలు చదివే వాళ్ళను నేను రెండు రకాలుగా చూస్తాను – నాన్ సీరియస్ పాఠకులు, సీరియస్ పాఠకులు అని. నాన్ సీరియస్ పాఠకుల దృష్టిలో నవలంటే కేవలం ఒక పెద్ద కథ అనే– ఆ కథలో చక్కని ఉత్కంఠ, ఆకర్షణీయమైన పాత్రలు, ఎన్నో ఊహించని మలుపులు ఉంటాయనే వీళ్ళనుకుంటారు. ఈ తరహా పాఠకులే ఇప్పుడు టీ.వీ. సీరియల్స్‌కు, టీ.వీ.ల్లో వచ్చే సినిమాలకు బానిసలైపోయారు.

సీరియస్ పాఠకులనేవాళ్ళు నవలంటే కేవలం కథ అనే అనుకోరు. నవలంటే జీవిత చిత్రణ అనీ, ఒక మంచి నవల చదివితే మనల్ని మనం ఆ నవలలో చూసుకొని మనమేమిటో తెలుసుకోవచ్చు. సమకాలీన సమాజమంతా ఆ నవలలో కనిపిస్తుందని సీరియస్ పాఠకులు అనుకుంటారు. ఈ తరహా పాఠకులు ఇప్పటికీ ఉన్నారు. వీళ్ళ కారణంగానే ఈ నాటికీ నవల బతుకుతున్నది. ఈ తరహా పాఠకుల కారణంగా ఈ 21వ శతాబ్దంలో కూడా కొన్ని మంచి నవలలు వెలువడుతున్నాయి. అలాంటి కొన్ని నవలల్ని గూర్చి చెప్పడానికే నేనీ వ్యాసాన్ని మొదలెట్టాను.

ఇరవై ఒకటవ శతాబ్దం ప్రారంభంలోనే – లేక ఇరవైయ్యవ శతాబ్దపు ముగింపు దశలోనే అమెరికాలో స్థిరపడిన కొందరు ధనికులైన తెలుగువాళ్లు స్థాపించిన 'తానా', 'ఆటా' లాంటి సంస్థల ద్వారా నవలల పోటీలను నిర్వహించి, ఉత్తమ నవలగా ఎంపికైన నవలకు లక్ష రూపాయల పారితోషికం ఇవ్వాలని నిర్ణయించారు. ఇది తెలుగు నవలాకారులకు చక్కని ప్రోత్సాహాన్నిచ్చింది. అలా తానా 1995లో నిర్వహించిన మొదటి నవలల పోటీలో చంద్రలత రచించిన *రేగడివిత్తులు* అనే వ్యవసాయ రంగాన్ని ఇతివృత్తంగా తీసుకొని రచించబడిన నవలకు లక్ష రూపాయల పారితోషికం లభించింది. ఈ నవలలోని కొన్ని అంశాలు వివాదాస్పదంగా మారినప్పటికి ఈనాడు వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పుల్ని ఈ నవల ద్వారా సమర్థవంతంగా చిత్రించిందనే చెప్పాలి.

ఆ తర్వాత 1998లో 'ఆటా' అనే సంస్థ కూడా నవలల పోటీని నిర్వహించింది. వీరు యేదో ఒక నవలను కాకుండా మూడు నవలల్ని ఉత్తమ నవలలుగా ప్రకటించారు. ఆ మూడు నవలలు – జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి రచించిన *వలసదేవర*కు 60 వేలు, ఎస్. వెంకటరామిరెడ్డి రచించిన *కాడి* నవలకు 40 వేలు, చిలుకూరి దేవపుత్ర రచించిన *పంచమం* నవలకు 30 వేలు పారితోషికంగా ప్రకటించారు. ఈ మూడు నవలలు 21వ శతాబ్దపు ప్రారంభంలోనే ప్రచురించబడ్డాయి.

ఈ మూడు నవలల్లోను గ్రామీణ ప్రాంతాల వ్యవసాయిక జీవితమే ప్రధాన ఇతివృత్తంగా కనిపిస్తుంది. *వలసదేవర* నవలలో రచయిత జె.ఎస్.ఆర్.మూర్తి గ్రామీణ జీవిత దృశ్యాల్ని, కాలక్రమంలో వాటి పరిణామాల్ని అత్యంత వాస్తవికంగా చిత్రించాడు. గ్రామ పెత్తందార్లు, రైతు కూలీల సంబంధాలు, రకరకాల వ్యాపారాలు, కులాల మధ్యన వ్యత్యాసాలు, రాయలసీమ ప్రాంతపు ఆచార వ్యవహారాలు, సమాజంలో ఈనాటికీ పాతుకుపోయిన మూఢవిశ్వాసాలు మొదలైన గ్రామీణ జీవితానికి సంబంధించిన అంశాలు ఈ నవలలో చిత్రించబడ్డాయి. ఈ నవలలో జె.ఎస్.ఆర్. మూర్తి కనబరచిన ప్రతిభ చాలా గొప్పది.

సన్నపురెడ్డి వెంకటరామారెడ్డి రచించిన *కాడి* నవల కూడా రాయలసీమ ప్రాంతపు వ్యవసాయ రంగాన్ని చిత్రించిన నవలే. అట్టడుగు వర్గాల్లో వస్తున్న చైతన్యం, అందుకు పైకులాల ప్రతిస్పందన ఈ నవలకు కథావస్తువు. ఈ నవలలో రచయిత వాడిన భాష, తీసుకున్న ఇతివృత్తం, కథాకథన పద్ధతి, పాత్ర చిత్రణ మొదలైనవన్నీ వాస్తవ జీవితానికి దగ్గరగా ఉన్నాయి.

చిలుకూరి దేవపుత్ర రచించిన *పంచమం* నవల దళితుల జీవితాలను చిత్రిస్తుంది. దళిత కులంలో జన్మించిన ఈ నవలలోని కథానాయకుడు శివయ్య పెరుగుదలతో పాటు గ్రామంలో ఉత్పన్నమవుతున్న పరిణామాలనన్నింటినీ రచయిత చిత్రించాడు. ఈ మూడు నవలలు కూడా రాయలసీమ ప్రాంతపు గ్రామీణ జీవితాలను చిత్రించడం గమనించ తగ్గ విషయం. ఈ మూడు నవలల్ని రచించిన ఈ ముగ్గురు రచయితలు ఆ తర్వాత చెప్పుకోదగ్గ మంచి నవలలేవీ రచించకపోవడం ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది.

జి.కళ్యాణరావు రచించిన *అంటరాని వసంతం* అన్న నవల 2000వ సంవత్సరంలో వెలువడింది. ఈ నవలలో కళ్యాణరావు మన సమాజంలో కులవ్యవస్థ అనేది ఎంత బలంగా పాతుకుపోయిందో చెబుతూ అట్టడుగు వర్గాలకు చెందిన దళితుల జీవితాల్లో ఉత్పన్నమవుతున్న చైతన్యాన్ని, దళితుల కుటుంబాల సంస్కృతీ, సంప్రదాయాలను చాలా వాస్తవికంగా, కవితాత్మకంగా చిత్రించాడు. ఈ నవలలోని ప్రధానపాత్ర రూబేను తన భార్య రూత్‌కు, తన పూర్వీకుల కథను– యేడు తరాల కథను చెబుతున్న క్రమంలో ఈ నవల రూపొందుతుంది. యేడు తరాల దళితుల బాధాతప్త జీవితాలను, వారి మీద అగ్రకులాల పీడనను, వాళ్ళ సాంస్కృతిక జీవితాలను ఈ నవలలో కళ్యాణరావు సవిస్తరంగా చిత్రించాడు. దళితులు క్రైస్తవ మతాన్ని స్వీకరించడం వల్లనే వాళ్ళ జీవితాలు మెరుగవుతాయని,

సాయుధ విప్లవం విజయవంతమైతేనే ఈ దేశంలో కులవ్యవస్థ అనేది అంతరిస్తుందన్న సందేశంతో ఈ నవల ముగుస్తుంది.

*అంపశయ్య* నవలతో ప్రసిద్ధుడై ఆ నవల పేరునే ఇంటిపేరుగా మార్చుకున్న నవీన్ 21వ శతాబ్దంలో చాలా నవలలు రచించాడు. వాటిలో ప్రధానంగా పేర్కొనదగిన నవలలు – *కాలరేఖలు, చెదిరిన స్వప్నాలు, బాంధవ్యాలు.* ఈ మూడు నవలల్ని త్రయ నవలలుగా పేర్కొనవచ్చు. ఒకదాని కొనసాగింపే మరొకటి. వీటిని సీక్వెల్స్ అనీ అనొచ్చు. ఈ మూడు నవలలు కూడా 400 పేజీలను మించిన నవలలే. ఈ మూడు నవలల్లో 50 సంవత్సరాల (1944 నుండి 1994 వరకు) తెలుగువాళ్ళ సాంఘిక, ఆర్థిక రాజకీయ జీవితం చిత్రించబడింది.

*కాలరేఖలు* నవల 2002లో వెలువడింది. 2004లో ఈ నవలకు కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం లభించింది. 1955 నుండి కేంద్ర సాహిత్య అకాడెమీ వారు 22 భారతీయ భాషల్లో వెలువడే ఉత్తమ గ్రంథాలకు పురస్కారాల్ని ఇవ్వడం ప్రారంభించాక ఈ అవార్డును గెల్చుకున్న మూడవ నవల *కాలరేఖలు.* (మిగతా రెండు: గోపీచంద్ *పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా, మాలతీచందూర్ హృదయనేత్రి*). *కాలరేఖలు* నవల 1944లో తెలంగాణలో ప్రారంభమైన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో ప్రారంభమై 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం యేర్పడే వరకు జరిగిన అనేక సాంఘిక, రాజకీయ పరిణామాల్ని చిత్రిస్తుంది. ఈ నవలలోని ప్రధాన పాత్ర రాజు. నవల ప్రారంభంలో ఇతడు నాల్గేళ్ళ పసివాడు. ఇతడు పెద్దవాడౌతున్న కొద్దీ ఇతని దృక్కోణం నుండి తెలంగాణ ప్రాంతంలో ఉత్పన్నమౌతున్న పరిణామాల్ని రచయిత చారిత్రక దృష్టితో చిత్రించాడు. రాజు పదవ తరగతి – అంటే మెట్రిక్యులేషన్ పరీక్షలు రాయడంతోనూ, తెలుగువాళ్ళందర్నీ ఒక రాష్ట్రంగా కలిపిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాపనతో ఈ నవల ముగుస్తుంది.

*కాలరేఖలు* కు కొనసాగింపుగా (సీక్వెల్‌గా) నవీన్ *చెదిరిన స్వప్నాలు* అనే నవలను రచించాడు. ఈ నవల 1959 నుండి 1969 వరకు తెలంగాణాతో పాటు భారతదేశంలో ఉత్పన్నమైన అనేక పరిణామాల్ని చిత్రిస్తుంది. నవలలోని ప్రధాన పాత్ర రాజు పదవ తరగతి ఉత్తీర్ణుడై, కొద్దిరోజులు తన గ్రామంలో ఉండి తర్వాత కళాశాలలో చేరి బి.ఏ. పూర్తి చేయడం, ఆ తర్వాత ఎం.ఏ. చదివి లెక్చరర్‌గా ఉద్యోగం సంపాదించి, పెళ్ళి చేసుకొని ఒక గృహస్థుడుగా మారటంతో ఈ నవల ముగుస్తుంది. *చెదిరిన స్వప్నాలు*కు కొనసాగింపుగా నవీన్ *బాంధవ్యాలు* అనే నవలను రచించాడు. ఈ నవల 1970లో ప్రారంభమై, 1994 వరకు సాగుతుంది. పాతికేళ్ళ తెలుగు సమాజపు పరిణామ చిత్రణ ఈ నవలలో జరిగింది. ఈ నవలను గూర్చి ఎ.బి.కె. ప్రసాద్ అన్నట్టుగా గడిచిన పాతికేళ్ళలో తెలుగు కుటుంబాల్లో వచ్చిన తరాల అంతరాలను, వైరుధ్యాలను, వైవిధ్యాన్ని సమాజ పరంగా వచ్చిన, వస్తున్న మార్పులను, శిథిలమవుతున్న కొన్ని పాత సంప్రదాయాలను, వద్దనుకున్నా ముమ్మరిస్తున్న కొత్త విలువలనూ, ఈ పరిణామ క్రమంలో అతలాకుతలమవుతున్న ఆర్థిక వ్యవస్థలో అంతర్భాగంగా మధ్యతరగతి సంసారాల్లో పుట్టుకొస్తున్న కల్లోలాలు, అస్తవ్యస్తమవుతున్న పరిస్థితులను అద్భుత శైలిలో అద్దం పడుతున్న సామాజిక నవల *బాంధవ్యాలు.*

ఇలా తెలుగులో సీక్వెల్ నవలల్ని రచించడం నవీన్‌తోటే ప్రారంభమైంది. ఇదివరకు ఆయన *అంపశయ్య*కు కొనసాగింపుగా *ముళ్ళపొదలు,* దానికి కొనసాగింపుగా *అంతస్రవంతి* అన్న మూడు నవలల్ని – వీటిని రవిత్రయ నవలలు అన్నారు – రచించాడు. ఈ మూడు నవలలు రవి అనే పాత్ర యొక్క కేవలం మూడురోజుల జీవితాన్ని చిత్రిస్తే, *కాలరేఖలు, చెదిరిన స్వప్నాలు, బాంధవ్యాలు* అన్న ఈ త్రయ నవలలు 50 సంవత్సరాల రాజు అనే ప్రధాన పాత్ర జీవిత పరిణామాన్ని చిత్రిస్తూనే సమాజంలో ఉత్పన్న మౌతున్న అనేక మార్పులకు చిత్రిక పట్టాయి.

మన సమాజంలో ఒక భాగమైన ముస్లిముల జీవితాలను చిత్రిస్తూ తెలుగులో సమగ్రమైన నవలలు వెలువడలేదనే చెప్పాలి. ఆ లోపాన్ని తీర్చడానికా అన్నట్టుగా రచయిత సలీం రచించిన *వెండి మేఘం* నవల 2003లో వెలువడింది. పేద ముస్లిముల సాంఘిక జీవితాలను విస్తృతంగా చిత్రిస్తూ తెలుగులో వెలువడిన మొదటి నవల *వెండి మేఘమే* అని చెప్పాలి. ఈ నవల భారత దేశానికి స్వాతంత్ర్యం రావటానికి పూర్వమే – అంటే 1945 ప్రాంతంలో ప్రారంభమౌతుంది. ప్రస్తుతం ప్రకాశం జిల్లాలోని చినగంజాం అనే ఊరు ఈ నవలలోని కథా కేంద్రం. ఆ

నవలలోని ప్రధాన పాత్ర అన్వర్ అనే స్త్రీ మైనారిటీ తీరక ముందే, 12 యేళ్ళ పసిపాపగా ఉన్నప్పుడే ఆమె అక్క చనిపోవడం వల్ల ఆమె బావకు రెండో భార్యగా వెళ్తుంది. అప్పట్నించీ ఆమె అనుభవించిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఆ కష్టాలనన్నింటినీ అధిగమించిన అన్వర్ తన జీవితాన్నే కాకుండా తనచుట్టూ ఉన్న ఎంతో మంది పేద ముస్లిముల జీవితాలను కూడా బాగుపరుస్తుంది.

ముస్లిముల ఆచార వ్యవహారాల్ని, వాళ్ళు పాటించే మత నియమాల్ని *వెండి మేఘం* చక్కగా చిత్రించింది. ఛిల్లా, ఊజా, జిరాతి, షియా, సున్నీ, లడాఫ్ మొదలైన ముస్లిములకు సంబంధించిన ఎన్నో మాటలకు ఈ నవలలో మనకు వివరణలు లభిస్తాయి.

*వెండి మేఘం* తర్వాత సలీం చాలా నవలలు రచించాడు. ఎయిడ్స్ రోగులను గురించి ఆయన రచించిన *కాలుతున్న పూలతోట* నవలకు 2011వ సంవత్సరంలో కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం లభించింది. అలాగే *పడగ నీడ* నవలలో కార్పోరేట్ కాలేజీల్లో చదువుతూ, వాళ్ళ హాస్టల్స్‌లో ఉండే విద్యార్థినులు ఎలాంటి మానసిక వత్తిళ్ళకు గురవుతారో, ఎలా ఆత్మహత్యలకు పాల్పడ్తారో, సలీం చిత్రించాడు. అలాగే ప్రేమ, పెళ్ళి, వివాహేతర సంబంధాలు మొదలైన సమస్యల్ని చిత్రిస్తూ సలీం *కాంచన మృగం* అనే మరో నవల రచించాడు. ఇలా ఇప్పుడు నవలలు రాస్తున్న నవలాకారుల్లో సలీంకు ఒక ప్రత్యేక స్థానం ఉంది.

*రేగడి విత్తులు* నవలతో ఎంతో సంచలనం సృష్టించిన చంద్రలత 2003లో *దృశ్యాదృశ్యం* అనే మరో మంచి నవలను రచించింది. నదులకు ఆనకట్టలు కట్టి పెద్ద పెద్ద జలాశయాలను నిర్మించటం వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలను చంద్రలత ఈ నవలలో చిత్రించింది. కడియాల రామమోహనరాయ్ అన్నట్టుగా ఆనకట్టల నిర్మాణం వల్ల యేర్పడే జలావరణం ఆధునిక సమాజం ఎదుర్కొంటున్న జీవన్మరణ సమస్య. జలావరణం వల్ల కలిగే కష్టాలను – కనిపించే వాటిని కనిపించని వాటిని శ్రీమతి చంద్రలత *దృశ్యాదృశ్యం* నవలలో జీవితమంత వాస్తవికంగా, కళాత్మకంగా ప్రదర్శించింది.

21వ శతాబ్దం ప్రారంభంలో సమాజం ఎదుర్కొంటున్న ఒక గడ్డు సమస్యను *దృశ్యాదృశ్యం* నవల అన్ని కోణాలనుండి చూపించింది. ఎక్కడా ప్రచార ధోరణిని, ఉపదేశ రీతిని చూపకుండా రచయిత్రి గొప్ప సంయమనాన్ని పాటించింది. మేధాపాట్కర్ లాంటి ఎందరో సాంఘిక సేవకులు నదులపై నిర్మించబడే పెద్ద పెద్ద ఆనకట్టల నిర్మాణాన్ని వ్యతిరేకించటం మనకు తెలిసిందే. ఆనకట్టల నిర్మాణం వల్ల యేర్పడే జలాశయాల వల్ల వందల కొద్ది గ్రామాలు – ముఖ్యంగా అడవుల్లో నివసించే గిరిజనులు ముంపుకు గురికావడం, వాతావరణ సమతౌల్యాన్ని కాపాడే అడవులు అంతరించి పోవడం లాంటి సమస్యలను *దృశ్యాదృశ్యం* చిత్రించిన తీరు బావుంది.

కాశీభట్ల వేణుగోపాల్ *నేను–చీకటి* తర్వాత *తపన* అనే రెండు నవలలను వినూత్న పద్ధతిలో రచించాడు. అక్కడక్కడ చైతన్య స్రవంతి ధోరణి, ఆధునికాంతర ధోరణి ఈ నవలల్లో కనిపిస్తాయి. సమాజపు నియమాలను ధిక్కరించటం, సెక్స్‌కు సంబంధించిన విషయాలను జంకూగొంకూ లేకుండా చర్చించటం, భార్యాభర్తల మధ్య చెలరేగే సంఘర్షణలు మొదలైన మానసిక సమస్యలను (ఈగో క్లాషెస్) ఈ రచయిత ఈ నవలల్లో చిత్రించాడు. కొన్ని బూతు అనబడే మాటల్ని యథేచ్ఛగా వాడటం, పవిత్రమైనవని భావించే వాటిలో పవిత్రత యేమీ లేదని చెప్పడం, కొన్ని విషయాల్ని అర్థం కాకుండా చెప్పడం లాంటి ఆధునికోత్తర వాద లక్షణాలు ఈ నవలల్లో కనిపిస్తాయి. ఈ రచయిత రచించిన *తపన* నవలకు 'తానా' వారు నిర్వహించిన నవలల పోటీలో పురస్కారం లభించింది.

మొదట్లో నాటక రచయితగా, తర్వాత సినిమా నటుడుగా స్థిరపడిన గొల్లపూడి మారుతీరావు 2001లో *సాయంకాలమైంది* అనే మంచి నవలను రచించాడు.

*సాయంకాలమైంది* నవలలో శ్రీవైష్ణవుల సంప్రదాయాలను, వారి నియమాలను, వారి ఆచార వ్యవహారాలను, సమాజ గమనంలో అంతరించి పోతున్న విలువలను, సంస్కృతీ సంప్రదాయాలను రచయిత చక్కగా చిత్రించాడు. ఈ నవలకు అక్కడక్కడ రచయిత చేసే సుదీర్ఘ వ్యాఖ్యానాలు పాఠకులకు కొంత ఇబ్బంది కల్గించినా శ్రీవైష్ణవుల జీవన విధానాలు, మారుతున్న కాలంతో పాటు ఎలా మారిపోతున్నాయో రచయిత లోతుగా చిత్రించటం కనిపిస్తుంది.

వి. చంద్రశేఖరరావు కూడా ఆధునికోత్తర వాదాన్ని నవలల్లో ప్రవేశపెట్టాలనే కోరికతో ఐదుహంసలు అనే ఎవరికీ

అర్థంకాని నవలొకటి రచించాడు. ఈ కారణం వల్లనే ప్రయోగాత్మకంగా రచించబడిన ఈ నవలను పాఠకులుగానీ, విమర్శకులు గానీ పట్టించుకోలేదు.

స్వామి (బండి నారాయణస్వామి) రచించిన *మీ రాజ్యం మీరేలండి* నవల 2005లో వెలువడింది. రామమోహన రాయ్ అన్నట్టుగా ఆధునిక సామాజిక జీవితాన్ని రాయలసీమ నేపథ్యంతో వాస్తవికంగా చిత్రించిన నవల *మీ రాజ్యం మీరేలండి* అనంతపురం జిల్లాకు అతి సమీపంలో ఉన్న పండమేరు గ్రామం ఈ నవలకు కథా స్థలం, ముప్ఫై నలభై యేళ్ళ నుండి ఆ గ్రామంలో వచ్చిన సాంఘిక, రాజకీయ పరిణామాలను రచయిత స్వీయ వ్యాఖ్యానాలతో కలగలిపిన నవల ఇది. గ్రామంలో కులవివక్ష, అంటరానితనం, దోపిడీ, బలహీనులపై పెత్తందార్ల దౌర్జన్యాలు, ఫాక్షన్ ఫైట్స్, ఎన్నికలు, అవకాశవాద రాజకీయాలు, నక్సలైట్ల దాడులు మొదలైన ఎన్నో సమస్యలను ఈ నవల చిత్రించింది. ఈ నవలలో బోయ, మాదిగ, వడ్డెర, కురుమ, దూదేకుల, చాకలి, కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ కులాల జీవిత చిత్రణ ఆసక్తికరంగా సాగింది.

ప్రధానంగా కథకుడైన కొలకలూరి ఇనాక్ 2007లో *అనంత జీవనం* అనే నవలను ప్రచురించారు. సాధారణంగా రాయలసీమలో – అదీ అనంతపురం జిల్లాలో వర్షాలు కురవనే కురవవు. ఎప్పుడూ కరువు కాటకాలతో అలమటించే అనంతపురం జిల్లాలో ఒకసారి భారీ వర్షం కురిసి బీభత్సాన్ని సృష్టించిన సన్నివేశాలు కూడా ఉన్నాయని ఈ నవలలో ఇనాక్ చిత్రించాడు. వర్షాలు సృష్టించిన వరద బీభత్సం వల్ల దళిత వర్గాలకు చెందిన ఎన్నో కుటుంబాలు ఎలా ధ్వంసమయ్యాయో, వాళ్ళకు సహాయ పడటంలో ప్రభుత్వం ఎలా విఫలమయ్యిందో, ఈ నవలలో కొలకలూరి ఇనాక్ చిత్రించాడు. నేరెళ్ల శ్రీనివాస్‌గౌడ్ రచించిన *బతుకుతాడు* అనే నవల కల్లుగీత కార్మికుల జీవితాలను లోతుగా చిత్రించిన మొదటి తెలుగు నవల.

కులవృత్తులను గూర్చి లోతుగా పరిశీలిస్తూ రాయాలంటే ఆ వృత్తిని గూర్చిన సమగ్రమైన అవగాహన ఉండాలి. శ్రీనివాసగౌడ్‌కు కల్లుగీత కార్మికుల జీవితాలు క్షుణ్ణంగా తెలిసి ఉండటం వల్లనే ఆయన ఈ నవల రాయగల్గాడు. రాసాని రచించిన నవల *బతుకాట* రంగస్థల కళాకారుల జీవిత సమస్యల్ని ఎంతో వాస్తవికంగా చిత్రించింది. పల్లెటూళ్ళలో నాటకాలాడి పొట్ట పోషించుకునే కళాకారులకు ఎన్నో సమస్యలెదురవుతాయి. ఆ కళాకారుల జీవన్మరణ సమస్యలను *బతుకాట* నవలలో రాసాని నాటకాలాడే వృత్తినే ఆలంబనగా చేసుకుని బతికే కళాకారులను గూర్చి సాధికారికంగా రచించాడు. ఇటీవలనే రాసాని *ముద్ర* పేరుతో జోగినీ వ్యవస్థను చిత్రిస్తూ మంచి నవలను రచించాడు. ఈనాటికి కూడా దళిత వర్గాలకు చెందిన స్త్రీలను అగ్రవర్ణాలవారు జోగినీలుగా మార్చి వాళ్ళతో తమ సెక్స్ కోరికలను తీర్చుకునే దుర్నీతిని రాసాని ఈ నవలలో ఎండగట్టాడు.

అలాగే చాకలివృత్తిలో జీవించే చాకలివాళ్ళ సమస్యల్ని చిత్రిస్తూ జీ.ఎస్. చలం రేవు అనే నవలను రచించాడు. వందల కథలు రచించిన కాలువ మల్లయ్య *బతుకు పుస్తకం*, *గువ్వల చెన్నా* లాంటి తెలంగాణ ప్రాంతపు బడుగు వర్గాలను చిత్రిస్తూ మంచి నవలలు రచించాడు.

ఒక ప్రత్యేక స్థలాన్ని గూర్చిన కథలను చెబుతూ స్థలపురాణాల్లాంటి నవలలు రాసే పద్ధతిని లోకేశ్వర్ *సలాం హైదరాబాద్* అనే నవల ద్వారా ప్రవేశపెట్టాడు. *జాతర* లాంటి మంచి నవలను రచించిన బోయ జంగయ్య, గత యాభై సంవత్సరాల్లో దళితుల జీవితాల్లో ఉత్పన్నమైన అనేక మార్పుల్ని చిత్రిస్తూ *జగడం* అనే మంచి నవలను రచించాడు.

తెలంగాణ ప్రాంతపు సంస్కృతీ సంప్రదాయాలను చిత్రిస్తూ ఎం.వి. తిరుపతయ్య *జీవన సమరం* అనే నవలను రచించాడు. ఈ నవల 2007లో వెలువడింది. ఈ నవలా రచన ఒక అద్భుతమని చెప్పాలి. తీవ్రమయిన క్యాన్సర్ వ్యాధికి గురయిన తిరుపతయ్య తానిక ఎంతోకాలం బతకనని తెలుసుకున్నాక ఈ నవలను పక్కమీద బోర్లా పడుకొని రాయడం మొదలెట్టాడు. రెండు నెలల కంటే ఎక్కువ బతకడని డాక్టర్లు చెప్పారు. అయినప్పటికి ఈ నవలను పూర్తి చేసేంత వరకు మృత్యువును తన దగ్గరకు రానివ్వనన్న దృఢ సంకల్పంతో 8 నెలలు శ్రమించి తిరుపతయ్య ఈ నవలను రచించాడు. ఈ నవలను ప్రచురించిన 11 రోజుల తర్వాత తిరుపతయ్య చివరి శ్వాస విడిచాడు.

గత యాభై సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్లకు పోలీసులకు మధ్య జరుగుతున్న యుద్ధం యొక్క పరిణామాలను చిత్రిస్తూ అంపశయ్య నవీన్ *రక్త కాసారం* అనే నవలను రచించాడు. ఇటు పోలీసుల చేతుల్లో

ఎన్‌కౌంటర్ల పేరుతో, అటు నక్సలైట్ల (మావోయిస్టులు) చేతుల్లో ఇన్‌ఫార్మర్ల పేరుతో ఎందరో బలయిపోతున్న సంఘటనల్ని - చాలా వరకు నిజంగా జరిగిన సంఘటనల్నే నవీన్ ఈ నవల రూపంలో నవలీకరించాడు. ఈ నవల కూడా 21వ శతాబ్దంలోనే, 2005లో వెలువడింది. ఒకే సంఘటనకు సంబంధించిన ఎనిమిది వెర్షన్స్‌ని *దృక్కోణాలు* అన్న నవలగా నవీన్ రచించిన ప్రయోగాత్మక నవల కూడా ఈ దశాబ్దిలోనే వెలువడింది... ప్రఖ్యాత జపాన్ దేశపు సినిమా దర్శకుడు అకిరా కురసావా నిర్మించిన *రోషమన్* అన్న సినిమాతో ప్రభావితుడైన నవీన్ ఈ నవలను రచించాడు. ఇలా ఒక సంఘటన యొక్క ఎనిమిది వెర్షన్స్‌ని చిత్రించిన మొదటి నవల ఇదేనని విమర్శకులు అభిప్రాయపడ్డారు. నవీన్ *దృక్కోణాల*ను కురసావా *రోషమన్* లను పోలుస్తూ కె.పి. అశోక్‌కుమార్ మంచి వ్యాసం రచించాడు.

2006వ సంవత్సరంలో నవీన్ 'ఆటా' వారి ఆహ్వానాన్ని పురస్కరించుకొని అమెరికాకు వెళ్ళాడు. అమెరికాలో స్థిరపడిన చాలామంది తెలుగువాళ్ళను కలుసుకున్నాడు. ఈ అనుభవాన్నే ఆయన *అమెరికా ...అమెరికా* అన్న నవలగా 2007లో వెలువరించాడు.

ఇటీవలనే - అంటే 2011లో నవీన్ రెండు చిన్న నవలల్ని రచించాడు. పతనమైపోతున్న వ్యవస్థను బాగు చెయ్యాలని ప్రయత్నించిన ఓ ఆదర్శవంతుణ్ణి ఈ వ్యవస్థ ఎలా లొంగదీసుకుంటుందో *అవాస్తవికుడు* నవలలో చిత్రీకరించాడు. ఈ నవల సంస్కృతంలోకి అనువాదమై సంస్కృత భారతి అన్న సంస్థ ద్వారా పుస్తకంగా ప్రచురించబడటం గమనార్హం. అలాగే ఆస్తి పంపకాలనేవి ఎంతో ప్రేమగా జీవిస్తున్న ఓ అక్కా తమ్ముణ్ణి ఎలా విడదీసి తీవ్రమైన విషాదానికి గురిచేస్తాయో *ఇల్లు ఇల్లనియేవు* అనే నవలలో నవీన్ చిత్రించాడు.

1948లో నిజాం పోలీసుల కాల్పులకు గురయి మరణించిన శేషగిరి ఉద్యమ జీవితాన్ని చిత్రిస్తూ పి. చంద్ రచించిన *శేషగిరి* అన్న నవల కూడా ఈ దశాబ్దంలోనే వెలువడింది.

పందొమ్మిది వందల డెబ్భైలలోనూ, ఎనభైలలోనూ పాఠకులచేత చదివించడాన్నే ప్రధానంగా భావించి ఎన్నో థ్రిల్లర్ నవలల్ని రచించిన యండమూరి వీరేంద్రనాథ్, మల్లాది వెంకటకృష్ణమూర్తి ఈ తరహా నవలలకు డిమాండ్ తగ్గిపోవడంతో 21వ శతాబ్దంలో వీళ్ళు నవలలు రాయటాన్ని ఇంచుమించు మానేశారు. వీళ్ళు రచించే తరహా నవలల్ని టీ.వీ. చానెళ్ళు సీరియల్స్‌గా ప్రసారం చెయ్యడంతో వీళ్ళ నవలలు పాఠకులకు అవసరం పడలేదు. అయినా అప్పుడప్పుడు వీళ్ళు రచించిన ఒకటో, రెండో నవలలు ఈ 21వ శతాబ్దంలో కూడా వెలువడ్తూనే వున్నాయి. *ఎఫ్.ఐ.ఆర్* పేరుతో మల్లాది వెంకటకృష్ణ మూర్తి రచించిన నవల 2006లో వెలువడింది. ఓ మధ్యతరగతి అమాయకుడు పోలీసుల విషవలయంలో చిక్కుకొని ఎన్ని బాధలు పడ్డాడో వివరించే నవల *ఎఫ్.ఐ.ఆర్* అంటారు ఈ నవలను ప్రచురించిన ప్రచురణ కర్తలు. మామూలుగా మల్లాది వెంకటకృష్ణమూర్తి రచించే నవలల్లో ఉండే హంగులన్నీ - ముఖ్యంగా డిటెక్టివ్ నవలల్లో ఉండే ఉత్కంఠ అలాంటిది ఈ నవలలో కూడా పుష్కలంగా ఉంది. అలాగే ఎన్నో ఉత్కంఠ భరిత నవలల్ని రచించిన యండమూరి వీరేంద్రనాథ్ 25 సంవత్సరాల తర్వాత *డేగ రెక్కల చప్పుడు* అన్న థ్రిల్లర్ నవలను 2011లో వెలువరించాడు. "మొదటి పేజీ నుండి చివరి పేజీ వరకు ఏకబిగిన చదివించే శిల్పం, ఇంతవరకు యే రచయితా తెలుగులో చేయని సాహసం - అల్‌ఖయిదా, అఫ్ఘాన్‌ల సమగ్ర చిత్రాన్ని కళ్ళకు కట్టినట్లుగా చూపించే - వర్తమాన ఉగ్రవాద చరిత్రకు దర్పణం ఈ నవల" అని ప్రచురణ కర్తలు చెప్పుకున్నారు. భారత ప్రభుత్వపు ఇంటిలిజెన్స్ వారు తమ అధికారినొకర్ని తాలిబాన్ల శిబిరంలోకి - ఆ శిబిరం ఆఫ్ఘానిస్తాన్‌లో ఉంటుంది. - కోవర్టుగా పంపిస్తారు. అతడు మారుపేరుతో కోవర్టుగా అల్‌ఖయిదా మరియు తాలిబాన్ల శిబిరంలో చేరి వాళ్ళ రహస్యాలన్నీ తెలుసుకొని, వాళ్ళను సర్వనాశనం చేసి ఇండియాకు తిరిగి రావడం ఈ నవలలోని కథాంశం. వేగంగా చదివించే గుణం ఈ నవలకు ఉందనటంలో సందేహం లేదు.

తెలుగులో సైన్స్‌ఫిక్షన్ నవలలు చాలా తక్కువగానే వచ్చాయి. దానికి కారణం సైన్స్‌ను గూర్చిన సన్నిహితమైన అవగాహన రచయితల్లో లేకపోవడమే. అలా సైన్స్‌ను గూర్చిన గొప్ప అవగాహన ఉన్న రచయిత డా॥ ఎల్.ఎస్.ఆర్. ప్రసాద్ రచించిన రెండు సైన్స్ ఫిక్షన్ నవలలు - *సత్యాన్వేషణలో*, *జినోమ్* ఈ 21వ శతాబ్దంలో వెలువడ్డాయి. *సత్యాన్వేషణలో* అనే నవలను డా॥ ప్రసాద్ ఇంగ్లీషులో బంగ్లాదేశ్ రచయిత్రి

తస్లీమా నస్రీన్ రచించిన నవల *లజ్జ*కు కొనసాగింపుగా – *లజ్జ* నవలలోని పాత్రలు భారతదేశానికొస్తే ఎలా ఉంటుందని ఊహించి ఈ నవలను రచించాడు. అలాగే ఆయన రచించిన *జినోమ్* అనే నవలలో భవిష్యత్తులో పురుషుల వీర్యంలో 'ఖ' క్రోమోజోమ్ ఉత్పత్తి పూర్తిగా నశించిపోతే యేమౌతుందో, ఎలాంటి పరిణామాలు ఉత్పన్నమౌతాయో ఊహించి రచించడం కనిపిస్తుంది. ఈ రెండు నవలల్లో కూడా సైన్స్ పట్ల డా॥ఎల్.ఎస్.ఆర్. ప్రసాద్‌కున్న విస్తృతమైన అవగాహన, నవలలు రాయడంలో ఆయనలోని ప్రయోగశీలత్వం కనిపిస్తాయి. ఈ రెండు నవలల్లో మొదటిది 2002లోను, రెండవది 2004లోనూ వెలువడ్డాయి.

శ్రీరామకవచం సాగర్ అనే రచయిత రచించిన *మూలుగు* అనే నవల వినూత్నమైన పద్ధతిలో రచించబడింది. ఈ నవల సామాన్య పాఠకులకు ఓ పట్టాన అర్థం కాదు. ఆధునికోత్తర వాదం యొక్క లక్షణాలు ఈ నవలలో కనిపిస్తాయి. ఈ రచయితే *దహనం* అనే అందరికీ అర్థమయ్యే రీతిలో మరో మంచి నవల రచించాడు.

ఇటీవలి కాలంలో వెలువడిన మరికొన్ని ముఖ్యమైన నవలల్ని చూద్దాం. కవిగా, కథకుడుగా, పర్యావరణ పరిరక్షకుడుగా పేరొందిన తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి *దేవరకోటేశు, హోరు* అనే రెండు చిన్న నవలల్ని 2007లో ప్రచురించాడు. కథ చెప్పే పద్ధతిలోనూ, వాక్యనిర్మాణం లోనూ, పాత్ర చిత్రణలోనూ పతంజలి శాస్త్రి ఈ నవలల్లో తనదైన ముద్రను కనబరచారు. బడుగు జీవులే ఈయన నవలల్లో పాత్రలుగా కనిపిస్తారు. కవిత్వం, పాటలు, బాలసాహిత్యం, పరిశోధనా గ్రంథాలు మొదలైన ఎన్నో ప్రక్రియల్లో కృషిచేస్తూ శతాధిక గ్రంథాలు రచించిన మలయశ్రీ కొన్ని నవలల్ని కూడా రచించాడు. వాటిల్లో *నిర్ణయం* అన్న నవల ఎన్నో బహుమతుల్ని, పురస్కారాల్ని అందుకుంది. ఈ నవలలో తెలంగాణ సాంఘిక జీవితాన్ని తెలంగాణ మాండలికాల్ని, సంస్కృతిని ఒక ఉద్యమస్ఫూర్తితో రచయిత చిత్రించాడు. ఈ నవల 2010లో వెలువడింది.

ఒకప్పుడు ఎన్నో రొమాంటిక్ నవలల్ని రచించి లక్షల మంది పాఠకుల అభిమానాన్ని చూరగొన్న యద్దనపూడి సులోచనారాణి ఇప్పుడు నవలల్ని రాయడం మానేసింది. ఆమె తరహాలోనే ఇప్పుడు నవలల్ని రచిస్తున్న వారిలో అంగులూరి అంజనీదేవిని ప్రత్యేకంగా చెప్పాలి. ఒక ముఖ్యమైన సామాజిక సమస్య చిత్రణ అన్నది ప్రధానం కాకుండా, అందమైన కవితాత్మకమైన, ప్రవాహశీలమైన శైలిలో అంగులూరి అంజనీదేవి *నీకు నేనున్నా* (2008), *మౌనరాగం* (2008) లాంటి నవలల్ని రచించారు. భారతదేశంలో కులవ్యవస్థ అనేది పుట్టడానికి గల చారిత్రక కారణాలేమిటి అన్న విషయాన్ని పరిశోధించి కరణం బాల సుబ్రహ్మణ్య పిళ్ళే *ఛండాలుడు* అనే పౌరాణిక, చారిత్రక నవలను రచించాడు. త్రిశంకుడనే ఓ రాజు విశ్వామిత్రుడి ఆగ్రహానికి గురికావడం వల్ల త్రిశంకుడ్ని చండాలుడిని కమ్మని శపిస్తాడు. అలా చండాలుడు అనే కులం పుట్టిందని, అలాగే ఇంకెన్నో కులాలు పుట్టాయని ఈ నవలలో రచయిత సూచిస్తాడు.

నందిగం కృష్ణారావు రచించిన *చీకట్లో నల్లపిల్లి* నవల 2002లో వెలువడింది. ఈ నవలను గూర్చి డి. వెంకట్రామయ్య అన్నట్లుగా చీకట్లో నల్లపిల్లిని వెదకటం ఎంత నిష్ప్రయోజనమో, ఇవ్వాళ్ల మనం బతుకుతున్న వ్యవస్థలో నిజం కోసం, న్యాయం కోసం, ధర్మంకోసం ప్రయత్నించటమూ, ప్రాకులాడటం కూడా అంతేనన్న వాస్తవాన్ని ఎంతో సహజంగా, స్పష్టంగా, సూటిగా చిత్రించిన నవల ఇది.

2005లో 'తానా' వాళ్ళు నిర్వహించిన నవలల పోటీలో సుంకోజి దేవేంద్రాచారి రచించిన *నీరు, నేల, మనిషి* అనే నవలకు బహుమతి లభించింది. రాయలసీమ ప్రాంతపు రైతుల వ్యధల్ని చిత్రించిన నవల ఇది. భూమికి, రైతుకు మధ్య ఉండే ప్రగాఢ సంబంధాన్ని ఈ నవల చిత్రించింది. రాయలసీమ ప్రాంతంలో వర్షాలు కురవవు. ఎప్పుడైనా కురిస్తే అతివృష్టి. ఎక్కువగా అనావృష్టే. ఈ సమస్యల్ని రచయిత ఎంతో వాస్తవికంగా చిత్రించాడు. అత్తా కోడళ్ళ సంబంధాలను చిత్రిస్తూ గోగినేని మణి *సుజన* అనే ఓ మంచి నవలను రచించింది. ఈ నవల 2011లో వెలువడింది.

కవిగా, కథకుడుగా ప్రసిద్ధుడైన మానేపల్లి *అనివార్యం* పేరుతో రచించిన నవల 2005లో వెలువడింది. 1990 –2005 మధ్యకాలం అంటే దాదాపు పదిహేనేళ్ళ కాలంలో రాష్ట్రంలోనూ, దేశంలోనూ జరిగిన వివిధ సంఘటనల్ని అవసరమైనంత మేరకు కథా నేపథ్యంగా తీసుకున్నాననీ, మార్క్సిజం, లెనినిజమ్, మావో ఆలోచనా విధానం పట్ల అచంచల విశ్వాసాన్ని ప్రకటించటం కోసమే, ఎప్పటికైనా ప్రజలు అజేయులని, విప్లవం అనివార్యంగా విజయవంతమై

తీరుతుందని చెప్పడానికే ఈ నవల రాశాననీ ఈ రచయిత చెప్పుకున్నాడు. డబ్బు సంపాదనే ముఖ్యం కాదని చెప్పిన *డాలర్...డాలర్* అనే నవలను సింహప్రసాద్ రచించారు. ఈ నవల 2010లో వెలువడింది. కులం అనేది ఈ దేశంలో పుట్టిన ప్రతీ వ్యక్తికి ఓ పుట్టుమచ్చ అనీ, ముఖ్యంగా దళిత కులాల్లో పుట్టిన వాళ్ళ మీద కులం అనేది ఓ పుట్టుమచ్చగా మారి వాళ్ళ జీవితాల్ని ఎలా పీడిస్తుందో చిత్రిస్తూ బోయ జంగయ్య రచించిన *పుట్టుమచ్చ* అన్న నవల 2011లో వెలువడింది. గంటి భానుమతి రచించిన *ఆఖరి ప్రయాణం* అన్న నవల 2011లో వెలువడింది. దీన్ని వైద్య విజ్ఞాన కాల్పనిక నవల అన్నారు ప్రచురణకర్తలు. హీమోఫీలియా అనే జబ్బును గూర్చిన రచన ఇది. ఆరోగ్య విషయాల పట్ల అందరూ అవగాహనను పెంచుకోవాలని, అప్పుడే ఆరోగ్యాన్ని కాపాడుకోగలరని ఈ నవల చెబుతుంది.

ఎంతో అన్యోన్యంగా కాపురం చేస్తున్నప్పుడు ఆకస్మాత్తుగా భర్త చనిపోతే ఆ భార్య పడే వేదనను, ఆ వేదనలోంచి ఆమె ఎలా బయటపడగల్గిందో చెబుతూ శ్రీపాద స్వాతి *పునరాగమనం* అనే మంచి నవలను రచించింది. ప్రముఖ జర్నలిస్టు మరియు కాలమిస్టు జీ.ఆర్. మహర్షి రచించిన ఫాంటసీ నవల *ఒకానొక కాలంలో* కూడా ఇటీవలనే వెలువడింది. సమకాల పరిస్థితుల్ని వ్యంగ్యాత్మకంగా చిత్రించిన నవల ఇది.

తెలంగాణ ప్రాంతపు పేద రైతుల బాధల్ని, గాథల్ని చిత్రిస్తూ ఎలికట్టె శంకర్ రచించిన *దేవుని రాజ్యం* నవల కూడా ఇటీవలనే వెలువడింది. నవలంతా మాండలికంలో రాయడం కాకుండా మాండలికాన్ని సంభాషణల వరకే పరిమితం చేస్తే ఈ నవల ఇంకా బావుండేది. నవలకు పఠనీయతా గుణం చాలా ముఖ్యం.

భర్త ఉద్యోగరీత్యా ఉత్తర భారతదేశంలో కొంతకాలం గడిపినప్పుడు ఎదురైన ఒక భార్యాభర్తల జంటను చూసినప్పుడు కల్గిన అనుభవం నేపథ్యంతో పొత్తూరి విజయలక్ష్మి *ఆత్మకథ* అనే మంచి నవలను రచించింది. భార్యను ఎంతగానో ప్రేమించిన ఓ భర్త ఆ భార్య ప్రేమను ఎన్నో అపార్థాల కారణంగా పొందలేకపోతాడు. చివరకు ఆమె అతణ్ణి అర్థం చేసుకొని అతణ్ణి తన హృదయానికి హత్తుకోవాలనుకుంటుండగా అతడు ఆకస్మాత్తుగా కన్నుమూయడం – ఈ విషాదభరిత సంఘటనను రచయిత్రి ఈ నవలలో చిత్రించిన విధానం పాఠకుల గుండెల్ని బరువెక్కిస్తుంది. ఈ కథలో కల్పితం యేమీ లేదని, తాను చూసిన వ్యక్తులనే పేర్లు మార్చి ఈ నవలలో పాత్రలుగా సృష్టించానని పొత్తూరి విజయలక్ష్మి చెప్పారు.

నాయుని కృష్ణమూర్తి రచించిన *ప్రలోభం* అన్న నవల కూడా ఇటీవలనే 2012లో వెలువడింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పేరుతో రోజురోజుకు పెరిగిపోతున్న యాంత్రిక సంస్కృతిలో మానవ సంబంధాలెంతగా దిగజారి పోతున్నాయో ఈ నవలలో రచయిత చిత్రించటానికి ప్రయత్నించాడు. ''ఇప్పుడు ప్రపంచంలో అందరి మెదళ్ళనూ మీడియా పురుగు కాటేసిందా? ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం ఎక్కడా కనిపించడం లేదేమిటి? ఎవరికీ భుజాల మీద తలలు ఉన్నట్లు లేదే! తలలకు బదులు టీవీలు, సినిమా తెరలు, కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు కనిపిస్తున్నా యెందుకు?" అని ప్రశ్నిస్తాడీ రచయిత.

"డా॥ కనుపూరు శ్రీనివాసులు రెడ్డి రకరకాల గుండె జబ్బులను గూర్చిన అనేక వివరాలతో *మరో హృదయం-మరో ఉదయం* అన్న నవలను కూడా ఇటీవలనే (2011) ప్రచురించాడు. "పేషెంట్‌గా మారిన ఒక డాక్టరూ, అతని కోసం తోటి డాక్టర్‌గా తాపత్రయపడిన అతని భార్య – ఆరోగ్య రీత్యాను, ఆర్థికంగానూ, కుటుంబ రీత్యానూ ఎటువంటి విషమ పరిస్థితుల్ని ఎదుర్కొన్నారో వివరించిన వైజ్ఞానిక, మనోవిశ్లేషణాత్మక నవల ఇది'' అంటుంది అబ్బూరి ఛాయాదేవి ఈ నవలకు రాసిన ముందుమాటలో.

ఇటీవలనే వెలువడిన మరో మంచి నవల శిరంశెట్టి కాంతారావు రచించిన *ఆకుపచ్చ విధ్వంసం*. శ్రీకాకుళం జిల్లాలో ఎన్నో వందల ఎకరాలు భూముల్ని ఎక్కువ ధర పలుకుతున్నదన్న ప్రలోభంతో రైతులు అమ్మేసుకోవడం, తర్వాత తాము అమ్మిన భూముల్లో ఒక అణువిద్యుత్ కర్మాగారం రాబోతున్నదని, దాని కారణంగా భయంకరమైన వాతావరణ కాలుష్యం జరగబోతున్నదని తెలుసుకొని *మా భూములు మాకివ్వాలని* పెద్ద పోరాటం చెయ్యటం – బడా పెట్టుబడిదారులు ఆ పోరాటాన్ని నిర్దాక్షిణ్యంగా అణచివేయడం మొదలైన సంఘటనల్ని రచయిత గొప్ప అవగాహనతో చిత్రించారు. ఇటీవలనే – అంటే 2012లోనే వెలువడిన వియస్సార్ రచించిన *వికసిత* కూడా ఈనాటి యువతరం ఎదుర్కొంటున్న విద్యా విషయిక సమస్యలను,

ఉద్యోగాన్వేషణ సమస్యలను, అమెరికాకు వెళ్ళి ఉద్యోగాలు చేస్తున్న వాళ్ళ సమస్యల్ని చక్కగా చిత్రించింది.

ఇలా 21వ శతాబ్దంలో ఎన్నో నవలలు– సమకాలీన సమాజం ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యల్ని చిత్రిస్తూ వెలువడ్డాయి. ఇవ్వాళ నవలాకారులు స్పృశించని సమకాలీన సమస్య అంటూ యేదీ లేదు.

మొన్నమొన్నటి వరకు ఒకే సామాజిక వర్గానికి చెందిన రచయితలే నవలలు రాస్తుండటం వల్ల ఆ వర్గపు కుటుంబ వాతావరణమే, సమస్యలే తెలుగు నవలల్లో చిత్రితమయ్యేవి. కానీ 1980ల నుండి ఆ పరిస్థితి మారింది. ఇప్పుడు అన్ని సామాజిక వర్గాలకు– ముఖ్యంగా దళిత, బహుజన వర్గాలకు చెందిన రచయితలు కూడా తమ వర్గాలకు చెందిన కుటుంబాల సమస్యల్ని చిత్రిస్తూ నవలల్ని రచిస్తున్నారు. ఈ కారణం వల్ల ఈనాటి నవలల ఇతివృత్తాలలో గొప్ప వైవిధ్యం కనిపిస్తున్నది. ఆయా వర్గాలకు చెందిన రచయితలు స్వానుభవంతో తమ వర్గాల ప్రత్యేక సమస్యల్ని చిత్రించటంతో వాళ్ళు రచిస్తున్న నవలలు అత్యంత వాస్తవికంగా రూపొందుతున్నాయి.

అలాగే ఈనాటి నవలలో కనిపిస్తున్న మరో లక్షణం ఆయా ప్రాంతాల మాండలికాలను ఆయా ప్రాంతపు రచయితలు తమ నవలల్లో విరివిగా ప్రయోగించటం. మాండలికాలను సంభాషణల వరకే వాడటం, నవలా శిల్పంలో సరి అయిన పద్ధతి అనీ, ఈ వీరమాండలిక వాదులు గుర్తించాలి. మనం రాస్తున్న నవలల్ని అన్ని ప్రాంతాల్లోనూ నివసిస్తున్న మన తెలుగు వాళ్లందరూ చదవాలని కోరుకోవాలి కదా! టీ.వీ. సీరియల్స్ కారణంగా మనం ఎందరో పాఠకుల్ని దూరం చేసుకున్నాం. నవలంతా మాండలికంలో రాస్తే ఇప్పుడున్న ఈ కాస్త పాఠకుల్ని కూడా దూరం చేసుకుంటాం.

అంపశయ్య నవీన్ (ప్రముఖ నవలా రచయిత)
ఓరుగల్లు, ఫోన్ : 9989291299



మిసిమి మాసపత్రిక
చందాదారులుగా చేర్పించండి
**బహుమతి**
పొందండి!

**మీ** ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవే కదా. మీకు ప్రియమైన వారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యం కదా.

వీరందరికీ మీరు *మిసిమి* ని బహుమానంగా నెల నెలా పంపవచ్చు. మీరూ ఒక బహుమతిని పొందవచ్చు. మీరు కోరిన గ్రంథాలయానికి, లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం **మిసిమి**కి చందా **₹240** పంపండి (వారి పూర్తి చిరునామాతో).

ప్రక్కన వున్న ఆస్కార్ వైల్డ్ (De Profundis) అనువాద పుస్తకాన్ని మీకు బహుమతిగా పంపిస్తాం. మీరు ఇచ్చిన చిరునామాకు నెల నెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని పలకరించినట్లే – మంచి సారస్వతంతో...

*(ప్రస్తుత చందాదారులు, మరో సంవత్సరము చందా పొడిగించినా ఈ పుస్తకం పొందగలరు.)*




మీ చందా *మిసిమి* పేర ఈ క్రింది చిరునామాకు పంపండి

మిసిమి మాసపత్రిక
**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
e-magazine: www.kinige.com/misimi

# అమృతం కురిసిన రాత్రి

- రావినూతల సత్యనారాయణ

(కేంద్రసాహిత్య అకాదెమీ పురస్కారం పొందిన పుస్తకాలు : 4)



బాలగంగాధర తిలక్

ప్రస్తావన :

ఇరవయ్యో శతాబ్దంలో ప్రపంచ మంతటా, అన్ని రంగాల లోను శర వేగంతో విప్లవాత్మక మైన మార్పులు చోటు చేసుకున్నాయి. ఆంగ్ల భాష ద్వారా, పర భాషల లోని సర్వ కవితా రీతులు మన రచయితలకు పరిచయ మయ్యాయి.ఆ కారణం చేత తెలుగు కవితా రంగంలో కూడా అనేక మార్పులు వచ్చాయి. వీటి ప్రభావం ఆనాటి కవులందరి మీద కొంతమేరకు కనిపిస్తుంది. కవితా రంగంలో అనేక పద్ధతులు మొదలయ్యాయి. సంప్రదాయ కవిత్వము, భావ కవిత్వము, అభ్యుదయ కవిత్వము, వచన కవిత్వము - అనే నాలుగు పాయలలో కవితా రథం పయనించ సాగింది. 20వ శతాబ్దం తొలి పాదంలో తెలుగు కవితా రంగంలో వచ్చినన్ని మార్పులు అంతకు ముందు కాలంలో మనకు కనిపించవు. సంప్రదాయ కవితా రీతులను మాని, ఆధునికత వైపు కలం సాగించిన వారికి ప్రజాదరణ లభించుట మొదలైనది.

గేయం, వచనం, రెండూ కూడా తెలుగు సాహిత్యంలో తమ తమ స్వతంత్ర ప్రతిపత్తిని నిర్మించుకొనుటలో విజయాన్ని సాధించాయి. 1935వ సంవత్సరము నుండి వచన కవిత క్రమ వికాసం చెందుతున్నది. భావ వ్యక్తీకరణలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఆదర్శంగా ఈ కవిత అభివృద్ధి చెందుతోంది. వచన కవిత సులభంగా అర్థమవుతుంది. అందుకే ప్రజలు దాన్ని ఆదరిస్తున్నారని మనం భావించాలి. అయితే ప్రతి ప్రక్రియ, కొన్ని భావాల అభి వ్యక్తీకరణకు యెక్కువ అనుకూలంగా వుంటుంది. ఏ ప్రక్రియ లోనైనా కవితా వస్తువు సాధారణంగా మూడు రూపాలలో ప్రదర్శిత మౌతుంది. భావ సంచలనం, ప్రకృతిలోని సౌందర్యా రాధనం, సామాజిక జీవన విశ్లేషణం. ఏ ప్రక్రియ రూపంలో వెలువడినా, ఒక కవిత విలువ ఆ కవితా గుణాన్ని, ప్రయోజనాన్ని బట్టి నిర్ణయించ బడుతుంది. గుణం లోపించి నప్పుడు కవిత ఏ ప్రక్రియలో వున్నా, ఏ ప్రయోజనాన్ని ఉద్దేశించినా, అది కవితగా పరిగణించబడదు. అంటే, ఏ ప్రక్రియలో చెప్పినా, కవిత కళాత్మకమైన అంతరసత్యదర్శనం కలిగించాలి.

అప్పుడే అది ఒక విశిష్టమైన కళా సంపదగా లోకానికి మిగులుతుంది. వచన కవితా ప్రక్రియలో ప్రఖ్యాత కవులు (కుందుర్తి, తిలక్, బైరాగి, ఆరుద్ర, దాశరథీ, అజంతా, నారాయణ రెడ్డి, బోయిభీమన్న, శేషేంద్ర శర్మ, ఇత్యాదులు) ప్రసిద్ధి కెక్కిన వచన కవితా గ్రంథాలు రచించారు. అయినప్పటికీ, "ఆధునిక వచన కవిత్వానికి ప్రాణం పోసిన వాడు తిలక్. అంతకు ముందే ఒక మట్టి బొమ్మను దేవాలయంలో ప్రతిష్ఠ చేశారు గాని, అది తిలక్ వాణి స్పర్శ తగిలే వరకు పలక లేదు. ఆయన్ను చూడగానే కేరింతలు కొడుతూ ఆటలాడింది... అప్పటికి గాని వచన కవిత్వానికి ఒక స్థాయి రాలేదు. గౌరవం లభించ లేదు" (కుందుర్తి). ఆశ్చర్యమేమిటంటే తిలక్ కవిత చెప్పిన పద్ధతి అటు సంప్రదాయజ్ఞులనూ, ఇటు ఆధునికులనూ, సమానంగా ఆకర్షించింది. తిలక్ రచించిన *వచన గేయం* పరిమళ భరితమైన బంగారు తీగలాగా సాగి ఆయన పనితనపు సామర్థ్యానికి లొంగి రసజ్ఞుల కంఠా భరణమై వాసి కెక్కింది!

బాల గంగాధర్ తిలక్ రచించిన *అమృతం కురిసిన రాత్రి* అనే కవితా సంకలనాన్ని పాఠక మహాశయులకు వివరణాత్మకంగా పరిచయం చేయడమే ఈ వ్యాసం యొక్క ముఖ్యోద్దేశం.

1971వ సంవత్సరంలో కేంద్ర సాహిత్య అకాడమీ (ఢిల్లీ) వారు "అమృతం కురిసిన రాత్రి" తెలుగులో ప్రచురితమైన ఉత్తమ కవితా సంకలనముగా ఎంపిక చేసి, పురస్కారాన్ని (జాతీయ అవార్డు) ప్రదానం చేశారు. అంతేకాక, ఈ రచన ఉత్తమ జనహిత గ్రంథంగా కూడా, ఎంపికయినది.

**బాల గంగాధర తిలక్ కవితా దృక్పథం:**

ఒక మహాకవి కవితా సుధను ఆస్వాదించుటకు ముందు ఆ కవి యొక్క కవితా దృక్పథం తెలుసు కొనుట ఎంతో వాంఛనీయం. దాని వలన పఠితలకు రచయిత భావాలు సులభంగా అర్థమౌతాయి. కవితలను చదివి ఆనందించ గల్గుతారు. ఆ ఉద్దేశ్యంతో తిలక్ గారి కవితా దృక్పథాన్ని సూక్ష్మంగా చర్చించడమైనది.

తిలక్ గారు అంతరాత్మా ప్రేరితులై వచన కవితా రచనకు పూనుకున్నారు. కవిత్వాన్ని గురించిన వారి అభిప్రాయాలు తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం.

పద్య రచనను గురించి ప్రస్తావిస్తూ "పద్యం ఈనాటి అనుభూతి విలక్షణతను ప్రదర్శింపలేదు. సమకాలీన జీవితంలోని వివిధ ప్రవృత్తులను పద్యంలో చూపించలేం". అంటారాయన. అంతేకాక, కవిత యొక్క నిర్వచనమూ, స్వరూపం ఎప్పటి కప్పుడు మారుతోంది. విస్తృత మౌతోంది. ఛందస్సూ, కవి సమయాలు, మొదలైన సంకెళ్ళ నుండి తప్పు కొనిన కవిత అచ్ఛమైన రూపం సంతరించు కొంటుందని ఆయన నమ్మకం. అలాగే కథా సంవిధానం అనే అనవసరపు తొడుగుని విప్పుకొని ప్రధాన అనుభూతుల ఆకృతితో నేటి కవిత్వం దర్శన మిస్తుంది... కవిత్వాన్ని నేడు అనుభవ ప్రధానంగా పరిగణిస్తున్నాం. "సిద్ధాంతాల కోసం కవిత్వాన్ని, అసలు వ్యక్తిని, బలి పెట్టే తత్త్వం హర్షణీయం కాదు" అంటారు తిలక్.

మరో సందర్భంలో వ్రాస్తూ "ఈ నాటి కవిత చురుకైన ఆవేశాన్ని, సాంద్రతరమైన అనుభూతి వత్తిడినీ, సూక్ష్మమైన భావననీ, అనుసరించడానికి, తన స్థానాన్ని ప్రత్యేకించు కుంది... కవి దృష్టి నేడు ఒక లాంతరు పట్టుకొని నలు వైపులా వెళ్ళి ఓపికగా పరిశీలించడం లాంటిది కాదు. వస్తు స్వరూపాలకూ, సంఘర్షణలకూ, శక్తులకూ, కీలక స్థానం మీద శక్తి వంతమైన బ్యాట్రీ లైటు ఫోకస్ చెయ్యడం లాంటిది" అంటారు తిలక్ గారు. తమ రచనల్లో కీలక స్థానం మీద శక్తి వంతమైన బ్యాట్రీ లైటు ఫోకస్ చేస్తారు, వస్తువు మీద కాదు! తిలక్ రచించిన *నిన్న రాత్రి* అనే కవిత *(చూడు అ.కు. రాత్రి 118-119పుటలు)* పరిశీలిస్తే వారి కవితా తత్త్వమంతా అందులో ఇమిడి వున్నట్లు తెలుస్తుంది. అంతే కాదు "తిలక్ గారికి, తక్కిన అభ్యుదయ కవులకు ఉన్న భేదం ఆ కవితలో ప్రస్ఫుటంగా దర్శన మిస్తుంది" అంటారు విప్లవ కవి వరవర రావుగారు. నవీనుల మనుకొనే వారు – సాంప్రదాయ కవులమని భావించే వారు శ్రీ బాలగంగాధర తిలక్ తమ తమ వర్గీయుడని ఎందుకు భ్రమిస్తారో కూడా *నిన్నరాత్రి* కవిత చదివితే విశద మౌతుంది.

ఆ కవితా ఖండికలో ఒక యువకుని ఆకలి చావు, "అమ్ముకొని యౌవ్వనం, అలసిన జీవనం" సాగించి, సాగించి, సంధ్య వేళ ఉరి తీసుకొన్న సాని దాని కథ, కాంగోలో, క్యూబాలో, సైప్రస్‌లో, లావోస్‌లో కాలి, కమురు కంపు కొట్టే కాలం కథ, మానవ వ్యథ వర్ణితమైంది. ఆశ్చర్యమేమిటంటే, "ఇవన్నీ నేను (రచయిత) నా మంచం మీద వచ్చి కూర్చొన్న దేముణ్ణి అడుగ లేదు!" అని చెప్పడం లోనే ఉన్నదని అంటారు వరవర రావు. గమనించండి:

**నాకు తెలుసు నాకు తెలుసు**
**గొలుసు లోని అసలు కిటుకు**
**నాకు తెలుసు నాకు తెలుసు**
**దేవుని చెక్కిళ్ళ మీద దీనంగా కారే కన్నీటిని ...**
**మానవుడే దానవుడై తిరగ బడినప్పుడు**
**పాపం! – పెద్దవాడు – కన్న కడుపు – ఏం చేస్తాడని!**

ఈ తతంగమంతా గమనిస్తూ, కవి తిలక్ ముక్కు మూసుకొని కూర్చో గలడా?! అద్భుత మేమిటంటే ఈ ఆధునిక యుగంలో దేవుడు ఎంత నిస్సహాయుడై పోయాడో – దేవుని చెక్కిళ్ళ మీద దీనంగా కారే కన్నీటిని తుడిచి ఊరడించ వలసిన పరిస్థితి కవికి పట్టింది.! మరో చమత్కార మేమిటంటే తిలక్ బాధ్యతనంతా దేవుని మీద వేయడు. హృదయాన్ని కదిలించే విధంగా మానవుడే దానవుడై ప్రవర్తిస్తే – పాపం దేవుడు మాత్రం ఏంజేస్తాడు – పైగా కన్న కడుపు! అంటూ జాలిని వ్యక్త పరుస్తాడు! సిద్ధాంతా లన్నింటికీ అతీతమైన మానవతా ధర్మాన్ని ప్రతిపాదిస్తాడు తిలక్ ఈ కవితలో.

తిలక్ గారికి కవిత్వం గురించి, మరియు కవిత్వం లోని *'నవత్వం'* గురించి నిర్దిష్టమైన అభిప్రాయాలున్నవి.

కేవలం అనుభూతి విశేషాన్నే కవిత్వంగా భావించిన వాడైతే, ఆధునికుల్లో, ఫ్రీవర్స్ రచయితల్లో ఆయనకు అగ్రస్థానం వచ్చేది కాదు... ఆయన కవిత్వంలో అబ్ స్క్యూరిటి, అస్పష్టత పనికిరాదన్నాడు. "మోడరన్‌గా ఉండాలని, ఏదో అందామనీ, తనకే తెలియని అస్పష్టపు అనుభూతిని అర్థం లేని యిమేజరీలతో, కలగా పులగపు వర్ణనలతో, చేతకాని అనుకరణలతో రాయొద్దన్నాడు. అంతటితో ఆగలేదు. "కవిత కొత్త అనుభవాల కాంతి పేటికను తెరవాలి, కదిలించాలి. ఈ కాలంలో బ్రతుకు; ఈ ప్రపంచాన్ని ప్రతిఫలించు. ఇంటికున్న కిటికీలన్నీ తెరచి అన్ని పవనాల్నీ ఆహ్వానించు, నువ్వు చెప్పేదేదైనా నీదై వుండాలి. నీలో నుంచి రావాలి, చించుకొని రావాలి. మళ్ళీ ఈనాడు చిత్ర కవితల్నీ, అయోమయ బంధాల్నీ, పునరుద్ధరించకు" అంటారు. ఎంత మంచి ఆలోచనలు! ఎంత మహత్తరమైన సందేశం! కవితా రచనను నిష్ఠతో సాగించే రచయితలందరూ అనుసరించ దగిన సందేశ మిది! తిలక్ మహాశయుని హృదయానికి అద్దం పట్టేటువంటి ఆలోచనా పరంపర.

తిలక్ కవితా దృక్పథాన్ని గూర్చి అనేక విషయాలు పేర్కొనవచ్చు. అలా వ్రాస్తే - ఒక పుస్తకమే అవుతుంది! అది ఈ వ్యాసకర్త లక్ష్యం కాదు. అందుకని...

**"కవిత్వం ఒక ఆల్కెమీ, దాని రహస్యం కవికే తెలుసును**
**కాళిదాసుకు తెలుసు, పెద్దన్నకీ తెలుసు**
**కృష్ణ శాస్త్రి కి తెలుసు, శ్రీ శ్రీ కి తెలుసు"**

అన్నా! కవిత్వం అంతరాంతర జ్యోతి స్సీమల్ని బహిర్గతం చెయ్యాలి, విస్తరించాలి చైతన్య పరిధి

**"అగ్ని జల్లినా, అమృతం కురిసినా**
**అందం, ఆనందం దాని పరమావధి"**

అని పేర్కొంటూ ఈ విభాగం ముగిద్దాం!

**అమృతం కురిసిన రాత్రి - కవితాధ్యాయనం :**

కవిత్వ అధ్యాయనానికి సాహిత్యాభిరుచి అవసరం. కవిత్వంలో వస్తువు వుంటుంది, ప్రక్రియ వుంటుంది, అనుభవం వుంటుంది. వస్తువు ఏదైనా, ప్రక్రియ ఏదైనా అవి రెండూ కూడా అనుభవానికి సాధకాలు. అనుభూతిని అందుకోవడానికి సహాయ పడతాయి. కవిత చదివితే పాఠకుడు ఆ కవితలోని భావంతో సానుభూతి ప్రకటించడం, లేదా ఆ కవిత ప్రతిపాదించే భావంతో ప్రభావితుడు కావటం జరుగుతుంది. కవితాను భూతిని రెండు విధాలుగా పొందవచ్చు. మొదటిది మనసుతో, రెండవది మెదడుతో. మనసుతో పొందే అనుభూతి పఠితకు లోచూపు నిస్తుంది. మెదడుతో పొందే అనుభూతి పైచూపు నిస్తుంది. పఠితలో విశ్వాసాన్ని తెలుసుకొనేది లోచూపు. విశ్వాత్మలో పఠిత తనను తాను చూచుకొనేది పైచూపు. ఈ రెండు విధానాలలో దేనితోనైనా పాఠకుడు (పఠిత) తన కవిత్వ అధ్యయనం మొదలెట్టవచ్చు. పైన పేర్కొనిన విషయాలు దృష్టిలో పెట్టుకొని *అమృతం కురిసిన రాత్రి*లోని కవితా ఖండికలు (కొన్నిటిని) ఆస్వాదించే ప్రయత్నం చేద్దాం.

*అమృతం కురిసిన రాత్రి* అనే కవితా సంకలనం లో 80 కవితా ఖండికలున్నవి. ఈ కవితలన్నీ 1941-1970 మధ్య కాలంలో రచించబడినవి. సంకలనములోని ప్రతి కవితా ఖండిక స్వయం సంపన్న. దేని కదే చదివి ఆనందింప తగినది. ఒక దానితో మరొకటి వస్తు బాంధవ్యము లేనిది. కాబట్టి కవితలన్నీ ఏక బిగిని చదువ వలసిన అవసరము లేదు. దేని ఆనందం దానిదే. దేని అనుభూతి దానిదే. పఠితలు తమ తమ ఇష్టాను సారంగా, ఇష్టాను క్రమంగా చదివి ఆనందించ వచ్చు.

*అమృతం కురిసిన రాత్రి* సంకలనము లోని మొదటి కవిత "నా కవిత్వం" అనే శీర్షికతో ప్రచురితమైనది. ఈ గేయం 1941లో రచించినది. అప్పటికే, విభిన్న రాజకీయ ధోరణులు సాహిత్య రంగములోకి ప్రవేశించాయి. ముఖ్యంగా అభ్యుదయ కవులు రాజకీయ ప్రభావాలకు లోనై తమ తమ కవిత్వంలో ఆయా ధోరణులు వ్యక్త పరచటం ప్రారంభ మైనది. నిబద్ధ కవితలు విరివిగా ప్రచురిత మయ్యాయి. అయితే, రాజకీయ పక్షాలకు రచయిత దాసోహం కావటం తిలక్ గారికి సమ్మతం కాదు. ఆ భావనే ఈ కవితా ఖండిక పరోక్షంగా వ్యక్త పరుస్తుంది:

**నా కవిత్వం కాదొక తత్వం**
**మరికాదు మీరనే మనస్తత్వం**
**కాదు ధనిక వాదం, సామ్య వాదం**
**కాదయ్యా అయోమయం జరామయం**
**...**
**నా అక్షరాలు కన్నీటి జడులతో తడిసే దయా పారావతాలు**
**నా అక్షరాలు ప్రజా శక్తుల వహించే విజయ ఐరావతాలు**
**నా అక్షరాలు వెన్నెలలో ఆడుకొనే అందమైన ఆడ పిల్లలు.**

తన కవిత్వాన్ని పైన పేర్కొనిన (తొలిగేయంలో) కొలత

బద్దతో కొలవద్దన్నాడు తిలక్. తన కవితా శక్తి నంతా కరుణా శృంగారాలతో నింపి విశ్వ శ్రేయస్కరం చేస్తానంటాడు. 'కరుణ' కు దయాపారావతాలను, శృంగారానికి అందమైన ఆడపిల్లలను, విశ్వశ్రేయస్సు సూచనగా విజయ ఐరావతాలను, ప్రతీకలుగా (సంకేతాలు) చిత్రిస్తాడు తిలక్. *మేగ్నాకార్టా* అనే మరో కవితలో –

**"మాకు లోకం ఒక గీటురాయి మాకు కరుణ చిగురు తురాయి**
**మేం పర పీడన సహించం మేం దివ్యత్వం నటించం"**

అంటారు. ఈకవిత రచించినది 1942వ సంవత్సరంలో. ఆ కాలంలో కొంతమంది యువకులు 'నయాగరా' కవులనే పేరుతో సాహిత్యాన్ని ఎత్తి పోతలుగా కురిపించారు. ఆనాటి యువకులకు వ్యక్తి చైతన్యాన్ని, సంఘ చైతన్యంగా అనువదించాలనే సంకల్పం ప్రబలమైనది. ఆ తరుణంలో తన *మేగ్నా కార్టా* ప్రకటిస్తాడు తిలక్. విజయ శంఖారావ విమల గీతమ్ముతో కొత్త మార్గాలకై సాగి పోతాడు. *మేగ్నా కార్టా* అంటే ఒక 'సివిల్ లిబర్టి చార్టరు' ప్రతి పౌరుడికి అన్ని విధాల స్వేచ్ఛ అవసరమనే ప్రబల వాంఛ.

**సైనికుడి ఉత్తరం:**

రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న ఒక సైనికుడు తన భార్యకు వ్రాసిన ఉత్తరం ఈ కవితా ఖండిక లోని వస్తువు. ఆ సమయం లో సైనికులు అనుభవించిన బాధలు, వారి జీవన విధానం, వారిని మనుషులుగా కాక మరలుగా వాడిన వృత్తాంతం అత్యంత ఆకర్షణీయంగా చిత్రించాడు కవి. అంతే కాక, ఆ తరుణంలో మనుష్యులలో చీకటి కొండగా పెరిగిన స్వార్థం, సైనికుల అసహాయత వారిని నిరుత్సాహ పరచి, వారిలో నిర్వీర్యతనే గాక రాక్షసత్వాన్ని, జీవితం పట్ల చులకనా భావాన్ని యినుమడింప చేస్తుంది.

అప్పటి వారి మనస్థితిని – మనో వేదనను వ్యక్త పరచడంలో మనోంతరాల నుండి అనుభూతిని విశాల పరిధి లోనికి గొని వచ్చి ఘనీభవింపజెయ్యాలని ప్రయత్నిస్తాడు తిలక్. ఆ కవితా ఖండిక లోని కొన్ని పాదాలను పరిశీలించండి!

**ఇక్కడ నేను క్షేమం – అక్కడ నువ్వు కూడా...**
**...**
**ఇప్పుడు రాత్రి, అర్థ రాత్రి**
**నాకేం తోచదు నాలో ఒక భయం**
**తెల్లని దళసరి మంచు రాత్రి చీకటికి అంచు**
**దూరంగా పక్క దేరాలో కార్పోరల్ బూట్స్ చప్పుడు**
**ఎవరో గడ్డి మేటి నుంచి పడ్డట్టు –**
**నిశ్శబ్దంలో నిద్రించిన సైనికుల గురక**
**చచ్చిన జీవుల మొరలా వుంది.**
**... ...**
**పోదు నాలో భయం మళ్ళీ రేపు ఉదయం**
**ఎడార్లు నదులూ అరణ్యాలు దాటాలి.**
**ట్రెంచెస్ లో దాగాలి**
**పైన ఏరోప్లేను, చేతిలో స్టెన్ గన్**
**కీయిస్తే తిరిగే అట్ట ముక్క సైనికులం**
**మార్చ్!**
**వన్ టూ త్రీ షూట్ డెడ్ ఎవడ్**
**నువ్వా నేనా**
**కేబుల్ గ్రాం యిప్పించండి కేరాఫ్ సో అండ్ సో**
**(మీ వాడు డెడ్.)**
**స్పృహ తప్పిన ఎస్తీషియాతో**
**వెన్నెముక కర్రలా బిగిసింది.**
**యుద్ధం యుద్ధం**
**లిబియాలో బెర్లిన్లో స్టాలిన్ గ్రాడ్ లో**
**స్వార్థం పిచ్చి కుక్కలా పెరిగింది.**
**...**
**నేనిది వరకటి నేను కాను**
**నాకు విలువల్లేవు**
**నాకు అనుభూతుల్లేవు**
**చంపడం, చావడం**
**మీసం దువ్వడం లాంటి అలవాటయ్యింది.**
**కనిపించే ఈ యూనిఫారం క్రింద**
**ఒక పెద్ద నిరాశ, అనాగరికత**
**బ్రిడ్జీ క్రింద నది లాగా రహస్యంగా వుంది.**
**వదల లేని మోపు ఊబిలాగా వుంది**
**నేనంటే నాకే అసహ్యం**
**అందుకే మరీ మరీ చంపుతాను, మరీ మరీ తాగుతాను**
**ఇంకేం చేసినా ఎవరూ ఒప్పుకోరు.**
**...**
**తిరిగి ఎప్పుడు మన ఊరు వస్తానో!**
**నిన్ను చూస్తానో?**
**...**

**ఎన్నాళ్ళకి! ఎన్నాళ్ళకి!**
**కొన్ని వేల మైళ్ళ దూరం మన మధ్య**
**ఒక యుగంలా అడ్డు పడింది.**
**ఇంక సెలవ్ మై డియర్!**
**నిద్ర వస్తోంది మత్తుగా నల్లగా**
**అదుగో సెంట్రీ దేరా ముందు గోరీలా నిలబడ్డాడు**
**...**
**మళ్ళీ జవాబు వ్రాయ్ సుమీ!**
**ఎన్నాళ్ళకో మరీ**
**సెలవ్! అబ్బా! చలి!**
**చలి గుండెల మీద కత్తిలా తెగింది.**
**నీ రూపం నా దేహానికి వెచ్చగా తగిలింది.**

భార్యా పిల్లల నుండి యెంత కాలం నుండి విడిగా వున్నాడో? అసలు వారిని కలుస్తానన్న నమ్మకం సైనికుడికి కలుగుట లేదు. ఒక వేళ కలిసినా ఎన్నాళ్ళకి? అనే ప్రశ్న అతన్ని కలవర పెడుతోంది! ఇదే తిలక్ శైలి లోని ప్రత్యేకత! మానవ కారుణ్య భావనకు పతాకం ఎగుర వేసే తత్వము తిలక్ ది.

మరో అద్భుతమైన కవితా ఖండిక *ఆర్త గీతం* ఇది ఒక హృదయ విదారకమైన కవిత. ఈ కవిత చదువు తున్నప్పుడు దేవులపల్లి కృష్ణశాస్త్రి రూపం మన కనుల ముందు మసలుతుంది. ఆయన రచన *ఏద్వనీండి నన్ను* మనకు స్ఫురిస్తుంది. కాని ఈ రెండు కవితలలో చాలా వ్యత్యాస మున్నది. తిలక్ హృదయ వ్యధకు దారి తీసిన కారణాలు పాఠకుణ్ణి సహితం అత్యంత వేదన పాలు చేస్తాయి. కవితలోని కొన్ని భాగాలు తిలకించండి!

**నా దేశాన్ని గూర్చి పాడ లేను,**
**నీ ఆదేశాన్ని మన్నించ లేను,**
**ఈ విపంచికకు శ్రుతి కలుప లేను**
**ఈ రోజు నాకు విషాద స్మృతి,**
**విధి తమస్సులు మూసిన దివాంధరుతి**
**నా ఎడద మ్రోడైన ఒక దుస్థితి.**
**నేడు నేను కన్నీరుగా కరిగిన గీతికను,**
**సిగ్గుతో రెండుగా చీలిన వెదురు బొంగును,**
**మంటలో అంతరాంతర దగ్ధమైన బూడిదను**
**పైన దైవమునకు, కింద మానవునకు జవాబు చెప్ప వలసిన వాణ్ణి**
**రసాతల మంట శిరస్సు వంచిన వాణ్ణి**

ఆ తర్వాత గేయాలలో తాను చూచిన దృశ్యాలను హృదయానికి హత్తుకొనే విధంగా చిత్రిస్తాడు తిలక్. "నేను చూచాను నిజంగా మూర్తీభవత్ దైన్యాన్ని, హైన్యాన్ని, క్షుభితాశ్రు కల్లోల నీరధుల్ని, గచ్ఛత్ శవాకార వికారుల్ని" అంటాడు భరించ లేని ఆవేదనతో. అందుకే కాబోలు "ఇది ఏ నాగరికతకు ఫల శ్రుతి? ఏ విజ్ఞాన ప్రకర్షకు ప్రకృతి; ఏ బుద్ధదేవుని జన్మ భూమికి గర్వ స్మృతి?" అని నిక్కచ్చిగా ప్రశ్నిస్తాడు ఆయన. ఆ తర్వాత మళ్ళీ అంటాడు. "ఒక్క మలినాశ్రు బిందు వొరిగి నంత వరకు; ఒక్క శుష్క స్తన్య సన్నిధిని క్షుదార్తి నేడ్చు పసి పాప ఉన్నంత వరకు...

అలాగే "ఒక్క తల్లి వీరవాక్రోశ రవమ్ము విన్నంత వరకు, ఒక్క క్షత దుఃఖిత హృదయ మూరడిల్ల నంత వరకు, నాకు శాంతి కలగ దింక నేస్తం, నేను నిగర్వి నైనాను, ఈ సిగ్గు లేని ముఖాన్ని చూపించ లేను" అని వాపోతాడు. అంతే కాదు, ఈ స్థితిని గురించి పట్టించు కొనే నాథుడెవడైనా (రాజకీయ వేత్త గాని, భోగ భ్యాగ్యాలనుభవించు వారుగాని) ఉన్నాడా? ఈ విషాద ఆర్తి వారిని చలింప జేస్తుందా? ఏ భగవంతునికి ఈ హృదయ విదారక స్థితి విన్నవించాలి? అని ప్రశ్నిస్తాడు కవికుల తిలక్. *ఆర్త గీతం* కవిత సూక్ష్మంగా పరిశీలిస్తే – తిలక్ మానవ కవి అనీ, అన్ని ధర్మాలకు మించిన మానవ ధర్మం త్రికరణ శుద్ధిగా పాటిస్తారనే నమ్మిక పాఠకు లందరి లోను దృఢ మౌతుంది.

తిలక్ కోరుకునే దేశం ప్రాణమున్న మనుష్యులతో నిండినది. ''ఆ దేశంలోని మనుషులకు ఆయన కోరుకున్నదల్లా, కడుపు నిండా ఆహారం, గుండే నిండా ఆ శ్లేష్మం, బ్రతుకు పొడువునా స్వతంత్రం, కొంచెం పుణ్యం, కాస్త పాపం, కొంత కన్నీరు, మరికొంత సంతోషపు తేనీరు!" ఈ అవసరాలన్ని తీరేకాల మెప్పటికైన వస్తుందా అని ఆయన మనో వ్యథ! దానిని గురించి అటు దేవునికీ, ఇటు మనిషికీ తగిన జవాబు ఇవ్వ లేక తన నిస్పృహను వ్యక్త పరుస్తాడు.

**గొంగళి పురుగులు:**

నేటి సామాన్య మానవునికి అన్ని సమాజ రంగాల్లో ప్రతి నిధులు ఉన్నారు. సాహిత్య రంగంలో సామాన్యునికి ప్రతినిధి తిలక్. సామాన్యుని ఆశయాల్ని, స్వధర్మాన్ని గుర్తించడమే గాక, వారిలో తానొకడుగా భావించాడు తిలక్.

సామాన్యుని అణగ ద్రొక్కాలనే యత్నంలో వున్న వారంతా నేటి రచయితకు (తిలక్) శతృవుల వంటి వారు. తానాశించే జాగృతీ, చైతన్యమూ సామాన్యులలో కనిపించక పోవడంతో నిస్పృహకు లోనవుతాడు. అలాంటి మానసికి స్థితిలో రచించిన కవితా ఖండిక, *గొంగళి పురుగులు*. గొంగళి పురుగును, పూట గడవని, కనీసావసరాలు తీరని, దైన్య స్థితిలో జీవించే సామాన్యునికి ప్రతీకగా వాడుతాడుకవి. కవితా చిత్రణ తిలకించండి:

**బల్ల పరుపుగా పడుకొన్న జీవితం మీద నుంచి**
**భార్యా మణి తాపిగా నడచి వచ్చి అంది కదా –**
**"పంచదార లేదు, పాల డబ్బా లేదు**
**బొగ్గులేవు రాత్రికి రగ్గులేవు.**
**రోజూ పాడే పాత పాటకి రోజూ ఏడ్చే పాత చావుకి**
**విలువలేక, విని కూడా కదల కుండా గొంగళీ పురుగు**
**సగం సగం తిన్న కలల్ని నెమరేస్తూ నిద్ర పోయింది**
**... ... ...**
**విసుగెత్తి చివరికి గొంగళి పురుగులు**
**బల్ల పరుపుగ పరుచు కున్న తన జీవితాన్ని పరుపు**
**చుట్టలా చుట్టి**
**ఆత్మహత్య చేసు కుందా మని అనుకుంటుంటే**
**పెళ్ళాం మాట వినబడి బాస్ కేక వినబడి**
**భయంతో గజ గజ వణుకుతూ**
**సగం సగం తిన్న కలల్ని నెమరు వేస్తూ**
**సగం సగం చచ్చిన ప్రాణాల్ని జోకొట్టుతూ**

తిలక్ 1959లో *ఒక శ్రుతి* అనే కవితను రచించారు. శ్రుతి అనే పదానికి వేదం, ధ్వని, వినబడినది, సంగీతం లోని మేళవింపు అనే నానార్థాలు ఉన్నప్పటికీ – వినబడినది అనే అర్థం లోనే తిలక్ వాడారని మనం భావించ వలసి ఉంటుంది. *ఒక శ్రుతి* అనే గేయంలో "దూరదూరాల్లో రేఖగా, పొలి మేరగా కరిగి నిల్చిన తనలో వినబడే" శ్రుతిని కవి పలికించడానికి ప్రయత్నిస్తాడు.

ఇది చాలా లోతైన భావన. (deep thought) అంటితేనే, చరచరా పారిపోయే, పాదరసం లాంటి అనుభూతి. అలాంటి అనుభూతిని పదాలలో అమర్చి పాఠకుడి అనుభవానికి అందజేయాలనే ప్రయత్నం చేస్తాడు కవి తిలక్. చాలా మంది ఆధునిక కవులు ప్రదర్శించే అలాంటి భావన పాఠకుల మనోనేత్రానికి చీకటిగా కనిపిస్తుంది. అలాంటి చీకటి తెరను చీల్చుకొని పోయేటంత శక్తి పాఠకుని హృదయపు కళ్ళకి సాధ్య పడదు. కాబట్టి కవి తన మనస్సులోని చీకటిని ఒక వెలుగు రేఖతో జోడించాలి. ఆ చీకటిని (Transparent) చెయ్యాలి. కవి ఉపయోగించే వెలుగు రేఖలే ఆలోచనా పరుడైన పాఠకునికి అందే సంకేతాలు, కవితా రహస్యాలు. ఈ కవితా ఖండిక లో తిలక్ చేసిన శిల్పాన్ని దర్శిద్దాం. ఈ కవితలో కవి దైవానికి, తనకి మధ్య గల దూరాన్ని హృదయంతో కొలుస్తాడు! అప్పుడు వినిపించే దూర దూరాల శ్రుతి.

**"చెరగి – నేను పుట్టిన పురిటి నొప్పుల చీకటి బాధ;**
**చెరగి – నేను నశించి చావు సంధ్యల నెత్తుటి చార**
**చెరపి కొని నీ మధ్య గల దూరపు రేఖ తెలిసికొని**
**నీ మధ్య నా మధ్య వంగిన తారకల శాఖ"**

"పురుటి నొప్పుల చీకటి బాధ చెరిగి పోవాలి. అప్పుడు కవికి ప్రారంభాన అనంతత్వం ప్రాప్తిస్తుంది. చావు సంజెల నెత్తుటి చార చెరగి పోవాలి. అప్పుడు అతనికి అంత్యాన అనంతత్వం ప్రాప్తిస్తుంది. 'పురిటి నొప్పుల చీకటి చార' అనడంలో మానవ జన్మలోని వేదన, జన్మ పూర్వకమైన అనంత తిమిరాలూ దర్శన మిస్తున్నవి.

ఇట్లా అనంత వేదననీ, అజ్ఞాన తిమిరాన్ని పాఠకుని అనుభూతికి తేవడానికి 'పురిటి నొప్పుల చీకటి చార' అనే పదాన్ని వాడడమే చీకటిని (Transparent) చేయడం... ఇక్కడే 'దూరపు రేఖ' అనే పద సంఘటన చాలా ప్రతిభా ద్యోతకమైనది. దూరాన ఉన్న రేఖ – అని కాదు దీని అర్థం. దూరము అనేటువంటి రేఖ. మానవుడు దైవానికి, ఒకేసారి అనంత దూరంలోనూ, అమిత సమీపంలోనూ, ఉన్నాడు... అందుకని ఒకేసారి దూరాన్ని సమీపానికీ, సమీపాన్ని దూరానికీ తీసుక పోగల శక్తిని ప్రదర్శిస్తుంది 'దూరపు రేఖ' అనే సమాసం. ఇటువంటి అద్భుత శిల్పాన్ని తిలక్ తనదైన నవ్య మార్గంలో విచిత్రంగా చూప గలిగాడు" (అద్దేపల్లి రామమోహనరావు) *ఒక శ్రుతి* అనే కవితా ఖండికలో.

*ఇంకావుంది...*

ప్రొఫెసర్ రావినూతల సత్యనారాయణ
ఫోన్ : 9618524702

# తెలుగు భాషా వైశిష్ట్యం

*- యల్.బి. శంకరరావు*

తెలుగు ద్రావిడ భాషాజన్యమైంది. దక్షిణ మధ్యద్రావిడ భాషకు చెందినది. నేడు మనం వ్యవహరిస్తున్న ఈ భాషకు ఆంధ్రం, తెనుగు, తెలుగు అనే పేర్లు ఉన్నాయి. తమిళులు సంగసాహిత్యంలో మన భాషను వడగు, వడుగ అని పిలిచేవారు. పోర్చుగీసువారు ఈ భాషను జెంటూ అని వ్యవహరించారు. *నికొలో ది కొంటి* (Niccolo de Conti) ఈ భాషను ఇటాలియన్ ఆఫ్‌ది ఈస్ట్ అని ప్రస్తావించాడు. ఇటలీ భాషలాగానే మన భాష కూడ అజంత భాష. అజంత భాషలు శ్రవణ సుభగత్వాన్ని కల్గిస్తాయి. తెలుగు భాష తియ్యని భాష. అందువల్లనే తమిళ భారతియార్ సుందర తెనుంగుగా కీర్తించారు.

మన భాషకు అంధ్ర, ఆంధ్ర, తెనుంగు, తెనుగు, తెలుంగు, తెలుగు, త్రిలింగ, వడగు, వడుగ, జెంటూ అనే పేర్లు సిద్ధించాయి. తెలుగు భాష 2000 సంవత్సరాలకు ముందే పుట్టి అనేకానేక మార్పులు చెందుతూ పరిణామం పొందింది. తెలుగు భాషలో ఉన్న కొన్ని విచిత్ర విన్యాసాల్ని పరిశీలిద్దాం.

తాళపత్ర ప్రతుల్లోగాని, మొట్ట మొదటగా ప్రచురించిన గుజలీ ప్రతుల్లోగాని, ప్రశ్నార్థకాదులైన వాటికి గుర్తులు పెట్టేవారు కాదు. అందువల్ల ఒక్కొక్కప్పుడు ఆ గుర్తులు లేని కారణం చేత మనం పొరపాటు పడటానికి ఆస్కారం ఉంది. మహాభారతం ఆదిపర్వం ద్వితీయాశ్వాసంలో గరుడునితో విప్రుడిలాగన్నాడు. **విప్రుడనున్నవాడ నపవిత్ర నిషాది మదీయభార్య కీర్తిప్రియ దీని బెట్టి చనుదెంచుట ధర్మువెనాకు-** (63), ఇక్కడ మదీయ భార్య కిర్తి ప్రియ అని అనుకోవడానికి ఆస్కారం ఉంది. కాని అపవిత్ర నిషాది మదీయ భార్య అనే చెప్పుకోవాలి. కీర్తిప్రియ అనేది గరుడునికి సంబోధన - కీర్తి ప్రియ అని ఈ గుర్తు పెట్టక పోతే సందేహం రావచ్చు. నన్నయ అరణ్యపర్వంలో ధర్మజుని సత్య ధర్మనిత్యు ధర్మజు రమణీయ కీర్తిప్రియు (1-204) అని సంబోధించటం గమనార్హం.

ఆది పర్వంలో కృష్ణద్వైపాయనుడు తన తల్లి సత్యవతితో ఇలాగ అన్నాడు:

క. **మతిదలపగసంసారం**
**బతిచంచల మెండమావులట్టుల సంప**
**త్ర్పతతులతి క్షణికంబులు**
**గత కాలము మేలు వచ్చుకాలము కంటెన్**

ఈ పద్యంలోని ఎండమావులు అతి చంచలాలనీ వాటిని ఆంగ్లంలో మిరేజస్ అంటారనీ మనందరికి తెలుసు. ఎండమావుల్ని శబ్దరత్నాకరం ఏకపదంగా దేశ్యంగా భావించి నీటివలె కనబడే సూర్యకిరణాలని అర్థం ఇచ్చింది. (పు.142) కాని అది ఏకపదం కాదు. సూర్యరాయాంధ్ర నిఘంటువులో కన్నడంలో ఉన్నటువంటి బిసిలుకుదిరె అనే సమానార్థక శబ్దాల్ని ఉదాహరించి ఎండలో గుర్రము వలె చలించు చాయలనే అర్థం చక్కగా ఇచ్చారు. ఇసకపర్రలమీద, తారురోడ్లమీద మధ్యందిన మార్తాండకిరణాలు తరంగాలవలె ఎగసి దూకే గుర్రాలలాగ భ్రమింపజేస్తాయి. కాబట్టి అవి ఎండమావులయ్యాయి. మావులంటే గుర్రాలు కదా!

తిక్కన భారతంలో అరవాయి అనే పదాన్ని పెక్కుమార్లు ప్రయోగించాడు. సందర్భాన్ని అనుసరించి అరవాయి అంటే వెనుదీయు, శంక, జంకు, సందేహించు అనే అర్థాల్ని మన నిఘంటువులిచ్చాయి. అరవాయి ఏకపదం కాదు. అర+వాయి = సగం నోరు అని అర్థం.

ఉద్యోగ పర్వంలో వృష్టి కుమార వరులనేకులట్టి యోధులు పోర నరవాయి గొందురే (1-268) శత్రువీరుల్ని నోటి నిండా కబళిస్తారుగాని సగం నోటితో కాదని అర్థం. సందర్భాన్ని అనుసరించి అరవాయికి అర్థం మారుతూ

పోయింది. మన నిఘంటువులు అరవాయిని వైకృతమని పేర్కొన్నాయి. కాదు ఇది దేశ్యపదమే.

తెలుగు సాహిత్యంలో మొదట ఒట్టు పెట్టించిన వాడు తిక్కన. నన్నయ భారతంలో ఒట్టు పెట్టించినట్లు కనబడదు. తిక్కన భీష్మపర్వంలో అర్జునుని చేత ఒట్టు పెట్టించాడు. శ్రీకృష్ణుడు చక్రాన్ని ధరించి భీష్మునిపైకి లంఘించినపుడు అర్జునుడు కోపము సంహరింపుమని శమియింపుమని చెప్పి "సాత్యకి చంపినాడ వింకట చనితేని" (2-161) అని ఒట్టుపెట్టాడు. నన్ను చంపినంత ఒట్టు అనకుండా కృష్ణుని సోదరుడూ తనకు శిష్యసమానుడూ అయిన సాత్యకిపై ఒట్టుపెట్టాడు. అంటే ఇద్దరికీ ఇష్టమైనవాని పైన ఒట్టుపెట్టాడన్నమాట. పోతన భాగవతంలో గోపస్త్రీలు కూడా యశోదతో మాయన్నల సురభులాన మంజులవాణీ అని మనోజ్ఞమైన ఒట్టు పెట్టారు. గోపభామినులు కాబట్టి తమ గోవులపై ఒట్టు పెట్టడం రమణీయంగా ఉంది.

నిర్వచనోత్తర రామాయణంలోని సీతాపరిత్యాగ ఘట్టంలో "రాముడు సడికంటె చావు మేలనియెడి పలుకు తలంపవలదె యిలపురుషులకున్'' (8-119) అని పలికినట్లుగా తిక్కన ప్రయోగించాడు. ఇక్కడ సడి అంటే అపవాదు, నింద, అపకీర్తి అనే అర్థంలో వాడారు. సడి అంటే జాడ అనే అర్థంలో వరాహపురాణంలో "ముప్పిరి కొనియెడి వగసడిచప్పుడు గాకుండ'' (3-60) అనే ప్రయోగముంది. సవ+వడి=సవ్వడి - జాడ అని సూర్యరాయాంధ్రము (6-851) సవ్వడియే పదమధ్యాక్షర లోపం చేత సడి అయ్యిందా? అయితే మరి పూర్వ స్వరానికి దీర్ఘం రాలేదే ? నేటి మన వ్యవహారంలో సడిచప్పుడు కాకుండా అనటం ఉంది. జాడ, శబ్దం అనే అర్థాలు సరిపోతాయి. సడి అంటే శబ్దించే అనే అర్థంలోనే వాడుతున్నాం. సి.నా.రె రవ్వంత సడిలేని రసరమ్య గీతాలన్నారు. తిక్కన నాటి నుండి అర్థం మారుతూ వచ్చింది. సడి అంటే చప్పుడు అనే అర్థం నేటి వ్యవహారంలో ఉంది.

అన్నమయ్య భక్త్యావేశంలో తిరుమల అనే దాంట్లో మల=కొండ అనే అర్థమున్నా తిరుమలకొండ తిరుమల కొండ అని పెక్కుమార్లు ప్రయోగించాడు. తిరుమల అనేదాన్ని ఒక ప్రదేశంగా తీసుకుని దానిపై మళ్ళీ కొండను చేర్చి తిరుమల కొండ అని ప్రయోగించటం గమనార్హం. ఇలాగే ఇంకొకచోట తిరుమల గిరివాసా అని ప్రయోగిస్తాడు. తమిళంలోని మలై మన తెలుగు భాషలో మలగా మారింది. మల దేశ్యపదమే ఆ మల పైన మరొక దేశ్యపదమైన కొండ చేర్చి వాడాడు. తిరుమల మీద ఇక్కడ గిరి అనే సంస్కృత పదాన్ని చేర్చి ప్రయోగించాడు.

అన్నం బ్రహ్మేతివ్యజానాత్ అనే శ్రుతి వాక్యాన్ని అనుసరించి నారాయణ సూరి తన కుమారునికి అన్నమయ్య అనే పేరు పెట్టాడు. తన వేంకటేశ్వర శతకంలో అమ్మకు తాళ్ళపాక ఘనుడన్నడు పద్యశతంబు చెప్పెకో కొమ్మని వాక్ప్రసూనముల కూరిమితో నలమేలు మంగకున్ అని అన్నడు ప్రయోగించాడు. తిన్నడు లాగా అన్నడయ్యింది. నేటి వ్యవహారంలో మనం అమ్మ శబ్దానికి కూడ డు చేర్చి అమ్మడూ అని స్త్రీని పిలవటం ఉంది. అలాగే కామాక్షిని కాముడూ అనటం కూడా ఉంది. తమిళ కన్నడాల్లో అప్ప అంటే తండ్రి, నేటి తెలుగులో అప్ప అంటే అక్క అనే అర్థం కృష్ణాజిల్లా భాషలో ఉంది.

అన్నమయ్య ఒకచోట "రువ్వెడి రాళ్ళదల్లి రోలదన్ను గట్టెనంట" అని ప్రయోగించినట్లుగా ప్రచురించారు. చల్ల చేయటానికి చల్ల కవ్వానికి త్రాళ్ళతో రువ్వుతారు. కాబట్టి రువ్వే త్రాళ్ళతో యశోదాదేవి చిలిపి బాలకృష్ణుని రోలుకు కట్టివేసింది. అందువల్ల రువ్వెడి త్రాళ్ళదల్లి రోలదన్ను గట్టెనంట అని ఉండాలి.

ఒకనాటి జాతీయాలు ఉచ్చారణలో కొంత మార్పు చెంది, నేడు ప్రయోగింప బడుతున్నాయి. మొసలి కన్నీరును ముసలి కన్నీరుగా శిష్టేతరులు వ్యవహరించడం ఉంది. మొసలి కన్నీరు అంటే దొంగ కన్నీరు పెట్టడం మొసలికి కన్నీరు ఉండదు. కన్నీరు కార్చకుండా కన్నీరు కారుస్తున్నట్లు నటిస్తే మొసలి కన్నీరు పెడుతున్నారు అంటారు.

ముందుంది ముసళ్ళ పండగ అన్నప్పుడు ముదుసలి+లు = ముదుసళ్ళు, కోడె వయస్సులో ఉన్నప్పుడు అడ్డదిడ్డాలుగా తిరుగుతున్నప్పుడు ఇప్పుడిలాగే వుంటుందిలే వయసుంది కాబట్టి ముందుంది ముసళ్ళ పండగ అంటారు. వయసు ముదిరాక నడుం నొప్పి మోకాళ్ళ నొప్పి వచ్చి బాధపడతారు. ఇప్పుడు కాదు పండుగ అప్పుడు ముసలితనంలో పండుగ అని వెక్కిరిస్తూ అంటారు.

సినిమాల కారణంగా విద్యార్థుల కారణంగా కొన్ని వినూత్న జాతీయాలు భాషలో చొచ్చుకు వచ్చాయి. సుత్తికొడుతున్నాడు. బోర్ కొడుతున్నాడనే అర్థం

సున్నమేస్తున్నాడు, బ్లేడు వేస్తున్నాడు, సోపేస్తున్నాడు, అంతసీను లేదు, ఓవర్‌యాక్షను చేయకు, క్లాసు తీసుకోకు, క్లాసు పీకకు, ఎక్స్ట్రాలు చెయ్యద్దు అనే కొత్త జాతీయాలు వచ్చాయి. కొందరు తర్జనభర్జనలు పడుతున్నారు. గుంపు సింపులు పడుతున్నారు. కిందమీద పడుతున్నారంటారు. తర్జన అంటే చూపుడు వేలుతో బెదిరించటం, అదలించటం అన్నమాట పోతన తర్జింప అనే క్రియను ప్రయోగించాడు.

మ. హరిసర్వాకృతులంగలండనుచు ప్రహ్లాదుండు భాషింప స
త్వరుండై యెందును లేడని సుతున్ దైత్యుండు తర్జింప

(భాగ-7-277)

భర్జనం అంటే కాల్చుకు తినటం, తపింపచేయటం అని అర్థం. కాల్చుకు తింటున్నాడన్నప్పుడు నిజంగా కాల్చుకు తినరు. కడుపు కాలిపోతోంది అంటాం, లేకపోతే కడుపు మండిపోతుంది, కడుపు మాడిపోతుంది అంటాం. ఆకలివేస్తే అనటమే కాకుండా, బాధవల్ల కూడా అలా అంటారు.

మన్నూమశానం, మట్టిమశానం అనటం ఉంది. శ్మశాన శబ్దమే పదాది హల్లోపం వల్ల మశానం అయ్యింది.

కొన్ని సామెతలు ఉచ్చారణలో మార్పు పొంది సామాన్య జనానికి ఆ సామెత అర్థం కాకుండా పోతోంది. రామాయణంలో పిడకల వేటలాగా మధ్యలో నీవేమిటిరా అంటారు. నిజానికి అది పిట్ట కథల వేట పిడకల వేట కాదు. రామాయణం భారతాల్లో పిట్టకతలు, పక్షుల కథలున్నాయి గదా! ప్రధాన కథ నుంచి రంజుగా సాగిపోతూ ఉంటే మధ్యలో వచ్చే ఈ పిట్ట కథలు శిష్టేతరుల ఉచ్చారణలో పిడకలవేటగా మారాయి.

ఇలాగే పనిలేని మంగలి పిల్లి తల గొరిగాడంటారు. పనిలేని మంగలి పిల్లి తల గొరుగుతున్నట్లుగా యువ పత్రికలో శీర్షికగా ఉంచారు. పిల్లిని పట్టుకొని తలగొరిగితే మంగలిని గీరుతుంది, పీకుతుంది. పనిలేని మంగలి పిలిచి తలగొరిగాడనటానికి బదులు వ్యవహారంలో అలాగ మారిపోయింది. నల్లేరు మొక్క బాగా జారిపోతుంది. దాని మీద బండి బాగా జారిపోతుంది సులభంగా జారిపోతుంది. నల్లేరుపై బండి నడకలాగా అంటాం. నల్లేరు అనేది ఒక రకమైన కలబందలాంటి మొక్క.

> **తె**లుగు భాషలో పదాదిలో ఊనిక కారణంగా కాలాంతరంలో ఆ పదాలు మార్పు చెందాయి. మూలరూపాలు సామాన్యులికి తెలియవు. చేయువలయును. చేయవలయు- చేయవలె- చేయాలె - చెయ్యాలిగా నేడు వ్యవహారంలో ఉంది. ఇలాగే కొయ్యాలి, తియ్యాలి, పొయ్యాలి రూపాలు కూడా మార్పు చెందాయి. క్రియారూపాలు కూడా ఎన్నో మార్పులు చెందాయి.

భాషలో ధాతువుల నుండే నామరూపాలు ఏర్పడతాయి. కాలాంతరంలో మూల రూపాల్ని మనం కనుక్కోలేం. కనునవి కాబట్టే కనురెప్పలయ్యాయి. ఇలాగే వినేవి వీనులు, మూర్కొనేది ముక్కు, నడుమ ఉంది కాబట్టి నడుము అయ్యింది. అరిగిపోయేది, అరుగు. రెండు కుటుంబాల వారిని అల్లుకుంటాడు, కాబట్టి అల్లుడు. కోడెప్రాయంలో ఉంది కోడలు అయ్యింది. (కోడె-ఆలు) ఎదుటివారిని తనలో అద్దుకుంటుంది కాబట్టి అది అద్దమయ్యింది.

తెలుగు భాషలో పదాదిలో ఊనిక కారణంగా కాలాంతరంలో ఆ పదాలు మార్పు చెందాయి. మూలరూపాలు సామాన్యులికి తెలియవు. చేయువలయును. చేయవలయు- చేయవలె- చేయాలె - చెయ్యాలిగా నేడు వ్యవహారంలో ఉంది. ఇలాగే కొయ్యాలి, తియ్యాలి, పొయ్యాలి రూపాలు కూడా మార్పు చెందాయి.

క్రియారూపాలు కూడా ఎన్నో మార్పులు చెందాయి. కొట్టపోకుము అనేది కొట్టపోకు- కొట్టబోకు -కొట్టమాకు -కొట్టమాకగా మారింది. ఇలాగే తిట్టమాకు, తిరగమాకు, తియ్యమాకు.

పై పదాల్లోలాగానే పకారం మగా కొన్ని చోట్ల మారిపోయింది. తిరుగపోత- తిరగమోత- తిరగమాతగా మారింది. ఇలాంటివే -పొగరుమోతు, తిరుగుమోతు, ఇంకాసైదేపూడి, రిమ్మనపూడిలోని పూడి మూడిగా మారింది. జిల్లేళ్ళమూడి గొంగనమూడి పూడి పూండి నుండి వచ్చింది గుమ్మడిపూడు, పూండు అంటే బురద అనే అర్థం నేటి వ్యవహారంలో ఉంది.

కల్లు అంటే రాయిగదా! అందువల్ల, వీరగల్లు, ఉప్పుకల్లులు ఏర్పడ్డాయి. తమిళంలో కళ్ళుప్పు అనేది తెలుగులో కల్లుప్పుగానూ, ఉప్పుకల్లుగానూ మారింది. తిరుగు+కల్లు - తిరుకల్లు - తిరుగల్లు - తిరుగలి - తిరగలిగా నేటి వ్యవహారంలో ఉంది. ఉప్పును కొన్ని

ప్రాంతాల్లో చవిరుచి అంటారు. చవి తెలుగు పదం, రుచి సంస్కృత పదం. రెండు పదాలకు అర్థం ఒకటే, రెండు రంగులు కలగలిసిన నేత చీరను కలనేత చీర అంటారు. విభిన్న దిక్కుల నుండి వీచేగాలిని వివిధనామాలతో పేర్కొంటారు. ఆగ్నేయ మూలగా వచ్చేగాలిని పైరుగాలి, పైరగాలి అంటారు. ఈ గాలి వీస్తే పంటలు బాగా పండుతాయి. దక్షిణ దిక్కునుండి వచ్చేగాలిని మలయ మారుతమంటారు. కేరళలోని కొండల మీదుగా వస్తుంది కాబట్టి మలయమారుత మన్నారు. వేసవి కాలంలో మే నెలాఖరు నుండి జూన్ నెలాఖరు దాకా వీచే గాలిని పడమటి చామరం అంటారు. పడమటి దిక్కునుండి వీస్తుంది కాబట్టి పడమటి చామరం అంటారు. చామరం అంటే విసనకర్ర గదా! పడమటి చామరం ఆగిపోయిన తర్వాత ఆ దిక్కునుండి వచ్చేగాలి పడమటిగాలి అంటారు. నైబుతి ఋతుపనాల కారణంగా వర్షం కురిసి ఏరులు ప్రవహిస్తాయి. కాబట్టి ఆ ఏరుల మీద నుండి వచ్చే గాలిని ఏటిగాలి అంటారు.

తమిళంలో వడర్కు అంటే ఉత్తర దిక్కు. ఉత్తర దిక్కు నుండి మే నెలలో వీచే గాలిని వడగాలి అంటారు. ఆ గాలి వెచ్చగా ఉంటుంది. పెసరపప్పు నానపెట్టిన తర్వాత వాటిని వడపప్పు అంటారు. వడదెబ్బ నుండి రక్షించేది కాబట్టి వడపప్పు అయ్యింది.

కృష్ణాజిల్లాలో గంజారుచట్టి అని ఒక పాత్రను అంటారు. గంజిని వార్చేచట్టి పల్లెటూరి వారి ఉచ్చారణలో గంజారుచట్టిగా మారింది.

కర్మధారయ సమాసాల్లో వచ్చే రుగాగమం పల్లెటూరి శిష్టేతరుల భాషలో కూడా కనబడుతుంది. దిబ్బలాగా ఉండే అట్టును దిబ్బరట్టు అంటారు. దిబ్బ+రు+అట్టు= దిబ్బరట్టు అయ్యింది. దీన్నే కొందరు రొట్టెగా భావించి దిబ్బరొట్టె అనటం కద్దు. సంబరం – సంబడం – సంబళం – అని సామాన్య జనవ్యవహారంలో ఉంది. గ్రామాల్లో ఎల్లమ్మ గంగానమ్మ పోలేరమ్మలుంటారు. ఒక గ్రామానికి ఉండే సరిహద్దును ఎల్ల అంటారు. ఎల్లలో ఉండే అమ్మ ఎల్లమ్మ అయ్యింది. అలాగే గ్రామం ఏర్పడేటప్పుడు పొలియో పొలి అంటూ మేరలు అంటే సరిహద్దు త్రొక్కుతారు, కాబట్టి పొలిమేర అంటారు. మేర అంటే హద్దు గదా! పొలిచెప్తూ పెట్టిన మేర పొలిమేర అయ్యింది. ఎల్లలో ఉండే ఎల్లమ్మలాగా పొలిమేరలో ఉండేది పోలేరమ్మా- పొలిమేర+అమ్మ పదమధ్యాక్షరలోపం తత్పూర్వ స్వరదీక్షకారణంగా పోలీరమ్మ-పోలేరమ్మ అయింది.

శివుని తలపై ఉండే గంగమ్మ కాదీ గంగానమ్మ, గంగానమ్మ రోగాల్నుండి రక్షిస్తుందనే విశ్వాసం గ్రామ ప్రజలకుంది. ముఖ్యంగా గొల్లలకుంది సం. గోపాల – ప్రా.గోఅల – తె.గోల్ల – గొల్ల అయ్యింది. ముఖ్యంగా మశూచికం నుండి, పశువులకు వచ్చే రోగాల నుండి రక్షిస్తుందనే నమ్మకం ఉంది. పశువులకు గాళ్ళు తగిలితే పందిపిల్లను పాతిపెట్టి దానిమీద పశువుల్ని తోలేవారు రోగనివారణార్థం.

> **వే**సవి కాలంలో మే నెలాఖరు నుండి జూన్ నెలాఖరు దాకా వీచే గాలిని పడమటి చామరం అంటారు. పడమటి దిక్కునుండి వీస్తుంది కాబట్టి పడమటి చామరం అంటారు. పడమటి చామరం ఆగిపోయిన తర్వాత ఆ దిక్కునుండి వచ్చేగాలి పడమటిగాలి అంటారు. నైబుతి ఋతుపనాల కారణంగా వర్షం కురిసి ఏరులు ప్రవహిస్తాయి. కాబట్టి ఆ ఏరుల మీద నుండి వచ్చే గాలిని ఏటిగాలి అంటారు.

తెలుగు వారి తిట్లు తమాషాగా ఉంటాయి. నీకు ముదనష్టంరాను అంటారు. పెద్దవాళ్ళు చచ్చిపోతే వరుసవల్ల వచ్చే ఆస్తిని ముదనష్టం అంటారు.

నీజిమ్మడ అన్నప్పుడు జిహ్వాపడ అని అర్థం. నీజిమ్మదీయ అన్నప్పుడు జిహ్వాపీకటమని అర్థం. నీ కడుపుకాల, నీకడుపుమండ అని తిడితే నీ సంతానం పోవటం అని అర్థం. దానివల్ల వచ్చే బాధను అనుభవిస్తారని తిడతారు.

తమిళంలోని పొరికి- తెలుగులో పోకిరి అయ్యింది. నీసిగతరగ, నీశిఖతరగ, నీ దుంపతెగ, విధవ – వెధవ, సన్యాసి – సన్నాసి, పోకిరిసన్నాసి, పోకిరి వెదవ, పోరంబోకు వెదవ, వెదవసనన్నాసి, సన్నాసివెదవ అని అనడం కూడ ఉంది.

ఉర్దూభాషా సాంగత్యం వల్ల ఉర్దూ తిట్లు తెలుగువారికి వచ్చాయి. బాంఛేతు, మాదచ్చేదు, బహన్ కా చూత్, మాకా చూత్ అలాగ అయ్యాయన్నమాట. దీన్ని అర్థం తెలియకుండా సర్వసాధారణంగానే అలా తిడతారు. తెలంగాణంలో బానిసను – బాంచను అంటారు.

త్వరగా వస్తానని చెప్పటానికి ఒక్క నిమిషంలో వస్తానంటారు. పది నిమిషాలైనా రారు. అంటే అతిశయోక్తిగా తొందరను చెప్పటం. ఒక్కసారి చెప్పానంటే వందసార్లు చెప్పినట్లు అంటారు కొందరు. ఆ ఒక్కటి వందతో సమానం. ఈ పని చెయ్య వద్దని లక్షసార్లు చెప్పానంటారు. ఇదీ అతిశయోక్తే. అయితే సవా అంటే ఏనిమిదో వంతు, పావు అంటే నాలుగో వంతు సవాశేరు, సవాపావు అనటం కూడా ఉండేది.

కాడు, కత్తె అనే తద్ధిత ప్రత్యయాలు తెలుగు నామాలకు చేరతాయి. ఆటగాడు ఆటకత్తె బాగానే ఉన్నాయి. నాగేశ్వరరావుని - నాగేశ్వరరావుగాడని, నాగ్గాడని, శంకరరావును - శంకరరావుగాడు, శంకరగాడని పిలవటం ఉంది. అలాగే కేశవరావుగాడు, కృష్ణగాడు, తిరుపతి రావుగాడు అనటం ఉంది. కులంతో చౌదరిగాడు, రెడ్డిగాడు ఉంది. చౌదరి, రెడ్డి శబ్దాలకే గాడు చేరుతోంది గాని ఇతర కులాలకు కమ్మ, బలిజకు చేరదు. కమ్మగాడు, బలిజగాడు ఉండదు. ముద్దుగా చిన్నపిల్లల్ని నానిగాడు, బాచిగాడు, బాబిగాడని పిలవటం ఉంది.

హిందీ, ఉర్దూల నుంచి కొన్ని పదాలు, పద సంబంధాలు మనకు వచ్చాయి. గుంటూరు ప్రాంతంలో చిన్న నాన్నను కక్కాయంటారు. ఉర్దూ పదం కాకాయే- కక్కాయి అయ్యింది. బాప్‌రే - బాపురే - అయ్యో, అమ్మో లాంటిది. హిందీ బాప్ కా భయ్యా - బాబయ్య అయింది. హిందీలోని బాప్ కాబాయి - బాబాయి అయ్యింది. హిందీలోని లావో, దేవోలు మనకు లావాదేవీ లయ్యాయి. హిందీ భాషలోని హమ్, తుమ్‌ల నుండి మనకు అమీ, తుమీలు వచ్చాయి. అమీ, తుమీ తేల్చుకుందాం అంటాం.

మన తెలుగులో నా+అన్న = నాన్న అయ్యింది. నాయన్న అంటే అర్థం వేరు, నాయన అంటే తండ్రి అనే అర్థంలో వాడతారు. మా+అక్క, మా + అమ్మ, మా + అత్త= మక్క, మమ్మ, మత్త = దీర్ఘాక్షరం మీది సంధి జరుగదు. కాని ఇక్కడ సంధి జరగటం విశేషం. వ్యవహారిక భాష కదా!

ఆంగ్లభాష నుండి కొన్ని పదాలు వింతగా ఏర్పడ్డాయి. ప్లేయింగ్ కార్డ్సులోని మొదటి అక్షరాల్ని గ్రహించి పేకలన్నారు. ఆ కార్డులు చిట్స్‌లాగా ఉంటాయి. కాబట్టి కొందరు చీట్ల పేకలంటారు. ఆంగ్లపదాలతో శబ్దపల్లవాలేర్పడ్డాయి. క్యాచ్ చేశా, ప్యాసయ్యా, ఫీలయ్యా, ఫేలయ్యా మీట్ చేశా, రఫ్ఫాడించు లాంటివి ఎన్నో ఉన్నాయి. గ్లాస్ అనే పదం నుండి మనకు గ్లాసు లేక గలాసు అనేవి అర్థపరిణామంతో వచ్చాయి. పల్లెల్లోని ప్రజలు పెద్దగా విషయం ఏమీ లేనపుడు ఆ ఏముంది గాడిద గుడ్డు కంకర పీచు అనటం ఉంది. భారతదేశానికి క్రిస్టియన్లు వచ్చిన తర్వాత ఆ మతబోధకులు God the good conccur the peace లేక God the good conquer the peace అని చెప్పగా అది పల్లీయుల ఉచ్చారణలో పలుమార్పులు చెంది అర్థం మరచిపోయి అలాగ తయారయ్యింది. కొన్ని ప్రాంతాల్లో కొందరు గాడిద గుడ్డు గంగడి పాచు అనటం కూడ ఉంది. గంగడి పాచును గంగడి పాచిగాను గంగడి పాసుగాను ఉచ్చరించటం ఉంది.

భారతదేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశంలో తలనీలాల్ని శ్రీనివాసునికి సమర్పించటం ఉంది. సమర్పించిన తర్వాత ఆ తలను గుండు అంటాం. గుండు గీయించుకున్నాడంటాం. గుండ్రంగా ఉండే రాళ్ళను రాతిగుండ్లు అంటాం. రాతి గుండులాగా నున్నగా ఉంది. కాబట్టి తలనీలాలు అర్పించిన తర్వాత దాన్ని గుండు అంటున్నాం. నీలాలు అంటే నల్లని వెంద్రుకలనే అర్థంలో వాడుతున్నాం. నీలము అంటే ఎన్ని అర్థాలున్నా నలుపు అనే అర్థం ఇక్కడ ప్రధానం.

తలపై నున్న నల్లని వెంద్రుకల్ని ఎంతో అర్థ గౌరవంతో తలనీలాలు అని పేర్కొంటున్నాం. తలగొరగటం అవమానానికి సూచన. దేవుని ముందు అలా గొరిగించు కోవటం మనం అహాన్ని చంపుకోవటం లాంటిది. భాగవతంలో కృష్ణుడు రుక్మిని చంపకుండా తలగొరిగి అవమానించి పంపించాడు. అంటే తలగొరగటం అహం చంపటం కోసం, అవమానం కోసం అన్నమాట.

ఈ విధంగా మన తెలుగు భాషలో ఎన్నో విచిత్ర విన్యాసాలు దర్శనమిస్తున్నాయి. వెదికి పరిశీలించాలే గాని ఇంకా ఎన్ని వినూత్న విచిత్ర విన్యాసాలు వినబడతాయి. కనబడతాయి.

---


ఆచార్య బి. శంకర రావు
విశ్రాంత ఆచార్యులు మద్రాసు విశ్వవిద్యాలయం,
చెన్నై, ఫోన్ : 044 -28443211

# మన ఇరుగు పొరుగు దేశాల కవిత్వం

– ముకుంద రామారావు

ఆఫ్ఘనిస్థాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, టిబెట్, భూటాన్, నేపాల్, మాల్దీవులు – ఇవి ఈ వ్యాసంలో ఇరుగు పొరుగు దేశాలుగా తీసుకున్నవి. ఈ దేశాల్లో కవిత్వం ఏ ఇతర దేశాలకూ తక్కువైనవి కావు. వాటిని పరిశీలనగా చూసేందుకు వీలుగా ఈ దేశాల్ని, ఇస్లాం ప్రభావిత దేశాలు, ఇతరాలుగా చూడటం ఉచితంగా తోచింది. ఆఫ్ఘనిస్థాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్ ఇస్లాం ప్రభావిత దేశాలుగాను తతిమ్మావి ఇతరాలుగా తీసుకున్నది అందుకే.

**ఇస్లాం ప్రభావిత దేశాలు :**

**ఆఫ్ఘనిస్థాన్ :** ఆగ్నేయాసియాకి మధ్య భాగంలో ఉన్న బహుజాతుల దేశం ఆఫ్ఘనిస్థాన్. వాణిజ్యపరంగా దక్షిణ తూర్పు ఆసియాని, యూరప్, మధ్యప్రాచ్యాలతో కలిపి ఉంచే మార్గంలో ఆఫ్ఘనిస్థాన్ ఉంది. ఆ కారణంగానే సామ్రాజ్య స్థాపకులకు, గొప్ప గొప్ప సైన్యాలకు, ఆఫ్ఘనిస్థాన్ ఆటాడుకుని అణగదొక్కే ప్రాంతమయింది. వాటి జాడల శిథిలాలు ఇప్పుడు జ్ఞాపకాలై మిగిలాయి. తూర్పు, దక్షిణాన పాకిస్తాన్, ఆజాద్ కాశ్మీర్, పశ్చిమాన ఇరాన్, ఉత్తరాన మధ్య ఆసియాలోని తుర్కెమినిస్తాన్, ఉజ్బెకిస్తాన్, తజికిస్తాన్ రాష్ట్రాలు, ఈశాన్యాన జియాంగ్, చైనా కూడా సరిహద్దులుగా ఉన్నాయి.

బ్రిటీష్ కి రష్యాకి మధ్య, ఆఫ్ఘనిస్థాన్ విషయంలో స్పర్ధ ఫలితంగా ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దులు 19వ శతాబ్దం చివర్లో నిర్ణయించబడ్డాయి. వాణిజ్య ప్రాబల్యం, రాజకీయ సిద్ధాంతాల యుద్ధంలో ఆఫ్ఘనిస్థాన్‌ను ఆయా దేశాలు, ఒక పావుగా వాడుకున్నాయి. బ్రిటన్‌కే చెందిన నోబెల్ బహుమతి గ్రహీత రుడ్యార్డ్ కిప్లింగ్ లాంటి కవి సైతం ఒక 'గొప్ప ఆట'గా దాన్ని అభివర్ణించారు. 20వ శతాబ్దం చివరి భాగంలో, (1979–89) మధ్య సోవియట్ రష్యా సైనిక దండయాత్ర చేసి ఆఫ్ఘనిస్థాన్‌ని ఆక్రమించుకుంది. అది అంతర్యుద్ధానికి, వినాశనానికి దారితీసింది. ఆ తరువాత అది మిగిలిన ఆఫ్ఘన్ కమ్యూనిస్టు పాలకులకు, ఇస్లామిక్ తిరుగుబాటుదారులకు మధ్య సాయుధ సంఘర్షణగా (1989–92) మారింది. దాని మూలాన కొన్నాళ్లు ముజాహిదీన్ వర్గాలు రాజ్యమేలాయి. వారిని కూలద్రోసి తాలిబన్లు అందరిమీదా తిరగబడి, దాడి చేసి (1996–2001) మధ్య అధికారం చేజిక్కించుకున్నారు. తొందర్లోనే అది ఒసామాబిన్ లాడెన్ ఆల్ ఖైదా ప్రభావంలో పడి, మరింత వినాశనానికి దారితీసింది. ఆ తరువాత అమెరికా సైన్యం జోక్యంతో 2001 డిసెంబరులో తాలిబన్ల సామ్రాజ్యం పతనమయి, అప్పటి నుండి ప్రజలతో ఎన్నుకోబడిన ప్రభుత్వం కొనసాగుతోంది.

ఆఫ్ఘనిస్థాన్‌ని దక్షిణ ఉత్తర ప్రాంతాలుగా విడదీస్తూ విశాలమైన హిందూ కుష్ పర్వత శ్రేణులున్నాయి. ఫలితంగా అనేక గిరిజన వర్గాలూ ఉన్నాయి. వలసలు, అనేక దేశాల ఆక్రమణల మూలాన చారిత్రకంగా అక్కడ ద్రావిడులు, ఇండో ఆర్యన్లు, గ్రీకులు, స్కిథియన్లు, అరబ్బులు, తుర్కులు, మోంగోలియన్లు వివిధ కాలాల్లో ఆఫ్ఘనిస్థాన్లో స్థిరపడి అక్కడి సంస్కృతిని, వంశాల్ని ప్రభావితం చేసారు. క్రీ.పూ 2000 ప్రాంతంలో ఆఫ్ఘనిస్థాన్‌తలోనే ఋగ్వేదం రాయబడిందని చరిత్రకారుల నమ్మకం.

ఆఫ్ఘనిస్థాన్‌లో, పాష్తో, దరి ఈ రెండూ అధికారిక భాషలు. పాష్తో అన్నది అఫ్ఘనిస్థాన్ ఫారసీ. దరి నిజానికి ఫారసీనే. జాహిర్ షా కాలం నుండి పాష్తో జాతీయ భాషగా కొనసాగుతోంది. కానీ దరి వాణిజ్య ప్రభుత్వ వ్యవహారాల్లో వాడేవారు. దరి భాషలో అనేక తుర్కీ, మంగోలియా పదాలున్నాయి. అక్కడివారు ఒక భాషనుండి మరో భాషకు తరచు మారుతూనే ఉంటారు. ఇప్పటికీ అక్కడ జనాభాలో 50 శాతం దరి భాష వాడితే, 35 శాతం పాష్తొన్ వాడుతున్నారు, 11 శాతం మంది తుర్కీభాష వాడుతున్నారు (ఉజ్బెక్, తుర్కమన్ లాంటి ప్రాంతాల్లో), తతిమా శాతం ఇతర భాషలు, బెలూచి, పాషాయ్, నూరిస్తాని మొదలైనవి వాడేవారున్నారు. ద్విభాష అక్కడ అతి సామాన్యం. పాష్తో, దరి ఈ రెండు భాషలూ కొద్ది మార్పులతో అరబ్బీలోనే



ఖలీల్

రాస్తారు. పాస్తో సాహిత్యం 17 వ శతాబ్దంలో ఎక్కువగా ప్రాచుర్యంలో కొచ్చింది. ఇప్పుడు జాతీయకవిగా కీర్తించబడుతున్న గొప్ప కవి ఖుషాల్ ఖాన్ ఖత్తక్ దానికి కారణం. చరిత్రలో ఆ భాషలో ఇతర గొప్ప కవుల్లో రహమన్ బాబా, ఆధునిక ఆఫ్ఘనిస్థాన్‌ని స్థాపించిన అహ్మద్ షా అబ్దాలి. దరి భాషలో విస్తృతమైన సాహిత్యం ఉంది. జలాలుద్దీన్ రూమీ రాసిన అద్భుతమెన సూఫీ కవిత్వమంతా ఈ దరి భాషలోదే. భారతదేశంలోని మొఘల్ సామ్రాజ్యంలో వారి ఆస్థాన భాషగా దరినే వాడేవారు. ఆఫ్ఘనిస్థాన్‌కి అయిదువేల సంవత్సరాలకంటే ఎక్కువ ఉత్కృష్టమైన సాంస్కృతిక నేపథ్యం ఉంది. అనేక సంస్కృతుల సమ్మేళనం అక్కడ కనిపిస్తుంది. అవి ఎక్కువగా ఇరాన్, భారత్ నుండి అక్కడకు చేరినవే. మొఘల్ సామ్రాజ్య కాలంలో ఈ కలయిక మరీ ఎక్కువైంది. కొన్ని వందల సంవత్సరాలు మధ్యప్రాచ్యం, మధ్య ఆసియా, దక్షిణ ఆసియా, తూర్పు ఆసియా ఈ నాలుగు ప్రాంతాలకు సాంస్కృతికంగా, పర్యావరణ పరంగా ఆఫ్ఘనిస్థాన్ ఒక కూడలి స్థలంగా ఉండింది.

సహస్రాబ్దాల క్రితం నుండే ఆఫ్ఘనిస్థాన్‌లో కవిత్వముంది. సుల్తాన్ మహమూద్ ఘజనీ సామ్రాజ్యంలో (998–1030) కవిత్వానిది ఉన్నతమైన స్థితి. దానికి కారణం సుల్తాను స్వయాన సాహిత్యం, ముఖ్యంగా కవిత్వాభిమాని. తదను గుణంగానే అప్పట్లో 700 వరకూ కవులు కవిత్వంలో విహరించారు. సుల్తాను ఘజనీకీ పూర్వం ఒక వందేళ్ల క్రితం, ఆఫ్ఘనిస్థాన్ పశ్చిమ భాగం నిమ్రూజ్ లో మొట్టమొదటి ఫారసీ రాజు యాకూబ్ మూలాన ఫారసీ సాహిత్యం అక్కడ మొదలయింది. ఆ రాజుని ప్రసన్నం చేసుకుందుకు ఒక కవి అరబ్బీలో ప్రస్తుతించిన కవిత్వం, ఆ రాజుకి సుతరామూ నచ్చలేదు. ఫారసిలో అన్నీ సాగాలన్న ఆదేశంతో ఫారసీ అక్కడ వేళ్లూనుకోవడం మొదలైంది.

ఆఫ్ఘన్లకు అక్కడ కవిత్వమే అంతా. ఊయలనుండి సమాధి వరకూ అంతా కవిత్వమే. తాజిక్, హజరా, పాస్థూన్, ఉజ్బెక్, తుర్క్ మెన్, నూరిస్తానీ, బలుచ్, అలా ఎన్ని వందల తెగలున్నా, వారందరినీ కట్టి ఉంచిందీ కవిత్వమే. పిల్లల్ని నిద్రపుచ్చడానికి తల్లులు, అప్పటికప్పుడు కూర్చిన తమదైన జోలపాటల కవిత్వం. ఆ కవిత్వ కూర్పు తల్లుల నుంచి తల్లులు, తరతరాలుగా నేర్చుకున్నదే. తరాల తరువాత తరువాత, కవులు అలా తయారవుతూనే వచ్చారు. పాఠశాలల్లో, మొదటి ఫారసీ పాఠంగా 14వ శతాబ్దపు దివానె హాఫీజ్‌ని పరిచయం చేస్తారు. దివానె హాఫిజ్ జ్ఞానాన్ని ప్రసాదించే పుస్తకమని, అందులో కవిత్వం నుండి తాత్వికత వరకూ అన్నీ ఉన్నాయని సంప్రదాయవాదులు నమ్ముతారు. అలాగే పాస్థూన్లు రహమాన్ బాబాని, ఉజ్బేక్లు ఫుజోలీ లేదా నవాయ్‌తో ప్రారంభిస్తారు. పిల్లలు పెరుగుతున్న కొద్దీ ఉదయం ప్రసిద్ధ ఫారసీ కవి సాదీని, మధ్యాహ్నం మరో ఫారసీ ఢిల్లీ కవి బెదిల్‌ని చదివిస్తారు. సాయంత్రాలు, చలికాలపు దీర్ఘ రాత్రుల్లో వెయ్యేళ్ళ క్రితపు ప్రసిద్ధ ఫిరదౌసీ షానామాని చదువుతారు.

అక్కడ సమాజంలో అన్నీ స్థాయిల్లోనూ కవిత్వం చొచ్చుకుపోయింది. ముల్లాలు, ప్రభువులు, సేనాధిపతులు, ఉగ్రవాదులు సైతం కవిత్వాన్ని తమ దైనిక జీవితంలో అనేక విధాలుగా వాడుకుంటారు. ఇతరుల ముందు అది ఒక సంకేతభాషగా కూడా ఉపయోగించుకుంటారు. కవిత్వం ఒక విధంగా, వారికొక ఆత్మ. ఇప్పటికీ రూమీ (బల్ఖ్ నుండి) సనై (ఘజనీ నుండి), జామీ (ఘోర్ నుండి)ల ఉత్సవాలు జరుపుకుంటారు. ప్రతి సందర్భానికి తగ్గ ఏదో ఒక కవిత వారి నాలుక మీద ఉంటుంది. ఎంత యుద్ధవాతావరణ మున్నా, ఎన్ని ఒడిదుడుకులున్నా ప్రతినెలా సార్వజనిక కవిత్వ సభలు జరుగుతూనే ఉంటాయి. అన్ని వయస్సుల వారూ అందులో పాల్గొంటారు. అదొక పెద్ద వేడుక వారికి. మరీ ముఖ్యంగా యువకులకు. ఆ ప్రదేశపు సంప్రదాయన్ని, ఆచార వ్యవహారాల్ని, వారి కవిత్వం ద్వారా తెలుసుకోవచ్చు. చదువుకున్న వారి సంఖ్య ఎంత తక్కువగా ఉన్నా, కవిత్వంలో ఎవరికీ తీసిపోని కవిత్వం అందరిలోనూ ఉంటుంది. ఎవరో అన్నట్టు వారు సాహిత్య నిరక్షరాస్యులు.

7–11 వ శతాబ్దంలో ఇస్లాము ఆధిపత్యం కొనసాగక ముందు నుండీ ఆఫ్ఘనిస్థాన్‌లో కవిత్వం ఉన్న దాఖలాలు వున్నాయి. 8వ శతాబ్దపు పాషితో ఖజానా (గుప్త నిధి) లో అద్భుతమైన పాస్తో భాషా కవిత్వముంది. ఆఫ్ఘనిస్థాన్ చరిత్రలో ముఖ్యమైన కవుల్లో రూమీ, ఖుషల్ ఖాన్ ఖత్తక్, రహమన్ బాబా, అహ్మద్‌షా దుర్రాని, తిముర్‌షా దుర్రాని, షుజషా దుర్రాని, ఘులాం ముహమ్మద్ తర్జి మొదలైన ఎందరో

ఉన్నారు. 7వ శతాబ్దం చివరికి కాబూల్, కాందహార్ (దక్షిణ ఆఫ్ఘనిస్థాన్ ప్రాంతం) అరబ్బుల వశమైనా, బామియాన్ బౌద్ధుల పరిపాలనలోనే, అవి మరో వందేళ్లున్నాయి. 7వ శతాబ్దం మొదటికల్లా బామియాన్ అన్నివిధాలా వర్ధిల్లుతున్న బౌద్ధ క్షేత్రం. అప్పట్లో అది అనేక సంఘారామాలనుంచి వచ్చిన బౌద్ధ భిక్షువులకు బౌద్ధం అభ్యసించే స్థలం. అబ్బాసిడ్ల కాలంలో బమియాన్ ఇస్లాం ప్రాబల్యంలోకి పూర్తిగా పోయింది.

క్రీశ 500–700 మధ్య రెండు విరాట్ బౌద్ధ విగ్రహాల్ని బామియాన్ గుహల్లో ప్రతిష్టించారు. ప్రపంచంలో మొట్టమొదటిసారిగా బౌద్ధులు బామియా గుహల్లో తైలవర్ణ చిత్రాలు చిత్రించారు. చెంఘీజ్ ఖాన్ దగ్గరనుంచి తాలిబన్ల పరిపాలన వరకూ ఆ విగ్రహాల్ని ఎలాగైనా ధ్వంసం చేయాలన్న ఆలోచన కొనసాగింది. ఫిరంగి గుండ్ల వర్షం ఆ విగ్రహాలమీద కురిపించడం చెంఘీజ్ ఖాన్ సమయం నుండీ మొదలయి తాలీబన్ల పరిపాలనలో అవి పూర్తిగా ధ్వంసమయాయి. ఆ విగ్రహం తుంపుల్ని తాలిబన్లు పెషావర్ బజార్లలో పర్యాటకులకు విక్రయించేవారు.

ఆ విద్వేష వాతావరణం కవిత్వం మీద కూడా ప్రభావం చూపింది. అంతలోనే దేశం యుద్ధ వాతావరణంలోకి నెట్టబడటంతో కొంతకాలం కవిత్వం తగ్గుముఖం పట్టి, ఆధునిక కవిత్వం వైపు నెమ్మదిగా దారితీసింది. యుద్ధం కొనసాగుతూ ఉండటంతో కాస్తయినా వారిని వినాలని కవిత్వం రాస్తున్న వారి సంఖ్య పెరిగింది. కవిత్వాన్ని పునరుజ్జీవింపజేయడంలోని వారి తపన అంతా, వారి భావావేశాల్ని, బాధల్ని, కోపాల్ని, ఉద్రేకాల్ని, ప్రేమల్ని ప్రపంచానికి తెలియజేయటానికే. నిజానికి ఆధునిక కవిత్వం ఆరంభదశ 20వ శతాబ్దం, నాలుగు అయిదు దశకాల్లోనే మొదలయింది.

అప్పటి వరకూ ఉన్న కవిత్వ సాంప్రదాయాల్ని విడనాడి కొత్త పద్ధతుల వైపు, ఖలిల్లులా ఖలిలి, యూసఫ్ ఐనా, జియా ఖరిజాదా, బషిర్ హెరవి, ఫతే మొహమ్మద్ ముంతజిర్, ఇబ్రహిం సఫ, అబ్దుల్ హకిం జియాయ్, షఫి రహ్గుజర్, రెజ మయెల్ హెరవి, హబిబుల్లా బెహ్జత్, మొహమ్మద్ రహిం ఎళం లాంటి ఎందరో ప్రయత్నాలు మొదలెట్టారు. అప్పటికే కొందరు కవులు మొహమ్మద్ అక్బర్ షయ్గన్, రవన్ ఫర్హది, అబ్దుల్ హక్ వాలా, ఉస్తన్ మొహమ్మద్ రహిం ఎళం లాంటివారు, పశ్చిమ సాహిత్యాన్ని అనువాదం చేయడం మొదలెట్టారు. ఇరాన్ ప్రచురణల ద్వారా ఆంగ్ల సాహిత్యం అందుబాటులో కొచ్చింది. అవి ఆఫ్ఘనిస్థాన్ సాహిత్యంలో అనేక మార్పులకు దోహదపడింది. పాకిస్తాన్ ప్రఖ్యాత కవి, అలామ ఇక్బాల్ కవిత్వం, అక్కడి కవిత్వాన్ని అమితంగా ప్రభావితం చేసింది. అలాగే అరబ్బీ, తుర్కిష్, ఫారసీ కవిత్వాల ప్రభావం కూడా. ఆమిర్ హబిబుల్లా ఖాన్ (1919–1991) పరిపాలనలో రాజ్యాంగ ఉద్యమం కూడా కవిత్వంలో మార్పుకి తోడయింది.


ఖుసాల్ ఖాన్ ఖత్తక్

**ఖుసాల్ ఖాన్ ఖత్తక్ (1613–1689):** గొప్ప యోధుడు, సైన్యాధిపతి. ఖతక్ తెగకు చెందినవాడు. ఆఫ్ఘన్ మీద మొఘల్ ఆధిపత్యాన్ని నిరోధించాలని అన్ని తెగల్నీ ఏకత్రితం చేసినవాడు. మొఘల్ సైన్యంతో తలపడి దాదాపు నలభయి వేల మొఘల్ సైనికుల్ని చంపగలిగినట్టు చరిత్ర చెబుతుంది. ఆ యుద్ధం తరువాతే ఖుసాల్ ఖాన్ కవిగా అవతారమెత్తి పాస్తోలో అద్భుతమైన కవిత్వం రాసారు. ఐక్యత, గౌరవం, యుద్ధం, ప్రేమ, తాత్వికత, దినవారీ జీవితం అతని కవితా వస్తువులు.

**తీయని జీవితం బహు నెమ్మదిగా గడుస్తుంది**
**అది నీటిలా నెమ్మదిగా పారుతుంది**

**వసంతంలో పూవులు మిత్రులు**
**నెమ్మదిగా వసంత మార్గాన్ని అనుసరిస్తారు.**


ఖుసాల్ ఖాన్ ఖత్తక్ సమాధి

జీవితం జీవితమే కాదు గౌరవం పోయినపుడు;
గౌరవం నిలుపుకున్నపుడు, మనిషి మనిషే.
దేశ గౌరవం, దేశ ప్రతిష్ఠ;
జీవితం మీద వాటికి ప్రథమ హక్కు.
ఏ లాభ నష్టాల తొందరా లేకుండా
ఈ ఆలోచనలతోనే నేనుంటున్నాను
తనగురించి తాను తెలుసుకున్నవాడు
ప్రావీణ్యుడు, గ్రహించగలిగే వాడు
స్వీయ జ్ఞానం, లోచూపు ఉన్నవానిలో
పరమ పవిత్రుని జ్ఞానముంటుంది.
మంచిపనులు చేయనివాడు
హృదయంలో భయం లేనివాడు / కంఠతా పెట్టిన ఖురానును
ఎంత నైపుణ్యంగా ఉదహరించినా వినొద్దు

**రహమాన్ బాబా (1632-1711):** ప్రసిద్ధ తత్వవేత్త, పాస్తో భాషలో ప్రముఖ మార్మిక సూఫీ కవి. ఖుసాల్ ఖాన్ ఖత్తక్ సమకాలికుడు. అతని సమాధిని స్త్రీలు కూడా సందర్శిస్తున్నారన్న కోపంతో, 2009లో కొందరు వ్యతిరేకులు దాన్ని ధ్వంసం చేసారు. ప్రతి ఏడాది అతని కవిత్వ అభిమానులు ఏప్రిల్‌లో ఆ సమాధి దగ్గర కవితోత్సవం జరుపుకుంటారు.


రహమాన్ బాబా

నీ పరిసరాలు తోటగా మార్చేందుకు పూలని నాటు
ముళ్లు నాటొద్దు; నీ కాళ్లకు గుచ్చుకుంటాయి
మరొకరిమీద బాణాలు వేస్తే
అవి తిరిగొచ్చి నిన్నే గాయపరుస్తాయి, తెలుసుకో
ఇంకొకరి దారిలో బావి తవ్వొద్దు
బావి అంచుల దగ్గరకు నువ్వొస్తే
ఆకలి కళ్లతో అందరినీ చూస్తావు
అయినా నువ్వే ముందు వట్టి మట్టివవుతావు
మానవులదంతా ఒకే శరీరం / ఎవరు ఎవరిని హింసించినా
వారు వారినే గాయపర్చుకుంటారు.

**అహ్మద్ షా దుర్రానీ (1722-1772):** దుర్రానీ సామ్రాజ్య స్థాపకుడు, ఆధునిక ఆఫ్ఘనిస్థాన్ వ్యవస్థాపకుడు. 1747 లో రాజయ్యాక, విశాలమైన సామ్రాజ్యాన్ని, ఇరాను నుండి ఉత్తర భారతదేశం వరకు, ఆము దర్యా నుండి హిందూ మహా సముద్రం వరకూ విస్తరించాడు. అతన్ని ఆఫ్ఘన్లు గౌరవంగా అహ్మద్ షా బాబా అంటారు. అద్భుతమైన కవిత్వం పాస్తోలో రాసారు.


అహ్మద్ షా దుర్రానీ

**దేశప్రేమ**

రక్తం మూలాన, నీ ప్రేమలో మేము మునిగున్నాము
నీకోసం యువకులు శిరస్సుల్ని పోగొట్టుకుంటారు
నీ దగ్గరకొస్తే నా హృదయం విశ్రాంతి పొందుతుంది
నీకు దూరమైనపుడు శోకం నన్ను చుట్టుముడుతుంది పాములా
ఆఫ్ఘన్ కొండ శిఖరాలు గుర్తొచ్చినపుడు
నేను ఢిల్లీ సింహాసనాన్ని మరచిపోతాను
ప్రపంచాన్నో నిన్నో ఎన్నుకోవాల్సొస్తే
పండని నీ ఎడారులు నా జన్మ హక్కు అనడానికి నేను సంకోచించను

సమకాలీన ఆఫ్ఘన్ కవిత్వం ఆ దేశ సామాజిక రాజకీయ పరిస్థితులకు అద్దం పడతాయి. ఆ దేశం యుద్ధానంతర ఆరాటాల్ని, వాస్తవాల్ని ప్రతిబింబిస్తూ, మతమౌఢ్యం విదేశీ ఆక్రమణల హింసాత్మక పోరాటాల మధ్య కూడా, ప్రపంచాన్ని అనుసరించాలనే ఈ తరం ఆశలు, ఆకాంక్షలు వారి ప్రతి కవితలో కనిపిస్తాయి. శాశ్వత శాంతి, గౌరవంతో బతకాలన్న తపన తొంగిచూస్తుంది. కఠినమైన పద్య నియమాలని వదిలి వచన కవిత్వంలోకి, గజల్ సంప్రదాయంలోకి కవిత్వం మారిపోతూ ఉంది. దేవునితో మార్మిక సంభాషణకు బదులు సామాజిక సంభాషణ చోటుచేసుకుంటోంది. శోకభరితం గాను, నాటకీయంగాను కవిత్వం పరివర్తనం చెందుతోంది. ఇందులో స్త్రీలు ముందుండటం అక్కడి వారికే ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. స్త్రీ స్వేచ్ఛ రాను రాను మృగ్యమవుతున్న దేశంలో, ఇలా బయట పడుతున్న స్త్రీలందరూ బహిష్కృతులై విదేశాలలో ఉంటూ రాయడం మరో విశేషం.

**నాడియా అంజుమన్ (1980-2005):** పాత్రికేయ

విద్యనభ్యసిస్తూ సాహిత్యంలో చురుకుగా పాల్గొంటున్నందుకు తట్టుకోలేక, ఆమె భర్తే ఆమెను హత్యచేసాడు. అతి చిన్న వయస్సులోనే చంపబడ్డ ఆమె రాసినవి కొన్ని కవితలే అయినా, ఆఫ్ఘనిస్థాన్ లో స్త్రీల దుస్థితిని కళ్లారా చూపిస్తుంది.

**ఆఫ్ఘనిస్థాన్ కుమార్తె**

**నాకు నోరు తెరవాలని లేదు, నేనేమి గానం చేయగలను?**
**గానం చేసినా చేయకపోయినా, నా వయస్సుకి,**
**నన్ను నేను తక్కువ చేసుకుంటూ ఉండిపోతాను.**

**తేనెకోసం ఎలా పాడగలను?**
**అది నా నాలుక మీద విషమైనపుడు –**

**పిడికిలితో నా నోటిని అణగదొక్కిన క్రూరుడ్ని తిట్టాలి**
**నేను ఏడ్చినా నవ్వినా, చచ్చినా బతికినా**
**పట్టించుకోని ఈ ప్రపంచాన్ని ఆశీర్వదించాలి.**

**ఈ కారాగారం, నేను; ఏమీ కాని నా కోరికతో**
**వ్యర్థంగా పుట్టినదాన్ని, నోరుమూసుకుందుకే పుట్టినదాన్ని**

**హృదయమా! నాకు తెలుసు వసంతం,**
**దాని ఆనందం కూడా పోయిందని**
**కానీ నేనెలా ఎగరగలను ఈ కత్తిరించిన రెక్కలతో?**

**ఈ సమయమంతా నేను నిశ్శబ్దంగానే ఉన్నా,**
**చాలా దగ్గరగా విన్నాను**
**జన్మించిన కొత్తవారి ప్రతి క్షణాన్ని,**
**ఆ పాటలతో నా హృదయం ఇంకా గుసగుసలాడుతూనేఉంది,**

**ఏదో ఒకరోజు నేనీ పంజరాన్ని, ఏకాంతాన్ని బద్దలగొడతాను**
**ఆనందపు మధువుని తాగుతాను,**
**వసంతంలో పక్షిలా పాడతాను**
**సున్నిత అవయవాల చెట్టునైనా, ప్రతీ గాలికీ వణికిపోను**
**నేను ఆఫ్ఘన్ కూతుర్ని –**
**నా బాధల పాటని అనంతంగా అల్లుతూనే ఉంటాను**

**షకిల నసీర్ (1949–) :** నలుగురు పిల్లల తల్లి. 1994 నుండి ఆస్ట్రేలియాలో స్థిరపడ్డారు.

**దాహం**

**ఆశ లేకుండా, కోరిక లేకుండా / ఖాళీగా ఒడ్డున దూరాన**
**పడిపోయిన చేపని నేను / ఓ గర్జించే అలా**
**నువు నా రక్షణకు రాకపోతే / నేను దాహంతోనే చస్తాను**

**ఫెహ్మియె రహ్గొజర్ బర్లాస్ (1960 –):** అమెరికాలో ఉంటున్నారు.

**నా ప్రపంచం**

**నా రోదన వినడానికి / చెవి ఏది?**
**నా కన్నీళ్లు చూడటానికి / కన్ను ఏది?**
**ఆశారహిత మంటల బూడిదను నేను**
**నా మంటల్ని బలపర్చడానికి / వీచేగాలి ఏది?**
**నా శోక గృహంలోనే నేను కూర్చున్నా**
**నిశ్శబ్దంగా ఇంటింటికీ తిరిగే ఫకీరుని**
**నా చింతల్ని పాడుకుందుకు / వేణువేది?**

**ఆఫ్ఘనిస్థాన్‌లో సూఫీ:** సూఫీని ఇస్లాం అంతర్గత భాగంగా ఆఫ్ఘనిస్థాన్‌లో భావిస్తారు. సూఫీల పట్ల అక్కడ సామాన్య ప్రజలకు సైతం భక్తి శ్రద్ధలున్నాయి. కానీ 1979 లో ఆఫ్ఘనిస్థాన్ మీద సోవియట్ ఆక్రమణ తరువాత, అక్కడ ప్రతిఘటనోద్యమంగా ముజాహిదీన్లు ప్రాముఖ్యత సంతరించుకున్నారు. ముజాహిదీన్లకు మద్దతుగా మధ్యప్రాచ్యం నుండి వచ్చిన వారి మూలంగా, సూఫీ వ్యతిరేకత మొదలైంది. దానితో అంతవరకూ సఖ్యతగా ఉన్న సూఫీలు, ఉలేమాలకు (ధార్మిక పండితులు) మధ్య ఉద్రిక్తతలు ప్రారంభమయ్యాయి.

సూఫీకు ఆఫ్ఘనిస్థాన్‌లో పదమూడు వందల ఏళ్లకంటే ఎక్కువ చరిత్ర ఉంది. ఇస్లాము అంత పాతది. నిజానికి ఆఫ్ఘనిస్థాన్ ని సూఫీ సాధువుల క్షేత్రం అంటారు. శతాబ్దాల తరబడి ఈ మార్మికులు అక్కడి జీవితంతో ప్రజల అంతర్భాగమై ఉన్నారు. ప్రపంచంలో ప్రసిద్ధ సూఫీలైన – హెరాత్ నుండి 11వ శతాబ్దంలో ఖ్వాజా అబ్దుల్లా అన్సారి, ఘజనీ నుండి 12వ శతాబ్దంలో హకిం సనాయి, బల్ఖ్ నుండి 13వ శతాబ్దంలో జలాలుద్దీన్ రూమి, హెరాత్ నుండి 15వ శతాబ్దంలో అబ్దుల్ రహ్మాన్ జామి, వజీరీస్తాన్ నుండి 16వ శతాబ్దంలో పీర్ రోషన్ బయాజిద్ అన్సారి, పెషావర్ నుండి 17వ శతాబ్దంలో రహ్మాన్ బాబా, కందహార్ నుండి 18వ శతాబ్దంలో అహ్మద్ షా అబ్దాలి మొదలైన వారికి అది పుట్టినిల్లు. వీరిలో కొందరి పరిచయం, కవిత్వం ఫారసీ కవిత్వ పరిచయంలో చూసాము. బొఖారా (ఉజ్బెకిస్తాన్) లో మొదలైన నక్ష్ బందియా , బాగ్దాద్‌లో మొదలైన క్వాదిరియా, హెరాత్‌లో మొదలైన ఛిష్తియా సూఫీ శాఖలు ఇప్పటికీ అక్కడ ప్రముఖంగా కొనసాగుతున్నాయి.

**ఖ్వాజా అబ్దుల్లా అల్ అన్సారి (1006 – 1088):** షైఖ్ ఖ్వాజా అబ్దుల్లా అన్సారి, షైఖ్ అన్సారి జబిర్ ఇబ్న్ 'అబ్దుల్లా

అల్-అన్సారి', హెరాత్ అన్సర్ అని కూడా పిలవబడే అన్సారి, పశ్చిమ ఆఫ్ఘనిస్తాన్‌లోని హెరాత్‌లో జన్మించారు. వీరి రచనలన్నీ ఫారసీ భాషలోనే రాసారు. హెరాత్‌లోనే వీరు మరణించారు. ఇప్పటికీ ప్రతీ ఏటా వీరి సమాధిని వేలకొద్దీ సూఫీలు నమ్మకస్తులు దర్శిస్తుంటారు.

**నీతో చంపబడేవాడు**

**ప్రభువా / నీతో చంపబడేవాడు / రక్తం వాసన వేయడు**
**నీతో కాల్చబడ్డవాడు / పొగ కంపు కొట్టడు / నీతో కాల్చబడ్డవాడు**
**కాలుతూ నవ్వుతాడు / నీతో చంపబడ్డవాడు /**
**పరవశిస్తూ ఏడుస్తాడు**

**జామీ (1414-1492):** జామీ గా పిలవబడే నూర్ అద్-దీన్ అబ్ద్ అర్-రహ్మాన్ జామీ. బాల్యంనుండి సూక్ష్మబుద్ధితో ఉన్న జామీ తనకు గురువులెవరూ లేరని చెప్పుకున్నారు. 100 కంటే ఎక్కువే వారి సూఫీ గ్రంథాలున్నా, 40 మాత్రమే వారివిగా నిర్ధారించారు. ఫకీరుగా, సూఫీ తత్వాన్ని బోధించడంలో అసమానమైన ప్రజ్ఞగలవాడని పేరు. అద్భుతమైన సూఫీ కవి.

**ప్రతీ ఆకర్షించే రూపం నీకు తన మోహాన్ని చూపిస్తుంది**
**విధి త్వరలోనే నీ కళ్లనుండి దాన్ని అపహరిస్తుంది**
**వెళ్లు ప్రతీ జీవన మలుపులోనూ/నిత్యం నీతో ఉన్న, నిత్యం నీతో ఉండే**
**అతనెవరికో నీ హృదయాన్నివ్వు**

(1996-2001) మధ్య తాలిబన్ల సామ్రాజ్యంలో అనేక మంది సూఫీలు రహస్య జీవితాన్ని గడిపారు. అనేక మంది సూఫీలు ముఖ్యంగా ఛిష్తియా శాఖకు చెందినవారు చంపబడ్డారు. వారి సమావేశాల్ని చెదరగొట్టి, వారి సంగీత వాయిద్యాలను సైతం తాలిబన్లు ధ్వంసం చేసి, సూఫీలను అనేక విధాల వేధించారు.

అయితే నెమ్మదిగా ఆ పరిస్థితి అక్కడ మారుతోంది. తాలిబన్లు, ముజాహిదీన్లు, ప్రభుత్వం మధ్య ఇప్పుడు సూఫీలు శాంతిదూతలుగా కూడా వ్యవహరిస్తున్నారు. వారి ప్రాముఖ్యత అక్కడ నిరంతరంగా పెరగటం, ఆఫ్ఘనిస్థాన్‌లో శాంతి ప్రక్రియకు లభించే అతిపెద్ద బహుమానంగా భావించబడుతోంది.

**పాకిస్తాన్:** పాకిస్తాన్ కొత్తగా ఏర్పడ్డ దేశమైనా, ప్రపంచంలోని అతి పురాతన నాగరికత అక్కడ వెల్లివెరిసింది. గాంధార్, మొహెంజొదారో, హరప్పాలో వాటి సాక్ష్యాలున్నాయి. పాకిస్తాన్ స్వతంత్ర దేశం కాకముందు నుండీ అనేక విదేశీ తెగలు, సామ్రాజ్యాలకు ఆకర్షణగా ఆ ప్రాంతం నిలిచింది. ప్రతీ ఆక్రమణ ఎంతో కొంత దాని లక్షణాల్ని ఆక్రమించిన దేశం మీద రుద్దుతుంది. భాష కూడా ఆ యా భాషలకు ప్రభావితమై మరికొన్ని కొత్త పదాలను సంతరించు కుంటుంది. అలా ఇప్పటి పాకిస్తాన్‌లో భాషలు ఎక్కువగా ఇండో యూరప్, ఇండో ఆర్యన్, ఇరానియన్, ద్రవిడియన్, డార్డిచ్ భాషా కుటుంబాలకు చెందినవి. ఉర్దూ జాతీయ భాష అయినా, ఆంగ్లం కూడా అధికారిక భాష. ఇతర ముఖ్యమైన భాషల్లో పంజాబి, పాస్తో, సింధీ, బాలొచ్ లు. పాకిస్తాన్ ఆవిర్భవించి ఆరుపదులు దాటినా, ఆ ప్రాంతంలో కవిత్వం మాత్రం అనేక వందల సంవత్సరాల నుండీ ఉంది.

1947 లో భారతదేశం నుండి వేరయి ముస్లిముల కోసం ఏర్పడ్డ దేశం పాకిస్తాన్ గుర్తించిన భాషలు తొమ్మిదయితే, అక్కడక్కడ తక్కువగా మాట్లాడుకునే భాషలు 70 వరకూ ఉన్నాయి. గుర్తించిన తొమ్మిది భాషల్లో, అధికారిక భాషలు ఉర్దూ, ఆంగ్లం. నాలుగు ముఖ్యమైన రాష్ట్రీయ భాషలు పంజాబీ, పాస్తో, సింధీ, బాలోచీ. మూడు ప్రాదేశిక భాషలు సారైకి, హింద్కో, కాశ్మీరీ. అక్కడున్న అనేక భాషల్లో సాహిత్యపరంగా ముఖ్యమైనవి ఉర్దూ, ఆంగ్లం, పంజాబీ, బలోచీ, పాస్తో, సింధీ.

ఉర్దూ జాతీయ భాషగా గుర్తించబడ్డా ఉర్దూ మాతృభాషగా ఉన్నవారి శాతం 8 మాత్రమే. అయితే ఉర్దూ మాట్లాడి, అర్థం చేసుకునేవారి శాతం 90. ఇతర భాషల్లో పంజాబీ మాతృ భాషగా 44 శాతం, సింధీ 14 శాతం, పాస్తో 16 శాతం, బలోచీ 4 శాతం, తతిమా 14 శాతం మంది ఇతర భాషల వారున్నారు.

8వ శతాబ్దంలో అరబ్బుల ప్రవేశం నుండి ఆ ప్రాంతంలో సాహిత్యాన్ని అంచనా వేయొచ్చు. అరబ్బీ, ఫారసీ, ఉర్దూ భాషల మూలంగా ఆ సాహిత్యం సుసంపన్నమైంది. దానికితోడు సింధీ, పంజాబీ, పాస్తో, బలూచీ, బ్రాహూయ్, కాశ్మీరీ మొదలైన భాషల్లో అక్కడ అద్భుతమైన జానపద సాహిత్య నిధి ఉంది.

గజల్ పాకిస్తాన్‌లో ప్రాముఖ్యత సంతరించుకున్న కవిత్వ రూపం. బిగువైన ప్రాస నియమంతో ఏదో ఒక ప్రాతిపదికా పూర్వక స్వాతంత్ర్యంతో ద్విపదల వరసల్లో ఉన్న కవిత్వ రూపం గజల్. ఒక్కో ద్విపదని షేర్ అంటారు. అవి చదువుతున్న

కవిని షాయర్ అంటారు. ఆ మొత్తం ద్విపదల వరసల్ని అషార్ అంటారు. ప్రతీ ద్విపద నాటకీయంగా స్వరంలోను, అర్థాలంకారం లేదా అభిప్రాయంలోను, మారుతూ ఉండొచ్చు. బహుశా గజళ్లు, ప్రదర్శనశాలలో ఒకదాని తరువాత ఒకటి, చూపుకు భిన్నంగా విలక్షణముగా అమర్చిన లఘుచిత్రాలు.

అవిచ్ఛిన్నమైన భారతదేశంలోనే ఉర్దూ సాహిత్యం తనదైన స్థానాన్ని సంపాదించుకుంది. ఉర్దూని మొదట్లో హిందవీ అనేవారు. అమీర్ ఖుస్రూ (1253–1325), ఉర్దూలో మొదటి గీత కవిగా గుర్తించబడ్డారు. కబీరు (1440–1518) కూడా ఉర్దూలో అద్భుతమైన కవిత్వం రాసారు. ఉర్దూ ఇండో ఆర్యన్ భాషా కుటుంబానికి చెందింది. భారత్ దేశం, పాకిస్తాన్, దక్షిణాసియా దేశాల్లోను దాదాపు 2500 లక్షల మంది మాటాడే భాష ఉర్దూ. బ్రిటన్లో కూడా చాలా ఎక్కువగా ఉర్దూ మాటాడే వారుండడం విశేషం. 13వ శతాబ్దంలో ఈ భాష ఉత్తర భారతదేశంలో ఉద్భవించిందని చెబుతారు. ఈ భాష హిందీతో బాటు, అరబ్బీ, ఫారసీ, తుర్కీ, అనేక ఇతర భాషా పదాల మనోరంజక మిశ్రమం. ఆ కారణంగా కవిత్వానికి అనువైన భాషగా పనికొచ్చింది. ఉర్దూ కవిత్వం శ్రావ్యమైనది.

ఉర్దూ కవిత్వంలో ముఖ్యమైన ఇతివృత్తాలుగా – మానవ సంవేదనలు, ప్రకృతి అందాలు, ప్రేమోద్రేకాలు మొదలైనవుంటాయి. ఎక్కువ భాగం కవిత్వం నస్తాలిక్ దస్తూరీలో ఉన్నా, దేవనాగరీ లోను, రోమన్ అక్షరాల లోను కూడా రాస్తున్నారు. ఉర్దూ కవులు కలం పేర్లు పెట్టుకుంటారు. ఆ కలం పేరును తఖల్లుస్ అంటారు. ఈ తఖల్లుస్, కవి సంతకంలా కవిత చివరి చరణాల్లో చేరుస్తారు. ఉర్దూ కవిత్వ సమ్మేళనాల్ని ముషాయిరాలంటారు. ముషాయిరా పాకిస్తానులోను, ఉత్తర భారత దేశంలోను అత్యంత జనరంజకమయిన ప్రక్రియ. ఆ కవితని వింటున్న ప్రేక్షకులు ప్రతీ ద్విపద చరణాల తరువాత 'వా హ్వా'లతో అభినందిస్తూ ఆనందిస్తారు. ఉర్దూ కవిత్వంలో అంతర్భాగమైన 'నజ్మ్' 18వ శతాబ్దం రెండవ భాగంలో నజీర్ అక్బరాబాది మొదటిసారిగా ప్రవేశపెట్టారు. సాధారణ వస్తువులు, రూపాలు, ఆందోళనలు వారి కవితా సామాగ్రి. అప్పట్లో అది ఉర్దూ కవిత్వంలో కొత్త. అక్బరాబాది ప్రభావం 19వ శతాబ్దంలోని అల్తాఫ్ హుస్సేన్ హాలి, ముహమ్మద్ హుస్సేన్ అజాద్ కవుల నుండి ఇప్పటి వరకూ కొనసాగుతూనే ఉంది. పాకిస్తాన్ ఆధునిక కవిత్వానికి ఆద్యుడుగా భావించబడుతున్న అల్లామా ముహమ్మద్ ఇక్బాల్ కూడా అందులో ముఖ్యమైనవారు.

ఉర్దూ జాతీయ భాష కావడంతో, సాహిత్యం పాకిస్తాన్ లో అత్యంత ప్రజాదరణ పొందింది. ఉర్దూ భారతదేశం, ఆఫ్ఘనిస్థాన్, బ్రిటన్, దక్షిణాసియా మూలంగా ఇతర దేశాల్లో కూడా అంతే ప్రాముఖ్యం ఉన్న భాష. పాకిస్తాన్‌లో ఉర్దూ కవిత్వంలో ప్రముఖులు అల్లామా ఇక్బాల్, ఫైజ్ అహ్మెద్ ఫైజ్, అహ్మెద్ ఫరాజ్ మొదలైనవారు.


అల్లామ ఇక్బాల్

**అల్లామా ముహమ్మద్ ఇక్బాల్ (1877–1938):** భారతదేశంలో ముస్లిం రాష్ట్రాన్ని మొట్టమొదట ఊహించిన తత్వవేత్త, రాజకీయవేత్త, భావుక కవి ఇక్బాల్. ప్రాక్ పశ్చిమ సాహిత్యాల్ని లోతుగా పరిశీలించి, అనేక రూపాల్లో కవిత్వాన్ని పండించినవాడు. గోథే, షెల్లీలకులా తాత్విక ఆలోచనలు, ఆధ్యాత్మిక ఆదర్శవాదంతో, సమాజం, జాతి నిర్మాణం కోసం ఆత్మసాక్షాత్కర తపనతో, నిండి ఉన్న కవిత్వం ఇక్బాల్ ది. అలానే ఫారసీ, అరబ్బీ ఛాయల ఇస్లామిక్ కవిత్వం కూడా ఇక్బాల్ కవిత్వం లో ఎక్కువ కనిపిస్తుంది. ఉర్దూ, ఫారసీ రెండు సాహిత్యాల్లోను తనదైన ముద్ర వేసిన కవి.

రాం (శ్రీరామచంద్రుని మీద కవిత), హిమాలయాలు, భారతీయ బాలలకోసమని జాతీయగీతం, గురునానక్, మీర్జా గాలిబ్ మీద కూడా అద్భుతమైన కవితలు రాసారు. రవీందనాథ్ టాగూరుకులానే, 1922 లో బ్రిటీష్ రాజు అయిదవ జార్జి, నైట్ హుడ్ బిరుదుతో సత్కరించారు. విభజనకు ముందు తరానే హింద్ (భారతదేశం పాట) కవితలో, హిందుస్తాన్ ని 'సారే జహాసే అఛ్ఛా, హిందుస్తాన్ హమారా' (ఈ పాట తెలియని భారతీయుడుండడు) అని కీర్తించిన ఇక్బాల్, ముస్లిముల కోసం ప్రత్యేక దేశాన్ని అందరికంటే ముందు ఆకాంక్షించారు. పాకిస్తాన్ వ్యవస్థాపకుడు మహమ్మద్ ఆలీ జిన్నాకు అత్యంత సన్నిహితుడు. పాకిస్తాన్‌కు జాతీయ కవి. దక్షిణాసియాలో ఉర్దూ ప్రపంచానికి – ప్రపంచ తూర్పు కవి. ప్రతీ ఏడాది ఇక్బాల్ పుట్టిన రోజు 9 నవంబరున పాకిస్తాన్ ప్రభుత్వం

సెలవుగా ప్రకటించి, ఆ రోజు ఇక్బాల్ రోజుగా పాకిస్తాన్ అంతటా జరుపుకుంటారు.

**నక్షత్రాల కావల**

నక్షత్రాల కావల అనేక ప్రపంచాలున్నాయి
ఇంకా అనేక పరీక్షల్లో ప్రేమ సఫలం కావాలి
ఈ అస్తిత్వం ఒక్కటే ముఖ్యం కాదు
ఎల్లల్లేని ప్రయాణాలు చాలా ఉన్నాయి
ఉన్నదానితోనే విశ్రమించొద్దు
అన్వేషించడానికి అనేక స్వర్గాలున్నాయి
నీ ఒక్క నివాసం పోయినందుకే ఎందుకు చింతిస్తావు
స్వంతం చేసుకోడానికి కొన్ని లక్షల చిరునామాలున్నాయి
నువ్వొక డేగవి, ఎగరటం నీ గుణం
అధిగమించడానికి నీకు అనేక ఆకాశాలున్నాయి
దివారాత్రుల చక్రంలో నిన్ను నీవు కోల్పోవొద్దు
నీకు అందుబాటులో అనేక సాహసకృత్యాలున్నాయి
జనసమూహంలో నేను ఒంటరిగా ఉన్న రోజులు పోయాయి
నా ఆలోచనల్ని ప్రతిధ్వనించే వారు నేడు అనేకులున్నారు

**కవి :**

దేశం ఒక శరీరం, జనం దాని అవయవాలు
చేతివృత్తులవారు దేశం కాళ్లూ చేతులు

పరిపాలన విభాగం దాని అందమైన ముఖం

లలితమైన పేరుతో స్పష్టంగా చూడగల కవి ఆ దేశం కన్ను
నొప్పితో అవయం బాధపడితే, కన్ను రోదిస్తుంది
ప్రాపంచిక శరీరం పట్ల కన్నుకి ఎంత కరుణ

**ఫైజ్ అహ్మద్ ఫైజ్ (1911-1984):**


ఫైజ్ అహమ్మద్ ఫైజ్

ఇక్బాల్ తరువాత ప్రముఖ ఆధునిక కవి, రచయిత, పాత్రికేయుడు, రాజకీయ వాది. కవిత్వంలో రాజకీయ కోణం విషయంలో ఇక్బాల్ నే అనుసరించినా, అతనిదంటూ ఒక ప్రత్యేకతను నిలుపుకున్న కవి. సామాజిక మార్పిష్టు దృక్పథం, సామాన్యుల పక్షాన నిలవడం ఫైజ్ కవిత్వంలో కనిపిస్తుంది. ఆర్థిక దోపిడీ, వలసరాజ్యస్థాపన, సార్వభౌమ పెత్తనాన్ని నిరసిస్తూ ప్రపంచ పీడితుల విప్లవాన్ని కోరుకునేవారు. ప్రతి వ్యక్తిలో సంపూర్ణ దేవుని మనిషిని పునరుజ్జీవింపజేసి ఆదర్శవంతమైన ముస్లిం సమాజాన్ని ఇక్బాల్ ఉద్ధరించాలనుకుంటే, నిరుత్సాహపడని ఆశతో అధర్మానికి వ్యతిరేకంగా విప్లవ విజయాన్ని ఫైజ్ కోరుకునేవారు. ఉర్దూలోనే కవిత్వం రాసిన, వామపక్ష భావాలున్న విప్లవవాది. మొదట్లో సాంప్రదాయకమైన ప్రేమ, సౌందర్యం లాంటివే కవితా వస్తువులైనా, రాను రాను రోజువారి సామాజిక రాజకీయ కోణాన్ని అవి సంతరించు కున్నాయి. ప్రణయం నుండి వాస్తవికవాదం వైపు దృష్టి మళ్లింది. తాను చేయని తప్పుకు నాలుగేళ్లు నిర్బంధంలో ఉన్నారు.

**కాస్త ప్రేమించి, కాస్త పనిచేసాను**

ప్రేమని బాధ్యతగా భావించినవారు,
లేదా పనిని సరిగ్గా ప్రేమించినవారు,
చాలా అదృష్టవంతులు.
కాస్త ప్రేమించి, కాస్త పనిచేసి
నా జీవితమంతా నేను తీరికలేకుండా ఉన్నాను.
ప్రేమ ఒక్కోమారు నేను చేస్తున్న పనిలో అడ్డయితే
మోహంతో ప్రేమించడానికి,
ఒక్కోమారు పని అనుమతించలేదు నన్ను
చివరకు ఆ పరిస్థితికి కలవరపడి
పనీ ప్రేమా రెంటినీ అసంపూర్ణంగా వదిలేసాను

**మాటాడు**

మాటాడు, నీ పెదాలకు అడ్డులేదు / మాటాడు, అది నీ నాలుకే
మాటాడు, అది నీ శరీరమే / మాటాడు, నీ జీవితం ఇంకా నీదే

చూడు, కమ్మరి కొట్టులో
మంట ఎలా విశృంఖలంగా మండుతోందో,
లోహం ఎర్రగా ప్రకాశిస్తోందో; /
తాళాలు వాటి దవడలు తెరుస్తాయి
ప్రతీ గొలుసూ తెగడం మొదలవుతుంది

నాలుక, శరీరం మరణించకముందే
మాటాడు, ఈ క్లుప్త సమయం చాలా దీర్ఘమైనది
మాటాడు, నిజం ఇంకా మరణించలేదు
మాటాడు, మాటాడు, ఏదైనా సరే, / నువ్వు తప్పక మాటాడు

**పద్యం**

వాళ్లు నా పెన్నూ సిరా లాక్కుంటే / నేను ఫిర్యాదు చేయకూడదు
నేను నా వేళ్లను హృదయరక్తంలో / ముంచాను కాబట్టి
వాళ్లు నా నోటిని కుట్టేసినా / నేను ఫిర్యాదు చేయకూడదు
నా గొలుసులో ప్రతీ చుట్టూ
మాటాడేందుకు సిద్ధంగా ఉన్న నోరే కాబట్టి

**హఫీజ్ జలంధరి (1900-1982) :** పాకిస్తాన్ జాతీయగీతం రాసిన ఆధునిక కవి. కాల్పనిక, ధార్మిక, స్వదేశాభిమానం, ప్రకృతి ముఖ్యంగా అతని కవితా వస్తువులు.

**నేనేమిటి?**

**మానవ రక్తపు అగాధమైన అల్లకల్లోల సముద్రంలో**
**విపత్తుల్లో, భూకంపాల్లో, / మెరుపుల్లో, ఉరుముల్లో,**
**ఒక స్వరంలేని స్వరాన్ని**

**స్త్రీల కవిత్వం:** ఫెహ్మిదా రియాజ్, కిష్వర్ నహీద్, జెహ్రా నిగాహ్, పర్వీన్ షకీర్ పాకిస్తాన్‌లో స్త్రీల పక్షాన ఉర్దూలో అద్భుతమైన కవిత్వం రాసినవారిలో ప్రముఖులు. అక్కడి సాంఘీక పరిస్థితుల్లో, కట్టుబాట్లలో తమవైన కష్టాలు, వేధింపులను ప్రపంచానికి తెలియజేసే వాహికగా కవిత్వాన్ని వారు వాడుకున్నారు.

**అహ్మిదా రియాజ్ (1946-) :** పాకిస్తాన్‌లో అగ్రశ్రేణి స్త్రీవాద కవయిత్రి, మానవహక్కుల క్రియాశీలి. విభజనకు ముందు మీరట్‌లో జన్మించి, పాకిస్తాన్ హైదరాబాద్‌కు వలస పోయిన సాహిత్య కుటుంబం ఆమెది. ఇంతవరకూ ఆమెలా అంత శక్తి వంతంగా ఆంగ్లంలో పాకిస్తాన్ నుండి


అహ్మిదా రియాజ్

కవిత్వం రాయలేదని అంటారు. జనరల్ జియా ఉల్ హక్ సమయంలో ఆమె మీదున్న ప్రతిబంధకాలను తప్పించుకుందుకు భారతదేశంలో తలదాచుకున్నారు. *నాలుగు గోడలు - నల్ల ముసుగు, గాయపడిన శరీరం, రాతి నాలుక, కవిత్వ సంకలనాలు, గోదావరి నవల* ఆమెకు మంచి పేరు తీసుకొచ్చాయి.

**సంచారిని ప్రేమించు**

**బాటసారి వెళ్లిపోయాడు**
**అతన్ని పట్టివ్వడానికి అతని వాసన సైతం తారాడడం లేదు**
**కాలిజాడా లేదు, అతని గుర్తూ లేదు**
**కనీసం గిన్నె అడుగులో చేదునైనా అతను మిగల్చలేదు**
**ఒక హాస్యం కాని నవ్వుగా, జీవితం మిగులుతుంది!**
**హృదయంలో ఆలోచన కుదురుకుంటున్నట్టు**
**వేగవంతమైన శ్వాస, మనస్సులో చిక్కిన ఆలోచన,**
**ఉండి ఉండి తునకలై కొట్టుకుంటుంది**
**వేదనాభరిత గుండెలో, బాధపడే గాయం.**
**అయినా అదంత తీవ్రమైనది కాదు**
**నొప్పి అలా ఉండిపోదు, దాన్ని బుజ్జగించలేము**
**పశ్చాత్తాప హృదయం, దాని మనస్సు మార్చుకున్నాక**
**దానికదే ఆశ్చర్యపోతుంది. / ఏమి తెలుసు దానిగురించి దానికి?**
**మానవ హృదయం అలాంటిది, అది బండ కాదు**
**ఒకమారు దానిమీద గీతగీస్తే, దాన్ని చెరిపేయలేం**

**కిష్వర్ నహీద్ (1940-):** నలభయి ఏళ్లకు పైగా సాహిత్యరంగంలో ఉన్నారు. నలభై పుస్తకాల వరకూ వచ్చాయి. ఆధునిక కవిత్వంలో స్త్రీ వాదిగా అందరికంటే ముందున్నవారు. అనేక సాహిత్య సాంస్కృతిక


కిష్వర్ నహీద్

కార్యక్రమాల్లో చురుకైన కార్యకర్త. మల్లికా సారాబాయి, తన నృత్య ప్రదర్శనల్లో పితృస్వామ్య వ్యవస్థ మీద తిరుగుబాటుగా కిష్వర్ నహీద్ రాసిన కవిత్వంలోని కొన్ని భాగాల్ని వాడుకుంటారు.

**అపసవ్యం**

**నా కళ్లు నీ కాళ్ల కింద చెప్పులైనా / నిన్ను భయం వదలదు**
**నేను చూడలేకపోయినా / సువాసనలా**
**శరీరాల్ని వాక్యాల్ని నేను తాకగలను / నా రక్షణ కోసమైనా సరే**
**కనిపించనంతవరకూ మలినంలో**
**నా ముక్కు నేను తుడుచుకుంటాను**
**అయినాసరే, నీ భయం నిన్ను వదలదు**
**నాకు వాసన తెలియకపోయినా / నేనింకా ఏదో ఒకటి చెప్పగలను**
**నా పెదాలు నీ దైవత్వాని కీర్తిసున్నా**
**పొడిపొడిగా ఆత్మలేనివిగా మారతాయి**
**అయినాసరే, నీ భయం నిన్ను వదలదు**
**నేను మాటాడలేకపోయినా / నేనింకా నడవగలను.**
**ఇంటిపనుల గొలుసులతో నన్ను నువ్వు కట్టి ఉంచినా**
**నా కాళ్లచుట్టూ లజ్జ, వినయంతో/నువ్వు నన్ను శక్తి లేనిదాన్ని చేసినా**
**నీ భయం నిన్నొదలదు / నేను నడవలేకపోయినా**
**నేనింకా ఆలోచించగలను. / నేను స్వేచ్ఛగా బతికి ఉండడం,**
**ఆలోచించగలగడం / నీ భయం**
**ఎవరికి తెలుసు, ఏ కష్టాలలోకి తీసుకుపోగలదో నిన్నది**

**సూఫీ కవిత్వం:** సింధ్, పంజాబ్, బెలూచిస్తాన్, ఖైబర్ కనుమల్లో సూఫీ పాటలు విరివిగా వినిపిస్తాయి. ప్రపంచ ప్రసిద్ధులైన సూఫీ గురువులు పంజాబీలో రాసినవారు అక్కడ ఎందరో ఉన్నారు. వారిస్‌షాహ్, బాబా హకీం అలీ, బుల్లే షాహ్, హఫీజ్ బర్ఖుర్దార్, ఖ్వాజా ఫరీద్, మీన్ ముహమ్మద్

బక్స్, షాహ్ హుస్సైన్ , సుల్తాన్ బహు, వారిస్ షాహ్ వీరంతా పంజాబీలో రాసిన ప్రముఖ సూఫీ కవులు. అలాగే సింధ్‌లో షాహ్ లతీఫ్, సచల్ సర్మస్త్, బలోచిస్తాన్ లో మస్త్ తవక్కలి ఉన్నారు.

**బాబా ఫరీద్ (1173-1266):** పాకిస్తాన్ ముల్తాన్ ప్రథమ ప్రసిద్ధ పంజాబీ సూఫీ కవి. పంజాబీ మత గ్రంథం ఆది గ్రంథ్‌లో ఫరీద్ కవితలెన్నో చేర్చబడ్డాయి.

**ఫరీద్ నువు ప్రభువుని కోరుకుంటే**
**అణకువగల గడ్డిగా ఉండు / కోసి, ఒలిచి, తడిపి, తొక్కి**
**మెత్తపర్చి పోగు పోసి ప్రార్థన చాపగా అల్లుతే**
**అప్పుడే దానికి ప్రభువు ఇంటిలోకి / ప్రవేశం లభిస్తుంది**
**....**
**ఫరీద్, మట్టిని తక్కువ చేయొద్దు / దానిలా ఏదీ లేదు**
**నువు బతికుండగా నీ పాదాల్ని నాకుతుంది**
**నువు మరణించాక నీ శిరస్సుని కప్పుతుంది**

**సుల్తాన్ బహు (1631-1691):** దైవావేశం ఉన్న పంజాబీ ప్రఖ్యాత సూఫీ కవి. చదువురాని వారినైనా ఆకట్టుకునే శబ్దచాతుర్యం అతనిది. ఇప్పటికీ చాలామందికి ఆ కవితలు కంఠతా రావడమే కాదు, సూఫీ సంగీతకారులకు సైతం ఒక పెన్నిధి.

**నా శరీరమంతా కండ్ల తోరణమయితే**
**అలసిపోని ఉత్సాహంతో నా ప్రభువును తేరి చూస్తూ ఉండొచ్చు.**
**కాని, నా శరీరం అణువణువూ పదిలక్షల కళ్లు కావాలని**
**ఎలా కోరుకోను**
**అలా అయితే కొన్ని కళ్లు మిణకరించినా,**
**తతిమ్మావి తెరిచి చూస్తాయని!**

**అయినా సరే, అతన్ని చూడాలన్న నా దాహం,**
**తీరకనే పోవచ్చు. నేనింక ఏమీ చెయాలి?**
**ఓ బహు, ప్రభువు క్షణదర్శనం నాకు**
**పవిత్ర కాబాకు లక్షలకొద్దీ తీర్థయాత్రల నేను చేసినట్టు**

**బుల్లేషాహ్ (1680 - 1758):** పంజాబీలో గొప్ప మార్మిక కవి, పండితుడు. నిజమైన ఆత్మానుభవం కోసం తపించినవారు. ప్రఖ్యాత సూఫీ గురువు ఇనాయత్ షాహ్ కి శిష్యుడుగా చేరి, మార్మిక జాగృతిలో గడిపారు. బుల్లే షాహ్ సూఫీ పాటలు ప్రపంచ వ్యాప్తంగా అందరినీ అలరిస్తున్నాయి.

**మక్కాకి పోవడమే అంతిమం కాదు**
**వందలకొద్దీ ప్రార్థనలు చేసినా సరే**
**గంగానదికి పోవడమే అంతిమం కాదు**
**వందలకొద్దీ పవిత్ర స్నానాలు చేసినా సరే**
**గయాకి వెళ్లడమే అంతిమం కాదు**
**వందలకొద్దీ పూజలు చేసినా సరే / బుల్లేషా అంతిమం అల్లా**
**హృదయం నుండి 'నేను' తొలగించినపుడే**
**ప్రక్షాళనం ద్వారా దైవం కనిపిస్తే**
**కప్పలు చేపలు తప్పకుండా ముందు అతన్ని కనిపెట్టేవి**
**దైవం అడవుల్లో దాగుంటే /**
**ఈ సరికే అతన్ని పశువులు కనుగొనేవి**
**ఓ బుల్లేషా, నిజమైన పవిత్ర హృదయులకే**
**దైవం దొరుకుతాడు**
**నన్ను వదిలేసి, అతన్ని అతనూ వదిలిపోయాడు**
**నాలో ఏమి తప్పుందో?**
**రాత్రయినా పగలైనా ప్రశాంతంగా నాకు నిద్రలేదు;**
**నా కళ్ల కన్నీరు కారుస్తున్నాయి!/ప్రేమంత క్రూరులెవరూ లేరు**
**ఈ వ్యాధిని ఏ వైద్యుడూ బాగుచేయలేడు**
**ఒక్క క్షణమైనా శాంతి ఉండదు/అంత తీవ్రమైనది వియోగం బాధ**
**ఓ బుల్లే, ప్రభువు తన అనుగ్రహం కురిపిస్తే**
**నా రోజులు సమూలంగా మారిపోతాయి**
**నన్ను వదిలేసి, అతన్ని అతనూ వదిలిపోయాడు**
**నాలో ఏమి తప్పుందో?**

**సచల్ సర్మస్త్ (1739 - 1829):** సింధీలో సూఫి కవిత్వం రాసిన అగ్రశ్రేణి కవి. అసలు పేరు అబ్దుల్ వహాబ్. సచల్ సర్మస్త్ అంటే సత్యాన్ని అన్వేషించే మార్మికుడు. ఇస్లాం తత్వాన్ని మనసావాచా అనుసరించిన మార్మిక కవి.

**రహస్య మార్గం తెలుసుకుందుకు / మిత్రమా, ఇదొకటే మార్గం**
**ఇతరుల దారిని అలక్ష్యం చేయి**
**ఋషుల కష్టమైన జాడనైనా, అనుసరించొద్దు**
**యాత్ర చేయనే ఒద్దు, నీ మొహం మీద ముసుగు చించేయ్**

ఆంగ్లం ఆధికారిక భాష కాబట్టి, పాకిస్థానీయులు ఆంగ్లంలో రాసిన సాహిత్యం కూడా ఎక్కువగానే ఉంది. ఆంగ్లంలో కవిత్వం రాసి పేరుపొందిన వారిలో ఆలంగిర్ హష్మి, దావూద్ కమల్, హుసైన్ షహీద్ సుహ్రావర్దీ మొదలైనవారున్నారు. సూఫీ కవిత్వం కాక పంజాబీలో రాసిన ప్రముఖ కవులు ఫఖర్ జమన్, నజ్మ్ హొసైన్ సైయెద్. పాష్తోలో రాసిన ప్రముఖ కవి - ఘనీ ఖాన్. సింధీ భాష సాహిత్యపరంగా ఉత్కృష్టమైనది, బహుశా ప్రపంచంలో అతి పురాతనమైనది. అందులో ప్రమిఖ కవులు సూఫీ కవిత్వం

కాకుండా, షైఖ్ అయాజ్, జైబ్ సింధి, తారిక్ ఆలం అబ్రో. బాలొచ్ బలూచిస్తాన్ లో మాట్లాడే భాష. తుర్కెమినిస్తాన్, తూర్పు ఆఫ్రికాలో కూడా ఈ భాషీయులున్నారు. బలోచీ లో ఈ భాషలో ముఖ్యులైన కవులు - ఆతాషాద్, గుల్ ఖన్ నాసిర్,సైయెద్ జహూర్ హాష్మి.

**బంగ్లాదేశ్ :** 38 వరకూ భాషలున్న బంగ్లాదేశ్‌లో బంగ్లా లేదా బెంగాలీనే అధికార భాష. 98 శాతం ప్రజలు బెంగాలీ మాటాడుతున్నా, అందులో 80 శాతం ముస్లిములే. హిందువులు 16 శాతం, బౌద్ధులు, క్రైస్తవుల సంఖ్య అతి తక్కువ. బంగ్లాదేశ్ గురించి మాటాడు కుంటున్నప్పుడు, 1947 నుండి పాకిస్తాన్‌కి అంతర్భాగమయిన తూర్పు పాకిస్తాన్ గా, 1971 నుండి బంగ్లాదేశ్ అనబడే ఒక స్వతంత్ర దేశంగా చూడాలి. 16వ శతాబ్దం వరకూ ఐశ్వర్యవంతమైన ప్రాంతం. హిందువులు బౌద్ధుల మధ్య ఆధిక్యత కోసం కుమ్ములాటలు, 12వ శతాబ్దం చివరికి ఆపలేని ఇస్లాం ప్రవాహంలో, టర్కీ నుండి 20 మంది సైనికులతో వచ్చిన మొహమ్మెద్ బఖ్తియార్ ఖిల్జీ బెంగాలుని 1199 లో ఆక్రమించగలగడం విశేషం.

జమిందారు పద్ధతుల్లో గడుస్తున్న ఆ ప్రాంతాన్ని, ఆ తరువాత మొఘల్ చక్రవర్తులు, పోర్చిగీసు, బ్రిటీష్ పరిపాలనలోకి రాకతప్పలేదు. ముస్లిముల సంఖ్య అధికంగా ఉన్న ఆ ప్రాంతం భారతదేశ విభజనలో పాకిస్తాన్ అధీనంలోని తూర్పు పాకిస్తాన్ గా మారింది. పాకిస్తాన్ అక్కడ వారిమీద ఉర్దూని రుద్దడం, ఏవిధంగానూ అంగీకరించలేక, బెంగాలీ భాష పరిరక్షణ కోసం అనేక అంతర్యుద్ధాలు, ఉద్యమాలు అక్కడ కొనసాగాయి. ఫలితంగా 21 ఫిబ్రవరి 1952 లో బెంగాలీనే అక్కడి అధికార భాషగా పాకిస్తాను అంగీకరించక తప్పలేదు. మాతృభాషకోసం ఎందరినో పోగొట్టుకుని, వారి హక్కుని సాధించుకున్నందుకు UNESCO ఆ రోజు ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మాతృ దినోత్సవంగా ప్రకటించింది. తూర్పు, పశ్చిమ పాకిస్తానుకు పొంతన ఎప్పుడూ కుదరలేదు. పైగా తూర్పు పాకిస్తానులో బంగ్లా జాతీయవాదం అణచివేయలేనంత ఎత్తుకు ఎదగడంతో, భారత సహకారంతో, తూర్పు పాకిస్తానుని స్వతంత్ర దేశంగా 1971లో ప్రకటించక తప్పలేదు పాకిస్తానుకి.



బంగ్లాదేశ్ పాయిట్రీ

సాహిత్యపరంగా ఆ ప్రాంతానికి రమారమి వెయ్యేళ్ల చరిత్ర ఉంది. మధ్యయుగంలో చండీ దాస్, దౌలత్ కాజీ, ఆలోల్ మొదలైన ముఖ్యమైన కవులు ఆ సాహిత్యానికి బలమైన పునాదులు వేసారు. ఆధునిక బెంగాలీ సాహిత్యం 19వ శతాబ్దంలో మొదలై, రవీంద్రనాథ్ టాగూర్, ఖాజీ నజ్రుల్ ఇస్లాం, మైఖేల్ మధుసూదన్ దత్తా. శరత్ చంద్ర చట్టోపాధ్యాయ్, బంకిం చంద్ర చట్టోపాధ్యాయ్, మిర్ మొషర్రఫ్ హొస్సైన్, కాజీ అబ్దుల్ వదూద్ లాంటి ఎందరో ప్రతిభావంతుల్ని మార్గదర్శులుగా పొందింది. రవీంద్రుడు రాసిన 'అమార్ సోనార్ బాంగ్లా' అక్కడి జాతీయగీతం అయింది. అప్పుడప్పుడు అక్కడ గడిపినపుడు రవీంద్రుడు రాసిన తొమ్మిది కవితల్ని, కథల్ని వారి ప్రాంతపు కవి రాసినవిగా బంగ్లా దేశీయులు గర్వపడతారు. వాటితో ఒక వార్తా చిత్రం సైతం వారు నిర్మించారు.

**ఖాజీ నజ్రుల్ ఇస్లాం (1899-1976):** బంగ్లాదేశ్ జాతీయకవి. బెంగాల్ తిరుగుబాటు కవి. బంగ్లాదేశ్ సమాజం లోనే నేను జన్మించినా, ఈ ఒక్క దేశానికే కాదు, సమస్త ప్రపంచానికి చెందిన వాడిని అని సగర్వంగా చెప్పుకున్న కవి. అసాధారణ బహుముఖ ప్రజ్ఞాశాలి. కవిత్వం, సంగీతం అత్యంత ఇష్టమైన వ్యాపకం. కొన్ని వందల పాటల సృష్టికర్తగా బహుశా ప్రపంచ సాహిత్యంలో ప్రథముడు. హిందూ స్త్రీని వివాహం చేసుకున్నందుకు అనేక ఇబ్బందుల్ని ఎదుర్కొన్నారు.



ఖాజీ నజ్రుల్ ఇస్లాం

**నిరీక్షణలో యుగాలు**

ఎడారి యాత్రికునికి కనుచూపు మేరలో ఒయాసిస్సు కనబడనట్టు
ఆశల దారిలో నిరీక్షిస్తూ యుగాలు గడిచిపోతున్నాయి
నా దాహన్ని కన్నీళ్లతో తీరుస్తూ సంవత్సరాలు వచ్చీ పోతున్నాయి
చేజారిపోయే దీపాన్ని నిరాశాజనక ఎండమావులతో వెలిగిస్తూ
లక్షల స్వరమాధుర్యాలలో ఎడారి జెముడు సైగచేస్తుంటుంది
నా కలల్లో నేనింకా ఊహించగలను
ఈ ఎడారి ఒకప్పుడు అల్లకల్లోల సముద్రం
కానీ పరిభ్రమించే యాత్రికుడిలా పాపం
ఆ సముద్ర తీరంలో మునిగిపోయిన పడవ
ఎడారితోవలో నిష్ఫలంగా ఇంకా నావికుడ్ని
వెతుకుతూనే ఉంది

**మనం తరువాత కలుసుకుందాం**

మరో జన్మలో కలుసుకుందాం మనం
దయచేసి మరచిపో, చిరు నవ్వుతో మరచిపో

చెప్పునివి ఏవైనా ఉంటే / నేనూ చెప్పను, నువ్వూ చెప్పొద్దు
ప్రేమని తెలియజేస్తే తిప్పి కొట్టు
ఇంకా ప్రయత్నిస్తూ ఉంటే బాధించు
కల హఠాత్తుగా కరిగిపోతుంది
రాత్రి కుసుమం వేకువకి రాలిపోతుంది
ప్రేమించక హృదయం ఎండిపోతుంది
అమృతం ఇక్కడ విషంలా ఉంటుంది

వియోగంలో హృదయం వేదన కోరుకుంటుంది
కలిసున్నప్పుడు, తొందరగా దూరమవుతాం
ప్రేమ ఊట ఎక్కడ ఎండిపోదో
అటువంటి శాశ్వత తోటలో నా హృదయాన్ని గుర్తుంచుకో

**విద్రోహి (దీర్ఘ కవితలో చివరిభాగాలు)**

అనిర్వచనీయమైన దుఃఖాన్ని నేను/ కన్య ప్రథమ స్పర్శ కంపనాన్ని నేను
తొలుత దొంగిలించబడ్డ/ఆమె ముద్దు సలిపే సౌకుమార్యాన్ని నేను
ముసుగు ప్రేయసి క్షణభంగురమైన చూపుని నేను
నేను ఆమె రెప్పవేయని స్థిరమైన దొంగచూపుని ...
...
నేను భూహృదయంలో మండుతున్న జ్వాలాముఖిని,
నేను అడవి దావానలాన్ని,
నేను నరకపు భీకరమైన సముద్ర రోషాన్ని!

మెరుపుల రెక్కలమీద లోతుగా ఆనందంగా విహరిస్తాను నేను
దుర్దశని భయాన్ని చుట్టూ చెదరగొడతాను నేను
ఈ ప్రపంచం మీదికి భూకంపాల్ని తీసుకొస్తాను నేను!
నేను శాశ్వత విద్రోహిని,
నేను ఈ ప్రపంచానికావల నా తల పైకెత్తుతాను
దృఢంగా, ఒంటరిగా ఎప్పటికీ నిటారుగా!

**జసిముద్దీన్ (1903-1976):** కుల మత తత్వాల కతీతంగా సామాజిక రాజకీయ ఉద్యమాల్లో ఉంటూ బెంగాలీ భాష, సాహిత్యాల పక్షం వహిస్తూ, తన కవిత్వంలో నిబద్ధత ఆక్షేపణ తెలియజేస్తూనే ఉంటారు. వీరి కవితలు బెంగాలులోను, బంగ్లాదేశ్ లోను పాఠశాలల్లో పాఠ్యాంశం చేయబడ్డాయి. పల్లెలనుండి పిల్లగాలులొచ్చి పట్టణాల నిట్టూర్పుల్ని చెమటల్నిచల్లార్చినట్టుంటాయి.

**పాములోళ్ల పాట**

ఓ బాబూ, దండాలు దండాలు మీకు
నా పేరు పాముల పట్టే గోయా / నా ఇల్లు పద్మానది
మేము పక్షుల్ని పడతాం / పక్షులమీద బతుకుతాం
మా ఆనందానికి అంతం లేదు, ఎందుకంటే
నాగుపాము తలమీద మణిని అమ్ముకుంటాం

ఒక తీరంలో వండుకుంటాం / మరో తీరంలో తింటాం
మాకు ఇళ్లు లేవు / సమస్త ప్రపంచం మా ఇల్లు
పురుషులందరూ మా సోదరులు / వారికోసం చూస్తాం
ప్రతీ ద్వారం దగ్గర ...

**షంసూర్ రహ్మాన్ (1929-2006) :** అరవయి కవిత్వ సంకలనాలకంటే ఎక్కువ రాసిన ప్రముఖ బెంగాలీ కవి. బంగ్లాదేశ్ అనధికార ఆస్థానకవిగా గుర్తింపు పొందారు. ఉదార మానవతావాదం, మానవ సంబంధాలు, కాల్పనిక యువ తిరుగుబాటు, బంగ్లాదేశ్‌లో తదుపరి పరిణామాలు, మత ఛాందసవాదానిపట్ల విముఖత వారి కవితా వస్తువులు.

**కొన్ని కవిత్వ చరణాలకోసం**

చెట్టు దగ్గరకు పోయి అంటాను:
ప్రియమైన చెట్టా, నాకో కవితనివ్వగలవా?
చెట్టు అంటుంది: నువ్వు నా బెరడులోకి దూరి
నా మూలంలో కలిసిపోతే
బహుశా నీకో కవిత దొరకొచ్చు
పాడవుతున్న గోడ చెవిలో గుసగుసలాడాను:
నాకో కవితనివ్వగలవా? / దట్టమైన దాని నాచు స్వరంతో
పాత గోడ బదులిచ్చింది రహస్యంగా:
నీకు నువ్వుగా నా శరీరం ఇటుక / సున్నంలోకి దూరగలుగుతే
బహుశా నీకో కవిత దొరకొచ్చు

నా మోకాళ్లమీద ఒంగి / నేనొక ముసలాయన్ని వేడుకున్నాను:
దయచేసి నాకొక కవితనివ్వండి/నిశ్శబ్దంముసుగుని చించుకుని,
వివేక స్వరం అంది / నువ్వు నా మొహంమీద ముదుతల్ని
నీకులా మలచగలిగితే / బహుశా నీకో కవిత దొరకొచ్చు
కేవలం కొన్ని కవిత్వ చరణాలకోసం,
ఎంతసేపు నేనీ చెట్టుముందు / కూలిపోయే గోడముందు,
ముసలాయనముందు వేచి ఉండాలి?
ఎంతసేపు నా మోకాళ్లమీద ఒంగి ఉండాలి?

**నిర్మలేందు గూన్ (1945–) :** బంగ్లాదేశ్ సమకాలీన కవుల్లో ఉన్నతమైన స్థానంలో ఉన్న కవి. 1970 నుండి ఇప్పటివరకూ 45 కవిత్వ సంకలనాలు వెలువడ్డాయి. మానవులమధ్య అడ్డుగోడల్ని బద్దలుగొట్టాలని, నిర్బంధాలను తెంచుకొని పోవాలని చూస్తారు. మానవ చైతన్యం, స్వేచ్ఛ మీద ప్రేమ, ఎక్కువగా వీరి కవితా వస్తువులు.

**ఏ పాపం నన్ను రక్షిస్తుంది**

నిషిద్ధ చెట్టు ఫలం / ఎప్పుడూ నేను రుచి చూడలేదు
నేను ఎదురుచూస్తూనే ఉన్నాను, ఎదురుచూస్తూనే ఉన్నాను
కాస్తంత ఆశతో / నది కోసం సముద్రం చూస్తున్నట్టు
లేదా నది, ప్రవాహ కెరటం కోసం
ఆ సంవేదనేదో రాళ్లమధ్యనుండైనా / సన్నగా బయటపడి
నా హృదయాన్ని మోహంతో మండిస్తుందని ......

**ఫర్రూఖ్ అహ్మద్ (1918–1974) :** ఆధునిక కవిత్వంలో బంగ్లాదేశ్ లోని మరో ముఖ్యమైన కవి. కవిత్వంలో బంగ్లాదేశ్ కవయిత్రుల పాత్ర తక్కువే అయినా విస్మరించలేనిది. అందులో కొందరు ప్రముఖులు– బేగం సూఫియా కమల్, డాక్టర్ తస్లీమా నస్రీన్ మొదలైన వారు.

**బేగం సూఫియా కమల్ (1911–1999) :** బంగ్లాదేశ్ ప్రథమ కవయిత్రి, రచయిత్రి, క్రియాశీలి, ప్రముఖ స్త్రీవాది. ఆమె మరణించినపుడు ప్రభుత్వ లాంఛనాలతో ఖననం చేయబడ్డ మొదటి బంగ్లాదేశ్ మహిళ.

**నీ ఆ ప్రేమ**

భూపాత్ర, పొంగిపొరలి పోయేవరకూ
నింపుతున్న నీ ఆ ప్రేమని/నేను నా స్వాధీనంలో ఉంచుకున్నాను
నా కళ్లు నింపుకుంటూ, నా హృదయాన్ని నింపుతూ,
నా చేతుల్ని నింపుకుంటూ/ఎంత భరించరానిదీ ఆనందం,
ఈ ప్రేమ అంత తీవ్రమైనది,
బంగారు కిరణాల బాణం సోకినంతలోనే
లోపలి మొగ్గ విచ్చుకుంటుంది, వేగంగా గడ్డిలా...


తస్లీమా నస్రీన్

**తస్లీమా నస్రీన్ (1962 –):** డాక్టర్ (వైద్య వృత్తి), ప్రముఖ స్త్రీవాది, కవయిత్రి, రచయిత్రి, మానవ హక్కుల కోసం పోరాడుతున్న క్రియా శీలి. మతం, ముల్లాలు, కట్టుబాట్లకు విరుద్ధంగా ఆమె భావాల మూలంగా బంగ్లాదేశ్ నుండి బహిష్కృతురాలు. అయినా ప్రపంచవ్యాప్తంగా ఆమె సాహిత్యానికి గుర్తింపు పొందారు. అనేక దేశాల్లో తలదాచుకుంటున్నారు. ఏ దేశమూ స్త్రీల కోసం కాదని బలంగా నమ్ముతారు. అనేక అవమానాలు, బెదిరింపులు, ఫత్వాల మధ్య ధైర్యంగా సాహిత్య యాత్ర సాగిస్తున్న ధైర్యవంతురాలు.

**దురాక్రమణ**

మానవ స్వభావమే అంత
నువు కూర్చుంటే, 'వద్దు, కూర్చోకు' అంటారు
నిల్చుంటే, 'ఏమిటి సంగతి,
తిరుగు' అంటారు
తిరుగుతూ ఉంటే 'సిగ్గులేదా, కూర్చో' అంటారు
మరీ అంతసేపు పడుకుంటే 'లే' అని ఆజ్ఞాపిస్తారు
పడుకోకపోతే 'విశ్రాంతి లేకుండానా నిద్రపో' అంటారు
నా రోజుల్ని వ్యర్థంగా గడుపుతున్నాను లేస్తూ, కూర్చుంటూ
నేను చస్తున్నాను ఇపుడు, వాళ్లంటారు 'బతుకు' అని
నేను బతుకుతూ ఉంటే, ఎవరికి తెలుసు
'సిగ్గులేదా, చావు' అనన్నా అంటారు
భయంతో, రహస్యంగా బతుకుతూనే ఉన్నాను

**శీలం**

నువ్వు అమ్మాయివి / అది మరచి పోవద్దు
మగవాళ్లు నిన్ను ఓరగా చూస్తారు / నువ్వు వీధిలో నడిచిపోతుంటే
మగవాళ్లు నిన్ను అనుసరిస్తారు, ఈల వేస్తారు
వీధిదాటి అసలు దారిలో అడుగుపెట్టాక
మగవాళ్లు దూషిస్తారు, శీలభ్రష్టవంటారు
నీకు శీలం లేకుంటే / వెనక్కి తిరుగుతావు ఉంటే
నడుస్తూనే ఉంటావు / ఇప్పుడు నడుస్తున్నట్టే అలా

ఇస్లాం వ్యాప్తి చెందిన అన్ని దేశాల్లో సూఫీ అనుయాయులున్నారు. బంగ్లాదేశ్‌లో అనేక మంది సూఫీ తత్వాన్ని అనుసరిస్తున్నా, పేరెన్నికగన్న సూఫీ కవిత్వం అక్కడ లేదనే చెప్పాలి. మి

ముకుంద రామారావు
హైదరాబాదు. ఫోన్ : 9908347273

# ఇచ్చింది, దోచుకొన్నది
# విజయనగర రాజులే

- *దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి*

తిరుమల వేంకటేశుని ఆలయం, యాత్రికుల్ని, భక్తుల్ని, వ్యాపారతత్త్వంగల వారిని, ఆశబోతుల్ని, ఔత్సాహకుల్ని ఆకర్షిస్తోంది. భక్తి తత్త్వాన్ని ప్రచారం చేసిన ఆళ్వార్లు, ఆచార్య పురుషులు, దాస వర్గీయులు, పాలిత జనం, పాలకులు (ముఖ్యంగా క్రీ.శ. 966లో తిరుమల ఆలయానికి ఆర్థిక ఫౌండేషన్స్ వేసిన పల్లవ సమవై గా పిలువబడిన కడవన్ (పల్లవ) పేరుందేవి కాలం నుండి) ఎవరి రీతిలో వారు ఈ ఆలయ ఖ్యాతికి, ఆర్థికాభివృద్ధికి కృషి చేశారు. అలాగే, ఆలయ ఖ్యాతి ఆలయ ఆర్థికాభివృద్ధికి; ఆర్థికాభివృద్ధి ఆలయ ఖ్యాతికి పరస్పరం దోహద పడ్డాయి. ముఖ్యంగా క్రీ.శ. పదిహేనవ శతాబ్ది మధ్య కాలం నుండి విలువైన భూములు, ధనరాసులు,ఆభరణాలు, ఆలయంలోకి ప్రవహించసాగాయి. దురదృష్టం కొద్దీ, తిరుమల ఆలయ ఖ్యాతి, సంపదలు దానికి శాపాలుగా మారాయి. ఈ ఆలయ సంపద దోచుకోవడంకై అనేకమంది ప్రయత్నించారు. తొలుత క్రీ.శ. 1543 లో నాటి గోవాలో పోర్చుగీసు గవర్నరుగా ఉండిన మార్టిం అఫాన్సో డీ సౌసా (క్రీ.శ. 1542-45) దాదాపు మూడు వేల మందితో సముద్ర మార్గాన ఆలయ దోపిడీకై బయలుదేరాడు. ఆ తరువాత కూడా అనేక మంది ధనాశా పరులు ప్రయత్నించారు. అట్టివారిలో కడపటి విజయనగర పాలకులు కూడా ఉన్నారు. కృష్ణదేవరాయలు వంటివారు దానాలు చేసి, ఆలయ నగలు దొంగిలించిన ఆలయ సేవకుడైన సిర్రప్పయ్యన్ వంటి వారిని శిక్షించి, అతని ఆస్తుల్ని కూడా ఆలయపరం చేసి శిక్షించగా, విజయనగర కడపటి పాలకులు తమ వ్యక్తిగత అవసరాలకు, యుద్ధాలకు, అధికారం నిలుపుకోవడానికి ఆలయ ధనరాశుల్ని, అనేక ఆభరణాల్ని దోచుకొని వాడేసుకొన్నారు. అంటే, తొలి పాలకులు దానాలు చేయగా, కడపటి పాలకులు ఆలయాన్ని దోచుకు తిన్నారు. ఇట్టి విజయనగర పాలకులు : ఆరవీటి వెంకటపతిరాయలు (క్రీ.శ.1586-1614), రామ దేవరాయలు (క్రీ.శ.1614- 1629), శ్రీరంగరాయలు (క్రీ.శ.1642-1665/1681) (ఆరవీటి అళియ రామ రాయలు మనుమడైన పెదవేంకట (క్రీ.శ.1629- అక్టోబర్ 1642) సోదరుని కుమారుడు). అసలు, ఆరవీటి వేంకటపతి రాయలు నందన సంవత్సరం, ఆవణి నెల 25న తిరుమలను సందర్శించి, చంద్రగిరి కోటలో తన నివాసాన్ని కూడా ఏర్పరచుకొన్నాడు. అంతేగాక, అప్పటి పాత చంద్రగిరి కోట (పదకొండవ యాదవ రాయలు నిర్మించినది) చిన్నదిగా ఉన్నదని భావించి, 12000 గజ్‌ల భూభాగంలో దానిని పెద్దదిగా పెంచి, డెబ్బై రెండు బురుజులు మొదలైన వాటిని నిర్మించి (క్రీ.శ. 1586-1604 మధ్య), తన రాజధానిని పెనుగొండ నుండి చంద్రగిరికి మార్చినాడు. ఆ తరువాత, క్రీ.శ. 1604లో నేటి రాయ వెల్లూరుకు మార్చి, అచట క్రీ.శ. 1611 లేక 1614 వరకు ఉండడం జరిగింది.

ఈ విషయాలన్నీ మధ్యయుగ భారతదేశాన్ని సందర్శించిన పోర్చుగీసువారు, డచ్చి వారు చేసిన రచనల నుండి తెలుస్తున్నాయి. అట్టి వాటిలో వాస్కోడిగామా (క్రీ.శ. 1497-99), పెడ్రో ఆళ్వారెస్ కాబ్రాల్ (క్రీ.శ.1500-1501), నికొలొ డి కొంటి (క్రీ.శ.15వ. శతాబ్ది), కాబ్రాల్ సహచర నావికులు, డొమింగో పేస్, ఫెర్నావో నూనెజ్‌ల (క్రీ.శ. 1518-30) రచనలు, జోవో డి బారోస్ రచించిన డెకడా ప్రైమీర (క్రీ.శ. 1552), డెకడాస్ ద ఏషియా లు, ఫ్రాన్సిస్కన్, క్లెరిక్ ఫ్రైయ్ లూయీ డొ సాల్వెడార్ (క్రీ.శ.1503, 1510 లలో విజయనగరాన్ని సందర్శించిన మొదటి పోర్చుగీసు వ్యక్తి), డామ్ ఫ్రాన్సిస్కో డి ఆల్మిడా (క్రీ.శ.1504), ఆఫాన్సో డి ఆల్బుకర్క్ (క్రీ.శ.1509-1515) (తిమ్మయ్య ద్వారా క్రీ.శ. 1510లో ఇతడు గోవాను పొందినాడు), బర్బోసా (క్రీ.శ. 1515), న్యూనో ఆళ్వారెస్

(క్రీ.శ. 1510) వంటి వారి రచనలు నాటి దక్షిణ భారత స్థితిగతుల్ని తెలియజేస్తున్నాయి. అలాగే, ఫెర్నావో మెండెజ్ పింటో (క్రీ.శ. 1537–1558) రచించిన పెరిగ్రినకావో, గాస్పర్ కొరీయా రచించిన లెండాస్ డ ఇండియా; పేరు తెలియని పోర్చుగ్రీసు చిత్రకారుడు వేసిన చిత్ర లేఖనాలు, క్రిస్టొవా డి కాస్ట్రో క్రీ.శ. 1544 నుండి వ్రాసిన లేఖలు, డియొగొ డొ కౌటో రచించిన  డెకడా క్వింటా డ ఏషియా (క్రీ.శ. 1596–97), గాస్పర్ కొరీయ (తిరుమల ఆలయ సంపద గురించి తన నాల్గవ పుస్తకంలో రచించిన వాడు, క్రీ.శ. 1543లో తిరుమలను సందర్శించిన వాడుగా చెప్పుకొన్నవాడు) రచించిన *లెండాస్ డ ఇండియా* (క్రీ.శ.1580లలో) లేక లెజండ్స్ ఆఫ్ ఇండియా, అబ్రహాం రొగేరియస్ (క్రీ.శ. 1630లలో, 1640లలో), రచించిన *డి ఓపోన్ డ్యూరె టాట్ హెట్ వెర్బోర్జెన్ హేడెన్‌డమ్,* క్రీ.శ. 1590ల నాటి, క్రీ.శ. 1600ల నాటి క్రైస్తవ మిషనరీల లేఖలు, జాక్వాస్ డి కౌట్రె (ఇతడూ తిరుమల–తిరుపతిలను క్రీ.శ. 17వ. శతాబ్దిలో సందర్శించాడు. స్పానిష్ భాషలో రచించిన స్వీయచరిత్రలో కూడిన యాత్రా విశేషాలు (క్రీ.శ.17 వ శతాబ్ది నాటిది) కూడా దక్షిణ భారత స్థితిగతుల గురించి, తిరుమల ఆలయం గురించి, దాని ఆభరణాలు మొదలైన విషయాల గురించి తెలియజేస్తున్నాయి.

ఇక, కౌట్రె విషయానికొస్తే ఇతడు క్రీ.శ. 1592లో గోవాకు వచ్చాడు. క్రీ.శ. 1611లో తిరుమల–తిరుపతి, చంద్రగిరి, ఇతర దక్షిణ భారత ప్రాంతాల్ని సందర్శించి, ఆ ప్రాంతాల గురించి, తిరుమల ఆలయం గురించి, దాని సంపద గురించి కూడా వ్రాశాడు. తిరుమల గురించి వ్రాస్తూ ఇలా అన్నాడు : "అక్కడ (తిరుమలలో) నేనొక పెద్ద నిర్మాణాన్ని చూశాను. దీనిని తిరుపతి పగోడా (ఆలయం) అనేవారు. ఇది దేశంలోనే ప్రధానమైనదిగా, ఇతర ఆలయాలకు నాయక నిర్మాణంగా భావించబడేది. దీనికి అత్యధిక ఆదాయాలు ఉండేవి. వీటిని దేశంలోని నాటి రాజులు, చక్రవర్తులు ఇచ్చేవారు. ఆదాయాలేగాక, ధనరూపంలో, ఆభరణాల రూపంలో కూడా ఈ ఆలయానికి మితిమీరిన సంపద ఉండేది. ఇది తెలిసిన నాటి చక్రవర్తి (విజయనగర ఆరవీటి వెంకటపతి రాయలు) తన అవసరాలకు ఆలయ ధనాన్ని అప్పుగా ఇవ్వాల్సిందిగా కోరేవాడు. అట్టి సందర్భాల్లో విశేష కార్యక్రమాలు (సెరిమొనీస్) నిర్వహించబడేవి. ఆ తరువాత, ఆలయ నిర్వాహకుడు, ప్రధాన అర్చకుడు, బ్రాహ్మణుల నాయకుడైన వ్యక్తి ఈ అప్పును ఇవ్వడం జరిగేది." కౌట్రె మరో చోట ఇలా అన్నాడు : "నిర్మాణం (తిరుమల ఆలయం) లోపల నేనొక లోహపు ప్రతిమను చూశాను (తక్కువ వెలుతురులో శిల్పం అతనికి లోహపు ప్రతిమగా అనిపించినట్లుంది). దానికి రెండు కండ్లు ఉన్నాయి. అవి వెండితో చేయబడి ఉన్నాయి. వాటి లోపల గ్లాసు వంటివి ఉన్నాయి. అవి అద్దం వలె మెరుస్తున్నాయి. ఆ ప్రతిమ విలువైన ఆభరణాలతో అలంకరించబడి ఉంది. వాటిలో డైమండ్‌లు, రూబీలు ఉన్న వడ్డాణాన్ని చూశాను. దాని మధ్యలో ఒక విలువైన డైమండ్ ఉండడం చూశాను. అక్కడి బ్రాహ్మణుల లెక్క ప్రకారం అది (నాటి దక్షిణ భారత కరెన్సీలో) ఇరవై వేల  పగోడాల (నాటి డబ్బు) విలువ ఉండేది; అదే, మా దేశ కరెన్సీలో దాదాపు రెండు వందలా నలభైవేల డకెట్‌ల విలువ ఉండేది. ఈ ప్రతిమే గాక, నేను ఇతర ప్రతిమల్ని (ఆలయాల్ని) కూడా ఈ నగరంలో చూశాను. శిల్ప ఆరాధకులైన నాటి స్వదేశీ రాజులు సమర్పించు కానుకల్ని చూశాను. వారి దానాల్ని చూశాను. నా యాత్ర నిజంగా ధన్యమైంది. వీరు పెద్ద జనంతో వచ్చేవారు. నేను రోడ్డుపై ప్రయాణిస్తూ వందల వేల కొద్ది యాత్రికులు గుంపులుగా రావడం చూశాను. ప్రతి కుటుంబం ఒక చిన్న ప్రతిమను తేవడం చూశాను. అవి, వారి వారి ఆర్థిక స్థితికి తగ్గట్టు వెండితో గాని, బంగారంతో గాని, ఇత్తడితో గాని చేసినవిగా ఉండేవి. పలురకాల తప్పెట్లతో, పతాకంతో (వైష్ణవం), కొందరు గుర్రాలపై, కొందరు నడకన, కొందరు ఎద్దులపైన వస్తుండడం చూశాను. ఎద్దుల కొమ్ములకు ఇత్తడి కప్పులు ఉండేవి, వాటి మెడలపై అలంకార పట్టెలు ఉండేవి. ఇవి దక్కన్ రాజ్యం నుండి వచ్చేవి. వీరు రావడాన్ని దూరం నుండి చూస్తే పెద్ద సైన్యం వస్తున్నట్లు నాకు అనిపించింది. నిత్యం జరిగే ఆటవిక ఉత్సవాల్ని, రాత్రిళ్ళు జరిగే టపాసుల కాల్చుడాలను చూడడానికే రెండు రోజులు తిరుపతి (తిరుమల)లో విడిది చేశాను. దైవ ప్రతిమ ఎదురుగా నిరంతరాయంగా పెద్ద సంఖ్యలో నాట్యగత్తెలు (దేవదాసీలు) నృత్యం చేస్తుండేవారు. వీరు రవ్వంత కూడా నీతి తప్పేవారు కాదు. ఇదంతా వైభవాన్ని ప్రదర్శించడమే లక్ష్యంగా ఉండేది. తిరుపతి సంపన్న నగరం కావడానికి ఈ ఆలయమే

కారణం. ఇచటి ప్రజలు సంపన్నులవడానికి ఇచట జరిగే వ్యాపారం, ముఖ్యంగా పెరల్స్ వంటి విలువైన రాళ్ళ (ప్రీషియస్ స్టోన్స్) వ్యాపారమే కారణం. నేను ఎవరి సహాయం లేకుండా ఒంటరిగా ఇక్కడ తిరిగినా నాకు దొంగల నుండి గాని, దారి దోపిడీగాళ్ళ నుండి గాని ఎటువంటి చిన్న హాని కూడా జరుగలేదు" అని వ్రాశాడు.

ఇక, డచ్ ఈస్టిండియా కంపెనీలో ఉద్యోగిగా క్రీ.శ. 1630లలో, 1640లలో నేటి నెల్లూరు జిల్లాలోని పులికాట్టులో నివసించినవాడు, ఆ తరువాత డచ్ ప్రొటెస్టాంట్ మినిస్టరైన అబ్రహాం, రొగేరియన్ (క్రీ.శ. 1649లో చనిపోయాడు) అనువాడు డచ్ భాషలో రచించిన డీ ఓపెన్-డ్యూరె టాట్ హెట్ హేడెన్‌డమ్ (ది ఓపన్ డోర్ టు ది కన్సీల్డ్ హీథెన్‌డమ్) అను గ్రంథంలో (రెండవ భాగంలోని పదవ అధ్యాయం) తిరుమల- తిరుపతి గురించి అనేక విషయాల్ని తెలియజేశాడు. ఈ వివరాల్ని చాలవరకు డచ్ కంపెనీలో లేఖకుడుగా (స్క్రైబ్) పనిచేస్తుండిన పద్మనాభ అను స్మార్థ బ్రాహ్మణుని నుండి ఇతడు సేకరించాడు. అబ్రహాం ఇలా వ్రాశాడు: "పాలియకట్టు (పులికాట్టు) నుండి కొద్దిరోజులు ప్రయాణిస్తే ప్రసిద్ధిగాంచిన తిరుపతి పగోడా (ఆలయం) వస్తుంది. ఇక్కడ ఏడాదికి మూడు ఉత్సవాలు జరుగుతాయి... ఈ ఆలయానికి ఏడాదికి అరవై, డెబ్బయ్, ఎనభై వేల పగోడాల (డబ్బు) ఆదాయం వస్తుంది... ఈ ఆలయం అత్యంత శక్తివంతమైనది. సంపద గలది. బ్రాహ్మణుడు పద్మనాభ ప్రకారం తిరుపతి పగోడా (ఆలయం) ఇప్పటికన్నా పూర్వం చాలా ఆదాయం ఉండేది. ఇదివరకటి రాజుల కానుకలతో ఆలయ సంపద పెరుగుచుండేది. కాని ఇప్పటి రాజులు కానుకలు సమర్పించడం లేదు. ఇదివరకటి రాజులు ఆలయానికి సమర్పించిన కానుకలు, ఆభరణాల్ని దాని అధీనంలోనే ఉండనిచ్చేవారు; ఆలయ అభివృద్ధికి తప్ప ఇతరమైన వాటికి ఖజానా నుండి ఎంతమాత్రం తీసుకొనే వారు కాదు. ఇప్పటి రాజులు ఆ విధానం అనుసరించడం లేదు. వెంకటపతి రాయలు తనకు డబ్బు చాలా అవసరంగా ఉందని, చెప్పి పగోడా (తిరుమల ఆలయం) ఖజానా నుండి డబ్బు తీసుకొన్నాడు. తాను ఆలయానికి నష్టం కలిగిస్తున్నట్లుగాని, దోచుకుంటున్నట్లుగాని అనుకోకుండా ఉండడానికై ఆలయం నుండి తీసుకొన్న డబ్బుకు ప్రామిసరీ నోటు వ్రాసి ఇచ్చాడు. తన రాజ్య ఆర్థిక పరిస్థితి మెరుగైనప్పుడు అప్పు తీరుస్తానని చెప్పాడు. ఈతని తరువాత రామదేవ రాజయ్యాడు. ఇతనికి డబ్బు ఆశ, విలువైన వస్తువులంటే ఇష్టం. ఇతడు వెంకటపతిరాయల అడుగుజాడల్లో నడవాలనుకోవడమే గాక, (అనగా ఆలయం నుండి డబ్బు తీసుకోవడం) వ్యక్తిగతంగా ధనవంతుడు కావడంకై ఆలయానికి చెందిన విలువైన నగల్ని తీసుకోదలచాడు. అందులోనూ వెంకటేశుని శిరస్సుపైగల రూబీలు డైమండ్లు పొదగబడి ఉన్న విలువైన కిరీటాన్ని తీసుకోదలచాడు. ఐతే, ఈ సలహా ఇచ్చినవాడు అలిపిరి వద్ద చచ్చాడు. ఆ తరువాత కొంత కాలానికి రాజూ చచ్చాడు; శిక్ష అనుభవించాడు అని పద్మనాభ చెప్పాడు.

ఇదంతా పెదవేంకట (క్రీ.శ. 1629-అక్టోబర్ 1642) పాలనా కాలంలో వ్రాయబడింది. క్రీ.శ. 1630ల తొలినాళ్ళలో పెదవేంకటతో రాజ్యాధికారానికై పోటీపడిన తిమ్మరాయలతో,తమిళ ప్రాంత నాయక్‌లతో సాగిన యుద్ధాల కారణంగా, బిజాపూర్ గోల్కొండ సుల్తానుల సైన్యాలు దక్షిణంగా పయనించి, చంద్రగిరి రాజ్యంలో ప్రవేశించడం వలన (క్రీ.శ. 1630ల చివరి నాళ్ళలో) చంద్రగిరి రాజ్యం పతనం కావడం క్రీ.శ. 1630లలో, 1640లలో జరిగింది. ఈ పతనం క్రీ.శ. 1630లలో బిజాపూర్ సైన్యం ఉత్తర కర్ణాటకలో ప్రవేశించడంతో ఆరంభమై క్రీ.శ. 1642 నాటికి పెరిగింది. దీనితో పెద వేంకట, ఆతని సామంతులు వెలుగోటి తిమ్మనాయక (వెంకటగిరి), దామెర్ల వెంకట నాయక (కాళహస్తి)లు ఏప్రిల్ 1642లో దండలూరులో గోల్కొండ పాలకుల 4000 గుర్రపు దళం, 40,000 కాల్బలంతో వచ్చిన మీర్ మహమ్మద్ సయిద్ అర్దిస్తాని చేతిలో ఓడిపోయాడు. ఇది జరిగిన కొద్ది కాలానికే అక్టోబర్ 1642లో పెద వేంకట చనిపోయాడు.

ఆ తరువాత, ఇతని సోదరుని కుమారుడు శ్రీరంగ రాయలు (క్రీ.శ. 1642-1665/1681) రాజయ్యాడు. ఇతడు యుద్ధాన్ని, దౌత్యాన్ని రెండు దశాబ్దాలు అనుసరిస్తూ చంద్రగిరిని, రాయవెల్లూరును తన కార్యకలాపాల కేంద్రాలుగా పాలించాడు. ఐతే, ఏప్రిల్ 1646 నాటికి చంద్రగిరి, తిరుపతిలు గోల్కొండ సుల్తాను వశమై, సుల్తాను ప్రతినిధి మహమ్మద్ సయిద్ చేతికి చేరింది. కాని, బిజాపూర్ గోల్కొండ సుల్తానుల సైన్యాల మధ్యగల విభేదాలు, ఈ సుల్తానులకు, ఉత్తరాన ఉన్న మొగలులకు మధ్యగల

విభేదాలు, క్రీ.శ. 1656 తొలినాళ్ళలో ఔరంగజేబు వైపు మీర్ మహమ్మద్ సయిద్ మారిపోవడం వంటి సంఘటనలు నాటి విజయనగర పాలకుడైన శ్రీరంగరాయలు నిలదొక్కు కొనేట్లు చేశాయి; అక్టోబరు 1656 నాటికి మహమ్మద్ సయిద్ ప్రతినిధిగా ఈ ప్రాంతంలో ఉండిన సెంజి (జింజి) నాయక కుటుంబానికి చెందిన తుపాకి కృష్ణప్పనాయకుని ఎదుర్కొని శ్రీరంగరాయలు చంద్రగిరి ప్రాంతాన్ని తిరిగి తన స్వాధీనం చేసుకొన్నాడు.

క్రీ.శ.1650ల మధ్యకాలం నుండి నాటి మొగల్ యువరాజు ఔరంగజేబు ఆలోచనలో శ్రీరంగరాయలు కీలక పాత్రదారుడైనాడు. ఇది ఔరంగజేబు లేఖలు ఆజ్ఞలు, మొఘల్ రాయబారులైన మహమ్మద్ ముమిన్, ఖ్వాజా అరబ్ వంటి వారి లేఖలను బట్టి తెలుస్తోంది. తన రాజ్యంపై బిజాపూర్, గోల్కొండ సుల్తానుల ముట్టడిని ఆపడంకై సహాయపడేట్లయితే తాను ఇస్లాం మతాన్ని స్వీకరిస్తానని రాయబారం చేయడంకై శ్రీనివాస అను బ్రాహ్మణుని, ఔరంగజేబు, షాజహానుల వద్దకు శ్రీరంగరాయలు పంపినట్లు తెలుస్తోంది. ఆ తరువాత, ఔరంగజేబు వద్దకు  వెళ్ళిన మరొక రాయబారి యాభైలక్షల హొన్నుల కప్పం, రెండు వందల ఏనుగులు, పెద్ద మోతాదులో నగలు, మొఘలులకు గోల్కొండ, బిజాపూర్‌లు కప్పంగా చెల్లించడానికి సిద్ధపడే మొత్తానికి రెండింతల, సాంవత్సరిక కప్పం కట్టడానికి శ్రీరంగరాయలు సిద్ధంగా ఉన్నాడని చెప్పినట్లు కూడా తెలుస్తోంది. అనగా తన పదవి కాపాడుకోవడంకై తిరుమల వేంకటేశుని సంపదను, ప్రతిష్టను కూడ మొఘల్ పాలకుల పాదాల వద్ద పెట్టడంకై శ్రీరంగరాయలు సిద్ధపడ్డాడు.

ఇంతేకాదు, తిరుమల–తిరుపతి ఖ్యాతి దక్కన్ సుబేదార్లు, ఢిల్లీ దర్బార్‌ల వరకు కూడా చేరింది. మహమ్మద్ సయిద్ కుమారుడు మీర్ మహమ్మద్ అమీన్ ఢిల్లీ వెళ్ళి షాజహాన్‌కు బహుమతులు అందజేయడం కూడా జరిగింది. ఈ బహుమతుల్లో స్పష్టంగా ఉన్న రెండు పెద్ద ఎమరాల్డ్‌లే గాక ఇతర విలువైన రాళ్ళు పొదగబడిన బంగారు  పెట్టె ఒకటి. ఈ ఎమరాల్డ్, ఒకప్పుడు తిరుమల వేంకటేశునికి చెందినది. దీని పైపడు వెలుతురు ఆకుపచ్చ రంగులో ప్రక్కనున్న వారిపై పడేది. ఈ బహుమతుల్లో విలువైన, అందమైన డైమండ్లు, రూబీలు, సఫైర్‌లు, పెరల్స్ కూడా ఉండేవి. ఇవన్నీ తిరుమల ఆలయ ఆభరణాలు. ఈ విషయాలన్నీ క్రీ.శ. 1657 జనవరి తొలినాళ్ళలో తుపాకి కృష్ణప్ప నాయకుని సైనిక శిబిరం నుండి పులికాట్టు డచ్ గవర్నరైన లారెన్స్ పిట్ కు పేరు తెలియని వ్యక్తి పంపిన నివేదిక నుండి తెలుస్తున్నాయి. ఆ నాటి లేఖలో జనవరి 12, 1657 వ తేది గలది ఒకటి. ఇది కూడా తుపాకి కృష్ణప్ప సైనిక శిబిరం నుండి వెలువడిన లేఖల్లో ఒకటి. ఇందులో చెప్పబడింది ఏమంటే : "మొఘలుల రాయబారి, కృష్ణప్ప నాయక రాయబారి, అతని సేవకుడు కర్నాటక రాజు (విజయనగర రాజు) వద్దకు వెళ్ళి, తిరుమల వేంకటేశుని ఆలయం నుండి ఆయన దోచుకొన్న నగలన్నింటినీ తమ చేతికి ఇస్తే తాము ఆయనతో ఒక ఒప్పందానికి వస్తామన్నారు. దీనికి జవాబుగా, అధికారంలో  ఉన్నప్పుడు తాను, తన పూర్వీకులు తిరుమల ఆలయానికి సమర్పించిన కానుకలు మొదలైన వాటన్నింటినీ నవాబ్ (మహమ్మద్ సయ్యద్ అని పిలువబడు చుండిన ము-అజాంఖాన్) తనతో తీసుకెళ్ళాడు, తనవద్ద మాత్రం అవి కొద్దిగానే ఉన్నాయి. వాటిని కూడా తాను మొఘల్ చక్రవర్తికి పంపదలచు కొన్నాను" అని చెప్పాడు. అంటే శ్రీరంగరాయలు తిరుమల ఆలయ నగల్ని దోచుకొని మొఘల్ పాలకులకు చేరేట్లు చేసి తన అధికారం కాపాడు కోవడంకై ప్రయత్నించాడు. అంటే, తిరుమల ఆలయ ఆభరణాల్ని అధికారం కాపాడుకోవడంకై మొఘలులతో బేరసారాలకు శ్రీరంగరాయలు వినియోగించాడు. ఐతే, క్రీ.శ. 1657 నాటికి ఔరంగజేబు తన సోదరులతో వారసత్వ యుద్ధాల్లో మునిగిపోవడంతో ఈతని ఆశలు ఫలించలేదు. వెలుగోటి, దామెర్ల వారి సైన్యాలు ఔరంగజేబుకు సహాయపడడంకై ఉజ్జయినీ ప్రాంతానికి పంపబడినా ఫలితం కలగలేదు. క్రీ.శ. 1668 నాటికి, నెక్‌నామ్‌ఖాన్ అను బిరుదాంకితుడైన గోల్కొండ, జనరల్ రజా కులీ బేగ్ తన ప్రతినిధిని తిరుపతిలో నియమించుకొని, ఆలయ విషయాల్నీ చూసుకోసాగాడు. ఇక, క్రీ.శ. 1681 నాటికి గోల్కొండ మంత్రి అక్కన్న ఏడు రోజులు తిరుపతిలో గడిపాడు. ఆనాటికి, అతని బంధువు పొదిలి లింగప్ప పాలనలోని తరఫ్ కర్ణాటకలో భాగంగా తిరుపతి ఉండేది. మి

దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి
రిటైర్డ్ ప్రొఫెసర్, ఎస్వీయూనివర్సిటీ,
తిరుపతి. ఫోన్ : 9849584324



# తిరునామాలు - శ్రీరామానుజులు

- *యస్.ఏ.టి. రాజ్యలక్ష్మి*

**"రమ్యాణి వీక్ష్య మధురాంశ్చ నిశమ్య శబ్దాన్**
**పర్యుత్సుకో భవతి యత్సుఖి తోపి జంతుః**
**తచ్చేతసా స్మరతి నూనమ బోధ పూర్వం**
**భావ స్థిరాణి జననాంతర సౌహృదాని"**

కాళిదాసు చెప్పినట్లు రమ్యమైన వస్తువుల్ని చూసినప్పుడు అనుభూతి కలుగుతుంది. అలాగే తన్మయత్వం కల భక్తుడికి భగవంతుడి పట్ల దివ్యమైన అనుభూతి కలుగుతుంది. ఆ అనుభూతి గీతమై వెలువడితే వాటిని భక్తి గీతాలు అంటారు. తెలుగు సాహిత్యంలో తొలి భక్తి గీతాలు కృష్ణమాచార్యులు రచించిన సింహగిరి వచనములు. తర్వాత తాళ్ళపాక అన్నమాచార్యులు, పెద తిరుమలాచార్యులు, క్షేత్రయ్య, త్యాగయ్య లాంటి ఎందరో భక్తి గీతాలను రచించి, పరవశులై ఆలపించారు. ఇవన్నీ విష్ణుమహిమను ప్రతిపాదించే గీతాలే. ఈ గీతాలలో విశేష లక్షణాలతో ఒప్పే భక్తిరసపూర్ణ గీతాలు తిరునామాలు.

**తిరునామాలు - నిర్వచనం :**

శ్రీ సంప్రదాయానికి సంబంధించిన భగవద్విషయాన్ని కీర్తించే గీతాలు తిరునామాలు. తెలుగు సాహిత్యంలో కవులు విష్ణుపారమ్యాన్ని అంగీకరించారు. వీరందరూ వైష్ణవులే కానీ శ్రీ వైష్ణవులు కారు. శ్రీ భాష్యంలో ప్రతిపాదించిన విశిష్టాద్వైత సంప్రదాయాన్ని అనుసరించే వారు శ్రీ వైష్ణవులు. వీరిది శ్రీ సంప్రదాయం. ఈ సంప్రదాయం తిరునామాలలో ఉంటుంది.

'తిరు' అంటే శ్రీ ప్రదం. శ్రీ ప్రదంగా భావించే కొన్ని శబ్దాలకు 'తిరు' శబ్దాన్ని జోడించడం శ్రీ వైష్ణవ సంప్రదాయం. శుభప్రదమూ శ్రీప్రదమూ అయిన నామాలు అని. ఇక 'నామ' శబ్ద వాచ్యుడు పరమాత్మే సకలేతర విలక్షణుడు అని పరమాత్మను శ్రీరామానుజులు శరణాగతి గద్యలో సంబోధించారు. 'నామం' అంటే పేరు, పుండ్రం అనేవి సాధారణార్థాలు. భగవన్నామ సంకీర్తనం ఉండటంతో పాటుగా, శ్రీ సంప్రదాయముద్ర ఈ తిరునామాలలో ఉండటం వల్ల తిరునామం అనే పేరు సార్థకమయ్యిందని చెప్పవచ్చు. అలాగే, 'నామ' శబ్దానికి ప్రాకాశ్యం అని అర్థం. అంటే తెలుప తగినది అని. సర్వజన సంక్షేమాన్ని కోరే తత్త్వం ఈ నామాలలో ఉండటం వల్ల అందరికీ అందించ తగినది అనేది విశేషార్థం.

ప్రాచీన కాలంలో కీర్తనలను దివ్వనామాలు అనేవారు. దివ్యనామాలు విస్తృతంగా అన్ని సిద్ధాంతాలనూ సూచిస్తూ ఉండటం వల్ల - ప్రత్యేకించి పరిమితార్థంలో విశేషంగా వాడేందుకు 'దివ్య' బదులు 'తిరు' శబ్దాన్ని వాడి ఉండవచ్చు.

ద్రావిడ ప్రబంధ పఠనం (వాణీ) తిరునామ పఠనంతో ముగుస్తుంది. దీనినే మంగళాశాసనం అంటారు.

**ఉదాహరణకు :**

**"పార్ పుగట్టి కమలై వాణీ పరంధామన్ పదంగల్ వాణీ**
**శీర్‌తిగణి పూదూర్ పన్దతిర వెతిరాశన్ వాణీ**
**ఆరియ రెవరుం వాణీ యాణ్‌వార్ పన్నీరువర్ వాణీ**
**వారి శూదులగ ముయ్య వైష్ణవక్కుణాంగళ్ వాణీ"**

ఈ వాణీ తిరునామముల నుండి తిరునామాలు ఉద్భవించి ఉండవచ్చు.

**లక్షణాలు :**

1. గానయోగ్యమైనవి.
2. శ్రీ సంప్రదాయ ప్రతిపాదకాలు
3. తాళ లయాన్వితమైన గేయాలు

4. శ్రీ వైష్ణవ సంప్రదాయ విషయ ప్రతిపాదన ముద్ర వీటిలో ఉంటుంది.
5. పదములు, సంకీర్తనలకన్నా విలక్షణమైన నిర్మాణం వీటిది.
6. తత్త్వత్రయ ప్రతిపాదకమైన సిద్ధాంతానికి బద్ధమై ఉండే రచనలు.
7. శరణాగతినే మోక్షసాధనంగా ప్రతిపాదిస్తాయి.
8. ఈ శరణాగతి ఆచార్యుని ద్వారా ఒనగూరటం పరమ ప్రశస్తమైనది. అందుకే ఆచార్య వైభవాన్ని అతివేలంగా కీర్తించడం మరో లక్షణం.
9. పురుషకార స్వరూప అయిన శ్రీదేవితో కూడిన నారాయణుని స్తుతించడం.
10. ద్రావిడ ప్రబంధాలలో ఉండే భగవద్రూప వర్ణనం, గుణ వర్ణనం, లీలా విభూతి వర్ణనం, అవతార వైభవ కీర్తనం మొదలైనవి తిరునామాలలో కూడా ఉండే లక్షణం.
11. శ్రీ రామానుజ స్తుతి విశేషంగా కలిగి ఉండటం.
12. దేవతాంతర, మంత్రాంతర, సాధనాంతరముల పరిత్యాగాన్ని ప్రతిపాదించడం.

**ప్రాచీనత :**

నాలాయిర దివ్య ప్రబంధం కూడా ఒక విధంగా తిరునామాల ప్రక్రియ కిందకే చేరుతుంది. పైన చెప్పిన లక్షణాలన్నీ వీటికీ ఉన్నాయి కాబట్టి 'శఠకోపులు' రాసిన (నమ్మాళ్వార్) ఋగ్వేద సారమైన *తిరువిరుత్తమ్*లో 64 వ పాశురంలో 'తిరునామచ్చొల్ కర్త్రనమే' - అని తిరునామ శబ్ద ప్రయోగం ఉంది.

**"ఇరుక్కు ఆర్ మొనీయాల్। నెఱి యిణ్ణుక్కామై। ఉలకళన్ద**
**తిరుత్తాళినై। నిలత్తేవర్ వణఙ్గువర్। యాముమ్ అవా**
**ఒరుక్కా వినైయొడుమ్ ఎమ్మొడుమ్ నొన్ద కనియిన్మైయిన్**
**కరుక్కాయ్ కడిప్పవర్ పోల్। తిరునామ చ్చొల్। కర్త్రనమే"**

భగవంతుడిని ఉద్దేశించినవో, ఆచార్యులను ఉద్దేశించినవో అయిన తిరునామాలన్నీ తెలుగులో మంగళ హారతి పాటలే. తెలుగులో క్రీ.శ. 1650 ప్రాంతానికే తిరునామాలు ప్రసిద్ధిగాంచినట్లుగా కూచిమంచి తిమ్మకవి - పార్వతీశ్వర శతకంలో దీని ప్రస్తావన ఉంది. దీనిలో సామాన్య రైతులకు లోకువైన పండితుల పాట్లను, వారు ఈసడించుకున్న విధానాన్ని వర్ణించారు.

**"పో పో బాపడ దోసెడూదలిడినం బోలేక పేరాసలన్**
**వా పో జాగితివేమి నీ సదువు తిర్నామంబులో సుద్దులో**
**భూపాళంబు లొలంక సత్తెలొ బలా బొల్యావు పోట్లాటలో**
**కా పాటింపనటంద్రు బాలిశులు భర్గా పార్వతీవల్లభా"**

**తిరునామాల కర్తలు - సంకలన కర్తలు :**

ప్రాచీన కాలానికి చెందిన తిరునామాలలో కొన్ని అజ్ఞాత కర్తృత్వాలు ఉన్నాయి. ఆధునిక కాలంలో కొందరి పేర్లు తెలుస్తున్నాయి.

మరింగంటి లక్ష్మణ దేశికులు-అష్టోత్తర శతనామముల రీతిలో 108 తిరునామాలు రాశారు. శ్రీ భగవత్ ఆచార్యుల పరంగా 32 తిరునామాలు రచించారు. అలాగే నల్లాన్ చక్రవర్తుల సింగర దేశికులు, తిరువడందం పోరెత్తి అప్పలాచార్యులు మొదలైన వారు తిరునామాల రచన, వ్యాప్తికి కృషి చేశారు. బొప్పన రఘురామదాసు *తిరునామములు* అనే సంకలన గ్రంథం; కిడాంబి నరసింహాచార్య *తిరునామములు* సంకలన గ్రంథం, వీరిదే *తిరునామములు* సమగ్ర పరిశీలనము అనే గ్రంథాలు తిరునామముల గురించితెలుసుకోవడానికి ఉపకరిస్తున్నాయి.

తిరునామములకున్న లక్షణాలలో ఆచార్య వైభవాన్ని అతివేలంగా వర్ణించడం ఒకటి. అందులో విశిష్టాద్వైతాన్ని సువ్యవస్థితం చేసిన భగవద్రామానుజులను ప్రత్యేకంగా కీర్తించడం తిరునామాలనే ప్రక్రియలో ఉండే ప్రత్యేకమైన లక్షణం.

శ్రీవైష్ణవం రామానుజమతం అనేంతగా రామానుజులు ప్రభావం చూపారు. తిరునామాలు శ్రీవైష్ణవ వ్యాప్తికి సాధనంగా ఉపయోగించడం వల్ల, రామానుజులను కీర్తిస్తూ చాలా తిరునామాలు వచ్చాయి. వీటిద్వారా రామానుజ తత్త్వాన్ని తెలుసుకోవచ్చు.

రామానుజులపై రచింపబడిన తిరునామాలను ఈ విధంగా విభజించవచ్చు.

1. వేద పురాణాంతర్గత రామానుజ విషయ ప్రతిపాదకాలు
2. చారిత్రక సంఘటనలను వర్ణించేవి
3. రామానుజుల జీవిత చరిత్రను వివరించేవి
4. రామానుజుల లీలావర్ణనం చేసేవి
5. రామానుజుల స్వరూప వర్ణనం చేసేవి
6. రామానుజులు ప్రచారం చేసిన విశిష్టాద్వైత తత్త్వాన్ని తెలిపేవి.

7. రామానుజులను స్తుతించేవి.

**1. వేద పురాణాంతర్గత రామానుజ విషయ ప్రతిపాదికాలు:**

రామానుజుల గురించి బ్రహ్మాండ పురాణంలో –

**"మన్నియోగాత్ భూత పుర్యాం అహీనామీశ్వరః**
**కలౌ శ్రీరామానుజ రూపేణ జనిష్యతి"** –

అని ఉంది.

భార్గవ పురాణంలో –

**అనంతః ప్రథమో దేవః ద్వితీయో లక్ష్మణస్తథా!**
**తృతీయో బలభద్రస్తు కలౌ కశ్చిద్భవిష్యతి ॥**

– మొదలైన విషయాలు ఉన్నాయి. వీటినే తిరునామాలలో – పరవాసు దేవునితో పంతగించి ధరణిలోపల వేంచేసిన *(81)* అనీ –

**"మొదటి యుగము ననంతుడై ముద మొదవగా పెంపొదవగా**
**సదయ రెండో యుగము లక్ష్మణ స్వామిగా బహు ప్రేమగా**
**వదలకను ద్వాపరమున బలభద్రుడై పెంపారగా**
**తుదను కలియుగమందు శ్రీ రామానుజాయని పేరుగా"**– (66)

అని చెప్పబడింది.

**2. చారిత్రక సంఘటనలను వర్ణించేవి :**

రామానుజుల కాలంనాటి చారిత్రక వ్యక్తులు, సంఘటనలు తిరునామాలలో కన్పిస్తాయి. రామానుజులు యాదవ ప్రకాశులనే గురువు వద్ద శాస్త్రం చదువుకొనే వారు. ఆ సమయంలో ఆ కాలంలో పరిపాలన చేస్తున్న చోళరాజు పుత్రికను బ్రహ్మరాక్షసి బాధిస్తూ ఉంటే, దానిని యాదవ ప్రకాశులు మాన్పించలేకపోయారు. అప్పుడు శ్రీ రామానుజులు శ్రీపాదతీర్థ స్పర్శతో రాక్షస పీడను పోగొట్టారు. దీనినే *తిరునామాలలో...*

**'మీరు రాజు బిడ్డను రక్షించ భామ యే భాగ్యము జేసెనొ'**

– *(72)* అని,

**'బ్రహ్మ రాక్షసిని హతము జేసితిరి'**

– *(73)* అని పేర్కొన్నారు.

**3. రామానుజుల జీవిత చరిత్రను వివరించేవి :**

రామానుజుల జీవిత చరిత్రను తిరునామాల ఆధారంగా తెలుసుకోవచ్చు. శ్రీవైష్ణవ మత ప్రచారంలో భాగంగా ఉడయవర్లు, ఎంబెరుమానార్ మొదలైన పేర్లతో ఖ్యాతి వహించిన శ్రీరామానుజుల జీవితం మొత్తం సామాన్య జనులకు అర్థమయ్యే రీతిలో అందించడం తిరునామాల లక్ష్యం.

**శేషుడు "మించి అనిత్య విభూతి నుంచి ఆసూరి కేశవ తనూజుడు"** గా *(70)* అవతరించెను.

**వీరిని "సుతునిగా గన్నట్టి కాంతిమతి యేమి వ్రతము జేసెనో"** *(72),* **"యాదవు వద్ద శాస్త్రము చదువుకొన"** – ఇంకా

కంచి వరదరాజస్వామి పేరిందేవితో కలిసి కిరాత దంపతుల రూపంలో కన్పించడం మొదలైన జీవిత విశేషాలన్నీ తిరునామాలలో గమనించవచ్చు.

**4. రామానుజుల లీలా వర్ణనం చేసేవి :**

శ్రీ రామానుజుల లీలలు అనితరసాధ్యమైనవి. ముఖ్యంగా ఇవి జన సామాన్యం మధ్యలో జరుగుతాయి. ఆ నోటా ఈ నోటా విన్నవీ, కన్నవీ గ్రంథస్థం కావడానికి అవకాశం ఉంటుంది. రామానుజ చరిత్రపై ఎన్ని కావ్యాలు వచ్చినా జనులు చెప్పుకోవడానికీ కీర్తించడానికీ వీలుగా ఉండేవి కీర్తనలే. అందుకే వీటికి అత్యంత ప్రాముఖ్యత ఉంటుంది. రామానుజుల లీలల్ని తెలుసుకోవడానికి తిరునామాలు మంచి ఉపకరణాలు. ఇవి చాలా ఉన్నాయి. వీటిలో ఒకటి రెండు తెలుసుకుందాం.

ఒకసారి రామానుజులు సింహాచల క్షేత్రం దర్శించారు. అక్కడ కృష్ణమాచార్యులనే సంగీత విద్వాంసుడున్నాడు. అతడు చాల గర్విష్ఠి. రామానుజులు అతడి గర్వం పోగొట్టాలని భావించి – కృష్ణమాచార్యులతో– సింహాచలనాథుడు మీకు ప్రత్యక్షమౌతాడు కదా! రామానుజ యతికి పరమపదం లభిస్తుందా లేదా అని నరసింహస్వామిని అడిగి రమ్మన్నారు. అతడలా వెళ్ళి అడిగితే – స్వామి "నేను ఇదివరకే విభూతి ద్వయాన్ని రామానుజులకిచ్చాను. చేతనుల కెవ్వరికైనా అతడు అనుగ్రహించకపోతే పరమపదం లేదు. నీకూ పరమపదం ఇవ్వగలవాడు రామానుజులే"– అన్నారట.

**"ఎలమితో ఉభయ విభూతులు మీరివ్వక లేవనుచు"**– *(193)* పల్కిన నారసింహులే మీ మహిమ తెలియగలవారు ఓ రామానుజా!'' అనే తిరునామం ఈ విషయాన్ని తెలియజేస్తోంది.

మరొకటి – ఆ తర్వాత రామానుజులు తిరుమల క్షేత్రాన్ని దర్శించారు. అప్పటికే తిరుమల వేంకటేశ్వర స్వామి తన శంఖ చక్రాలను తొండమాన్ చక్రవర్తికి అర్పించాడు. వక్షఃస్థలంలో లక్ష్మి లేదు. అందువల్ల శైవులు ఆ స్వామిని శివుడనుకుంటున్నారు. శైవ, వైష్ణవుల మధ్య వాదనలకు ఇది కారణమయ్యింది. రామానుజులు దీన్ని నివారించాలని

అనుకొన్నారట. శైవులతో ఇలా అన్నారు. త్రిశూల ఢమరుకాలను మీరూ, శంఖ చక్రాలను మేము ఆలయంలో ఉంచి, కోవెల తలుపులు మూసేద్దాం. స్వామి వేటిని స్వీకరిస్తే దానిని మనమూ స్వీకరిద్దాం – అని. తెల్లవారేసరికి వేంకటేశ్వరుడు శంఖ చక్రాలను ధరించాడు. అందువల్ల అక్కడ దైవం విష్ణువయ్యాడు. ఈ అనుమానం మళ్ళీ తలెత్తకుండా ఉండటానికి రామానుజులు వేంకటేశ్వరుడి వక్షఃస్థలంలో లక్ష్మీదేవిని ప్రతిష్ఠించారట.

"ఫణిగిరి నాథుని చెట్ట చక్రము చేర్చిన ధీరా! రామానుజా! వందనములు మీకు" – *(175)* – ఇటువంటి వెన్నో *తిరునామాలలో* కన్పిస్తాయి.

**5. రామానుజుల స్వరూప వర్ణనం చేసేవి :**

రామానుజుల స్వరూపాన్ని, గుణగణాల్ని వర్ణించే తిరునామాలెన్నో ఉన్నాయి.

**రాజా – శ్రీ భూతపురీ యతి**
**రాజా – నిజ ఆశ్రిత జన సుర**
**భూజా! సన్మానిత పాదాం భోజా!**
**వర నిర్మల సమధిక**
**తేజా – ఆ సూరి కేశవ త**
**నూజా– ఘన సజ్జన హృత హృ**
**త్పూజా – శుభదాయక సద్గుణ**
**భాజా – పరంభజన హృతకృ**
**త్తేజా – రామానుజ రామానుజ రామానుజా !**

**అంటీ నీ అవతారము గను**
**గొంటీ – నీ గుణములు చాల**
**వింటీ – మీ తిరువడిఘళ్ నే**
**గంటీ – మరి యితరము లెరుగ**
**కుంటీ – కృప శాయను మరి మీ**
**వంటి – బలవంతులు భువి లే**
**రంటి – నీకు దయనీయుడనను**
**కొంటి – నీ కృపకాశించి యుంటి**
**రామానుజ!**

– ఇలా శబ్దాలంకార శోభితంగా శరణాగతిని చెప్తూ రామానుజ స్వరూప గుణ వర్ణన తిరునామాలలో కనిపిస్తుంది.

**6. రామానుజులు ప్రచారం చేసిన విశిష్టాద్వైత తత్త్వాన్ని తెలిపేవి :**

తిరునామాల ఆవిర్భావమే రామానుజులు దివ్య ఉపదేశాన్ని ప్రకటించేందుకూ వ్యాపింప జేసేందుకూ ఉద్దేశించినది.

యామునులు ప్రాణోత్క్రమణానికి పూర్వమే మూడు వేళ్ళు ముడిచి పరమపదించారు. దానికి మూడు ప్రతిజ్ఞలు చేశారు రామానుజులు.

1. వైష్ణవ మతోద్ధరణ, అందరికీ పరమపద ప్రాప్తి
2. విశిష్టాద్వైత పరంగా శ్రీ భాష్య రచన
3. పరాశరుల పేరు వేరొకరికి పెట్టడం

ఈ మూడు ప్రతిజ్ఞల ద్వారా యామునుల ఆశయాన్ని నెరవేర్చాలనే రామానుజుల సంకల్పం వ్యక్తమవుతుంది.

దీనిని తిరునామం –

"మూడంగుళులు వింతగా విడిపించిరి" – అని చెప్తోంది. *(73)*

ఈ ప్రతిజ్ఞలు ఆచార్య సూక్తి ముక్తావళి, ప్రసన్నామృతాలలోనూ ఉన్నాయి.

తిరుక్కచ్చినంబి ద్వారా రామానుజుల వారు కంచి వరదరాజ స్వామిని ఆరు ప్రశ్నలు అడిగించారు. ఆ ప్రశ్నలకు స్వామి ఇచ్చిన సమాధానాలను ఆధారంగా చేసుకొని రామానుజులు చేసిన విశిష్టాద్వైత తత్త్వ ప్రచార విశేషాలను తిరునామాలు వివరిస్తున్నాయి.

**"సామజాచలాధి వాస సంజ్ఞాపిత ఆగమార్థులైరి"** – *(161)*
**"తిరుక్కచ్చినంబితో ఆరువార్తలు ముచ్చటలాడిరి"** – *(177)*

ఆ ఆరువార్తలకు సమాధానాలు ఇవి –

**"అహమేవ పరంబ్రహ్మ జగత్కారణ కారణం**
**క్షేత్రజ్ఞేశ్వర యోర్భేదః సిద్ధ ఏవ మహామతే**
**మోక్షోపాయోన్యాస ఏవ జనానాం ముక్తి మిచ్ఛతాం**
**మద్భక్తానాం జనానాంచ నాంతిమ స్మృతిరిష్యతే**
**దేహావసానే భక్తానాం దదామి పరమం పదం**
**పూర్ణాచార్యం మహాత్మానం సమాశ్రయ గుణాశ్రయమ్"–**

1. విష్ణువే జగత్తుకు కారణం
2. జీవేశ్వరులకు భేదం ఉంది.
3. ముక్తికి మార్గం ప్రపత్తి
4. అంతిమ స్మృతి లేకపోయినా భక్తుడికి మోక్షప్రాప్తికి బాధలేదు

5. దేహావసానంలో నా భక్తులకు ముక్తి ఇస్తాను

6. మహాపూర్ణులను ఆచార్యులుగా పరిగ్రహించు –

ఇవీ – వరదరాజస్వామి చెప్పినవి. రామానుజులు ఈ దిశగా కర్తవ్యాన్ని నిర్వర్తించారు. జన బాహుళ్యంలో వ్యాప్తి పొందించాలని రామానుజులు భావించిన శ్రీ సంప్రదాయాన్ని తిరునామాలు ప్రవచిస్తున్నాయి.

ఒక భాగవతుడు తన గురువర్యులు అయిన న.చ.శింగర గురువర్యులు తనకు పంచసంస్కార దీక్షని ప్రసాదించి, ఏ విధంగా తనను ఉజ్జీవింప చేశారో ఈ తిరునామం ద్వారా తెలుపుతున్నాడు.

**కలకంఠి! నేనొక్క కలగంటినమ్మా –**
**కలలో నే నాచార్యులను గంటినమ్మా –**
**పలుకుల నమృతము నొలుక నను బిలిచి**
**తలపు లోపలి చింత తొలగించ గంటి**
**ఇరు భుజముల ముద్రలిడగా కలగంటి**
**తిరుమణి తిరుచూర్ణం దిద్ద కలగంటి**
**తిరుమంత్ర వైభవ మెరిగించ గంటి**
**చరమ శ్లోకార్థము సాయించ గంటి**

ఇలా సలక్షణంగా శబ్ద సౌందర్యంతో ఒప్పే తిరునామమిది. ఇందులో పంచ సంస్కార స్వరూపం ఉంది. "తాపః పుండ్రః తథా నామ మన్త్రః యాగశ్చ పంచమః"– అని. ఈ విధంగా శ్రీవైష్ణవత్వ సిద్ధికి పంచసంస్కార దీక్ష అత్యంతావశ్యకమని ఈ తిరునామం ఉద్భోదిస్తోంది.

**7. రామానుజులను స్తుతించేవి :**

రామానుజుడే రక్షకుడు. పరమపదాన్ని అనుగ్రహించే ఆచార్యుడు. భక్తులకు దిక్కు. అందుకే ఎన్నో సంస్తుతులు తిరునామాలలో వెల్లివిరిశాయి.

**"శ్రీ రామానుజ కామధేను విచ్చటికి వేంచేసింది సేవించరే" –**
**"యతిరాజా యతి రాజా నతజన కల్ప భూజా! యతిరాజా!"**
**"లేదు మోక్షమిక బ్రహ్మాదులకు నైనా**
**మాదైవ మెంబెరుమానారనక గాని"–**
**"రాజ మా యతిరాజ జియ్యరు రావె గురుకుల రత్నమ**
**తేజ వినుత బిడౌజ విబుధ సమాజ తారక చంద్రమా"–**

**ఉపసంహారం :**

తిరునామాలు ఎంతో విశిష్టమైన రచనలు. ఇందులో రామానుజాచార్యులను భక్తులు శరణాగతి కోరారు. విన్నపాలు విన్న వించుకున్నారు. నైజ్యానుసంధానం చేశారు. మహిమల్ని కీర్తించారు. గుణగణాల్ని కీర్తించారు. అంతేకాదు, నాటి సమాజంలోని చారిత్రక, సామాజిక విశేషాలను కూడా ఇవి తెలియజేస్తాయి.

తిరునామాలలో శైలి సులభమైనది. సామాన్య జనులకు సైతం అర్థమయ్యే రీతిలో ఉండాలనే ఆశయం దీనికి కారణం.

కాలక్షేపాలలోనూ తిరువారాధనలోనూ మంగళా శాసనాల రూపంలోనూ వీటిని వినియోగిస్తున్నారు.

గానం యోగ్యమైన విధంగా మాత్రా ఛందస్సులో ఉన్నాయి.

తేట తెనుగు పదాలతోనూ సంస్కృత సమాసాలతోనూ కూడి ఉన్నాయి.

విశిష్టాద్వైత లక్షణాలను ప్రజలకు చేరువ చేయడంలో, మతవ్యాప్తిలో కావ్యాలకన్నా, శతకాలకన్నా, స్తోత్రాలకన్నా తిరునామాలే ముందు స్థానంలో ఉన్నాయి.

ఎందరో ఆచార్యులు వీటిని రచించి వ్యాపింప చేశారు వారందరికీ వందనాలు.

**ఎమ్బెరుమానార్లు – వాణీ తిరునామము :**

**శీరారు మెదిరాశర్ తిరువడిగళ్ వాణి,**
**తిరువరైయిర్ చాత్తియ శెన్దువరాడై వాణి,**
**ఏరారుమ్ శెయ్యవడి వెప్పొఇుదుమ్ వాణి,**
**ఇలఙ్గియ మున్నూల్ వాణి ఇణైత్తోళ్గళ్ వాణి,**
**శోరాద తుయ్యశెయ్య ముగచ్చోది వాణి,**
**తూముఱువల్ వాణి తుణైమలర్ క్కణ్గల్ వాణి,**
**ఈరాఱు తిరునామమ్ అణిన్ద ఎణిల్ వాణి,**
**ఇనిదిరుప్పోడైణిల్ ఞాన ముత్తిరై వాణియే**

డాక్టరు ఎస్. ఏ.టి రాజ్యలక్ష్మి
తెలుగు అకాడమి,
హైదరాబాదు.

# శిశిర సహాన

**1956**వ సంవత్సరంలో బెంగాలులోని బంకూరా అనే ఒక కుగ్రామంలో జన్మించాడు శిశిర్ సహాన. పుట్టి పెరిగిన ఈ గ్రామం ఎంత వెనుకబడినదంటే ఎనిమిది సంవత్సరాల వయస్సు వచ్చేంతవరకు శిశిర్ సహాన బస్ అనేది చూసి ఎరుగడు. ఏమీ తెలియని ఆ వయస్సులోనే గోడలమీద సున్నాలు చుట్టేవాడు, గీతలు గీసేవాడు. కొడుకు తప్పుదారి పడుతున్నాడని తండ్రి తీవ్రంగా మందలించటమే కాకుండా చేయి చేసుకునేవాడు కూడా. శిశిర్ లోని కళా హృదయాన్ని అర్థం చేసుకున్న ఆయన ఉపాధ్యాయులొకరు శిశిర్ తండ్రిని కలిసి ఒక అభిరుచి అంతరంగంలోనికి తీవ్రంగా చొచ్చుకుపోయిన తరువాత దానిని నియంత్రించటం అసాధ్యం అని, పిల్లవాని అభిరుచిని బట్టి చదువు కొనసాగించాలని చెప్పే విఫలయత్నం చేశాడు. తండ్రితో విభేదించి గురువుల ఆర్థిక సాయంతో, ఆశీస్సులతో సహాన శాంతినికేతన్‌లోని కళాభవన్‌లో చిత్రకళనభ్యసించాడు. శాంతినికేతన్‌లో చదువుతున్నపుడు మెరిట్ స్కాలర్‌షిప్‌కు అర్హత సంపాదించడంతో ఆర్థిక పరమైన అడ్డంకులు తొలగిపోయాయి. శాంతినికేతన్ నుంచి బి.ఎఫ్.ఏ., ఎమ్.ఎఫ్.ఏ పట్టాలను పొందారు. 1993లో కామన్‌వెల్త్ స్కాలర్‌షిప్ కైవసం చేసుకుని లండన్ వెళ్ళి అక్కడ ఉన్న సెయింట్ మార్టిన్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ & డిజైన్ విభాగంలో స్టెయిన్డ్ గ్లాసుపై చిత్రకళలో అడ్వాన్సు కోర్సు చేశాడు. గ్లాసును కరిగించి రంగులద్ది శిల్పాలుగా మలచటంలో ప్రతిభను సాధించి 2000ల సంవత్సరంలో భారతదేశానికి తిరిగివచ్చాడు. ఇంగ్లండుకు వెళ్ళడానికి పూర్వమే బొంబాయి ఆర్ట్ సొసైటీవారు 1993లోను ఆయన లండన్ నుంచి తిరిగి వచ్చిన తరువాత 1995 సం॥లో హైదరాబాదు ఆర్ట్ సొసైటీ వారు ఘనంగా సన్మానించారు. 1989 నుంచి 2003 వరకు హైదరాబాదు పబ్లిక్ స్కూలులో ఆర్ట్ టీచరుగా పనిచేశాడు. 1989 –2001 సంవత్సరాల మధ్య ఆయన వేసిన చిత్రాలు, గ్లాసులో రూపుదిద్దుకున్న శిల్పాలు భారతదేశంలో అన్ని ముఖ్యపట్టణాలలోను ప్రదర్శితమై ప్రజలను ఆకర్షించాయి.







"నేను ఏదీ ఆలోచించి పని మొదలు పెట్టను. ఒక అంతరంగ స్ఫురణతో నేను వేయబోయే చిత్రంగాని, చెక్కబోయే శిల్పంగాని అస్పష్టంగా మొదలవుతాయి. కొంతసేపటికి దానంతట అదే ఒక కొత్త రూపం సంతరించుకొంటుంది. మన చిత్రాలు, శిల్పాలు యొక్క మూలాలు మన ప్రాచీన దేవాలయ ప్రాంగణంలోనే ఉన్నాయి. పశ్చిమ బెంగాలులోని అనేక దేవాలయాలలో ఎర్రటి మట్టి (టెర్రకోట) తో మలచబడ్డ అద్భుతమైన శిల్పాలున్నాయి. అవే నాకు ప్రేరణనిచ్చాయి. రాజస్థానీ మినీయేచర్ చిత్రాలంటే నాకు చాలా ఇష్టం. అయినప్పటికీ వాటిని అనుకరించకుండా నాదైన శైలిలో చిత్రాలు గీసుకుంటాను. తోట వైకుంఠం, లక్ష్మాగౌడ్ చిత్రాలు నన్ను కట్టిపడేస్తాయి. స్థానిక జీవన సౌందర్యాన్ని వారు చూపిస్తున్న తీరు అద్వితీయం" అంటూ తన మనసులోని మాటను వెళ్ళబుచ్చారు.

గ్లాసును కరిగించి శిల్పాలుగా మలచటం అత్యంత క్లిష్టమైన ప్రక్రియ. ఇది ముఖ్యంగా వెనీస్ పట్టణంలో, యూరోప్ దేశాలలో ఎక్కువ ప్రాముఖ్యత పొందింది. మన దేశంలో దీనిని తయారు చేయడానికి సరిపడే పరికరాలుగాని, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌గాని లేకపోయినా తనంత తానుగా తయారు చేసుకుని డిజైన్ చేసుకొన్న కొలిమితోనే కళాకృతులకు రూపమిస్తున్నారు. ఆయన తయారుచేసిన గ్లాసు శిల్పాల ఖరీదు ఇప్పటి మార్కెట్ దృష్ట్యా అక్షరాలా మూడు లక్షల రూపాయలు ఉంది. ప్రస్తుతం ఈయన నివాసం హైదరాబాదు. సంవత్సరానికి రెండు మూడు సార్లు బెంగాలు వెళ్ళి వస్తూ వుంటారు. "ఆ మట్టి పరిమళం నన్ను కొత్త ఆలోచనలకు పురిగొల్పుతుంది" అని పేర్కొంటాడు. హైదరాబాదు జె.ఎన్.టి.యు కాలేజీలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. తరచుగా క్రియేటివ్ గ్లాస్ సెంటర్ ఆఫ్ అమెరికా వారి ఆహ్వానంపై అక్కడకి వెళ్ళి చిత్రకళపై ఉపన్యాసాలిస్తారు. కళకు సంబంధించిన చర్చల్లో పాల్గొంటారు.





చిత్రాలు, శిల్పాలతోనే తృప్తిపడలేదు. కదలాడే చిత్రాలు (సినిమా) పై తనదైన ముద్రను వేస్తూ పృథ్వీ అన్న చిత్రాన్ని నిర్మించారు. ఇందులో ఒకప్పటి స్మితామాధవ్ (*బాలరామాయణం*లో సీత పాత్రధారి) నటించింది. ***మిసిమి***లో ప్రచురించిన ఈ చిత్రాలన్నీ రాజస్థాన్ మినీయేచర్ శైలికి సంబంధించినవే అయినా శిశిర్ సహాన తన సృజనాత్మకతతో వాటికి కొత్త అందాలను కూర్చారు. చిత్రంలో స్త్రీలలోని లావణ్యం, కొంగ్రొత్త భావుకత. గాఢమైన వర్ణసమ్మేళనం మనల్ని కట్టి పడేస్తుంది. మి

# ఆంధ్రప్రదేశ్‌లో మాలదాసరి సంప్రదాయం

*- కొంకే గౌరీశ్వరరావు*

**ఉపక్రమం :**

మనిషిని గురించి, అతని అనుభవంలోని సమస్త వస్తు విషయజాలాన్ని గురించి తెలియజేప్పేదే సంస్కృతి. 1931, 1961 సంవత్సరాల జన గణన ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణ జిల్లాలలో మాలదాసరులున్నారని, కోస్తా జిల్లాలలో మాలదాసరులు ఉన్నారని స్థూలంగా తెలుస్తుంది.

ఆయా జిల్లాల్లో ప్రత్యేకంగా జరిగిన గణన వల్ల మాలదాసరుల / మాల దాసులు ఆంధ్రదేశమంతటా ఉన్నారని ఆచార వ్యవహారాల ప్రకారం ఈ రెండు పేర్లు ఒకే తెగకు చెందిన వారినే సూచిస్తున్నాయని తెలిసింది. మరికొన్ని పరిశోధనల ప్రకారం మాల కులస్థులు 4 వర్గాలని, 6 వర్గాలని తెలుస్తుంది. ఏది ఏమైనా మాల కులానికే చెందిన ఒక విశిష్ట ఆచార వ్యవహార సంపన్నమైన శాఖ *మాలదాసరి* పేరుతో వ్యవహరింపబడుతూ ఉంది. ప్రస్తుతం గుర్తింపు పొందిన 59 షెడ్యూల్డు కులాల్లో ఒక ఉపకులమే 'మాలదాసరి'.

మాలదాసరి సంప్రదాయం ఆవిర్భవించిన క్రమమూ, వారి ఆచార వ్యవహారాలు, వారి విశిష్టత మొదలగు అంశాలను వివరించడమే ఈ వ్యాస లక్షణం.

**మాలదాసరి పుట్టుక :**

'దాస' శబ్దం సేవక వృత్తిని తెలుపుతుంది. దాసుడు, కింకరుడు సమానార్థక పదాలు, దాసత్వం, కైంకర్యం సేవను తెలిపేమాటలు. దేవుని ఎదుట మానవులందరూ సేవకులే.

'దాస' శబ్దం నుండి దాసుడు, దాసు, దాసరి అనే మాటలేర్పడ్డాయి. 'దాసుడు' తత్సమం. 'దాసు' దాని సంక్షిప్త రూపం. మత అర్థంలో 'అరి' ప్రత్యయం చేరిన రూపం 'దాసరి', 'పూజరి' లాగా. కులాన్ని సూచించే విధంగా మాలదాసరి అనే పదబంధం ఏర్పడింది. గడ దాసరులు, పూసదారులు, చెంచు దాసరులు మొ॥ పేర్లతో చాలా కులాల్లో దాసరులున్నారు. భగవంతునికి మాలా కైంకర్యం (పూమాలలను కట్టడం) చేసినందున 'మాల' లయ్యారన్నది మరొక వాదం. 'దాసరి' అనే మాట విష్ణు సేవకుణ్ణి లేదా విష్ణు భక్తుణ్ణి (వైష్ణవుని) సూచించేదిగా రూఢికెక్కింది.

11వ శతాబ్దిలో విశిష్టాద్వైత సిద్ధాంతకర్త రామానుజుడు ఆంధ్రదేశమంతటా పర్యటించి, అన్ని కులాల వారికి వైష్ణవ మతాన్ని వ్యాప్తి చేశాడు. భక్తి తత్త్వం ద్వారా అందరూ మోక్షార్హులేనని చెప్పాడు. ఆ విధంగా వైష్ణవులుగా మారిన మాలలు, మాల దాసరులయ్యారు. అనంతరం పల్నాటి బ్రహ్మనాయుడు వైష్ణవ మత వ్యాప్తికి కృషి చేశాడు.

అతని సేనాపతి, మాల కులస్థుడైన వీరకన్నమనీడునే వైష్ణవాలయాల నిర్వహణకై నియమించాడు. వైష్ణవుడైన కన్నమనీడు, కన్నమదాసుగా ప్రసిద్ధి పొందాడు. మాచర్ల, మార్కాపురం మొదలైన చోట్ల ఉన్న చెన్నకేశవస్వామి ఆలయాలను మహమ్మదీయ దండయాత్రికుల నుండి రక్షించాడు. కాబట్టి 11, 12 శతాబ్దాలలోనే 'మాలదాసరి' శాఖ ఆవిర్భవించిందని తెలుస్తుంది. 16వ శతాబ్దికి చెందిన శ్రీకృష్ణదేవరాయల కృతమైన *ఆముక్తమాల్యద* లోని 4 ప్రధాన కథలలో *దాసరి కథ* ఒకటి. ఇది తమిళదేశానికి చెందిన కథ. అయినప్పటికీ దాసరి వృత్తాంతం, ఆంధ్రదేశంలోని మాలదాసరుల ఆచార వ్యవహారాలకు వేష భాషలకు సన్నిహితంగా ఉంది.

దీనిని బట్టి నేడు ఆంధ్రదేశంలోని మాలలందరు, మాలదాసరులు కారు. వైష్ణవమతాన్ని స్వీకరించి, అన్ని నియమాలను పాటిస్తున్న వారు మాత్రమే మాలదాసరులు.

**వైష్ణవాచారం :**

మాలదాసరులు తిరుమంత్రోపాసన చేస్తారు. తిరునామాన్ని ధరిస్తారు. గురువును ఆశ్రయిస్తారు. గురువు వారి భుజాల మీద విష్ణు శంఖు చక్రాల గుర్తులను ముద్రిస్తాడు.

ధనుర్మాస వ్రతాన్ని నిర్వహిస్తారు. బ్రాహ్మీ ముహూర్తంలో లేచి, నిత్యానుష్ఠానం నిర్వహించి, అక్షయ పాత్రను తల మీద ధరించి, రాగతాళయుక్తంగా విష్ణు సంకీర్తన చేస్తూ భిక్షని స్వీకరిస్తారు. మిగిలిన నెలలో గరుడు కంబాన్ని చేత పట్టుకుని సాయం సమయాలలో నారసింహ సంకీర్తన చేస్తూ అమంగళాలను, దుష్టశక్తులను నశింపజేస్తారు.

ధనుర్మాసంలో ప్రతి ఉదయం ఆండాళ్ రచించిన *తిరుప్పావై* అనే దివ్య ప్రబంధాన్ని గానం చేస్తారు. చెన్నకేశవ సుప్రభాతం చదువుతారు. పసుపు రంగు వస్త్రాలను ధరిస్తారు. స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం చేసి, తులసీ దళాలతో పూజిస్తారు. ధనుర్మాస వ్రతాన్ని నిర్వహించే సమయంలో మాలదాసరులను 'హరిదాసుల'ని కూడా పిలుస్తారు.

**అర్చకత్వం :**

కొందరు మాలదాసరులు విష్ణ్వాలయాలలో వంశపారంపర్యంగా అర్చకత్వాన్ని నిర్వహిస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లా, ఉండి మండలం, ఉప్పులూరు గ్రామంలో చెన్నకేశవస్వామి ఆలయంలో మాలదాసరులే అర్చకత్వం చేస్తున్నారు.

కన్నమదాసు సంతతికి చెందిన తిరువీధి నారాయణదాసు క్రీ॥శ॥ 1280 ప్రాంతంలో మాచర్ల నుండి ఉప్పులూరికి వలస వచ్చాడు. 1335 ప్రాంతంలో సింహాచలం నుండి వచ్చిన కందాల కృష్ణమాచార్యులు ఉప్పులూరులో అప్పలస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించి మాలదాసరులనే పూజారులుగా నియమించాడు. 1479. ప్రాంతంలో రాజా ధర్మ అప్పారావు బహద్దరు ఆలయ నిర్మాణం చేశాడు. ఆ తరువాత అక్కడికి వచ్చిన వైష్ణవ మతగురువు పరవస్తు రామానుజాచార్యులు అప్పలస్వామి విగ్రహానికి చెన్నకేశవస్వామిగా పేరు పెట్టారు.

1893లో పాల్వంచ, భద్రాచలం జమీందారు రాజా పార్థసారథి అప్పారావు చెన్నకేశవస్వామి ఆలయానికి 40 ఎకరాలు భూదానం చేశాడు. ఇక్కడ నేటికి కూడా మాలదాసరులే వంతుల వారిగా అర్చకత్వం నిర్వహిస్తున్నారు. వీధి కేశవస్వామి, వీధి శ్రీరాములు దాసు, వీధి రామానుజ దాసు, వీధి వెంకటేశ్వర రావు, వీధి వెంకట నరసింహాచారి, వీధి ఉదయవరులు, కొణతం కృష్ణమూర్తి దాసు, తోట శేషయ్యదాసు, వీధి రామకేశవ దాసు అనే తొమ్మిది మంది ప్రస్తుతం అర్చకులుగా ఉన్నారు. ఇక్కడి అర్చకులు చెన్నకేశవస్వామికి నిత్యపూజలు నిర్వహిస్తారు. భజనలు చేస్తారు. వైశాఖమాసంలో స్వామికి అయిదు రోజులు తీర్థమహోత్సవాలు నిర్వహిస్తారు. కృష్ణాష్టమి, విజయదశమి, దీపావళి, ఉగాది, కార్తీకపూర్ణిమ మొదలగు పర్వదినాలలో విశేషపూజలు నిర్వహిస్తారు. శ్రీకాకుళం జిల్లాలోని మాలదాసరులు *పాంచరాత్ర ఆగమం* ప్రకారం విష్ణ్వాలయాలలో దైవ ప్రతిష్ఠలు చేస్తున్నారు. వీరిలో కొందరు శ్రీభాష్య భగవద్విషయాలను అధ్యయనం చేశారు.

**పౌరోహిత్యం :**

మాలదాసరులు తమ కులస్థులందరికీ పురోహితులుగా పనిచేస్తారు. శిశువు పుట్టినప్పుడు చేయవలసిన జాతక కర్మ నామకరణం, వివాహం, మరణం మొ॥ అన్ని సందర్భాలలోను సంప్రదాయబద్ధంగా, శాస్త్రవిధిననుసరించి ఆయా కార్యక్రమాలను నిర్వహిస్తారు. *పంచాంగం* ప్రకారం ముహూర్తాలను కూడా నిర్వహిస్తారు. ఈ విధంగా మాలదాసరులు పౌరోహిత్యం చేస్తారు.

**వైద్యం :**

మాలదాసరులు వనమూలికలతో వైద్యం చేస్తారు. వీరికి పూర్వుల నుండి సంక్రమించిన వృత్తి ఇది. అడవులలో దొరికే కాయలు, ఆకులు, పూలు, వేరులు, దుంపలు మొదలైన వాటిని సేకరించి, రకరకాల వ్యాధులకు మందులుగా వాడతారు. పాము, కుక్క, తేలు, పిల్లి, ఎలుక మొదలైన వాటి కాటు వల్ల కలిగే విషాన్ని మూలికా వైద్యంతో నయం చేస్తారు. శరీరంలో ఏర్పడ్డ కణుతులను (గడ్డలను) ఆకు పసరుతో కరిగిస్తారు. జ్వరం, తలనొప్పి, మూత్ర పిండాలలో ఏర్పడ్డ రాళ్ళు మొదలగు వాటిని నయం చేస్తారు.

మాలదాసరులకు మంత్రాలు కూడా తెలుసు. భూతవైద్యం చేస్తారు. శిశువులకు తాయెత్తులు, విభూది, రక్షరేకులు ఇస్తారు.

**హస్తకళలు :**

మాలదాసరులు తాటి ఆకులతో విసన కర్రలు చేస్తారు. వాటికి రంగులు అద్దుతారు. అందంగా తయారు చేసిన విసన కర్రలను అమ్మడం ద్వారా డబ్బు సంపాదిస్తారు. వీటినే పెద్ద పెద్ద వారికి, జమీందారులకు కానుకలుగా సమర్పించి వారి నుండి ప్రశంసలనందుకొంటారు.

**లలిత కళాకౌశలం :**

మాలదాసరులు చక్కగా పాడగలరు, ఆడగలరు. వారిలో గొప్ప నటనా నైపుణ్యం ఉంది. వారికి ప్రత్యేక కళారూపాలున్నాయి. విష్ణు సంకీర్తనలను రాగతాళయుక్తంగా గానం చేస్తారు. తంబురాను, చిరుతలను వాయిస్తారు. 15 లేదా 20 మందితో ఒక జట్టుగా ఏర్పడి ఊరూరా తిరిగి విష్ణు సంబంధమైన కథలను వీధి భాగవతాలుగా ప్రదర్శిస్తారు. ముగ్గురు మరాఠీలు, బొబ్బిలి కథలు, పల్నాటి వీరగాథలు మొదలైన జానపద చారిత్రక కథలను ప్రజారంజకంగా గానం చేస్తారు. ఆ విధంగా సంపాదించే డబ్బుతో కుటుంబ పోషణ చేసుకుంటారు.

**కుటుంబాచారాలు :**

మాలదాసరులు వైదికాచారాలను పాటిస్తారు. హిందూ సమాజంలోని విశ్వాసాలే వీరిలోనూ ఉన్నాయి. జీవితంలో అనేక ముఖ్య సందర్భాలలో జరుగవలసిన సామాజికాచారాలను పాటిస్తారు. స్త్రీ గర్భం ధరించిన 5 లేదా 7వ నెలలో గర్భ సంరక్షణ కోసం సీమంతం అనే వేడుకను జరుపుతారు. రజస్వలకు 9వ రోజున లేదా 11వ రోజున స్నానం చేయించి ముత్తైదువలందరూ చేరి కొన్ని వేడుకలు చేస్తారు. పెండ్లి విషయాలలో వధువుకు వరుడు కన్యాశుల్కం చెల్లించే పద్ధతి ఉండేది పెళ్లి ఖర్చు వరుని పక్షానవారే భరిస్తారు. పెండ్లికి ముహూర్తం ముందుగా నిర్ణయించుకొని ఒక్క రోజులో పెళ్ళితంతు పూర్తిచేస్తారు.

చనిపోయిన వారిని పూడ్చే ఆచారం వీరిలో ఉంది. 11వ రోజున కర్మ జరిపించి ఆ కుటుంబం శుద్ధి పొందుతుంది. మహాలయ అమావాస్యను పితృదేవతల రోజుగా భావిస్తారు. దీనినే పెద్దల అమావాస్య అని అంటారు. ఆ రోజు ఇంటిని శుభ్రపరచి ఒక మూల బియ్యం పోసి, దాని మీద జ్యోతిని వెలిగిస్తారు. గతించిన తమ పెద్దలను ఈ విధంగా సంస్కరించుకొంటారు.

మాలదాసరులు సాధారణంగా వేంకటేశ్వరస్వామిని, నరసింహస్వామిని పూజిస్తారు. గ్రామదేవతలైన పోలేరమ్మ, ముత్యాలమ్మ, చిన్నారాముడులను కూడా పూజించే ఆచారం కొందరిలో కన్పిస్తుంది. గ్రామదేవతలకు మేకలను, కోళ్ళను బలి ఇస్తారు. సంక్రాంతి, దసరా, ఉగాది, హోళీ, దీపావళి, శివరాత్రి, శ్రీరామనవమి మొదలైన పండుగలను వీరు భక్తితో జరుపుకొంటారు. పండుగ సందర్భాలను వీరు సామాజిక కార్యక్రమంగా కూడా నిర్వహిస్తారు.

**ముగింపు :**

మాలదాసరులు షెడ్యూల్డు కులాలకు చెందిన వారైనప్పటికీ ఆచార సంప్రదాయాలను బట్టి ఒక విశిష్టత కలిగిన జాతిగా, విష్ణు భక్తులుగా గుర్తింపు పొందారు. భక్తులుగా, దేవాలయార్చకులుగా, పురోహితులుగా, వైద్యులుగా, కళాకారులుగా, ప్రసిద్ధి పొందారు. తమ కులంలో తక్కిన వారి కంటే ఉన్నతులుగా ఎదిగారు. ఉప్పులూరు చెన్నకేశవస్వామి ఆలయ అర్చకుడైన వీధి కృష్ణమూర్తి దాసును 1996లో భారత రాష్ట్రపతి శంకర దయాళ్ శర్మ పండిత పురస్కారంతో సత్కరించారు. రంగస్థల కళాకారుడైన శెట్టి భక్తుల రాజితమూర్తి నటనా కౌశలానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నంది బహుమతినిచ్చి సత్కరించింది. ఈ రెండు సందర్భాలు మాలదాసరుల ప్రజ్ఞా విశేషానికి నిదర్శనాలు. సమాజంలోని ఇతర కులాల వారి కంటే మాలదాసరులు ఏ విధంగానూ తక్కువ కాదని తెలిపే అద్భుత ఘట్టాలీరెండు.

ఒకనాడు అంటరాని వారుగా నిరాదరింపబడిన మాలదాసరులు తమ ప్రజ్ఞతో, కృషితో క్రమక్రమంగా సమాజ ప్రధాన జీవన స్రవంతిలోకి రావడం, సమాజ ప్రగతిని కోరుకొనే వారిని సంతోషపరిచే పరిణామం. మాలదాసరులు ఒక విశిష్ట జాతికి చెందిన వారని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఆ విశిష్టతకు వారు ఆచరిస్తున్న సంప్రదాయ వైభవమే కారణం.

డాక్టరు కొంకే గౌరీశ్వరరావు,
సంచారవాణి, హైదరాబాదు.
ఫోన్ : 9951459842



# కూచిపూడి కళానికేతన్

*– వేదాంతం వెంకట నాగచలపతిరావు*

వేదాంతం వెంకట నాగ చలపతి రావు అను నేను కూచిపూడి అగ్రహారం లో శ్రీ వేదాంతం రత్తయ్య శర్మ, వేదాంతం రాజ్యలక్ష్మి వారసత్వంగా ద్వితీయ పుత్రునిగా జన్మించాను. మా వంశంలో వారసత్వంగా సంక్రమించిన నాట్యవిద్యను ముందు మా తండ్రిగారు నాకు నేర్పినా, తరువాత మా బాబాయి వేదాంతం రాధేశ్యామ్ నేర్పించడం జరిగింది. కారణమేమంటే ఇంటివిద్య చనువు చేత, ప్రేమాభిమానాల చేత ఖచ్చితంగా సాగదని! మా నృత్యాంశాలతో పాటు కొన్ని యక్షగానాలు కూడా నేర్చుకోవడం జరిగింది. అటు పిమ్మట సత్యభామ వంటి స్త్రీ పాత్ర పోషణకై పద్మశ్రీ వేదాంతం సత్యనారాయణ శర్మ వద్ద కొన్ని మెళకువలు నేర్చుకున్నాను. ఆ తరువాత పద్మభూషణ్ డా॥ వెంపటి చినసత్యంతో అమెరికా వంటి దేశాలలో నృత్యరూపకాలలో కొన్ని ముఖ్యపాత్రలు పోషించి వారి శిక్షణలో ఎంతో అనుభవం గడించాను.

2005లో *కూచిపూడి కళానికేతన్* పేరుతో నాట్యాలయం స్థాపించి, ఇప్పటి వరకు దాదాపు 30 మందికి శిక్షణ నిస్తున్నాను. వేదాంతం రాధేశ్యామ్ వద్ద శిక్షణ పొందే సమయంలో మాకు 12,13 సం॥ల వయసున్నప్పుడు వారు మాతోటి విద్యార్థులందరినీ తీసుకుని *భక్తప్రహ్లాద* యక్షగానాన్ని మాకు నేర్పి ప్రదర్శనలిప్పించడం, పెద్ద లందరూ ఆశీస్సులందించడం, అంతేగాక ఆ స్ఫూర్తితో *పార్వతీ కల్యాణం* యక్షగానంలో తారకాసురుడు, అలా హిరణ్యకశిపుడు మున్నగు రాక్షసరాజ పాత్రలను మా తరంలో ఎక్కువ ప్రదర్శించిన అదృష్టం నాకే దక్కింది. అటు పిమ్మట 1996వ సం॥లో నిర్వహించిన నాట్యోత్సవాలలో వేదాంతం సత్యనారాయణ శర్మగారి నేతృత్వంలో *ఉషాపరిణయం* యక్షగానంలో పార్వతిగా మొట్టమొదటి సారి నేను స్త్రీ పాత్ర పోషించడం జరిగింది. ఆ స్ఫూర్తితో తరువాతి కాలంలో సత్యభామ, ఉష వంటి స్త్రీ పాత్రలు వేసి ప్రదర్శించడం జరిగింది. ఇలా పెద్దల నుండి పొందిన విద్యను, అనుభవాన్ని క్రోడీకరించుకొని నేను చేసిన మొట్టమొదటి నృత్యరూపకం *అన్నమయ్య*. దీనిలో రచయిత వ్రాసిన సాహిత్యం కన్నా అన్నమయ్య కీర్తనలే ఎక్కువ! అంటే అన్నమయ్య బాల్యం నుండి స్వామిలో ఐక్యమయ్యే వరకు వివిధ దశలలో రచించిన వారి కీర్తనల ఆధారంగా వారి జీవితంలోని ముఖ్య ఘట్టాలను తీసుకొని సందర్భాన్ని బట్టి శృంగార కీర్తనలు, ఆధ్యాత్మ సంకీర్తనలు వంటివి చేర్చి, అవసరమైన చోట కవి చేత పద్యాలు, చిన్న చిన్న దరువులు వ్రాయించి, ఎక్కువ భాగం అన్నమాచార్య కీర్తనలతోనే అన్నమాచార్య జీవిత చరిత్రను నృత్య నాటకంగా మలచటం ఇందులోని ప్రత్యేకత! ఇక మధ్యలో అనుసంధానం చేసిన వారు పారుపల్లి శ్రీరామచంద్రమూర్తి. సంగీతం కూడా వీరిదే.

అన్నమాచార్య కీర్తనలు మాత్రం వాడుకలో ఉన్న బాణీలే. ఇందులో అన్నమయ్య జననం సందర్భంగా వ్రాసిన దరువులో కవి ఎంతో పరిశోధన చేసి ఆ రోజు తిథి, వారం, నక్షత్రం మున్నగు వివరాలతో నిదర్శనాత్మకంగా వ్రాయటం కూడా ప్రత్యేకత. ఆ తరువాత చేమకూరి వేంకట కవి విరచితమైన *విజయ విలాసం* కథను నృత్యరూపకంగా నల్లాన్ చక్రవర్తుల జగన్నాథాచార్యులు గారు వ్రాయగా రూపొందించాము. ఇందులో అర్జునుడు భూప్రదక్షిణం చేస్తూ చిత్రాంగద, ఉలూచి వంటివారిని వివాహం చేసుకునే సన్నివేశాలు వుంటాయి. వీరి సాహిత్యం క్లిష్టంగా ఉంటూ, ఒకే పదానికి రెండు అర్థాలు వచ్చే విధంగా ఉండటం చేత అభినయం చేయటం కష్టతరంగా ఉండేది. ఐతే కవి అర్థాన్ని ఒకసారి, నిగూఢార్థాన్ని ఒకసారి, నాట్యధర్మిలో, వినియోగించే

హస్తాలతో ఒకసారి ప్రదర్శింప చేశాను. ఇందు *సుభద్రా పరిణయ* ఘట్టంలో కవి వారి ధోరణిలో వ్రాయగా నేను కొన్ని మార్పులు కోరి మా *శశిరేఖా పరిణయం* సంప్రదాయ యక్షగానంలో బలరామకృష్ణుల ప్రవేశదరువును పోలిన దరువునే వ్రాయించి మా సంప్రదాయాన్ని మర్చిపోకుండా శశిరేఖా పరిణయంలోని సంగీత బాణీని యథాతథంగా వాడుకోవడం జరిగింది. దీనికి నల్లాన్ చక్రవర్తుల బుచ్చయాచారి సంగీతం. ఆ తరువాత రుక్మిణీ కల్యాణం పేరుతో మరో నృత్య రూపకం చేశాను.

ఇదే కథను ముందు పద్మభూషణ్ డా॥ వెంపటి చిన సత్యం అత్యద్భుతంగా రూపకల్పన చేసి ఖండఖండాతరాల్లో ప్రదర్శించారు. అలాగే నేను ఇంటర్ చదివే రోజుల్లో పోతన *భాగవతం* లోని ఈ ఘట్టం చదవటం జరిగింది. అందులో పద్యాలు, సాహిత్యంలో ఒరవడి, నా మనసుకి ఎంతో నచ్చిన అంశాలు. ఇదికాక నా చిన్నతనంలో ఎన్.టి.ఆర్. దర్శకత్వంలో వచ్చిన *శ్రీకృష్ణపాండవీయం* చిత్రంలోని *రుక్మిణీ కల్యాణం* ఘట్టం దాదాపు 20 నిమిషాలపాటు పోతన పద్యాలతో ఎంతో రమణీయంగా తెరకెక్కించారు. వీటన్నిటి ప్రభావం చేత నాకూ ఈ కథను నృత్యరూపకంగా చెయ్యాలనే కోరికతో జగన్నాథాచార్యులతోనే మరలా వ్రాయించటం జరిగింది. ఇందులో శిశుపాలుడు రుక్మిణి వద్దకు వచ్చి వెంట పడుతున్నట్లు దరువు వ్రాయించి, పై వాటిలో చూపని భీష్మకుడు, రుక్మి పాత్రల నిడివి పెంచి వ్రాయించడం జరిగింది.

చిన సత్యం నృత్య రూపకంలో అగ్నిద్యోతనుని పాత్ర శాంతి మంత్రంతో ప్రారంభించి సంధాన కర్తగా ఉండటం జరుగుతుంది. నేను ఆ అగ్నిద్యోతనుని పాత్రకూడా కొంచెం పెంచి చేయించాను. ఈ నృత్యనాటకంలో నృత్యానికి ఎక్కువ ప్రాముఖ్యత నిచ్చాను. అలా రుక్మిణి, కృష్ణులతోపాటు అగ్నిద్యోతనునికీ నృత్యాన్ని ఏర్పాటు చేసి చేయించటం జరిగింది. దీనికి కూడా శ్రీ బుచ్చయాచార్యులుగారే సంగీత దర్శకత్వం చేశారు. ఆ తరువాత 'శాకుంతలం' అనే నృత్యరూపకాన్ని చేశాను. దీనికి రచన శ్రీమతి టి.కె. చూడామణి. కాకినాడలో సూర్యకళామందిరంలో 'సరస్వతీ గాన సభ' వారు అడిగి మరీ దీనిని తయారు చేయించు కొన్నారు. ఈ నాటకంలో జాలరి వాళ్ళ పాటకు మా సంప్రదాయ *రామనాటకం* యక్షగానంలో చాకలివాళ్ళ దరువు మాదిరిగా వ్రాయించి యక్షగాన దరువుగా చేశాను. అలాగే శకుంతల దుష్యంతులకు మధ్యనున్న సంవాద దరువులను, ప్రణయగీతాలను *శశిరేఖా పరిణయం* యక్షగానంలో శశిరేఖాభిమన్యుల సంవాద దరువులను పోలి ఉండేటట్లుగా ఆ బాణీలోనే వ్రాయించాను. దీనికీ బుచ్చయాచార్యుల వారే సంగీతం చేశారు. పైన చెప్పినవి మాత్రం యక్షగానాలలో సంగీత బాణీని యథాతథంగా వాడుకుని మిగిలిన వాటికి వారిచే స్వరరచన చేయించాను. ఈ రూపకంలో నృత్యానికి ప్రాముఖ్యత తగ్గించి అభినయానికీ, సంగీతానికీ ప్రాధాన్యత నిచ్చాను. దరువులు పాడే పద్ధతిని బాగా చూపించి హస్తాభినయానికి పెద్దపీట వేశాను.

ఆ తరువాత పూర్వం చినసత్యం రూపుదిద్దిన *క్షీరసాగర మథనం* నృత్యరూపకాన్నే ప్రస్తుతం కూచిపూడిలో ఉన్న యువకళాకారులందరినీ చేర్చి యథాతథంగా ప్రదర్శించడం జరిగింది. దీనికి రచన శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి. సంగీతం శ్రీ బాలాంతరపు రజనీకాంతరావు. అదే వరుసలో *భక్త ప్రహ్లాద* యక్షగానాన్ని మరల చేయనారంభించాను. దీనిని తిరువళ్ళిక్కేణ్ రామానుజాచార్యులు, వేదాల తిరునారాయణాచార్యుల వారి రచనలు రెంటినీ కలిపి, చింతా వెంకట్రామయ్యగారితో సంగీతీకరింపబడి, మా తండ్రిగారైన రత్తయ్యగారు నృత్యీకరించిన రీతిలోనే ప్రదర్శించడం మొదలుపెట్టాను. ఐతే మా తండ్రిగారి వద్ద 45 నిముషముల నిడివి మాత్రమే నేర్చుకున్న *భామాకలాపాన్ని*, ఈ తరువాత పసుమర్తి రత్తయ్యశర్మ గారి వద్ద దాదాపు 2 గంటల పాటే పూర్తినిడివి ఉన్న *భామాకలాపాన్ని* నేర్చుకుని ఆయన మాధవిగా నేను సత్యభామగా చేస్తూ ప్రదర్శించేవాళ్ళం.

ఐతే ఈ భామాకలాపంలో ప్రత్యేకత ఏమిటంటే మిగిలినవారి భామ నాటకంలో లేని ఎదురు వరుసలు, అంటే పలుగుడు వరుసలు, తోతుమాంగలు, మండెకొప్పు, చౌకం వంటి అడుగులన్నీ ఎదురు వరుసలుగా వచ్చేవి. నేను పసుమర్తి రత్తయ్యగారిని ఏమిటి మామయ్యా ఈ అడుగులన్నీ కొత్తగా ఉన్నాయని అడిగితే ఇది వేదాంతం ప్రహ్లాదశర్మగారి బాణీరా! నేను నేర్చుకున్నదిదే అందుకే నీ కదే నేర్పానని చెప్పారు. మదనాదరువైతే చినసత్యంగారి పద్ధతిలో మదనాదరువుకి ఏ మాత్రం తీసిపోకుండా ఒకింత

దానికి మించి ఉంటుంది. ఇది కూడా అన్నీ ఎదురు వస్తూ ఉంటుంది. ఈ బాణీ మనకలవాటు లేదు కనుక కష్టతరంగానే ఉంటుంది. పూర్వులు ఈ దరువుకు ఎక్కువ నృత్యం చేయకుండా పంచబాణాదులు కూర్చుని చేసేవారట! కానీ ప్రహ్లాదశర్మ మదనా దరువు మిక్కిలి నృత్యమిళితంగా ఉంటుంది. అలా మొత్తం వారి భామాకలాపం ప్రత్యేకంగా ఉంటుంది. నృత్త, నృత్య, అభినయాలను సరిపాళ్ళలో మేళవించి చేశారు. ఐతే సత్యనారాయణ శర్మ వంటి ప్రముఖ విద్యాంసులు నిలబడి చేసినా చెల్లుబాటైపోతుంది కారణం వారు సాత్వికాభినయంలో పండిపోయి ఉన్నారు కనుక! ఇప్పుడు కాలం మారుతోంది. వేగం పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో మనం నుంచుని సాత్వికాభినయం చేసి ప్రేక్షకులను కూర్చోబెట్టడం చాలా కష్టం! ఇటువంటివన్నీ ఆలోచించే ప్రహ్లాదశర్మ ఈ విధంగా చేసి ఉన్నారేమోనని నేనను కుంటున్నాను.



అలాగే పసుమర్తి రత్తయ్యశర్మ వద్దే *ఉషాపరిణయం* యక్షగానం నేర్చుకున్నాను. దీని రచన రెంటచింతల చిదంబరకవి, సంగీతం చింతా వెంకట్రామయ్య. ఈ *ఉషా పరిణయం* నేర్చుకున్న తర్వాతే నాకు యక్షగాన ఔన్నత్యం అర్థమయింది. వాటిలో ఉన్న నాటులు, ఉసులు, నడకలు, ఆ సంగీతం... ఇలా చెప్పేదానికన్నా చేసేవారికే ఆ ఆనందం అర్థమవుతుంది. ఇందులో 'అనంగుడున్ ఘనంబటంచు', 'వెడలెనసురజలధిసోముడు', చిత్రరేఖా ఉషల సంవాద దరువులు నాకెంతో ఇష్టం. పసుమర్తి రత్తయ్య మాకు నేర్పించేటపుడు ఒక దరువుని సత్యనారాయణ శర్మయితే ఈ విధంగా, ప్రహ్లాదశర్మయితే ఈ విధంగా, తగినట్లు నువ్వు మలచుకో అని చెప్పేవారు.

అందుచేత వాటిలో ఏ పద్ధతి నచ్చితే ఆ పద్ధతి ఎంచుకొనుటకు సులువుగా ఉండేది. అంతేగాక పూర్వులు యక్షగానాలలో ఏ విధమైన రీతిని అవలంబించేవారో చెప్పేవారు. సమయాన్నిబట్టి అప్పటికప్పుడు తగ్గించు కోవడం, పెంచుకోవడం, జనుల కోరికపై వారు కోరిన అంశాన్ని అప్పటికప్పుడు సన్నివేశాన్ని సృజించి, వారు నిరుత్సాహపడకుండా, కథనానికి అడ్డుతగలకుండా చేసి చూపేవారట! అలా ఎప్పుడు ఎలా కావాలంటే అలా మలచుకునేంత అవగాహన వారికుండేదట! అదే పద్ధతిలో నేనూ కొనసాగుతున్నాను. ఇదిగాక మేము హైదరాబాదులో ఉండే రోజులలో నేను మా అన్నయ్య కలసి వేదాంతం బ్రదర్స్ పేరుతో కొన్ని వ్యస్త నృత్యాంశాలను రూపొందించాము. వాటిలో మొట్టమొదటి అంశం సద్గురు శ్రీ త్యాగారాజస్వామివారి 'శ్రీ గణపతిని సేవింపరారే' అనే సౌరాష్ట్ర రాగ కీర్తన.

ఈ అంశంలో 'వివిధగతుల ధిత్తళాంగుమని వెడలిన' అనే పాదం వద్ద కూచిపూడి సంప్రదాయంలోని పలుగుడు వరుసలు, కొలిపింపు అని అందమైన నడకలను ఐదు జాతులలోనూ చేసేవాళ్ళం. ఆ తరువాత సదాశివబ్రహ్మేంద్ర స్వామికీర్తన 'గాయతివనమాలీ'ని తీసుకొని అందులో 'కూజతిశుకపిక ముఖఖగకుంజే' అను పాదంలో కృష్ణుడు బృందావనంలో ఉండగా నెమళ్ళు, ఆవులు, శుక, పికములు మున్నగువాటికి కొనుగోలు చేస్తూ చేసేవాళ్ళం.

ఆ తరువాత వేదాంతం శ్రీమన్నారాయణ మా పూర్వులు ఒకాయన పూజ చేసుకుంటూ ఆశువుగా రచించిన 'శంభో శివశంభో శివశంకర భవ నాశంకర' అను పల్లవితో సాగే పాటను చింతా రామమూర్తి మీకేమన్నా ఉపయోగపడితే చేసుకోండి అని నాకివ్వడం, వెంటనే నా ప్రాణస్నేహితుడైన డి.ఎస్.వి. శాస్త్రికిచ్చి దానిని సంగీత రచన చేయించడం జరిగింది. ఈ కీర్తనలో ఆయన పలు సందర్భాలలో శివుని రూపాన్ని కొలవడం అనగా *కిరాతార్జునీయ ఘట్టం* లో కిరాతశివా! అనీ, *క్షీరసాగర మథన* సందర్భంలో గరళాన్ని మింగినపుడు వరద నీలకంఠ శివా! అనీ, మన్మథ దహనం సందర్భంగా మదనాంతక శివా! అనీ, కపట వటుడుగా వచ్చి పార్వతిని పరీక్షించినపుడు ఉమాధిపా కల్యాణ శివా! అనీ 4 చరణాలలో నాలుగు కథలను చెప్పడంతో, రాగమాలికగా దానిని చేశాక నృత్యం చేయడం జరిగింది. ముందు సాహిత్యాన్ని చదివినపుడు అంతగా ఏమీ అనిపించని ఆ కీర్తన ఒకసారి సంగీతం చేశాక వింటే అత్యద్భుతంగా ఉండటంతో మేము చేయడం,

ఊహించని రీతిలో ఆ అంశం విజయవంతమవ్వడం జరిగింది.

ఈ కీర్తనకు ముందు 'నాగేంద్రహారాయ త్రిలోచనాయ' అనే శివపంచాక్షరీ శ్లోకాన్ని అమృతవర్షిణి రాగంలో శాస్త్రిగారు కూర్చగా మేము రూపకల్పన చేశాము. ఈ అంశంలో శివుని యొక్క నాలుగైదు కథలను కలిపి రచించడం చేత సంచారీలు చేసుకోవడానికి చక్కని అవకాశం దొరికి, మా వద్ద నాట్య శిక్షణ పొందుతున్న అభినందన, నేను కలిసి యుగళ నృత్యంగా ప్రదర్శించగలిగాము.

అలా ఇద్దరూ ప్రదర్శిస్తూ, ప్రతి చరణం ముందు జతులుచేసి, అటు నృత్యానికీ, ఇటు అభినయానికీ ప్రాముఖ్యం ఉండేలా చేశాము. ఆ తరువాత నేను కూచిపూడిలోని పెద్దలందరి వద్దా శిక్షణ పొందడం, మెళకువలు నేర్చుకోవడమేగాక, శ్రీ వేదాంతం సత్యనారాయణ శర్మ, వేదాంతం రాధేశ్యాం, పసుమర్తి రామలింగ శాస్త్రి, వేదాంతం రామలింగ శాస్త్రి, డా॥ శోభా నాయుడు శ్రీమతి మంజుభార్గవి, దండిభొట్ల వైకుంఠ నారాయణమూర్తి వంటి వారందరి దగ్గర, అంటే నా ముందు తరాల వాళ్ళేగాక తరువాతి తరాలవాళ్ళ దగ్గర కూడా పనిచేయడం వల్ల ఒక్కొక్కరిలో ఉన్న ఒక్కొక్క ప్రత్యేకతను, ప్రతిభను అవగతం చేసుకున్నాను.

తద్వారా నేను నృత్యరూపకాలు చేసేటపుడు ఆ అనుభవం తోడయ్యింది. వెంపటి చినసత్యం వద్ద పొందిన మెళకువలు, అనుభవమైతే ఇక చెప్పనే అక్కరలేదు. అంత మహాసముద్రం ఆయన. స్త్రీ పాత్ర పోషణలో సత్యనారాయణ శర్మ, పురుష పాత్రల పోషణలో మా తండ్రి రత్తయ్య శర్మ అందులో నాయిక పాత్రలు, ప్రతినాయక పాత్రలు, యక్షగానాలు చేసేటపుడు పసుమర్తి రత్తయ్య శర్మ, ఇలా అందరూ నాకు స్ఫూర్తి ప్రదాతలయ్యారు. ఇందరి గురువుల ఆశీర్వాద ఫలంగా ప్రప్రథమంగా కేంద్ర సంగీత నాటక అకాడమి వారి బిస్మిల్లాఖాన్ యువ పురస్కారాన్ని పొందియున్నాను. వ్యస్తనృత్యాంశాలు, కలాపాలు, యక్షగానాలు ఇలా కూచిపూడిలో ఉన్న అన్ని ప్రక్రియల యందు ఆరితేరి ఉండాలన్నది నా అభిమతం. ఈ రోజులలో వేరే నాట్యరీతుల వారు ఆచరిస్తున్న సాంకేతిక విషయాలలో, లైటింగ్ వంటి వాటిల్లో మనం వారికన్నా కొంత వెనుకబడి ఉన్నామని నా అభిప్రాయం. అలాగే ఏ రసానికి ఏ లైట్ వెయ్యాలి? ఏ సైడ్ నుంచి లైట్ వేస్తే నర్తకుల ముఖకవళికలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి వంటి విషయాలలో మనం నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. ఈ మధ్య నేను కెనడా వెళ్ళినపుడు అక్కడి వారితో *వామనావతారం* అనే నృత్యరూపకం చేయించాను. కథానుగుణంగా వామనుడు పెరిగి పెద్దవాడయ్యే సన్నివేశంలో దానిని నాట్యంలో చూపడం కష్టం కనుక వామనుడుగా నటించే అమ్మాయిచేత బాగా కూర్చోబెట్టి క్రమంగా పైకిలేస్తూ వేళ్ళమీద నిలబడగలిగే వరకూ చేయమని అదే సమయంలో ఆమె వెనుక తెల్లని తెరమీద 'క్రోమోస్' వామనుడు గొడుగు పట్టుకొని నుంచున్నట్లు వేసి ఆ క్రోమోని క్రమంగా పెద్దదిజేస్తూ చివరకు విశ్వరూపంగా చూపించాను.

ఈ సాంకేతిక ప్రక్రియను కంప్యూటర్ సహాయంతో తయారు చేసుకుంటాం. వీటిని గోబోస్ అని అంటాం. ఆ రకంగా మనకేది కావాలో దానిని పెయింట్ చేసుకుని, గ్లాస్ మీద దానిని తీసి కంప్యూటర్ ద్వారా తెల్లని తెరపై ఫోకస్ చేసినపుడు మనం అడవి వేస్తే అడవి, నక్షత్రాలు, చంద్రుడు, మంటపాలు, స్తంభాలు ఇలా కావలసినవి దాని మీద కావలసిన పరిమాణంలో కనబడుతుంది. అలా మునపటిలా వేదిక మీద సెట్టింగ్స్, పిల్లర్స్ అడ్డంగా లేకుండా, సులువుగా మనం నాట్యం చేసుకోవడానికి మంచి అవకాశంగా నాకనిపించింది. ఈనాడు ప్రేక్షకుల ఆలోచనా విధానంలో మార్పులొస్తున్నాయి కాబట్టి తదనుగుణంగా మనం కూడా నూతనత్వం చూపితే సఫలీకృతులవవచ్చు. కనుక సంప్రదాయం చెడకుండా నవీన రీతులలో మన నాట్యాన్ని మరింత ముందుకు తీసుకు వెళ్లడానికి నిరంతరం శ్రమించే కళాకారుడిగా నేనెప్పుడూ సిద్ధమేనని తెలియబరుచుకుంటూ, అందుకు కావలసిన శక్తిని ఎల్లప్పుడూ ప్రసాదించమని మా బాలాత్రిపుర సుందరీ, రామలింగేశ్వర స్వాములను భక్తితో ప్రార్థిస్తూ.... ⓑ

వేదాంతం వెంకట నాగచలపతిరావు
కూచిపూడి నాట్యాచార్యులు,
విజయవాడ.



# సప్తస్వర వీణాపాణి శ్రీపాద పినాకపాణి

– సి. యస్. రావు

రాజమండ్రిలో ఇన్నీసు పేట. ఇన్నీసుపేటలో గోదావరి తీరాన్ని ఆనుకుని ఈ వీధినుంచి అవతల వీధిదాకా విస్తరించి ఉన్న శ్రీపాదవారి లోగిలి. ప్రధానమైన ఇల్లు తాలూకా ఆఫీసు వీధికి ఆనుకుని ఉంటే నాలుగైదు పోర్షన్లు గోదావరీ తీరం వైపు ఉండేవి. మధ్యలో విశాలమైన ఖాళీస్థలం. మొక్కలు, కొన్ని పెద్ద చెట్లు, బావి ఉండేవి. అది అన్ని హంగులుగల లోగిలి. ఆ లోగిలిలో 1948 నుంచి 51 దాకా నేను మా అమ్మగారి అమ్మమ్మతో కలిసి ఆ ఇంట్లో ఉన్నాను. ఒక గదిలో మేము అద్దెకి ఉన్నాము. ఆ గది ఆ లోగిలిలో భాగమే. అంటే వారి కుటుంబ సభ్యులతో పాటే నేనూ ఉండే అవకాశం కలిగింది. అప్పట్లో నేను గవర్నమెంటు మోడల్ స్కూలు విద్యార్థిగా తొమ్మిదవ తరగతి (అప్పట్లో ఫోర్త్ ఫారమ్) చదువుతున్నాను. ఈ వివరణ అంతా ఎందుకు ఇవ్వాల్సి వచ్చిందంటే సంగీత సరస్వతి శ్రీపాద పినాకపాణి గారు ఆ ఇంట్లో ఏ కారణం చేతనో సకుటుంబంగా కొంతకాలం ఉండిపోయారు. అది వారిల్లే. విశాఖపట్నంలో కింగ్ జార్జి ఆసుపత్రిలో డాక్టరుగా ఉంటూ సెలవుపెట్టో మరో కారణం చేతనో దాదాపు రెండేళ్ళపాటు ఆ ఇంట్లో ఉండిపోయారు.

వారితో పాటు నరసింహారావు అనే ఒక శిష్యుడు కూడా ఆ ఇంట్లోనే ఓ గదిలో ఉండేవారు. భోజనం, వసతి అన్నీ వారి కుటుంబ సభ్యులతో పాటే ఆయనకీను.

ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే అప్పుడు ఒక పల్లెటూరు నుంచి వచ్చిన నేను పినాకపాణి గారిని చూడడం, వారి సంగీత సాధనను, నరసింహారావుకు పాఠం చెప్పేటప్పుడు వారు సంగీతం నేర్పే విధానాన్ని నేను వినే అవకాశం, చూసే అవకాశం కలిగాయి. అదంతా ఇరవై అడుగుల దూరంనుంచే. బంగారు మేని ఛాయ, నిండైన విగ్రహం, బట్టతల, తీయని గాత్రం శ్రీపాద పినాకపాణి గారిది.

వారి దగ్గరకి ఎవరెవరో వచ్చేవారు. రోగులు కాదు. సంగీతానికి సంబంధించిన వారు. వారితో మాట్లాడుతూ, సంగీతంలో వారి సందేహాలను తీరుస్తూ, వారిచేత పాడిస్తూ, తాను పాడి చూపిస్తూ సాగుతూ ఉండేవి ఆ సమావేశాలు. అది ఒక సంగీత సరస్వతి సభలా కొనసాగేది. వచ్చిన వారందరికీ ఆయనంటే గౌరవం, భక్తి, గురి అని తెలుస్తూనే ఉండేది.

అలా కొన్నాళ్ళకి ఇంకొంచెం దగ్గరగా వెళ్ళి ఆయన సాధన చేసేటప్పుడు శ్రద్ధగా వినేవాణ్ణి. నరసింహారావుకి పాఠం చెప్పేటప్పుడు కూడా నా గదిలో కూచుని నేను చదువుకుంటూనే ఉండేవాణ్ణి. అలా సంగీతం వింటూ చదువుకునే అలవాటు వంట పట్టింది. అలా కొన్నాళ్ళకి డా॥ పినాకపాణిగారు శ్రీపాద కామేశ్వరరావుగారి కొడుకని తెలిసింది. అప్పటికే స్వర్గీయ శ్రీపాద కామేశ్వరరావుగారు రచించిన రాణాప్రతాప్ నాటకాన్ని పినాకపాణిగారి అమ్మగారు నాకిచ్చారు.

నేను చదువుకునే గవర్నమెంటు మోడల్ స్కూలు గవర్నమెంటు ట్రైనింగ్ కాలేజిలో ఒక భాగం. బి.ఇడి. స్టూడెంట్స్ మోడల్ స్కూలు విద్యార్థులకి క్లాసెస్ తీసుకునే వారు. బి.ఇడి. కాలేజి లెక్చరర్లు బి.ఇడి. విద్యార్థుల కోసం మాకు మోడల్ లెసెన్స్ కూడా చెప్పేవారు. అప్పట్లో ట్రైనింగ్ కాలేజి ప్రిన్సిపాల్ కేశరాజు సత్యనారాయణ గారు. అంతకుముందు కొన్నేళ్ళ క్రితం శ్రీపాద కామేశ్వరరావుగారు కూడా ఆ ట్రైనింగ్ కాలేజి ప్రిన్సిపాల్‌గా పనిచేశారని తెలిసింది. వారి తైలవర్ణ చిత్రాన్ని కాలేజిలో చూసే అదృష్టం కలిగింది. వారు ఆచార్యులే కాకుండా చారిత్రాత్మక నాటక కర్తగా కూడా ప్రఖ్యాతులు. సంగీత ప్రియులని కూడా తెలిసింది.

అనునిత్యం పినాక పాణిగారు సంగీత సాధన చేయడమే కాకుండా ఇరుగు పొరుగు వారెవరైనా అనారోగ్యంతో వస్తే వైద్యం చేస్తూ రోగి కదలలేని స్థితిలో ఉంటే వారి ఇళ్ళకు వెళ్ళి వైద్య సేవలు అందిస్తూ ఉండేవారు. వారి శిష్యుడు నరసింహారావుగారు చెప్పగా పినాకపాణి గారు ఎంత పెద్ద డాక్టరో అంతపెద్ద కర్ణాటక సంగీత విద్వాంసులు కూడా అని విన్నాను.

అప్పుడప్పుడు రాజమండ్రి గవర్నమెంటు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా॥ తోలేటి కనకరాజు ఎఫ్.ఆర్.సి.ఎస్ కూడా పినాకపాణిగారిని కలవడానికి వచ్చేవారు. వారిరువురు మంచి స్నేహితులు. ఆ స్నేహం కారణంగా ఒక పండగ రోజున గవర్నమెంట్ హాస్పటల్‌లో పినాకపాణి గారి గాన కచేరి కూడా ఏర్పాటు చేసి రోగులకి పినాకపాణి గారి సంగీతం వినే అవకాశాన్ని కలిగించారు. ఇవన్నీ కూడా రోగుల పట్ల ప్రేమతో అందించిన ఉచిత సేవలే. నేను కాస్త ఎడంగా నిలబడో, కూర్చునో వారిని చూస్తూ వారి సంగీతాన్ని వింటున్నట్టు వారు గమనించారు. వారు నన్ను పిలిచి నా గురించి అడిగారు.

ఆయనకి విద్యార్థులంటే అభిమానం అని నేను గ్రహించాను. కొన్నాళ్ళకి కొంత చనువు ఏర్పడింది. ఓ సందర్భంలో తంబుర శృతి చేస్తూ వారినే గమనిస్తున్న నన్ను చూశారు. తంబుర ఎలా మీటాలో నాకు వివరంగా చెప్పారు. ఒక తీగ మీటి మిగిలిన మూడు తీగలని వరసగా మీటాలని చెప్పారు. స.ప.స లు ఎలా పలకాలో వివరిస్తూ వాటిని సరైన స్థానంలో అనగలిగితే మాతృభాష నేర్చుకునే టప్పుడు ఓ నమఃలు అన్నట్టే అన్నారు. మా పరిచయం ఇంకొంచెం పెరిగింది. నాకు పొద్దున్నే వ్యాయామం చేయడం నేర్పారు. అది భారతీయ వ్యాయామం దండీలు, బస్కీలు, పులప్స్ ఓ గడప ఆధారంగా కాలి బొటన వేళ్ళు ఆన్చి కిందికీ పైకీ లేవడం ద్వారా కాలి పిక్కలు ఎలా గట్టి పడతాయో చేసి చూపించడమే కాకుండా నాకు నేర్పి నా చేత చేయించారు. శరీరంలోని తల దగ్గర నుంచి పాదాల దాకా చేయవలసిన అన్ని వ్యాయామాలూ నాకు నేర్పారు. నాకు వ్యాయామం మీద ఆసక్తి కలిగి, వ్యాయామం చేసి అప్పుడప్పుడు నా కండరాలను నేనే చూసుకుని మురిసిపోయే వాణ్ణి. ఎవరూ లేనపుడు స.ప.స.లు అని నాలో నేనే ఆనందించే వాణ్ణి. అది ఎంత గొప్ప అనుభూతి. ఆయన మంచి బాడీ బిల్డర్. మంచి డాక్టరు. మంచి సంగీత విద్వాంసుడు. సంగీతం, ఆరోగ్యం కలిసి మనిషిగా కూడితే ఆ మనిషే శ్రీపాద పినాకపాణి గారు.

అప్పట్లో రేడియోలో రాత్రి నెలకొకసారి కాన్సప్ట్ ప్రోగ్రామ్స్ అని శాస్త్రీయ సంగీత కార్యక్రమాలు వచ్చేవి. విజయవాడ రేడియో స్టేషను నుంచి ఆ సంగీత కచేరీలు ప్రసారమయ్యేవి. ఆ గంట కర్ణాటక కచేరి కార్యక్రమాల్లో పినాకపాణిగారు పాడేవారు. ఆ కార్యక్రమం వచ్చినపుడు వారి అమ్మగారు, వారి సతీమణి బాలాంబగారు, మరో తమ్ముడు కూతురు జోగాంబ, వారి అన్నగారి భార్య సుబ్బలక్ష్మిగారు, వారి కుమార్తె గాయత్రిగారు, వారితోపాటు నేను ఆ కచేరీలు వినేవారం.

వారి దగ్గరకి వచ్చే సంగీత విద్వాంసులు ఎవరెవరో నేను పెద్దవాణ్ణయిన తరువాత తెలిసింది. నేదునూరి కృష్ణమూర్తిగారు, శ్రీరంగం గోపాలరత్నంగారు, పాలగుమ్మి విశ్వనాథంగారు, నూకల వారు నాకు గుర్తున్న పేర్లు. ఇంకా ఎందరో మహానుభావులు. వారి దగ్గరకి వచ్చేవారు.

అటువంటి వారు కొందరు మాట్లాడుకుంటూ ఉండగా నేను విన్నది ఆయన్ని రోగులు సంగీతం డాక్టరుగారు అంటారు. హాస్పటల్‌లో రౌండ్సు తీసుకునేటప్పుడు, రోగులని పరీక్షించేటప్పుడూ కూడా ఆలాపిస్తూనే ఉండేవారట. అందుకే సంగీతం డాక్టరుగారనే పేరు వచ్చింది. సంగీతం అందాలి అన్నది ఆయన ధ్యేయం. అందుకే తనకు తెలిసిన విద్య తనలోనే దాచుకోకుండా ఆసక్తిగల అందరికీ అందేలా శాస్త్రీయ సంగీతాన్ని గ్రంథస్థం చేసిన మహానుభావుడని పించుకున్నారు.

నేను హైదరాబాదులో స్థిరపడిన తరువాత వారిని రేడియో స్టేషనులో పాలగుమ్మి విశ్వనాథం గారితో కలిసి ఉండగా వారిని కలిసి, నన్ను నేను పరిచయం చేసుకున్నాను. ఎంతో ఆప్యాయంగా పలకరించి నా గురించి తెలుసుకున్నారు. నేను రేడియో నాటకాలు బాగా రాస్తానని విశ్వనాథంగారు చెప్పగా విని సంతోషించి ఆశీర్వదించారు. మరి కొన్నాళ్ళకి గొల్లపూడి మారుతీరావు గారు నేను రచించి దూరదర్శన్ కోసం నిర్మిస్తున్న చిలకమర్తి వారి గణపతిలో నటించడానికి సతీసమేతంగా గోదావరి జిల్లా కూళ్ళ వచ్చి ఒక వారం రోజులు గడిపారు. వారు పినాకపాణిగారి సోదరుని అల్లుడని చెప్పారు. నా జ్ఞాపకాలు వారితోటి, వారి సతీమణితోటి పంచుకుని ఆనందించాను.

ఓ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ సంచాలకులు కవితా ప్రసాద్‌గారు పినాకపాణిగారి గురించి ఒక డాక్యుమెంటరీ తీయాలనుకుని నాతో చర్చించారు. అది ఆచరణలోకి రాలేదు. మరి కొన్నాళ్ళకి పినాకపాణి గారిని మారుతీరావు గారు సమగ్రంగా సంగీత పరంగా ఇంటర్వ్యూ చేసి మిసిమిలో ప్రచురించారు. ఆయన ఎంత ఎత్తు ఎదిగారో రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి, పురస్కారాలు ఎన్ని వారిని వెతుక్కుంటూ వచ్చాయో చదివి, విని ఎంతో ఆనందించాను. ఆయనకి ఆయనే సాటి అనుకున్నాను. వారు గతించిన తరువాత సాంస్కృతిక మండలి, సాంస్కృతిక శాఖ ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో పాలు పంచుకొని గురుదేవులకు కృతజ్ఞతలు తెలుపుకున్నాను.

అప్పుడనిపించింది మనిషికి తీయన జ్ఞాపకాలు ఎంత తీయని అనుభూతినిస్తాయో. మహాపండితులని చూసినపుడు పుంభావ సరస్వతి అని అంటారు. అంటే పురుష రూపంతో ఉన్న సరస్వతీదేవి అని అర్థం. నేను పినాక పాణిగారిని చూసిపుడు ఆయన గురించి విన్నప్పుడు, వారు జ్ఞాపకం వచ్చినపుడు సప్తస్వర వీణాపాణి శ్రీపాద పినాకపాణి అని అనిపిస్తుంది.




సి.యస్. రావు

ఫోన్ : 9885017122

*(ప్రముఖ నాటక రచయిత,*
*రాష్ట్రపతి సమ్మాన గ్రహీత)*

# హిందూస్థానీ – కర్ణాటక : ఆచార్య బృహస్పతి వాదం

– నండూరి పార్థసారథి

*గత సంచిక తరువాయి...*

సంగీత రత్నాకరానికి తాను రాసిన వ్యాఖ్యానంలో కల్లినాథుడు చెప్పిన ఈ క్రింది విషయాలను పరిశీలిస్తే విజయనగరంలో అప్పటి సంగీతంపై ముస్లిముల ముకాం పద్ధతి ప్రభావం ఎంతగా ఉందో తెలుస్తుంది:

1. నా కాలంలో ప్రతి రాగం షడ్జంతో మొదలవుతుంది.
2. షడ్జంతో సంవదించే పంచమం మాత్రమే ఇప్పుడు మిగిలింది. (రిషభంతో సంవదించే పంచమం వాడుకలో లేకుండా పోయింది) రెండు గ్రామాలలోనూ రాగాలన్నీ ఇప్పుడు షడ్జంతో సంవాదం గల పంచమాన్నే ఉపయోగిస్తున్నాయి.
3. శ్రీరాగంలో రిషభ, గాంధార, ధైవత, నిషాద స్వరాలు ఇది వరకటి కంటే ఒక శ్రుతి పెరిగాయి.
4. క్రియాంగ రాగమైన రామక్రిలో మధ్యమం రెండు శ్రుతులు పెరిగింది. (అంటే, మధ్యమత్వం మాయమైపోయి, వరాళి మధ్యమం, 'పత పంచమం', తీవ్రమధ్యమం వంటి స్వరనామాలకు బీజాలు పడ్డాయన్నమాట.)
5. నట్టా, దేవక్రి వంటి రాగాలలో రిషభ ధైవతాలు అంతర గాంధార, కాకలీ నిషాదాల నుంచి రెండేసి శ్రుతులను తీసుకున్నాయి. (అంటే, 'స-గ-గ-మ-ప-ని-ని-స' లోని గ,నిస్వరాలు రి,ధ స్వరాలుగా మారిపోయాయి.) ఆ విధంగా (అవైదికమైన) పంచశ్రుతి గాంధారం, పంచశ్రుతి నిషాదం వాడుకలోకి వచ్చాయి.
6. కర్ణాట గౌడ రాగంలో షడ్జం స్థానంలో నిషాదం గ్రహ స్వరం, అంశ స్వరం అయింది. (అంటే, ఆ రాగం యొక్క థాట మారిపోయిందన్న మాట.)
7. హిందోళంలో రిషభ-ధైవతాల స్థానంలో రిషభ- పంచమాలు లోపించాయి.
8. ఒక్కోసారి ఔడవ రాగాలలో లోప్య స్వరాలు ఉపయోగించబడుతున్నాయి.
9. కొన్ని చోట్ల జన్య, జనక (రాగాల) మేళనం వేరే విధంగా ఉంటున్నది.
10. రసానుగుణంగా రాగాలను ప్రయోగించడంలో నిబంధనలను ఉల్లంఘించడం జరుగుతున్నది.

మాధవ విద్యారణ్యస్వామి తర్వాత వందేళ్ళకు, రామామాత్యునికి వందేళ్ళ ముందు విజయనగర సంగీతం 'అవైదిక'మై పోయిందని పై మాటలను బట్టి తెలుసుకోవచ్చు. రాగాల వర్గీకరణలో 'మేళ' పద్ధతి అందరికీ ఆమోదయోగమై పోయింది. సంప్రదాయ సంగీతపు మౌలిక అంశాలలో ఇంతటి మార్పుకు కారణాలేమిటనే విషయంపై మౌనమే ఉత్తమమని కల్లినాథుడు భావించాడు. ఈ రాగాలన్నీ దేశి రాగాలే కనుక తాను పేర్కొన్న నియమోల్లంఘనల వల్ల నష్టమేమీ లేదని మాత్రం అన్నాడు. తన కాలపు సంగీతం ఎటువంటి ప్రభావాలకు లోనయిందో వాటిని కప్పిపుచ్చే ప్రయత్నమే తప్ప అతడు చెప్పింది శాస్త్రీయమూ కాదు, సహేతుకమూ కాదు.

**యేషాం శ్రుతి స్వరగ్రామ జాత్యాది నియమోనహి!**
**నానా దేశ గతిచ్ఛాయా దేశి రాగాస్తు స్మృతాః ॥**

'ఆంజనేయ' అనే లాక్షణికుడు చెప్పిన ఈ సూత్రాన్ని కల్లినాథుడు తన వాదాన్ని సమర్థించుకోవడం కోసం ఉటంకించాడు. దీని అర్థం : "శ్రుతి, స్వర, గ్రామ, జాతి వంటి నియమాలేవీ లేని రాగాలు, ప్రాంతీయ ఛాయలు కలిగిన రాగాలు దేశి రాగాలనబడుతున్నాయి." దేశిరాగాలకు ఏ నియమాలూ ఉండవనేదే ఈ మాటల అర్థమైతే ఆ రాగాలను బద్ధీకరించవలసిన అవసరమే ఉండదు. 'సంగీతరాజ' గ్రంథాన్ని రచించిన మేవాడ్ రాజు కుంభరాణా కల్లినాథుని సమకాలికుడే. మేవాడ్‌లో అప్పటికింకా సంగీతం ముస్లిం ప్రభావానికి లోను కాలేదు. కల్లినాథుడు పేర్కొన్న నియమోల్లంఘనలను, పరిణామాలను కుంభరాణా పేర్కొనలేదు. ఇది గమనార్హమైన ముఖ్య విషయం. *సంగీతరత్నాకరం*పై తన వ్యాఖ్యానంలో కల్లినాథుడు తన కాలపు సంగీతం గురించి యథాలాపంగా ప్రస్తావించేదే గాని 'మేళ' పద్ధతి గురించి మాట్లాడలేదు.

ఇప్పటివరకు లభించిన దాక్షిణాత్య సంగీత లక్షణ గ్రంథాలలో రామామాత్యుని *స్వరమేళ కళానిధే* మొదటిది. కల్లినాథుని తర్వాత యాభైయేళ్ళకు విజయనగర ఆస్థాన విద్వాంసుడు లక్ష్మీనారాయణ తన *సంగీత సూర్యోదయ* గ్రంథంలో గజల్, కవ్వా ప్రక్రియలను గురించి వివరంగా రాశాడు. అంటే, ఆ రెండూ అప్పటికే విజయనగరంలో బాగా ప్రచారంలో ఉన్నాయన్నమాట. రామామాత్యుడు కల్లినాథుని దౌహిత్రుడని ప్రొఫెసర్ రామకృష్ణ కవి చెప్పారు కాని అందుకు

ఆధారాలు చూపించలేదు. శార్ఙ్గదేవుని *సంగీత రత్నాకరా*నికి కల్లినాథుని వ్యాఖ్యానాన్ని చదవాల్సిన అవసరం లేదని రామామాత్యుడు అనుకొన్నట్లున్నాడు. చదివితే అతడు ముస్లిముల 'హిజుజి'ని గ్రామ రాగంగా పేర్కొనేవాడు కాదు. కల్లినాథుని మాటలను అతడు అర్థం చేసుకొని ఉంటే చ్యుతపంచమ మధ్యమం (వరాళి మధ్యమం) శుద్ధ మధ్యమం కంటే మూడు శ్రుతులు పైన ఉంటుందని అనేవాడు కాదు. క్రియాంగ రాగమైన రామక్రిలో మధ్యమం షడ్జ సంవాది – పంచమం కంటే రెండు శ్రుతులు తక్కువగా ఉంటుందని కల్లినాథుడు స్పష్టంగా పేర్కొన్నాడు.

నిజం చెప్పాలంటే మేళ పద్ధతిని అనుసరించిన వారందరూ కల్లినాథుడిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ముస్లిముల పూర్వీ థాట (లేక కామవర్ధని మేళం) లోని నిషాదాది మూర్ఛన నుంచి పుట్టిన – పూర్తిగా అవైదికమైన– తమ ముఖారి శార్ఙ్గదేవుని శుద్ధ స్వర మూర్ఛనే అనే ఒక భ్రమను సృష్టించారు. దాక్షిణాత్య పండితుడైన కల్లినాథుని మాటలను ఏమాత్రం లక్ష్యపెట్టకుండా, శార్ఙ్గదేవుని మాటలకు తమ ఇష్టం వచ్చినట్లు అర్థం చెప్పుకునే వారు తమది ప్రాచీన వైదిక పద్ధతి అని చెప్పుకోవడం ఏమాత్రం సమర్థనీయం కాదు.

వెంకటమఖి గోపాల నాయకుని పట్ల గౌరవం ప్రకటించుకున్నాడు. ఢిల్లీతో, అమీర్ ఖుస్రోతో గోపాల నాయకునికి గల సంబంధం తెలిసినదే. 'ఆలాప, థాట, గీత, ప్రబంధ' అనే నాలుగింటితో చతుర్దండి అనే ఒక ప్రత్యేక పద్ధతిని ప్రారంభించినవాడు గోపాల నాయకుడు. 'చారోం డోంఢి' బాంధ్ ఆయే నాయక్ గోపాల్'... వంటి మాటలు కొన్ని ధ్రుపద్ రచనలలో కనిపిస్తాయి. అందుచేత 'చతుర్దండి' అనే కొత్త పద్ధతితో ఢిల్లీకి ఏమీ సంబంధం లేనట్లు మాట్లాడడం కుదరదు. వెంకటమఖి పరమగురువు తానప్పకు కూడ ఈ చతుర్దండి గురించి తెలిసే ఉంటుంది. మొత్తం మీద – కర్ణాటక సంగీతంపై ముస్లిం ప్రభావం లేదన్నమాట అబద్ధం. మేళ, థాట పద్ధతులు రెండింటి మూలం ఒకటే. ముఖారి మేళానికి భరత సంప్రదాయంతో ఏ మాత్రం సంబంధం లేదు. ప్రాచీన గ్రామ–మూర్ఛన పద్ధతి పూర్తిగా అంతరించి పోయింది.

* * *

ఈ వ్యాసంలో ఇప్పటి దాకా చెప్పిన విషయాలన్నీ ఆచార్యబృహస్పతి రాసినవే. శార్ఙ్గదేవుని అనంతరకాలంలో అమీర్ ఖుస్రో సంగీత ధోరణులు దాక్షిణాత్య సంగీతంలోకి చొచ్చుకు రావడానికి దారి తీసిన రాజకీయ, సామాజిక పరిస్థితులను వివరిస్తూ అందుకు సంబంధించిన ఆధారాలను ఆయన ప్రధానంగా రాబర్ట్ సూయెల్ (Robert Sewell) రచించిన *ఎ ఫర్గాటెన్ ఎంపైర్* అనే గ్రంథం నుంచి స్వీకరించారు. విజయనగర సామ్రాజ్య చరిత్ర గురించి ఎవరు ఏమి రాయాలన్నా ఆ గ్రంథం నుంచి ఎంతో కొంత సమాచారాన్ని స్వీకరించక తప్పదు. అదొక గొప్ప ప్రామాణిక గ్రంథం. కాని, రామామాత్యుని గురించి ఆ గ్రంథంలో ఉన్న ఒక్క విషయం మాత్రం పూర్తిగా అవాస్తవం. ఆ అవాస్తవ సమాచారాన్ని బృహస్పతిగారు యథాతథంగా ఉటంకించారు. *స్వరమేళ కళానిధి* గ్రంథాన్ని రచించిన రామామాత్యుడూ శ్రీకృష్ణదేవరాయల అల్లుడు అళియ రామరాజూ ఒక్కరేనంటూ బృహస్పతిగారు ఇలా రాశారు:

"రామామాత్యుడు తన తండ్రి తిమ్మామాత్యుడని *స్వరమేళ కళానిధి* గ్రంథంలో పేర్కొన్నాడు. 'అమాత్యుడు' అంటే మంత్రి అని అర్థం. అంటే తండ్రీ కొడుకులిద్దరూ మంత్రులన్నమాట. రామామాత్యుడు అళియ రామరాయలే. శ్రీ కృష్ణదేవరాయల మంత్రి 'తిమ్మ' అనీ, అతడి కుమారుడు 'రామ' అనీ *ఎ ఫర్గాటెన్ ఎంపైర్* గ్రంథ రచయిత రాబర్ట్ సూయెల్ పేర్కొన్నాడు. 'రామ రాయ' అనే పేరులో 'రాయ' అంటే 'రాజు' అని అర్థం.

రామామాత్యుడు కృష్ణదేవరాయల అల్లుడు. క్రీ.శ. 1542లో సదాశివరాయలు విజయనగరం రాజయ్యాడు. కాని, అతడు రామామాత్యుని చేతిలో కీలుబొమ్మ మాత్రమే. అసలు రాజ్యపాలనం చేసిన వాడు రామామాత్యుడు. అందుచేత ముస్లిం చరిత్రకారులు 'రామ' నే 'రాజు'గా పరిగణించి, అతడిని రామరాయలుగా పేర్కొన్నారు." బృహస్పతి గారు ఉటంకించిన సూయెల్ గ్రంథంలోని ఈ సమాచారం పూర్తిగా అవాస్తవం. పేరులో 'అమాత్యుడు' అని ఉన్న వాళ్ళందరూ మంత్రులు కారు. బమ్మెర పోతనామాత్యుడు మంత్రికాదు. రామామాత్యుడు, తిమ్మామాత్యుడు కూడా మంత్రులు కారు. కృష్ణదేవరాయల అల్లుడు అరవీటి రామరాజు. అతడు కొంతకాలం గోల్కొండ కుతుబ్‌షాహీల కొలువులో ఉన్నాడు. కృష్ణదేవరాయలు అతడిని గోల్కొండ నుంచి రప్పించి తన కూతురు నిచ్చి వివాహం చేశాడు. తర్వాత అతడికి తన కొలువులో ఉన్నత పదవి ఇచ్చి అధికారాలు అప్పగించాడు. కృష్ణదేవరాయల మహామంత్రి సాళువ తిమ్మరుసు. ఆయన బ్రాహ్మణుడు. రామామాత్యుడు కూడా బ్రాహ్మణుడే. అరవీటి (అళియ) రామరాజు బ్రాహ్మణుడుకాడు– కృష్ణదేవరాయల కులంవాడు. కృష్ణదేవరాయల మరణానంతర రాజకీయ పరిణామాలలో రామరాజు మంత్రే అయినా

సర్వాధికారాలతో రాజులాగానే వ్యవహరించాడు. *స్వరమేళ కళానిధి* గ్రంథకర్త రామామాత్యుడు, *వసుచరిత్ర* కావ్యకర్త భట్టుమూర్తి ఇద్దరూ రామరాయల కొలువులోని వారే. రామరాయల ప్రేరణతోనే రామామాత్యుడు *స్వరమేళ కళానిధి* గ్రంథాన్ని రచించాడు. రామరాయల నుంచి సన్మానం అందుకోవడం వల్లనే భట్టుమూర్తి 'రామరాజ భూషణుడు' అయ్యాడు. కృష్ణదేవరాయల మంత్రి 'తిమ్మ' కుమారుడే రామరాయలనీ, అతడే కృష్ణరాయల అల్లుడనీ సూయెల్ పేర్కొనగా నేలటూరి వెంకట రమణయ్య, ఆరుద్ర వంటి పండితులు ఆ అవాస్తవ సమాచారాన్ని తమ రచనలలో ఎందుకు ఖండించలేదో తెలియదు. కర్ణాటక సంగీతంపై ముస్లిముల ప్రభావం గురించి రాస్తూ బృహస్పతి ఈ విషయాన్ని ఎందుకు ప్రస్తావించవలసి వచ్చింది? రాక్షసి-తంగడి యుద్ధంలో రామరాయలు మరణించడంతో విజయనగర సామ్రాజ్యం విచ్ఛిన్నం కావడం, తంజావూరు, మధుర నాయకులు స్వాతంత్ర్యం ప్రకటించుకోవడం తెలిసిందే. తంజావూరు నాయక రాజుల పూర్వీకులకు రామరాయలతో వైరం ఉండేదనీ, ఆ వైరాన్ని మనస్సులో పెట్టుకొని రఘునాథనాయకుని మంత్రి గోవింద దీక్షితుడు *సంగీత సుధ* లోనూ, వెంకట మఖి *చతుర్దండి ప్రకాశిక* లోనూ రామామాత్యుడిని అమర్యాదకరమైన పద జాలంతో విమర్శించి ఉంటారనీ బృహస్పతిగారి ఊహాగానం. రామామాత్యుడు, రామరాయలు ఒకరేనన్న విశ్వాసం దీనికి ఆధారం. ఈ ఊహ హాస్యాస్పదం. ఈ ఒక్క విషయం తప్ప ఆయన వ్యాసంలోని మిగిలిన అంశాలన్నీ పక్కాగా, పకడ్బందీగా ఉన్నాయి.

## రజని వాదం

క్రీ.శ 14వ శతాబ్దిలో భారతీయ శాస్త్రీయ సంగీతం రెండుగా చీలిపోయిన తర్వాత ఏర్పడిన కర్ణాటక సంగీత పద్ధతి భరత, మతంగ, శార్ఙ్గదేవుల సంప్రదాయానికి పూర్తి విరుద్ధమైనదన్న ఆచార్య బృహస్పతి గారి అభిప్రాయాన్నే కళాప్రపూర్ణ బాలాంత్రపు రజనీకాంతరావు కూడా వ్యక్తం చేశారు. *ఆంధ్రవాగ్గేయకార చరిత్రము* రెండవ భాగంలో రజనీకాంతరావు ఏం చెప్పారో చూద్దాం :

"ముస్లిం దండయాత్రల వల్ల ఉత్తర సంగీతం ప్రభావితమయింది కానీ, కర్ణాటక సంగీతం ప్రభావితం కాలేదు, స్వచ్ఛంగా ప్రాచీన సంగీత వాహిని వేద కాలపు స్వరూప స్వచ్ఛతతో నేటికీ ప్రవహిస్తోందని మన విద్వాంసులు చెపుతూండే మాటలు కేవలం భ్రమతో చెప్పినవి. భరత మతంగాదుల సంప్రదాయం పూర్తిగా తెలుసుకుని, వివరించి లక్షణం వ్రాసిన వాగ్గేయ కారులలో చివరివాడు శార్ఙ్గదేవుడు. అతని తరువాత లక్షణ కర్తలు శార్ఙ్గదేవుని గ్రంథానికి గాని, భరతాదుల సంగీత లక్షణాలకు గాని, తమ కాలానికి లక్షణంలోను, లక్ష్యంలోను కూడా దేశీయ సంగీతంలో కలిసిపోయిన పారశీక సంగీత పద్ధతుల ప్రమాణాల బీగాలతో ప్రాచీన లక్షణపు గుప్తపేటికలను తెరవడానికి చేసిన ప్రయత్నాలు ఫలించక వారంతా ఆ గ్రంథాలన్నీ అయోమయమని త్రోసిపారేశారు.

సంగీతకర్తా, విద్యానగర సామ్రాజ్య నిర్మాతా అయిన విద్యారణ్యులు కూడా పారశీక గాన పద్ధతుల పరిచయానికి లోను కావడం చేతనే 15 రాగాలు మేళకర్తలనడము, దానికి కావలసినట్లుగా శ్రుతి వివరణము, హెజ్జుజ్జి వంటి రాగాలను కూడా స్వీకరించడమూ జరిగింది. హిజాజ్ అనే పర్షియన్ ముకాం లేక స్కేల్ హెజ్జుజ్జికి మూలం. అరేబియాలోని మక్కా మదీనాలుండే ప్రాంతాన్ని హిజాజ్ అంటారు. దానితో చుట్టరికం గల మేళకర్త హెజ్జుజ్జి. హుసేనీ ముకాంను హజ్రత్ దావూద్ పవిత్ర గ్రంథ పఠనానికి వినియోగించే వాడు. కర్ణాటక సంగీతంలోకి హుస్సేనీ రాగం వచ్చింది కదా. విద్యారణ్యుల తర్వాత *స్వరమేళ కళానిధి* కర్తయైన రామామాత్యుడు కూడా 19 మేళ కర్తలను వివరించాడు.

శార్ఙ్గదేవుని నాడూ వీణ సారికలు కదపడానికి వీలుగా ఉండేవి. అతడి స్వరమేళముల వివరణ కూడా భరతాదులు చెప్పిన 22 శ్రుతుల పద్ధతిని అనుసరించింది. కాని, రామామాత్యుడు అచల సారికల వీణకు ఆరంభకుడై తాను వివరించిన 12 స్వరస్థానాలు ముకాం పద్ధతిని అనుసరించినవే అయినప్పటికీ వాటిని శార్ఙ్గదేవుని స్వరాల కంటే వేరు కావని ప్రకటించడం చేత సంగీత చరిత్ర పరిశోధకులకు ప్రాచీన సంగీత గ్రంథాలు అయోమయమై పోయాయి. "రాగవిబోధ కారకుడయిన సోమనాథుడు మేళకర్తలను కనుగొనే లెక్కలను విరివిగా పెంచి, కొంచెం అతిగా పోయికూడా వాటిలో పనికొచ్చేవి, శ్రావ్యత గలవి కొన్నే అని చెప్పాడు. ఆ తర్వాతి వారు- ఒకరినొకరు చూసి వ్రాసిన వారిని వదిలేస్తే, అహోబలుని 12 స్వర స్థానాలు టెంపొరయిజ్డ్ స్కేల్ కాని, వేంకట మఖి, గోవిందామాత్యులు గణితం ద్వారా సుస్పష్టం

చేసిన 72 మేళకర్తల పద్ధతికాని, పారశీక సంప్రదాయాల్ని లక్ష్య, లక్షణాల ద్వారా జీర్ణం చేసుకొన్న ఫలితంగా రూపొందింప చేసినవే. "ఉత్తరాది వారు భైరవము అనీ, మనం మాయా మాళవగౌళ అనీ పిలిచే రాగం ప్రాచీన భారతీయ గ్రామ లక్షణాల ద్వారా లభించే రాగం కాదు. ఈ పారశీక రాగాన్ని అమీర్ ఖుస్రో మనకు అందించి, తాను సిద్ధం చేసిన సంప్రదాయంలో ఇదే మొదటి రాగం అన్నాడు. మరో మూడు వందల ఏళ్ళకు తర్వాత కర్ణాటక సంగీత పితామహుడు పురందర దాసు మనకు సంగీత పాఠానుక్రమాన్ని తయారు చేస్తూ ఈ మాళవ గౌళలోనే సరళీస్వరాలూ, జంటస్వరాలూ, అలంకారాలూ అభ్యాసం చెయ్యాలని నిర్ణయించాడు.

"బహమనీ, విజయనగర రాజ్యాలు పరస్పరం సంగీత విద్వాంసులను ఒకరి ఆస్థానాలకు ఒకరు పంపుకోవడం ఉండేది. 1446-1465 మధ్య విజయనగర రాజైన ఇమ్మడి దేవరాయలు తన ఆస్థాన వాగ్గేయకారుడైన కల్లినాథుని చేత శార్ఙ్గదేవుని *సంగీత రత్నాకరానికి* వ్యాఖ్యానం వ్రాయించాడు. అందులో ప్రాచీన సాంప్రదాయిక రహస్యాలను తెలిసిన వారు చాలా అరుదు అని కల్లినాథుడే వ్రాశాడు. దేశిరాగ లక్షణాలను వివరించే చోట షడ్జ పంచమముల అచల స్థితినీ, రిషభ ధైవతములు ఐదేసి శ్రుతులను తీసికొనడాన్ని, పూర్వ ప్రసిద్ధములయిన మేళరాగాల ప్రశంసా, జన్యజనకరాగాల మధ్య భేదమూ, రాగాలకు వివిధ రాసాలకు నడుమ ఉండే బాంధవ్యంలో అప్పటికి ప్రచారంలో ఉండిన భ్రమవల్ల కలిగిన కొన్ని విశ్వాసాలూ, వర్జ్య స్వరాల వాడుకా-ఇటువంటి విషయాల ప్రస్తావన కల్లినాథుడు చేయడం అంతా ఆనాడు క్రమంగా అల్లుకు పోయిన పారశీక సంప్రదాయాల వల్లనే."

*(ఆంధ్రవాగ్గేయకార చరిత్రము-రెండవ భాగము 140,141,142 పేజీలు)*

◆ "భరతుని నుండి శార్ఙ్గదేవుని వరకు దేశములో ప్రచారములో నుండిన సంగీత శాస్త్రపద్ధతులన్నింటికి అమీర్ ఖుస్రో వంటి పారశీక సంగీత విద్వాంసుల కుతర్కము వల్ల ఓటమి సంభవించి ఆ గ్రంథములలోని ఆనాటి సంగీత రీతుల నెరుగు మర్మములు క్రమముగా వివరించి చెప్పు శాస్త్రకారులు కరువైపోయారు.

దక్కన్‌లో బహమనీ రాజ్యం కూడా ఏర్పడిన 1300 ప్రాంతంలో విద్యానగర రాజ్యస్థాపనకు కారకుడయిన విద్యారణ్య స్వామి వంటి ప్రాచీన భారతీయ సంప్రదాయ నిష్ణాతులకు కూడ వెనుకటి సంగీత శాస్త్ర పద్ధతులు అగమ్యగోచరమై పోయిన పరిస్థితి ఏర్పడింది. అందుకే భరతుడు నాట్యశాస్త్రములో చెప్పిన 22 శ్రుతులు ఏవి? వాటిలో శుద్ధ స్వరములేవి? వికృత స్వరములేవి? వంటి ప్రాచీన సంగీత లక్షణములను వివరించేటప్పుడు విద్యారణ్యుడు తన *సంగీత సార* గ్రంథంలోను, రామామాత్యుడు తన *స్వరమేళ కళానిధిలో*ను, గోవింద దీక్షితులు, వెంకట మఖి తమ *సంగీత సుధ, చతుర్దండి ప్రకాశికల*లోను వేరు వేరు మార్గముల నవలబించి ప్రాచీన సంగీత రూపమును మరింత అయోమయము చేసివేశారు.

భరతుని నుండి శార్ఙ్గదేవుని వరకూ సామవేదము నుంచి షడ్జమధ్యమ గాంధార గ్రామములు, గ్రామములనుండి మూర్ఛనల ద్వారా జాతులు, జాతుల నుండి రాగములు ఏర్పడే విధమును తెలియజేయగా విద్యారణ్యుడే మొదటిసారిగా 15 మేళ రాగములు కలవని, మిగిలిన రాగములన్నీ ఆ 15 మేళకర్తలకు జన్యము లౌతాయని, పారశీక సంగీత పద్ధతిలోని ముకాముల ననుసరించి జనక రాగములను, జన్యరాగములను వివరించారు.

విద్యారణ్యుల తర్వాత రామామాత్యుడు, సోమనాథుడు ఈ పద్ధతిని కొంత పెంచడానికి ప్రయత్నించారు. వెంకట మఖి, గోవిందామాత్యుడు శుద్ధ, వికృత స్వరముల యెంపికలోనే ప్రాచీన లక్షణము నుండి పూర్తిగా భేదించి భరతుని 22 శ్రుతులకు బదులు పారశీక పద్ధతి ప్రకారము స,రి,గ,మ,ప,ద,ని అనే ఏడు స్వరములలోను షడ్జ పంచమాలు వికృతులు లేని స్థిర స్వరాలనీ, మధ్యమములు శుద్ధ, ప్రతిమధ్యమములుగా రెండు విధములనీ, రి,గ,ధ,ని నాలుగు స్వరములూ ఒక్కొక్కటీ అయిదేసి వికృతులు కలిగి ఉంటవనీ, ఐదు వికృతులలోను ఒక్కొక్కదాని మొదటి స్వరము శుద్ధ స్వరముగా ఉంటుందని వివరించారు.

"ప్రతి ఒక్క లక్షణ కర్త తన కాలము నాడు వాద్య ప్రయోగములోను, గాత్ర సంగీతములోను అప్పటికి జరిగిపోయిన మార్పుల ననుసరించి క్రొత్తగా లక్షణము తయారు చేస్తూ ఉండడమూ, పాతలక్షణ శాస్త్రమునకూ, తాను చేప్పే శాస్త్రమునకూ అన్వయింపలేక, తన పూర్వలక్షణ కర్తలను దుయ్యబట్టి విమర్శిస్తూండడమూ వీరంతా చేసినపని. లక్షణ కర్తలను వదిలి లక్ష్యకర్తలైన వాగ్గేయకారుల ద్వారా మన సంగీత స్వరూప పరిణామమును గ్రహించడం శ్రేయస్కరం."

*(ఆంధ్రవాగ్గేయకార చరిత్రము - రెండవ భాగం : 332 పేజీ)*

నండూరి పార్థసారథి
హైదరాబాదు, ఫోన్ : 9959734534



త్రిపుర

# త్రిపుర కథాంతం...

*– తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి*

**ఒక** జీవితకాలంలో కేవలం పదిహేను కథలు రాసి కథా సాహిత్యం మీద బలమైన ముద్ర వేసిన అతి తక్కువ మంది భారతీయ కథకుల్లో త్రిపురగా ప్రాచుర్యం పొందిన రాయసం త్రిపురాంతకేశ్వర రావు గారొకరు. అప్పుడప్పుడు ఆయన కథలు చదువుతూనే ఉంటాను. జన్ బౌద్ధం, జిడ్డు కృష్ణమూర్తి, కాఫ్కా, కేమూ, సార్త్రే ఇంకా ఎవరెవరివో ప్రభావాలు ఆయన రచనల్లో చూస్తుంటారు. ఫ్రాయిడ్‌ని ఎందుకు వదిలేశారో తెలీదు. చాలా సందర్భాల్లో ఆయన కథలు ఫ్రాయిడ్‌కి కూడా లొంగుతాయి.

అయితే ఒక రచన అనేక విశ్లేషణలకు అవకాశం కలిగించడం గొప్ప విషయం. ఎటొచ్చీ మనకు తెలిసిన విషయాలన్నింటినీ ఒక కథలో నింపడం సమంజసం కాదు – జన్ బౌద్ధానికీ త్రిపుర దృక్పథానికీ సంబంధం ఏఁవిటో నాకు అర్థం కాలేదు. పాఠకులకీ, విమర్శకులకీ ఇబ్బంది కలిగించకుండా త్రిపుర తన కథాసంకలనానికి ముందు పాస్కాల్ వ్యాక్యాలు రెండు ఉదహరించారు. "I am frightened and I am ashtanished at being here rather than there, why now rather than then". *కాఫ్కా కవితలు* పేరుతో ఆయన ఒక కవితా సంకలనాన్ని ప్రచురించారు. అందుచేత ఆయన కథల మీద ప్రాపంచిక దృక్పథం మీదా ఎవరి గాఢ ప్రభావం ఉన్నదో ఆయనే స్పష్టం చేశారు. త్రిపుర ఏకాంతాన్నీ, మౌనాన్నీ, జన్మ హక్కులుగా భావించి కాపాడుకున్నారు.

సాహిత్య సభలకి వెళ్లడం, ఉపన్యాసాలు చెప్పడం, సాహిత్య వ్యాసాలు రాయడం వంటివి ఏవీ చెయ్యలేదు. తన కథల గురించి ఆయన గానీ ఇతరులు గానీ తన ముందు మాట్లాడటం కూడా ఇష్టం ఉండేదికాదాయనికి. గుంపులుగా ఉండే తెలుగు సాహిత్య వాతావరణంలో, సాహిత్యం అంటే ఏదో ఒక ధోరణికో, వాదానికో కట్టుబడి ఉండాలనే పరిమితుల మధ్య త్రిపుర వంటి రచయితలు, ఆలోచనాపరులు ఇమిడి ఉండడం కష్టం. లోకానికీ తనకీ పెద్దగా సంబంధాలుండ కూడదని ముందే నిర్ణయించుకున్నారు త్రిపుర. అట్లా అంటే దురహంకారంగా తోస్తుంది. కానీ నిజానికి రచయితలు అందరూ లోకంలో తమకోసం, అవసరార్థం– అది దృక్పథం కావొచ్చు కేవలం అవసరాలు కావొచ్చు– సంబంధా లేర్పరుచుకుంటారు.

త్రిపుర అనగానే కాఫ్కా, కేమూ, సార్త్రే, జ్ఞాపకం వస్తారు. ప్రాథమికంగా నలుగురికే జీవితంపట్ల ఆయన ఒకే దృక్పథం ఉండేది. దీనికి ఉదాహరణగా సిసిఫస్ ప్రాచీన గాథ ఉటంకిస్తుంటారు. సిసిఫస్ ఒక బండరాయిని జీవితాంతం కొండ చివరకు దొర్లించి తీసుకు వెళ్లే ప్రయత్నం చేస్తుంటాడు. అది ఎంత వ్యర్థ ప్రయత్నమో, క్లేశమో జీవితం కూడా అంతేనని ప్రతీకాత్మకంగా చెప్పినది. కేమూని అలా ఉంచితే సార్త్రే, కాఫ్కా మానవ జీవితం అర్థరహితం అని నమ్మినవారు. సార్త్రే అస్తిత్వ వాది. గాఢమైన అస్తిత్వ చైతన్యంతో ఉంటూ నిరర్థకమైన జీవితానికి ఒక సృజనాత్మక వ్యాపారం జోడించడం వల్ల సార్థక్యం ఏర్పడుతుదంటాడాయన. అస్తిత్వ స్పృహ అనేది కీలకం. కొంతకాలం క్రితం కాఫ్కా గురించి Borges రాసిన చిన్న వ్యాసం చదివాను. అందులో ఆయన కాఫ్కాలో మూడు అంతరువులున్నాయంటూ ఒకటి ఆధ్యాత్మికం అన్నాడు. త్రిపుర ప్రాపంచిక దృక్పథానికి రెండు సూత్రాలున్నాయని ఆయనే అన్నాడు. ఒకటి దేవుడు లేడు. రెండు ఈ జీవితానికి అర్థం లేదు. అలా అంటూనే సార్త్రే సలహా పాటించాడాయన త్రిపుర కథలు చదివి, కాఫ్కా అధివాస్తవికతా ప్రభావం గమనించి కొందరాయన్ని అరాచక వాదిగా అర్థం చేసుకున్నారు. అరాచకవాదానికి మనం ఇచ్చుకునే అర్థాన్నిబట్టి ఉంటుంది.

వ్యవస్థీకృతమైన నైతిక, సామాజిక, ధార్మిక నియంత్రణకీ, నియంతృత్వానికీ ఆయన వ్యతిరేకి. మౌనంగా వీటిని తిరస్కరించారాయన. తన జీవన విధానాన్ని, ప్రవర్తననీ, అభిప్రాయాలనీ ఇతరులు ఆమోదించలనిగాని, అంగీకరించాలని గాని ఆయన అనుకోలేదు. ఆ మేరకు ఆయనకి ప్రపంచంతో సంబంధం లేదు. కానీ త్రిపుర తన కుటుంబాన్నీ, ఉన్నకొద్ది మంది స్నేహితుల్నీ మనస్ఫూర్తిగా ప్రేమించాడు. పిల్లల చదువు, ఎదుగుదల మొదలైన ప్రాపంచిక అవసరాల్ని ఎన్నడూ ఉపేక్షించలేదు. పెద్దతనంలో పిల్లలు తన దగ్గిర ఉంటే బాగుండు ననుకునే వారు. విశాఖపట్నం ఇష్టం. అందుకని విశాఖని వదిలి వెళ్లలేదు. జీవితాంతం ఆయన్ని కాపాడుకుంటూ వచ్చిన భార్య పెద్దతనంలో అనారోగ్యంతో ఉన్నప్పుడు సేవ చేశాడు. ఒంటరితనం, స్వేచ్ఛ, సంతోషం, దుఃఖం అన్నీ తగిన మోతాదుల్లో అనుభవించారాయన. మేనల్లుడి అకాల మరణం బాధించింది. నిశ్శబ్దంగా భరించారాయన అన్నీ. ఈ వైయక్తిక సుఖః దుఃఖాలను వేటినీ ఆయన కథల్లోకి చొరనివ్వలేదు. అస్తిత్వ స్పృహలో జీవితాన్ని ఒక అనివార్యమైన బాధాకరమైన వ్యర్థ ప్రయాసగా గుర్తించినా ఆయన ఒక ఉన్నత మధ్య తరగతి జీవనం సాగించాడు.

త్రిపుర కాఫ్కా చదివి జీవితాన్ని అర్థం చేసుకోలేదు. ఆయనలో మొదటి నుంచీ చిత్రమైన అశాంతి సందిగ్ధత

తీవ్రస్థాయిలో ఉండేది. త్రిపుర తండ్రిగారు గూడురులో డాక్టరుగా ఉండేవారు. సాయంత్రాలు నెల్లూరు గూడురు మధ్య రైలు పట్టాల వెంట రోజూ మైళ్లకొద్దీ నడుస్తూండే వాడినని చెప్పేరు త్రిపురగారు. రైలు ఆయన జీవన సంకేతం. ప్రయాణం ఆయనకిష్టం. His stories replete with departures. త్రిపురలో ఉద్యోగించేటపుడు "వామపక్ష తీవ్రవాద విద్యార్థుల్ని సమర్థించి ప్రమాదకరం అనిపించలేదా" అని ఓ సారి అడిగాను. "నాకప్పుడలా అనిపించలేదు. చెయ్యాలనిపించింది, చేశాను" అన్నారాయన. విశాలమైన సాహిత్యానుభవం, జీవితానుభవం, పరిపక్వమైన ఒక దశలో చింతనాశీలి అయిన రచయిత తన జీవితాన్ని వెలుపల నుంచుని పునశ్చరణ చేసుకునే అవకాశం ఉంది. ఎందుకంటే విశ్రాంత జీవితం సమీపించే నాటికి అనేక భ్రమలు తొలిగి ఒకరకమైన ఎరుక ఏర్పడుతుంది. ఆ దృష్ట్యా, మీరు మళ్లా కాసిని కథలు రాయొచ్చుగదాని చాలా సార్లు అడిగాను. "నేను రాయను. రాయడం ఇష్టంలేదు. ఎందుకు రాయడం?" అనేవారాయన. ఆయన వేపు నుంచి అది సమంజసమే. ఎందుకంటే ఒక సాహిత్యకారుడిగా జీవించాలనీ, తన దృక్పథాన్నీ, అనుభవాల్నీ ఇతరులతో పంచుకోవాలనే ఆలోచనగానీ అవసరంగానీ ఆయకి లేవు. మరి రాసిన కథలు దేనికి రాసినట్టు? "నా కప్పుడు రాయాలనిపించింది. రాసుకున్నాను" అన్నాడాయన. ఆ కారణం చేతనే త్రిపుర తెలుగు కథకుల్లో గొప్పవాడయ్యాడని ఉద్దేశ్యం. నిస్సారమైన భూమిలో వేరుని బలంగా చెట్టు విస్తరించినట్టు ఒక మూల విస్తరించాడు త్రిపుర. చెట్టునీడని వెదుక్కుంటూ వేళ్లేవారుంటారు గదా. నాలుగు సంవత్సరాలక్రితం ఆయన పుట్టిన రోజు రాత్రి ఫోన్ చేసి రోజంతా ఏం చేశారని అడిగాను. "ఏం చెయ్యలేదు, చొక్కా చింపుకుని కూచున్నాను అన్నా రాయన.

ఒక రకంగా త్రిపుర ఒకే కథని పదిహేను కథలుగా రాశాడు. అన్ని కథలకీ అంతఃసూత్రం ఒకటే. కాలంతో అనుభవాల్ని ముక్కలు చేసి పదిహేను చేశాడాయన. పదిహేను జీవన శకలాలు దేనికది నిండైనది. మొత్తం కథలు చదివిన తరువాత క్రమంగా వాటి నేపథ్యమైన రెండు రకాల విధ్వంసం కమురు వాసన వలె మనస్సుని తాకుతుంది. కొన్ని కథలకి భౌతికమైన యుద్ధ వాతావరణం; చీకటి, బురద, జిగట వర్షం, కంకర రాళ్ల మట్టి రోడ్లు, రాత్రి గుండెలదిరే శబ్దంలో ఒంటరి ప్లాట్‌ఫాం మీదికొచ్చిన రైలు. మానస సంబంధాల విధ్వంసం; భళ్లుమని పగిలిన గ్లాసు పలకవంటి ప్రేమ, ఓటమి, వ్యర్థమైన అన్వేషణ, వ్యర్థ నిష్ఫల నిరీక్షణ, ఒంటరి తనం. నీతో నిమిత్తం లేకుండా, కోరకుండా నీలోంచి వెలువడ్డ ఉద్వేగావడగాలి భయపెడుతుంది నిన్ను. బౌద్ధులు నిత్యం మృత్యు స్పృహతో

**మొ**దటిసారి త్రిపుర దగ్గరకు జగన్నాథరావు గారు తీసుకు వెళ్లారు. అప్పుడు ఆయన బెజవాడ, దుర్గా కళామందిరం వెనక ఒక సందులో – 1900లో కట్టిన పాత మేడ పైభాగంలో విడిది చేసి వున్నారు. విరిగి పోయిన చెక్కమెట్లు – జారిపోతున్న లతలు చెక్కిన చూరులు – పెద్ద గుమ్మం – అదిదాటి రెడ్ ఆక్సైడ్ ఫ్లోరింగ్ హాలు – దానికి గ్రే బోర్డరు– మమ్మల్ని సాదరంగా ఆహ్వానించి– 'వీడు నా స్నేహితుడు'– అని ఆ యింటి యజమానిని – ఆయన ఒక వెదురు కర్ర మాదిరి వున్నారు – చూపించారు. కాసేపు కబుర్లు చెప్పుకున్నాం – స్నేహితుని మీద సరసాలు నడిచాయి– "వీడు శనివారం నాకు రైలు టిక్కెట్టు బుక్ చేశాడు – ఇంతకు ముందు ఫోన్ చేస్తే 'ఆ రైలు లేదు..' అన్నారు – హాహా – అది కాఫ్కా రైలన్నమాట!" అని నవ్వారు. "ఈ మేడ కూడా కాఫ్కా భూతకాలం నాటిది.. మీరు రాగలగటం గొప్ప విషయమే" అని అన్నారు. లక్ష్మిగారి బెంగాలీ కథలు తెలుగులో రాసినవి ఇచ్చి – అవి అచ్చువేయటానికి పడిన ముప్పతిప్పలు – అచ్చుతప్పులు చెప్పి నవ్వటం– ఆయన చెప్పే కబుర్లు మనకు గుర్తుండవు ఎక్కువగా, ఎందుకంటే, మనల్ని ఇంప్రెస్ చేయటానికి చెప్పేవి కాదుకదా–

ఆయన ఒకప్పుడు నిలబడిన మొగల్‌సరాయి ఖాళీ తడి ఫ్లాట్‌ఫారమ్ మీద, తర్వాత ఎప్పుడో – వర్షంలోనే నేనూ రైలు బండికోసం ఎదురు చూస్తున్నా– ఆ రైలు బండి పొగలు చిమ్ముతూ గంగను దాటి వస్తుందో – నన్ను గంగ దాటిస్తుందో తెలియని అయోమయంలో నిలబడి నిరీక్షిస్తున్నా – ఇంతకంటే ఏమి కావాలి ఆయన రచన తెలుసుకోవటానికి. బాధలోని హుందాతనం – ఓటమిలోని ఓర్పు.... ఎప్పుడు కలిసినా ఆయన ఏ నాగరకత ముసుగులు వేసుకోలేదు. సుదూర గతంలో నుంచి నన్ను చూసే చూపులు ఏవో మౌనంగా మోసుకొచ్చేవి. గోరంత కూడా గోరోజనం కనపడని– ఆయనలాంటి మరోవ్యక్తిని – ఇంకా కలవ వలసి ఉంది. హాయిగా నవ్వే పిల్లి గడ్డం – అందులోనుంచి ఏ వలస పక్షులు ఎగిరివస్తాయోనని ఆశ్చర్యపోయే వాడిని– సహజమైన మృదు సంభాషణే – ఎప్పుడూ ఉపన్యాసాలు వుండేవి కావు.

తర్వాత ఆయన ఎక్కడ వుంటే అక్కడకు వెళ్లి కలిశాను. విశాఖలో పాండురంగ పురంలో రెండు, మూడు సార్లు – హైద్రాబాద్‌లో శ్రీనగర్ కాలనీలో రెండు సార్లు – నాగభూషణంగారు, నాగేశ్వరరావుగారు ఎవరో ఒకరు తోడుండేవారు. ఎప్పుడూ మా కోసం క్రిందికి వచ్చి ఎదురు చూసేవారు. ఆయనతో గడిపిన సమయం అమూల్యమైంది. ఏ సిద్ధాంతాలు చర్చించేవారు కాదు. సముద్రపుటలల్లా నవ్వుతారు. "నిన్న కానిస్టేబులు వచ్చాడు – నా పాస్‌పోర్టు, కొత్తదానికి అప్లికేషన్స్ ఇచ్చాను – నన్ను, నా చిరునామా వెరిఫికేషన్ కోసమని వచ్చాడు. ఎండలో పడి – 'అట్లా కూర్చో' అని చల్లని నీళ్లిచ్చాను– కాస్త కునుకు తీశాడు–! తర్వాత సంతకం చేయించుకుని, ఫోటొ తీసుకుని, నన్ను, ఫోటోని చూసుకుని వెళ్లిపోయాడు..." అని కొద్దిగా విచారంగానే నవ్వారు. ఈ వ్యవస్థ మీద ఆయనకు విచారంతో కూడిన సానుభూతి కాబోలు – ఆయన 'త్రిపుర'లో ఉన్నపుడు – తెలుగు మరచి పోకుండా వుండేందుకు తెలుగు కథలు రాశానని చెప్పారు. తెలుగు కథకు ఆయన త్రిపురాంతకుడు!

– ఎ.కె

ఉండాలంటారు. అది ఒక విముక్తి మార్గం అనుకోవచ్చు. *భగవంతం కోసం* కథలో పిస్టలు, గార్డినర్ మాత్రలు దానికి సంకేతాలు కావచ్చు. ఈ వాక్యం చూడండి. భగవంతం రాస్తాడు: ''భరించలే ననుకుంటే, ఇంక లాభంలేదనుకుంటే పరుగెత్తుకురా...", "డిజార్డర్, నీ జీవితానికి అర్థం డిజార్డర్. నీ దేహానికీ నీ మెటాఫిజికల్ ఉనికికే అర్థం డిజార్డర్." మనిషి ఈ అవ్యవస్థాభారాన్ని మోసుకు తిరుగుతుంటాడన్నమాట. విరుగుడుగా *సుబ్బారాయుడి రహస్య జీవితం* ఒక వ్యర్థ ప్రయత్నం. ఆత్మ వంచన. ఉల్లిపొరలు తొలగించిన తరువాత ఏముంది? పాము కుబుసం విడిచినట్టు ఒక రోజు అలఖ్ నిరంజన్ మరొకరోజు డాలీ. ఈ శేషాచలము కొన్ని కథల్లో కనిపిస్తాడు. తెలుగు కథాసాహిత్యంలో శాశ్వతంగా కళ కళలాడే భగవంతం *కోసం* వలస పక్షుల గానంలో ఒక వాక్యం ఉంది. "ఏం చేస్తున్నావు కొండమ్మ తల్లీ?" "ఏవీ లేదు. పెసలు ఆరబెడుతున్నాను". ఆరబెట్టి? పెసరట్లు వేస్తుంది. మళ్లీ పెసలు అలా ఆరబెడుతూనే ఉంటుంది. వీటిలో త్రిపురకి ఆంతరిక బాంధవ్యం ఉంది. కాశీలో గంగ, విశాఖ సముద్రం, సరస్సులు, చెరువులు. వర్షంలో ఎప్పుడూ తడుస్తూంటాడు.

గొలుసులు, చాపం, విడుదల భావం, మరో గొప్ప కథ. గొప్పగా చెప్పిన కథ. త్రిపుర కథల ఆకర్షణ. ఇతఃపూర్వం తెలుగులో లేని శైలి, పద బంధాలు, విశాఖ మాండలికం, తెలుగుతనం, ఆంగ్ల సాహిత్యంలో గాఢపరిచయం ఉన్నా ఎక్కడో తప్ప ఆయన మెటాఫర్ ఆంగ్లవాసనలు వెయ్యని కథనం ఆయనిది. 'ఉత్త గోధుమ రంగు వేడి భావన', 'ఒత్తులేని 'ధ' లా ఉన్న మధ్యధరా'సముద్రం', 'ఆశ్చర్యార్థకాల వంటి తాడిచెట్ల' వంటి అద్భుతమైన పోలికలు ప్రతి కథలో దొరుకుతాయి. చాలా సహజంగా, అలవోకగా కథనంలో, ఇతివృత్తంలో కలిసి పోయి కథతో పాటు జ్ఞాపకం ఒస్తాయి- త్రిపుర కథల్ని అనుకరించాలి అనుకునే వారు రెండు విషయాలు మర్చిపోకూడదు. ఒకటి దృక్పథానికి సంబంధించిన నిజాయితీ. రెండు, కథనం లోపం కథ రాయకూడదు. *జర్కన్* లాంటి గొప్ప కథ ఆయన భగవంతం కోసం రాసినట్టు రాయలేదు. *చీకటి గదులు, వంతెనలు, వలస పక్షుల గానం,* వంటి కథలు దేని కథనాన్ని అదే పోల్చుకున్నాయి. కథలన్నీ రంగూన్, బర్మా, కాశీ వంటి భిన్న ప్రాంతాల్లో జరుగుతాయి. కథలనిండా అందరూ తెలుగువాళ్ళు కారు. కథకుడిగా త్రిపుర సాధించిన ప్రత్యేకత ఒకటి నాకిష్టం. ఆయన చదువు, జ్ఞానం ఎక్కడా ఏ కథలోనూ పాఠకుల మీద రుద్దలేదు. తాను చెప్పదల్చుకున్నది చెప్పుకుంటూ వెళ్లిపోయాడాయన. రావిశాస్త్రి కథల నిండా కనిపించే అలంకార భారం కనిపించదు. ఒక కథలో త్రిపురగారంటారు ''జ్ఞాపకాల ముక్కల అస్తవ్యస్తపు సముదాయమే జీవితం... మనం ఉందనుకున్న పేటర్న్ అసలు ఉన్నది కాదు... మనం అవసరాల కోసం ఇంపోజ్ చేసినది".

ఈ కథలు చదివిన తరువాత త్రిపుర జీవితంలో ఒక అలజడి, సందిగ్ధత, చింతన ముప్పేటగా creative catharisis గా వెలువడిందనిపిస్తుంది. అందుకే ఆయన కథలన్నీ 1963-81 మధ్య రాసినవే. బహుశా అది ఆయన్ని కుదిపేసిన సృజన రుతువు. తాజాగా మామూలు తెలుగులో కథల్లోకి ఒదిగిన త్రిపుర కొన్ని వాక్యాలు నాకు 90లో రాసిన *వలస పక్షుల గానంలో* కనిపించలేదు. అది కథకి లోపం అనడంలేదు. *భగవంతం* కోసం కథ నిండా అబ్బురపరచే వాక్యాలున్నాయి. 'ఏడో నంబరు బస్సులాగా బలిసిన ఊరకుక్క' మరోచోట 'ఎండ బుర్రమీద కుండ పోతగా పడి తుళ్లుతోంది', 'గాలి మండుతున్న కాంతి', 'పెదవులు కొరికెయ్యగా మిగిలిన మాటలు', భగవంతంగారిల్లు 'భోంచేసి బొజ్జ నిమురు కుంటున్నట్టుగా ఉంది', *వలస పక్షుల గానం* ఒక విషాద గీతం. మనకి తెలీకుండానే మనసు చుట్టూ పల్చటి మేఘం చుట్టు ముడుతుంది. మొత్తం జీవన విషాదపు చేదు రుచి గుండెకి పడుతుంది. జీవితకాలపు స్మృతి శకలాలు పక్షులై ఎగిరి వచ్చి ఒక తటాక నిశ్శబ్దాన్ని చిందరవందర చేస్తాయి. నిర్మాణపరంగా కథ కొంచెం పెద్దదనిపించినా అది త్రిపుర swan song. అనుమానం లేదు. చిత్రం ఏమంటే కథ మరో ప్రయాణం మొదలవడంలో ముగుస్తుంది. మరోసారి లేదా పదిహేనోసారి చివరిసారిగా రెండు మాటలు, చెప్పినవే చెప్పి ముగించాడు. సుశీల అంటుంది, 'రారు కాబోలు మనం వేళ్లేలోగా'; 'రారు'! 'మరి ఎప్పుడూ రారా మన దగ్గరకి'! 'రారు'...'రాలేరు వాళ్ళు పాపం'

మనసులో ఎక్కడో ముల్లు గుచ్చుకుంటుంది. నీ జన్మంతా నీ ముందు పరుచుకుంటుంది. కళ్లు చెమ్మగిల్లుతాయి. అనుకోకుండా నీ కళ్లు గోడకి వేలాడే ఫోటోల వేపు చూస్తాయి. ఇదొక కొలనులో కలకలం. పై సంభాషణకి ముందు ఒక వాక్యం రాశాడు... ఈ ఇంటినీ, సరస్సునీ, ఈ వూరినీ వదిలి ఈ ఇరవై ఏడేళ్ల స్మృతి శకలాల్ని మోసుకుని; ఇరవై ఏడేళ్ల స్మృతి శకలాలు అంటే ఆయన మొదటి కథ 1963లో రాశాడు. 1990లో, అంటే 27 సంవత్సరాల తరువాత చివరి కథ ముగించాడు- త్రిపుర గదిలోకి వెళ్లి తలుపు వేసుకున్నాడనిపించింది. ఏది ఏమైనా - త్రిపురా ఉంటాను. మి

**తల్లావఝ్ఝుల పతంజలి శాస్త్రి, కథా రచయిత,**
**స్వచ్ఛంద పర్యావరణ పరిరక్షకులు,**
**రాజమండ్రి. ఫోన్ : 9440703440**

*(త్రిపుర - జయంతి : 02.09.1928 - వర్ధంతి : 24.05.2013)*



# తెనాలిలో రావూరి భరద్వాజ

*- వెలగా వెంకటప్పయ్య*

ఇప్పటికీ చాలామంది అనుకుంటూ ఉంటారు. ఆ కాలంలో అంటే 1945-60 మధ్య తెనాలిలో గడపలేక పోయామేనని. ఆ దినాలలో నవ్యభావనకు మోసులెత్తించిన కవి పండితులు, మహా నటీనటులు ఒకే కాలంలో తెనాలిలో నడయాడుతూ తెనాలికి కీర్తి ప్రతిష్ఠలు సంపాదించి పెట్టారు.

ఆ మహనీయులలో రావూరి భరద్వాజగారికి సముచిత స్థానం ఉంది. తెగిన గాలిపటంలా 1948-49లలో తెనాలిలో జ్యోతి పత్రిక కార్యాలయంలో సహాయకుడుగా కుదురుకున్నారు. ఆ పత్రిక యజమాని ఆలపాటి రవీంద్రనాథ్ చౌదరిగారు తెనాలి సమీపంలో వున్న గోవాడ గ్రామవాసి, మంచి స్థితిమంతులు. అంతకుమించి గొప్ప సంస్కారి, సహృదయులు. ఆ పైగా మంచి అందగాడు. గ్లాస్గోలాల్చీతో రోడ్డుపై నడుస్తుంటే జనం వారిని చిత్రంగా చూసేవారు. వారు 1947లో ప్రారంభించిన జ్యోతి - మాసపత్రిక యువతరాన్ని ఒక ఊపు ఊపింది. ప్రతి యువకుని చేతిలో ఆ పత్రిక కనిపిస్తూ ఉండేది.

అప్పటికి భరద్వాజగారికి వివాహం కాలేదను కుంటాను. మధ్యస్థ రూపం. లాల్చీ, లుంగీ - ఇప్పటి మాదిరిగానే ఉండేవి. పత్రికా కార్యాలయంలో బల్లలమీదే పడక, హోటల్ భోజనం, నాకు తెలిసినంతవరకు ఆనాడు వారి నెల జీతం రు. 30/-కి మించదు. కథ రాస్తే అది రవీంద్రనాథ్ గారికి నచ్చితే, మరో రు. 10/- లు. పారితోషికం ఇచ్చేవారు. ఆ రోజులలో కొందరు కథకులు ముఖ్యంగా రోజు గడవని వారు, కథరాసి తీసుకువచ్చి ఇస్తే- ఆ కథ వెంటనే చదివి బాగుంటే రు. 10/- లు లేదా రు. 15/- లు రొక్కం ఇచ్చేవారు. దాన్ని రచయిత ఒక పండుగలా భావించి ఆనందించేవారు. కథ బాగా లేకపోతే రచయితకు రు. 5/- ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. అచట బతుకుదెరువు సమస్య ఉంది. అది రవీంద్రనాథ్‌గారి ఔదార్యం. రు. 5-తో ఐదు దినాలు భోజనం, టిఫిన్ లభించేది. ఆ రోజులలో డబ్బుకు ఎంతో కటకట, విలువ ఉండేది. తెనాలికి చెందిన కథకులు మునిపల్లె రాజుగారు 1940లో తెనాలి పరిస్థితిని గురించి రాస్తూ, 1930 దశకంలో నవర్సు బంగారం ధర మూడు రూపాయలనీ, బస్తా బియ్యం రెండున్నర రూపాయలనీ, పూటకూళ్ళ ఇళ్ళల్లో పావలాకు (25 పైసలు) సుష్టయిన భోజనం లభిస్తుందనీ, మెయిన్‌రోడ్‌లోని గోల్డెన్ కేఫ్‌లో రెండణాలకే నేతి పెసరట్టు, అరకప్పు చిక్కని కాఫీ లభిస్తుంటే ఆశ్చర్యపోతాం. దాదాపు 1950 దాకా తెనాలిలో పూటకూళ్ళు పెట్టే ఇళ్లుండేవి.

రవీంద్రనాథ్ గారికి చిత్ర, విచిత్రమైన అభిరుచులు ఉండేవి. పాఠకుల దృష్టితోనే పత్రికలు చూసేవారు. సెక్స్ మిళితం చేసిన కథలు బాగా పాఠకులను ఆకట్టుకుంటాయని వారి అభిప్రాయం. ఆ మార్గంలో భరద్వాజగారి చేత *అలవాటైన ప్రాణం* - కథ రాయించి అచ్చేస్తే దానిపై ఒకరు కేసు పెట్టగా వారికి రు. 500/- జరిమానా కోర్టువారు విధిస్తే దాన్ని రవీంద్రనాథ్‌గారే చెల్లించి, భరద్వాజగారిని బయటపడేశారు. అదీ వారి ఔదార్యం.

జ్యోతి తొలి సంవత్సరాలలో, సుప్రసిద్ధ కథకులు ధనికొండ హనుమంతరావు అచ్చటే పనిచేసేవారు. ధనికొండ చాలా నిక్కచ్చయిన మనిషి. ఫైర్ బ్రాండ్. పైగా విద్వత్ సంపన్నులు. రవీంద్రనాథ్‌గారు ప్రారంభించిన *రేరాణి* మాసపత్రిక చూసేవారు. ఒక చిన్న మాటపట్టింపు వలన అక్కడ మానేసి వారు సొంత కుంపటి పెట్టుకుని *అభిసారిక* అనే మాసపత్రికను 1950 ప్రాంతంలో ప్రారంభించారు. *రేరాణి* - *అభిసారిక* మాసపత్రికలు ఆనాడు ఆంధ్రదేశంలో యువతరాన్ని ఉర్రూతలూపాయి. ధనికొండవారికి గల గొప్ప సరదా ఏమంటే రచయితకు పత్రిక కాంప్లిమెంటరీ కాపీ,

పారితోషికం ఒకే రోజున అందేలా చూసేవారు. పారితోషికం లేకుండా రచన వేసేవారు కాదు. బాగా లేని రచన, పత్రిక ఖర్చుతో తిప్పి పంపేవారు. మనకోసం రచన చేశారు. మనకు బాగా లేనపుడు తిప్పిపంపడం మన ధర్మం అనేవారు. ఆ దినాలలో *అభిసారిక* మాసపత్రికలో దాసరి సుబ్రహ్మణ్యం గారు పనిచేసేవారు. వారూ పత్రికాఫీసులోనే మకాం. వారానాడు *అభిసారిక*లో పతివ్రత – అనే కథ రాశారు. దీని సారాంశం ఏమంటే – ఒక వ్యక్తి, భార్యతో ఉంటూనే – రెండో కాపురం పెడతాడు. ఈ విషయం భార్యకు తెలుస్తుంది. ఆమె ఆలోచన మరోవైపుకు మళ్ళింది. భర్త తప్పు చేశాడు గనుక నరకానికి వెళతాడు. మరో జన్మలో అయినా ఆ భర్త నాకే సొంతం కావాలి అనుకుని తానూ నరకానికి వెళ్ళదలచి – పక్కవీధిలో గల టైలరుతో సంబంధం పెట్టుకుంటుంది. ఈ చిన్న కథ ఆనాడు పెద్ద దుమారం లేపింది. కుటుంబ వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తున్నారంటూ కొందరు ధనికొండ వారిపై విరుచుకు పడ్డారు. సమస్య పక్క దారి పట్టే సమయంలో రవీంద్రనాథ్ గారు, అందరినీ తన ఆఫీసుకు పిలిపించి, సర్దుబాటు చేశారు. అంతటి నిభాయింపు పెద్దరికం రవీంద్రనాథ్ గారికి ఆనాడు ఉండేది.

భరద్వాజగారు తెనాలిలో అడుగుపెట్టిన వేళావిశేషం చేత, తెనాలి వచ్చాక స్వయం కృషితో, విశేష అధ్యయనంతో మంచి కథకుడుగా రూపొందారు. తాను కూడపెట్టిన ప్రతి పైసాతో పుస్తకాలు కొనేవారు. ఆనాడు టీకా తాత్పర్యాలతో గల వసుచరిత్ర రు. 6.00, మను చరిత్ర రు. 5.00, మహాప్రస్థానం (తొలి ముద్రణ) రు. 3.50– వీటిని స్వయంగా కొని ప్రతి అక్షరం దేగకళ్ళతో చదివి భాషపై పట్టు సాధించారు. దీనికితోడు రోజూ పదిగంటలు ప్రూఫులు దిద్దేపని వారిలో శబ్దస్వరూపాలపై అధికారం పెంచింది. ఆ విధంగా తెనాలిలోనే భరద్వాజగారిలో మంచి రచయిత రూపుదిద్దుకున్నాడు.

తెనాలిలో భరద్వాజగారికి మంచి మిత్రబృందం ఉండేది. మిత్రులు అంటే, తన బలహీనతలను తెలుసుకొని, వాటిని సొమ్ము చేసుకోకుండా, తన ఉనికికి సహకరించే వారు. వారిలో అబ్బరాజు నాగభూషణం, శారద, అలూరి భుజంగరావు, శార్వరి, తొలిశ్రేణిలోని వారు. వీరూ రోజూ కలిసేవారు. రాత్రి 12 గం. వరకు సాహిత్య చర్చలు చేస్తూ గడిపేవారు. అదే వారి ప్రపంచం. వీరిలో ఏ ఒక్కరూ పరిశుభ్రమైన బట్ట కట్టి ఎరుగరు. వారి ధ్యాస, ఆలోచన వేరు. తదుపరి తాళ్ళూరి నాగేశ్వరరావు, హితశ్రీ, కవిరావు, వేజండ్ల సాంబశివరావు, అలపర్తి వెంకట సుబ్బారావు, నేనూ రెండో శ్రేణికి చెందినవారం. అపుడపుడూ కలిసేవారం. భరద్వాజగారి జ్ఞానతృష్ణ తీర్చినవారిలో మండవ శ్రీనివాసరావు గారిని విస్మరించలేం. హైదరాబాదు, సికింద్రాబాదులలో నిర్వహించే అజంతా కూల్‌డ్రింక్స్ యజమాని మండవ శ్రీనివాసరావుగారికి ఆనాడు తెనాలిలో న్యూస్ పేపరు ఏజెన్సీ ఉండేది. అన్ని పత్రికలను ఆనాడు తెప్పించేవారు. భరద్వాజ, శారదగార్లకు రాత్రి పూట కొత్త పత్రికలను చదివేందుకు ఉచితంగా ఇచ్చేవారు. ఆ విధంగా భరద్వాజగారికి తెనాలిలో ఉండగానే విద్వత్ సంపద పెరిగింది. ఈ నేపథ్యంతో ఆకాశవాణి, హైదరాబాదులో మంచి ఉద్యోగం సంపాదించి అంచెలంచెలుగా ఎదిగారు.

భరద్వాజగారు కొంతకాలం కూచిపూడికి చెందిన హేతువాది కోగంటి రాధాకృష్ణమూర్తిగారి నలందా ప్రెస్‌లో కూడా పనిచేశారు. ఇచట, *సమీక్ష* – మాసపత్రికను రాధాకృష్ణమూర్తిగారు నడిపేవారు. పాఠ్య గ్రంథాలు ప్రచురించేవారు. నేను 1949లో తెనాలిలో హైస్కూలు విద్య పూర్తిచేశాను. అప్పటికి తెనాలిలో కాలేజి లేదు. చదువుకు అంతరాయం. 1952లో తెనాలిలో కాలేజీ పెట్టాక ఇంటరు పూర్తిచేశాను. ఆ కాలేజిలో ఆనాడు డిగ్రీలేదు. మరల చదువుకు అంతరాయం. ఈ అంతరాయం కలుగుతున్న కాలాలలో కాలక్షేపం పత్రికా కార్యాలయాలే. ఉదయం సాయంత్రం అచటే మకాం.

తరచు ఆ దినాలలో తాళ్ళూరి నాగేశ్వరరావు కొలకలూరి నుంచి వచ్చి మాతో కలిసేవారు. ఆనాటి నుంచి రవీంద్రనాథ్ గారితో గల స్నేహబంధం వారి తుదిశ్వాస వరకు కొనసాగింది. అదొక మధురానుభూతి. ఇలా మరపురాని సన్నివేశాలు ఎన్నో – అలాగే భరద్వాజగారితో గల చిరకాల స్నేహబంధం నిరంతరాయంగా కొనసాగుతూంది. నన్ను ఏకవచనంతో సంబోధించే ధైర్యం ఆనాడు భరద్వాజగారికి ఒక్కరికే ఉంది. అదీ మా మైత్రికి నిదర్శనం. మి

వెలగా వెంకటప్పయ్య
గ్రంథాలయోద్యమ నాయకులు,
తెనాలి, ఫోన్ : 9490449555

# తెలుగు జాతి శిల్ప కళావైభవం

- శ్రీమతి ఎ.శ్రీదేవి

**నీ కళా కిరణాలు నిఖిల దిక్కులలోన**
**నిండింపరా శిల్ప పండుతవి భాగ్యాలు**
**నిదుర మైకము వీడరా**
**భారతాభ్యుదయము కావింపరా!** *- తోరణ కావ్యము*

**ఈ పవిత్రావనీ ఖండమెల్ల యెడల**
**పెళ్ల పెళ్లను విరిచి చూపించగలను**
**నా కళాదేవి చరణ చిహ్నములు కొన్ని**
**నా ప్రశంసన వర్ణ ఫలకములుకొన్ని** *- పులివర్తి శరభా చార్యులు*

**జగచ్ఛిల్పము :** సృష్టిని ఆనందమయం, సౌందర్యనిలయం గా మార్చడంలో శిల్పులదే పైచేయి. సుందరభావమే ఆనందాన్ని కలిగిస్తుంది. ఆ ఆనందం నుండే అభిప్రాయాలు, అభీష్టాలు, భావాలు, ఊహలు చెలరేగుతాయి. మానవుని మనసు ఒక మహాసముద్రం. సముద్రంలో ఎన్ని తరంగాలుంటాయో, కళాకారుని హృదయంలో అన్ని భావాలుంటాయి. వాటి చిత్ర విచిత్ర గతులు వర్ణించలేము. అందుకే శిలలను గూర్చి శిలాశాస్త్రం, లోహాలను గూర్చి లోహశాస్త్రం వెలువడ్డాయి.

ఇందులో 1. భావ శిల్పము, 2. వాఙ్మయ శిల్పము, 3. రూప శిల్పము, 4. దేవాలయ శిల్పము, 5. యంత్ర శిల్పము వున్నాయి. శిల్పము లేనిది జగము లేదు. కోలవెన్ను పరబ్రహ్మతీర్థుల వారు *జగచ్ఛిల్పము* అనుగొప్ప శిల్పశాస్త్ర గ్రంథాన్ని వెలయించారు. శిల్పశాస్త్రం అద్భుతం, ఆనందము, సౌందర్యమయమునయి జగత్కర్త సృష్టిని మరింత ఆనందమయం చేసింది. 'విశ్వకర్మ మయం జగత్' విశ్వమును నిర్మించిన వాడాయన.

నగర నిర్మాణం, వాడే కూప తటాకాలు, భవనాలు, రాజసౌధాలు, సభావేదికలు, రాజాస్థానాలు, యజ్ఞవేదికలు ఉద్యానవనాలు ఇదంతా ఒక శాస్త్రం. శిలా శిల్పమొకటి ప్రత్యేకమైనది. ఆయా సుందర శిల్పాలతో గృహాల నలంకరించుకొని జీవితాలని ఆనందమయం చేసు కుంటున్నాం. అందుకే మహాకవి "శిలలపై శిల్పాలు చెక్కినారు మనవాళ్ళు సృష్టికే అందాలు తెచ్చినారు" అని వ్రాశారు. "ఈ నల్లని రాలలో ఏ కన్నులు దాగెనో, ఆ బండల మాటున ఏ గుండెలు మ్రోగెనో..!" అందొక కవి హృదయం. మనది కర్మ భూమి, ధర్మ భూమి. ప్రజలంతా కర్మశీలురు. వ్యవసాయం, పశుపాలన, వాణిజ్యం వివిధ కర్మములు, ధనార్జనకు ముఖ్యసాధనాలు. అభ్యుదయ సమాజానికి ముఖ్య ఉపాధులని, మహాభారతంలో అర్జునుడు అభిప్రాయపడినాడు. అర్జునుడు ధర్మ తత్త్వం తెలిసినవాడు. అర్థశాస్త్ర కోవిదుడు. ధర్మరాజు శిబిరంలో రకరకాలుగా వేతనాలు తీసుకునే శిల్పులుండే వారని మహాభారతం వలన తెలుస్తుంది. మహాభారతంలో ప్రజాపతి విశ్వకర్మ, దానవ విశ్వకర్మ మయుడుగా ప్రసిద్ధి వహించాడు. స్థపతి, తక్షకి, వర్ధకి, రథకార, కర్మకార, కర్మాల, హిరణ్యకార అనే శబ్దాలు శిల్పి పదానికి పర్యాయపదాలు.

**స్థపతి :** దేవతా మూర్తులను స్థాపించటానికి అర్హతగలవాడు. వేద వేదాంగవేత్త! శాస్త్ర పారంగతుడు తపోనిష్ఠ గలవాడు. ఆచార్య పీఠానికి అధిపతి ! అధర్వణ వేదం, శిల్పశాస్త్రములు అధ్యయనం చేసి వుండాలి. దేవతామంత్రానుష్ఠాన పరుడు, సదాచార సంపన్నుడుగా వుండాలి.

**తక్షకుడు :** అనగా చెక్కువాడు. ముడిపదార్థాలైన చెక్క, తామ్ర, శిల్ప, స్వర్ణాదులను చెక్కిగాని, కరిగించిగాని శిల్పాలు చేసేవాడు.

**శిల్పము-పురాణాలు-వేదాలు :** మహాభారతంలో ఎందరో శిల్పకారులున్నారు. వారిలో తక్షకులు, వర్ధకులు, రథకారులు, స్వర్ణకారులు, కర్మకారులు వున్నారు. దంతకారులు, మణికారులు కూడా ముఖ్యమైన వారే. పురోచన శిల్పాచార్యుడు దుర్యోధన సార్వభౌముని మంత్రి, లాక్షాగృహం నిర్మించినవాడు. మయుడు దేవశిల్పి. చిత్ర విచిత్రమైన, సౌందర్యశోభితమైన కౌశలముతో నిండిన మయ సభ నిర్మించిన వాడు. పాండవులతో బాటుగా అందరి ఆమోదాన్ని పొందినవాడు. శిల్పులు శివ స్వరూపులని *స్కంధ పురాణం* చెబుతోంది. శివునకు శిల్పులకు బేధం లేదని చెప్పారు. విశ్వకర్మ వంశంలో పుట్టిన శిల్పి బ్రాహ్మణులే. దేవతామూర్తి నిర్మాణం చేయగల సమర్థులు. "నే విశ్వమును సృష్టిస్తున్నాను. నన్ను శిల్పులు సృష్టిస్తున్నారు. నా వలన శిల్పులు పుడుతున్నారు. శిల్పుల వలన శివలింగములు.

శిల్పి నా రూపము" అని శివుడు పార్వతితో చెప్పాడు. కనుక శిల్పి విశ్వకర్మ స్వరూపుడే! వాస్తు విద్యకు శివుడు మూలపురుషుడని *కాశ్యప శిల్పము, మానసార, గార్గేయాగమ విశ్వకర్మ ప్రకాశిక* మొదలైన వాస్తు శాస్త్ర గ్రంథాలు చెబుతున్నాయి. ఇంద్రుడు కూడా శిల్ప శాస్త్ర కోవిదుడని ఋగ్వేదం చెబుతోంది. సహస్రాక్షుడు శిల్ప కర్మాధిపతి అని. కనుక ఇంద్రుడు సామాన్యుడేమీ కాదు. గొప్ప వాస్తు శిల్పి అని వేదవాక్కు. మొదటి నౌకను నిర్మించింది. వైవస్వత మనువు. ఆది మత్స్యము మనువుకి ఉపకారం చేయదలచింది. మత్స్యము చెప్పినట్లుగా మనువు ఓడను నిర్మించి, సకల ధన ధాన్యములు, సకల జంతువుల నమూనాలు, సేకరించి అందులో చేర్చి సముద్రం దాటాడు. ఆ విధంగా సమస్త జీవకోటి రక్షింపబడింది. *ఎఱ్ఱాప్రెగడ అరణ్యపర్వము 4-226; 4-229-30)*

దీర్ఘతముడు జలసారథి. ఆయనే మూల పురుషుడు. ఆయన భార్య ప్రద్వేషిణి. భర్తపై కోపించి కుమారులను పిలిచి, అంధుడైన భర్తను గంగలో తోసి వేయమని ఆజ్ఞాపించింది. వారట్లే చేశారు. ఆ దీర్ఘతముడు నదిలో కొట్టుకుపోయి, ఒక మహారాజుగారికి దొరికాడు. ఆయన వంశాన్ని నిలబెట్టాడు. ఋగ్వేదంలో దీర్ఘతముడు జలసారథిగా చెప్పబడినాడు. నలుడు విశ్వకర్మ కుమారుడు. శిల్పకళాచాతుర్యం గలవాడు. సేతువులు నిర్మించటంలో ఘనుడు. స్వయంగా సముద్రుడే శ్రీరామచంద్రునితో నివేదించాడు. ఇతడు నూరు యోజనాల పొడవు, నూరు యోజనాల వెడల్పు గల సేతువు నిర్మించిన మహాపురుషుడు. ఆ సేతువును దాటి వానరులు లంకలో ప్రవేశించారు. వాల్మీకి రామాయణం, యుద్ధకాండలో యీ విషయం ఉంది.

**"స వానర వరః శ్రమాన్ విశ్వకర్మాత్మజో బలీ!**
**బ బంధసాగరే సేతుం యథా చాస్యపితా శథా"॥**

*- యుద్ధకాండ 22-73*

కళాప్రపూర్ణ, దర్శనాచార్య కొండూరు వీరనారాయణాచార్యులు, ఎన్నో శిల్ప శాస్త్రగ్రంథాలు, పురాణాలు, ప్రబంధాలు వ్యాసములు, ఖండకావ్యాలు, పరిశీలించి, పరిశోధించి, వేదాలతో సమన్వయం చేసి శిల్ప శాస్త్ర గ్రంథం వెలువరించారు. అదే *శిల్ప దర్శనం.*

**"శిల్ప మాతా శిలా పుత్రో దాసత్వం సర్వ పూజకాః**
**కర్తవ్య ఇంద్ర భోగశ్చేతదం త్రివిధ లక్షణమ్"** *3-23*

శిల్పకారుడు తల్లి - శిల కుమారుడు. దాసులు పూజకులు ఇవి సరిగ్గా సమకూరిన ఇంద్రభోగము. *శిల్ప దర్శనం* ప్రామాణిక గ్రంథం. ఇది శిల్ప విజ్ఞాన సర్వస్వం. కొండూరు వారి శిల్ప శాస్త్ర పాండిత్యం అనితరసారథ్యం. ఈ నాడు భారతీయ శిల్పం గురించి, శిల్పాగమ శాస్త్రాల గురించి సాధికారికంగా చెప్పగలవారు, వ్రాయగలవారు చాల తక్కువ. *శిల్ప దర్శనం*లో - 1.ప్రతిమా లక్షణ సౌందర్యములు, 2. లింగ తత్త్వస్వరూపాలు, 3. దేవతా మూర్తి బేధములు, శిల్పాగమాలు, శిల్పాచార్యులు అనే అంశాల ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇంకా తెలుసుకోవలసిన అంశాలు చాలా వున్నాయని ఆచార్యుల వారి అభిప్రాయం. ఆచార్యుల వారు శిల్ప, సాహిత్య, యోగ వేదాంత శాస్త్రాలలో చేస్తున్న కృషి ప్రశంసనీయం అని వేలూరి శివరామశాస్త్రిగారు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇంకా వారు యిలా అన్నారు. "శ్రీ వీరరాఘవాచార్యులు లలిత కళలలో అందె వేసిన చేయి. ఆనందకుమార స్వామి, గంగూలీ మొదలగు వారి కోవకు చెందిన వారు." అదీ వారి అభిప్రాయం. వారు అనారోగ్యం వలన యింకా కొన్ని విషయాలు వ్రాయలేక పోయారు.

**చరిత్రలో శిల్పం - శిల్ప బ్రహ్మలు :** భారతదేశంలో శిల్ప చరిత్ర చాలా పురాతనమైనది. శిల్ప ప్రవర్తకులు ఆనాడే వున్నారు. "శిల్పులు రూపము చేతనే అభీష్టమగు దేవతను, ధ్యానము చేయుదురు" అని *శిల్పోపనిషత్* చెబుతోంది. వేదాలలో కొన్ని మంత్రాలు చక్కగా నిర్మింపబడిన రథము వలె యీ మంత్రం ఇంద్రుని దోడ్కొని వచ్చుటకు సమర్థమగుగాక!" పరమేశ్వరుడు కర్మకారుని వలె యీ జగమును సృష్టించెను అనే వర్ణనలున్నాయి.

మొహంజదారో, హరప్పాలలోని చిహ్నాలను బట్టి, ఇక్కడ శిల్పకళ అతిప్రాచీనమని తెలుస్తోంది. పంచజునులు, పంచలోహ శిల్పాలు, పాంచాల శిల్పులు యిలా పంచ అనే పదానికి శిల్ప శాస్త్రములో ప్రాధాన్యమున్నది.

**శిల్ప బ్రాహ్మలు :** సనాతన ఋషి, *బ్రహ్మాండ పురాణం*లో ఈ ఋషిని గురించి ప్రస్తావించారు. ఆకలి దప్పులు లేని వాడు, దారు కర్మమును కనిపెట్టిన వాడు, మందిరాలు, రథాలు, ప్రయాణ సాధనాలు సృష్టించాడు. వీరిలో ప్రథమాచార్యుడు విశ్వకర్మ పరమేష్ఠి, సానగుడు, సనాతనుడు, సనారువు, తరువాత వీరి నుండి 55 మంది మహర్షులు, వారి ద్వారా యీ బ్రహ్మ విద్య వ్యాపించింది. వీరు శిల్ప విద్యా ప్రవర్తికులు. బ్రహ్మవిద్యను ఉపదేశించిన వారు.

**అహభూవన ఋషి :** ఈయన విశ్వకర్మ ముఖము నుండి పుట్టి గృహస్థ ధర్మాన్ని సృష్టించాడు. బంగారంతో పాత్రలు చేయటం, ప్రారంభించి లోకానికి ఉపకారం చేశాడు.

**ప్రత్నఋషి :** *బ్రహ్మాండ పురాణం*లో ఈయన ప్రసక్తి వస్తుంది. ఈయన శిలా శిల్పము ఉపదేశించాడు. "శిలా కర్మ చ శివునాం." నానావిధ దేవతా మూర్తులు, దేవాలయములు, మండప ప్రాకారాలు, గోపురాల నిర్మాణం కనిపెట్టి లోకోపకారం చేశాడు.

**సుపర్ణ ఋషి :** ఈయన అందగాడు. మహోన్నతుడు. మహాత్ముడు. సుపర్ణ శిల్పమునకు ప్రయోక్త కిరీట కుండలాది భూషణములు నిర్మాణమునకు కర్త. బ్రహ్మ, విశ్వకర్మలకు అభేదము. మనువు, మయుడు, త్వష్ట, శిల్పి విశ్వజ్ఞుడు అయిదుగురు విశ్వకర్మ కుమారులు.



**మనువు శివుడును, మయుడు రమాధవుండు**
**త్వష్ట పరమేష్టి, శిల్ప వృద్ధ శ్రవుండు**
**తక్ష భానుండునగు, వీరు దైవ గురులు**
**విశ్వకర్మాగ్ర నందనులే వినుత పుణ్య**

*– నాగర ఖండము*

విశ్వరూపుడు, కశ్యపుడు, విశిష్ట శిల్ప నిర్మాతలు కశ్యపుని శిల్పము కాంతిమంతము, చిత్ర విచిత్రము సంపూర్ణము. కశ్యపుడు నిర్మించినది కనుక భూమి కాశ్యపి అయినది.

**శిల్ప గ్రంథాలు :** ఇంతటి విశ్వ విజ్ఞానానికి ఆధారమైన గ్రంథాలు, వాని పేర్లు తెలుసుకోవటం సమంజసమే అనిపిస్తుంది. ఇరువది వరకు విశ్వకర్మ నిర్మించిన శిల్ప శాస్త్ర గ్రంథాలున్నాయి. *విశ్వకర్మ ప్రకాశిక* ఒకటి. ఇది గొప్ప ప్రామాణిక గ్రంథం. వాస్తు విద్వాంసులకి కల్పవృక్షం.

**అథసు విదుల విద్యో విశ్వకర్మా మహాత్మ**
**సకల గుణ వశిష్ఠ స్సర్వ శాస్త్రార్థ వేత్తా**
**సకల సురగణానాం సూత్ర ధారః కృతాత్మా**
**భువన నివసితాం సచ్ఛాస్త్రమేత చకార–**

గృహస్థుల ఉపయోగం కోసం విశ్వకర్మ యీ శాస్త్ర గ్రంథము చెప్పెను.

**విశ్వకర్మ వాస్తుశాస్త్రము :** దేవశిల్ప విశ్వకర్మ వ్రాసినది.

**విశ్వకర్మాశిల్పమ్ :** *విశ్వకర్మీయ* మని మరొక పేరు. 'అథ విశ్వం కరోతీతి విశ్వకర్మా' – విశ్వమును నిర్మించు వాడు కనుక కవి విశ్వకర్మ.

**మయమతమ్ :** ఇదిమయ శిల్ప శాస్త్రము. విశ్వకర్మకుల శ్రేష్ఠో ధర్మజ్ఞు వేద పారగః ఇతడు సత్యవచనుడు, సదాచార సంపన్నుడు, సమస్త శాస్త్రాలు చదివినవాడు, ఆరోగ్యశాలి, ప్రభాశీల వంతుడు అయివుండాలి.

**మయవాస్తువు :** ఇది చిన్న గ్రంథము శిల్ప శాస్త్రం. వాస్తు విశేషాలిందులో వున్నాయి. నవతాళ ప్రమాణములతో విగ్రహములు చేయు విధానం, గోపుర నిర్మాణంతో యీ గ్రంథం పూర్తవుతుంది.

**కాశ్యప శిల్పము :** కాశ్యపుడు నిర్మించినది శివతత్త్వ ప్రధానమైన అంశాలున్నాయి. మహాదేవుని కరుణ వలన తానీ గ్రంథం వ్రాశానని చెప్పుకున్నాడు.

**మానసారము :** దేవతా మూర్తుల, భవనముల కొలతలు, సారములు యిందున్నాయి.

**యంత్రసర్వస్వము :** భరద్వాజుడు వ్రాసిన మొత్తం గ్రంథం దొరక లేదు. విమానాలు తయారు చేయు విధానం వివరించబడింది. గూఢరహస్యం, సర్పగమన రహస్యం, రూపాకర్షణ, పరశబ్దరూపగ్రాహక, దక్ ప్రదర్శన అనే విషయాలు వివరింప బడినాయి. రోహిణీ విద్యుత్తు ప్రసరింపచేస్తే, ఎదురుగా వుండే వస్తువులు కనబడతాయిని వుంది. ఈ విషయం *శక్తి తంత్రం* అనే గ్రంథంలో వున్నది. విమానములు రాత్రులయందు కూడా నడిపింప వచ్చని వుంది. వైమానిక ప్రకరణంలో ఎన్నో రహస్యాలు, ఎందరో శాస్త్రకారులు వున్నట్లు తెలుస్తున్నది.

**సమరాంగణ సూత్రధారము :** మహాశిల్ప శాస్త్ర గ్రంథము. క్రీ.శ. 11వ శతాబ్దము నాడే తెలిసింది. సమస్త వాస్తు శిల్ప గ్రంథాలు పరిశోధించి ఆయన యీ గ్రంథం వ్రాశారు. ఇది శిల్పి వాస్తు శాస్త్రాల సమగ్ర విజ్ఞానం అని చెప్పారు.

**అపరాజిత పృచ్ఛ :** భువన దేవాచార్యుడు వ్రాసిన మహాశిల్ప శాస్త్ర గ్రంథం. వైదిక శాస్త్రీయ, పౌరాణిక, చారిత్రక శిల్పాల గుణవిశేషాలు వివరించారు.

**మండన సూత్రధారుని గ్రంథాలు**

**శిల్పరత్నము :** శ్రీ కుమారుడు అను శిల్పి వ్రాశాడు. 48 అధ్యాయాలున్నాయి. భూమిలక్షణాలు ఇంకా అనేక గొప్ప విషయాలు ఇందులో పొందు పరచబడినాయి.

**శ్రీతత్త్వనిధి :** ముమ్మడి కృష్ణ రాజ ఒడయారు, మైసూరు సంస్థానాధీశులు. శాస్త్ర పురాణాలు పరిశీలించి వ్రాసిన గ్రంథం. శక్తినిధి, శివనిధి, విష్ణునిధి, బ్రహ్మనిధి, గ్రహనిధి, వైష్ణవనిధి, ఆగమనిధి, కౌతుకనిధి. వేయి దేవతల ధ్యాన లక్షణాలు ఇందులో వున్నాయి. సాహిత్యంలో శ్రీ కృష్ణదేవరాయల వలె, శిల్పశాస్త్ర రచనలో కృష్ణరాజ ఒడయారును చెప్పాల్సి వస్తుందేమో!



**నారదీయసంహిత :** నారాయణుడు ఉపదేశించాడు. నారదుడు వ్రాశాడు. పాంచరాత్ర సంప్రదాయాలు అనేక విషయాలు ఇందులో వున్నాయి. అష్టాదశ సంహితలో నారదీయ సంహిత ఒకటి.

**భారతీయ మహాశిల్పము :** శ్రీ స్వర్ణ సుబ్రహ్మణ్య కవి వ్రాశారు. వీరు ఆధునికులే! ఇందులో 16 భాగాలున్నాయి. సమస్త శిల్ప, వాస్తు, ప్రతిష్ఠ, యంత్ర మంత్రాది విషయాలున్నాయి.

**విశ్వకర్మ బ్రాహ్మణవంశాగమము :** వడ్డెపాటి నిరంజన శాస్త్రిగారి మహోన్నత కృషి ఆరు కాండలున్నాయి. శిల్పము, చరిత్ర, శిల్పాచార్యుల జనన ప్రభావాలు చూపించారు.

**ఆగమాలు :** ఆగమాలలో శిల్ప శాస్త్రము నిక్షేపించబడి వున్నది. *గార్గేయాగమం, వైఖానసాగమం, పాంచ రాత్రాగమం, శైవాగమం.* వీనిలో శిల్ప శాస్త్ర రహస్యాలు వున్నాయి. తత్త్వాలు, ఎన్నో మహిమలు వివరించబడినాయి.

**ప్రసిద్ధి వహించిన శిల్పాచార్యులు :** రాజాస్థానాల్లో గౌరవాలు పొంది తమ ప్రతిభను ప్రదర్శించి, శిల్పాలు చెక్కే శిల్ప విద్యనేర్పించి, శిల్ప శాస్త్ర విద్యాలయాలు, స్థాపించి, శిల్పులను తయారు చేసి, తమ తపశ్శక్తి చేత, శిల్ప శాస్త్ర రహస్యపాండిత్యం చేత, నైపుణ్యంచే ప్రసిద్ధి వహించిన మానవాళికి, మహోపకారం చేసిన మహనీయ కళామూర్తు లెందరో ఉన్నారు. జక్కణాచార్యుడు, డక్కణ పుల్లోజు, కన్నోజు, ఇంకా ఎందరో వారి పేర్లు సైతం తెలియవు. ఆళ్లగడ్డ శిల్పులు, ఆధునిక కాలంలో ప్రసిద్ధి చెందిన వారు ఎందరో వున్నారు.

**శిల్పకళావిశేషాలు :** తిరుపతి క్షేత్రంలోని కళా వైభవం వర్ణించ వీలుకానిది. వైష్ణవ మూర్తులు, దశావతార శిల్పాలు అద్భుతంగా వుంటాయి. కపిలేశ్వరాలయం లోని శిల్ప సంపద గొప్పది. కాళహస్తి శిల్పవైభవం వర్ణనా తీతమైనది. ఇక్కడ ముక్తిలింగము, వాయులింగము వున్నాయి. జ్ఞాన ప్రసూనాంబ యోగులకు దివ్యానుభూతిని ప్రసాదిస్తూ వుంటుంది. శైవ ప్రపంచమంతా ఇక్కడ కనిపిస్తుంది.

తాడిపత్రి దేవాలయ శోభ ఎన్నదగినది. ఇక్కడ కొన్ని స్తంభాలలో ఒక స్తంభంలోనే మూడు ఉపస్తంభాలు కనిపిస్తాయి. వీటిని మ్రోగించితే రకరకాల స్వరాలు వినిపిస్తాయి. వారు వీరూ చేతులు వేసి తడిమి చూచి ఆ సాంకేతికత పోయింది.

పెనుగొండ శిల్ప వైభవం వల్ల రామస్వామి దేవాలయం అంతా అద్భుత శిల్ప కళాసమన్వితం. దేవాలయ కుడ్యాల మీద కృష్ణలీలలు, ముద్దుగా ముచ్చటగా తీర్చబడినాయి. మహాద్భుతమైన చిత్రకళారహస్యాలు ఇందులో నిక్షిప్తమై వున్నాయి. అగస్త్యుడు ప్రతిష్ఠించిన పాపనాశేశ్వర లింగం వుంది. జటాయువు శ్రీరాముడికి సాయంచేసింది.

అచ్యుతదేవరాయల కాలంలో కోశాధికారి విరూపణ్ణ కట్టించిన ముఖమండపం వుంది. చిత్రం, శిల్పం రెండూ కలగలసిన విద్య, అజంతా తరువాత లేపాక్షియే! రంగమండపం అందాల నిలయం. మహేంద్రుడి సభ, రంభ, నాట్యం, పద్మినీ జాతి స్త్రీ అందచందాలు, పాంచాల పురుషుడి ధీరగంభీర సుందర విగ్రహం మనలను ఆకట్టుకుంటాయి. పైకప్పు మీద చిత్రించిన బాలకృష్ణుడు, వటపత్రశాయి మూర్తి అతిమనోహరం. ఆ చూపులు మనలను కట్టిపడేస్తాయి. మనం ఎటువైపు వెళ్ళి చూసినా ఆ చూపులు మననే చూస్తుంటాయి. ఆ చిత్రకారుడు, ఏ పద్ధతితో యీ చిత్రం చిత్రించాడో మరి అనూహ్యం! వేళ్లాడే స్తంభాలు మరో విచిత్రం. విరూపణ్ణ కట్టించిన కళామండపం

ప్రత్యేకం. లేపాక్షి బసవయ్య అందచందాలు ముచ్చటగా ధీరగంభీర సుందరంగా దర్శనమిస్తాయి.

అహోబిల క్షేత్రంలో శిల్ప విశేషాలు ఎన్నదగినవి. జక్కనాచార్యుడు అపర విశ్వకర్మ. ఆయన చెక్కిన చెన్నకేశవరాయ స్వామి విగ్రహంలో దోషమున్నదని చెప్పి నిరూపించిన కళావేత్త ఆయన కుమారుడు డక్కశాయే! తండ్రిని మించిన తనయుడు. శిలలో, పుం శిలలు, స్త్రీ శిలలు, నపుంసక శిలలు వుంటాయి. గర్భ శిలను దేవతా శిల్ప నిర్మాణానికి ఉపయోగించరాదు. శిలలు నిదురించి నపుడు తేలికగా వుంటాయి. మేల్కొన్నపుడు బరువుగా వుంటాయి. సత్వరజస్తమోగుణాలు కలిగిన శిలలుంటాయి. ఆయా దేవతాశిల్పాల గుణాలకు అనుగుణంగా శిలను ఎంపిక చేసుకోవాలి. దోషభూయిష్టమైన శిలలు వాడితే వాటి పరిణామాలు తీవ్రంగా వుంటాయి. శిలాస్థాపనకు దేవతా విగ్రహం చెక్కడానికి జపము, తపము, ధ్యానము దీక్ష కావాలి.

**శిల్ప కళకు ఆంధ్రుల కృషి :** మహాభారతంలో విజయుని తీర్థయాత్రా విశేషాలలో, ఉలూచి అనే నాగకన్య ఆయన సౌందర్యం చూసి మోహించి నాగలోకానికి తీసుకుపోయింది. శిల్ప కళ శాతవాహనుల కాలంలో రతనాల గద్దెపై ఎక్కి మురిసిపోయింది. ఇక్ష్వాకుల కాలంలో నాగార్జున కొండలో నాట్యమాడింది. ఆంధ్ర పల్లవుల కాలంలో ముత్యాల పల్లకి ఎక్కి సంబరపడిపోయింది. చాళుక్యులు రాజ్యం చేసే కాలంలో సోయగాలు విరజిమ్మింది. కాకతీయుల బంగారు పరిపాలనలో తెలుగు నేలకు కొత్త అందాలు దిద్దింది. విజయనగర రాజుల కాలంలో వన్నెలతో, చిన్నెలతో అందాలు ఒలకబోసింది. శిల్పకళా శాస్త్ర రహస్యాలలో ఓల లాడింది. ఆంధ్రశిల్పకళాలక్ష్మిని చూసి ప్రపంచమే ఆశ్చర్యపోయింది. ఇంతగొప్పది మన శిల్ప నాగరికత!

శాతవాహనుల కాలంలో బౌద్ధశిల్పం వ్యాప్తి చెందింది. ధాన్యకటకంలో స్థూపాలు, చైత్యాలు వెలసి అదొక మహాబౌద్ధ సంఘారామంగా, గొప్ప విశ్వవిద్యాలయంగా వెలుగొందింది. అమరావతీ స్థూపం ఆనాటిదే! కృష్ణా తీరాన పెందోటలో శిల్పులు ప్రసిద్ధి వహించి శిల్పరాజ్యమే నిర్మించారు.

**అమరావతీ స్థూప కమనీయ శిల్పాలు**
**చివురించెనే మస్తిష్కమందు –**

ఆనందుడు గౌతమీపుత్ర శాతకర్ణి ఆస్థాన శిల్పాచార్యుడు. రెండవ వాడు మహాశిల్పి మహాయాన బౌద్ధ ప్రచారకుడు బోధిసత్త్వ నాగార్జునుడు. ఆనాడు ఘంటశాలలో కూడా శిల్పులుండేవారు. ఆ శిల్పులను గూర్చి విశ్వనాథ సత్యనారాయణగారు "ఘంటశాల పురీకవిత పూర్వాంధ్ర శిల్పాచార్యులకు తల్లియైనదియు" అని ప్రస్తుతించారు. భట్టి ప్రోలు, గుమ్మడిదుఱ్ఱు, శాలిహుండం, గుడివాడ మొదలైన ప్రదేశాలలో బౌద్ధశిల్పం విస్తరించింది.

కొండూరు వారు అమరావతి కావ్యం గురించి యిలా ప్రస్తుతించారు. "మూడువందల యేడులమోఘ తపముచేసి సృష్టించిరీ స్థూప శిల్పకృతుల తపము. సిద్ధహస్తులు మా తెలుగు శిల్పవరులు, తమ కళాశక్తులన్నియు ధారవోసి" ఆ స్థూప సౌందర్యం వర్ణించ యీ చిన్న వ్యాసం చాలదు.

**అది కరుణామూర్తి బుద్ధాంఘ్రి దివ్య**
**పూజకెత్తిన రత్న నీరాజనమ్ము**
**అది జగ చ్ఛాంతి దూత దివ్యావతారు**
**నర్చనము చేయు శిల్ప పుష్పాంజలి పుట."**

ఆ సుందర శిల్పాలు, బౌద్ధ చైత్యాలు, విహారాలు. ఆరామాలు, స్థూపాలు, అవన్నీ నేలమట్టమయ్యాయి. శిల్పాలు విరగ్గొట్టారు. బౌద్ధులను హింసించారు. శాంతిదూత చరిత్రనంతా నాశనం చేశారు. మతకలహాలలో మగ్గిపోయి ఆ సుందరశిల్పాలు, ఆరామాలు కాలగర్భంలో కలసి పోయాయి. అదొక విషాద చరిత్ర! ఆ గాథ మరొక్కసారి కొండూరు వారి అమరావతి కావ్యంలో ఆ విశేషాలన్నీ దర్శనమిస్తాయి.

ఆంధ్రశాతవాహనుల కళాహృదయం అద్భుతమైనది. గుహాలయ నిర్మాణం శాతవాహన ఆంధ్ర శిల్పులే మొదలు పెట్టారు. ఇంకా కార్లే, నాశిక్, నానేఘాట్, ఔరంగాబాదు గుహాలయాలు కూడా వారు నిర్మించినవే! సాంచీ స్థూప ద్వార తోరణ నిర్మాతలు కూడా ఆంధ్ర శాతవాహనులే అని అడవి బాపిరాజు గారి అభిప్రాయం. వారు రచించిన *అడవి, శాంతిశ్రీ*; గోనగన్నారెడ్డి *హిమబిందు* మొదలగు నవలల్లో యీ విశేషాలు కనిపిస్తాయి. రాజకుటుంబాలలోని స్త్రీలు కూడా చైత్యాలు, విహారాలు నిర్మింపజేశారు. కళాపోషణ వారికి ప్రాణం. చాళుక్యుల కాలంలో వెలసినవే అలంపురంలోని నవబ్రహ్మేశ్వ రాలయాలు. భారతదేశంలో మరెక్కడా లేవు. అలంపురంలోని మ్యూజియంలోనూ ఎన్నో అద్భుత శిల్పాలున్నాయి.

---

**డాక్టరు శ్రీమతి ఎ. శ్రీదేవి**
**విశ్రాంత ఆంధ్రోపన్యాసకురాలు, నంద్యాల**

# ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము

*- రావినూతల సత్యనారాయణ*

(కేంద్రసాహిత్య అకాడెమీ పురస్కారం పొందిన పుస్తకాలు : 3)

**(గతసంచిక తరువాయి...2)**

**శ్యామశాస్త్రులు :** సంగీత జిజ్ఞాసువులకు అనేక సంగీత విశేషాలను తెలియ పరచిన సాంబమూర్తి శ్యామశాస్త్రుల వారిని గూర్చి వ్రాస్తూ, ఆయన "వడదేశత్తు వడమాళ్" అనీ, దక్షిణ భారతదేశంలో తమిళం మాట్లాడే బ్రాహ్మణుడని పేర్కొన్నారు. సంగీత పరిశోధకులు తెలియ పరచిన అంశాలనుబట్టి శ్యామశాస్త్రుల వారి పూర్వీకులు ఆంధ్రదేశంలోని కర్నూలు జిల్లా కంభంలో వుండే వారని తెలియు చున్నది.

ఆది శంకరుల కాలం నాటికి, శ్యామశాస్త్రుల వారి పూర్వీకులు కాంచీనగరం వచ్చి, శంకరాచార్యుల వారి ఆదేశానుసారం అచ్చటి కామాక్షి దేవి విగ్రహానికి అర్చకత్వం వహించారట. తర్వాత కాలంలో తులజాజీ మహారాజు ఆదరం సంపాదించి తంజావూరులోని కామాక్షి ఆలయాన్ని కట్టించి, శ్యామశాస్త్రులగారి తండ్రిగారైన విశ్వనాథశాస్త్రి ఆ ఆలయానికి అర్చకత్వాన్ని నిర్వహించినట్లు విదిత మగుచున్నది.

శామశాస్త్రుల వారు విశ్వనాథ శాస్త్రుల వారికి 25వ యేట జన్మించారు. యుక్త వయస్సు వచ్చే సరికి, సంస్కృతాంధ్రాలలో విద్యాభ్యాసం జరిగింది. శ్యామశాస్త్రి మేనమామ ఆయనకు సరళీ వరుసలు మొదలు కొని, స్వర జ్ఞానం వరకు నేర్పించారుట. సంగీత శాస్త్రవేత్త అయిన ఒక యోగీశ్వరుడు యాత్రార్థియై తంజావూరు వచ్చి శ్యామశాస్త్రిలో దాగివున్న సంగీత శక్తులను గుర్తించి, మూడు సంవత్సరాల పాటు శ్యామశాస్త్రికి సంగీత లక్షణ మర్మాలన్నింటిని తెలియపరుచారట.

తండ్రిగారి తర్వాత, కామాక్షమ్మను అర్చన చేసే అధికారం శామశాస్త్రులవారికి వచ్చింది. శామశాస్త్రులవారి జ్ఞానసుధ వికసించి, వారి కృతులు విద్వత్ప్రసిద్ధి పొంద నారంభించినవి. సామాన్య రాగాలలోనే కాక, అపూర్వ రాగాలలోను, అతిక్లిష్టమైన నడకలు గల తాళాలలోను ఆయన సునాయాసంగా కృతులు రచించ మొదలిడినాడు. ఆయన మొదటి కృతి *జననీ నతజన పరిపాలినీ పాహిమాం భవానీ.* శామశాస్త్రులవారి అపార భక్తికి, సంతసించిన దేవి సాక్షాత్కరించి శామశాస్త్రులతో సంభాషించేదని విజ్ఞుల విశ్వాసం. పూజా సమయాలలో భక్తితో పరవశం చెంది ఆయన అద్భుత రచన లొక్కొక్కటి, వెలువడు తుండేవని ప్రతీతి. శామశాస్త్రులు యెక్కువ జీవితం తంజావూరులోనే గడిపారు. శిష్యుడైన అలనూరు కృష్ణయ్యతో కలిసి ఒకసారి మధుర వెళ్ళారని, అచ్చట దేవి సన్నిధిలో తొమ్మిది కృతులు రచించి పాడినారట. ఆ కృతులను *దేవీ నవరత్న మాలిక* అంటారు. శామశాస్త్రి రచనలన్నీ దాదాపు 300 వరకూ వుండవచ్చు నని పేర్కొంటారు. విద్వాంసులు తాళ ప్రస్తారాన్ని గురించిన పథకాలలో ఆయన వ్రాసిన తాళ ప్రతులు దొరికినవట. శాస్త్రులు తెలుగు, సంస్కృత, తమిళ భాషలలో కృతులను రచించారు. శ్యామశాస్త్రులవారికి ఆంనదభైరవి రాగం పైని ప్రత్యేకాభిమానం ఉండటం మూలాన ఆ రాగం లోనే ఎక్కువ కృతులను రచించారు.

**ముద్దుస్వామి దీక్షితులు :** దీక్షితుల వారు వేంకటమఖి పౌత్రుడైన వేంకట వైద్యనాథ దీక్షితుల వారి శిష్యులైన రామస్వామి దీక్షితుల పుత్రునిగా పేర్కొంటారు. రామస్వామి దీక్షితుల వారు ముద్దు కుమారస్వామి సంకీర్తన చేయగా వరప్రసాదియై జన్మించినవాడు ముద్దుస్వామి దీక్షితులు. తమిళులీయనను ముత్తుస్వామి దీక్షితర్ అని పేర్కొంటారు. ముత్తుస్వామి బాల్యంలోనే విద్యాభ్యాసం ప్రారంభించి, అచిర కాలంలోనే వేదాధ్యాయనంలోను మరియు అనేక శాస్త్రములలో పాండిత్యం



ముద్దుస్వామి దీక్షితులు

సంపాదించారు. వీరి జీవిత విశేషములను వివరంగా చర్చించారు గ్రంథ కర్త రజనీకాంత రావు. *(చూడు: ఆ.వా.చ. 357-363 పుటలు).*

త్యాగరాజ సమకాలీనులు. తర్వాతి వారు కర్ణాటక సంగీత వికాసానికి అనేక విధాలుగా తోడ్పడినారు. వారి ప్రభావం, వారందర్ని గూర్చిన విశేషాలు తగురీతిలో చిత్రించాడు. రజనీకాంత రావు. *(చూడు : ఆ.వా.చ. పుటలు : 352-419).* ఇంత వరకు, ఈ వ్యాసంలో 17వ శతాబ్దం ప్రారంభం నుండి 20వ శతాబ్దం వరకు, అనగా గడచిన మూడు శతాబ్దాలలో కర్ణాటక సంగీతపు క్రమ పరిణామానికి తోడ్పడిన వాగ్గేయకారుల జీవిత విశేషాలను, రచనల గూర్చి చెప్పుకొన్నాము. ఆ క్రమపరిణామమే, వివిధ శాస్త్రీయ రచనారీతుల పుట్టుకకు, సంగీత సభాసాంప్రదాయాల అభివృద్ధికి, దోహదం కల్పించి, ఆధునిక కర్ణాటక సంగీత స్వరూపాన్ని తీర్చిదిద్దింది.

**కాలజ్ఞాన తత్త్వకర్తలు :** తాళ్ళపాక ఆధ్యాత్మ సంకీర్తనలు వరవడిగా తీసుకొని, తర్వాతి కాలంలో కాలజ్ఞాన తత్త్వాలు అనే పేరుతో ఆధ్యాత్మిక ప్రబోధం చేసే కీర్తనలను రచించిన వాగ్గేయకారులు చాలామంది పుట్టుక వచ్చారు! వీరిలో చాలామంది పామర జనోద్ధరణమే ఆశయంగా భావించిన వారూ, బ్రాహ్మణేతర కులాలో జన్మించిన వారూ, వేదాలలోను, ఉపనిషత్తులలోను చెప్పబడిన పరమార్థ తత్త్వాన్ని సులభ భాషలో పామర జనానికి అర్థమయ్యే శైలిలో కీర్తనలు వ్రాసి ప్రబోధం చేశారు. ఇలా రచించిన వారు సంగీత శాస్త్రజ్ఞానం కలిగిన వారనిగాని, భాషాకోవిదు లనిగాని అనుకొనుట వీలుపడదు. వీరివలన సంగీత పరిణామానికి, వికాసానికి ఎటువంటి ప్రయోజనం కలుగక పోయినా, శాస్త్రీయ గేయరీతుల నూతన ప్రవాహ వేగంలో దేశీయ గేయ రీతులు కొట్టుకొని పోకుండా కాలజ్ఞాన తత్త్వాల రూపంలో నిలిచి పోయాయి! ఇట్టి తత్త్వజ్ఞుల వివరాలు సమగ్రంగా పేర్కొన్నారు గ్రంథకర్త. అలాగే హరికథా వాగ్గేయకారుల వివరాలు కూడా పొందు పరచ బడ్డాయి. ఈ గ్రంథంలో.

**ఆధునిక వాగ్గేయ కారులు (1850-1956) :** స్థూలంగా నూట యాభై సంవత్సరాల కాలాన్ని ఆధునిక యుగంగా నిర్దేశించు కొన్నారు గ్రంథ కర్త రజనీకాంత రావు.

ఆధునిక యుగపు వాగ్గేయ కారుల రచనలను మూడు విధాలుగా పరిగణించారు.



1. మొదటి విధానానికి చెందిన వారు పూర్తిగా సంగీత విద్వాంసులు, సాహిత్యంలో ప్రవేశం కలిగి గేయ రచన చేసినవారు. 2. పూర్తిగా సాహితీ పరులై కొద్దిగా సంగీతాభిరుచి కల్గి గేయ రచనలు చేసిన వారు. 3. సంగీత సాహిత్యాలలో సమాన ప్రతిభ కలిగి గేయ రచనలు చేసినవారు. పై మూడు శ్రేణులకు అనుగుణ్యమైన చాలా మంది విద్వాంసుల వివరాలను సేకరించి పొందు పరచడమైనది ఈ పుస్తకంలో వారిలో. అత్యంత ప్రతిభా వంతులను గురించి క్లుప్తముగా పేర్కొనడమైనది ఈ వ్యాసంలో.

**తంజావూరు విద్వచ్చతుష్టయము :** ముత్తుస్వామి దీక్షితులకు శిష్యులై స్వాతి తిరునాళ్ ఆస్థాన విద్వాంసులైన చిన్నయ్య, పొన్నయ్య, శివానందం, వడివేలులను తంజావూరు చతుష్టయంగా పేర్కొంటారు. ఈ నలుగురు సోదరులు తెలుగులో అనేక వర్ణాలు, కీర్తనలు, జావళీలు రచించారు. వీరు రచించిన పాటలు చాలా వరకు బృహదీశ్వరుడికి అంకితముగా రచించినవి. ఈ సోదరులలో చిన్నయ్య తానవ వర్ణాదులు రచించినట్లు తెలియుచున్నది. వీరి వర్ణాలు గౌళ, లలిత, ఆనంద భైరవి, కళ్యాణి, శంకరాభరణం, కాంభోజి వంటి ప్రసిద్ధ రాగాలలో ఉన్నవి.

**మహాకవి దాసు శ్రీరాములు (1846-1908) :** వీరు 19వ శతాబ్ది చివరి భాగంలో సాహిత్య వికాస చరిత్రలోను, సంఘాభ్యుదయ చరిత్రలోను అత్యంత ప్రధాన పాత్ర వహించిన యుగపురుషుల కోవకు చెందినవారు. కందుకూరి వీరేశలింగం పంతులుగారికి సమకాలికులు. శ్రీరాములుకి, చిన్న నాటి నుండియే పద్య కవిత లోను, గేయ కవితలోను కౌశలం ప్రస్ఫుటించింది. 12వ యేటనే సోమలింగేశ్వరునిపై ఒక శతకమూ, 14వ యేటనే సాత్రాజితీ అనే యక్షగానం రచించారు! మహాకవి కలం నుండి అనేక రచనలు వెలువడ్డాయి. వీరు దేవీ భాగవతం, ఆశువుగా ఆరు నెలల్లో తెనుగించారు. ప్రఖ్యాతి వహించిన సూర్య శతకంతో పాటు, అభిజ్ఞాన శాకుంతలం, మాలతీ మాధవం, మాళవికాగ్ని మిత్రం, ముద్రా రాక్షసం వంటి ప్రముఖ సంస్కృత నాటకాలు ఆంధ్రీకరించారు.

ఏలూరులో, ఈయన ఆధ్వర్యంలో ఒక గాన పాఠశాల చాలా కాలం నడిచింది. దాసు శ్రీరాములు అనేక కృతులు, స్వర జతులు, పదాలు, జావళీలు రచించిన గొప్ప వాగ్గేయ కారులు. శ్రీరాములు సంగీత రచనలు కొన్నింటిలో సహగేయకారులైన పిఠాపురం వీణాచార్యులు, తుమురాడ సంగమేశ్వర శాస్త్రిగారు స్వర వరుసలను సమకూర్చినట్లు శ్రీద్వారం వెంకటస్వామి నాయుడు రజనీకి వెల్లడించి నట్లు తెలియుచున్నది. అంతేకాక, ఆ కాలములో నట్టువ వారు, రెండు రకాల నాట్య ప్రదర్శనలు చేస్తుండే వారట. ఒకరకం నాట్యాన్ని, భరత నాట్యమనీ, రెండవ విధానాన్ని కర్ణాటక అభినయనమని పిలుస్తుండే వారు. కర్ణాటక అభినయనానికి ఉపకరించే, జావళీలు కొన్ని శ్రీదాసు శ్రీరాములు రచించారు.

ఇటీవలి కాలంలో మహాకవిగారి పదములు, జావళీలు శ్రీయుతులు ఎస్.సి.హెచ్. కృష్ణమాచార్యులు, నూకల చిన్న సత్యనారాయణ, తదితరులు స్వర కూర్పు చేసి, *పదాలు-జావళీలు* అనే పేరుతో గ్రంథ రూపంగా వెలువరించారు. దాసు వారి రచనలు 'దాసు రామ' అనే ముద్రను కలిగి వుంటాయి.

మహాకవి తర్వాత పేర్కొన తగిన, ప్రఖ్యాతి గాంచిన వాగ్గేయ కారులు ముత్తయ్య భాగవతార్ (1877-1945). వీరు తెలుగు, కన్నడ, సంస్కృత, తమిళ భాషలలో అపూర్వ రాగాలలో వివిధ లయ రీతులలో వర్ణాలు, కీర్తనలూ, దరువులు, రాగ మాలికలు, తిల్లానాలు రచించారు. మద్రాసు మ్యూజిక్ అకాడమీ వారు ఈయనను అధ్యక్షునిగా యెన్నుకొనుటయే గాక, 'సంగీత కళానిధి' అనే బిరుదు నిచ్చి సత్కరించారు.

వివిధ వాగ్గేయకారుల రచనల తోను, తమ సంగీత శాస్త్ర పరిశోధనాంశాలను జతపరచి *సంగీత కల్పద్రుమ* అనే గ్రంథాన్ని తమిళంలో రచించారు. వీరికి తిరువాంకూరు విశ్వవిద్యాలయం 1942లో డాక్టరేట్ గౌరవ పట్టాన్ని ఇచ్చింది. భాగవతార్ తమ పరిశోధనల మూలాన చాలా నూతన రాగాలను కనుగొన్నారు. ఆ రాగాలలో కొన్నిటికి బహుళ ప్రచారం లభించింది. ఈయన గోటు వాద్యం, వయొలిన్, మృదంగ వాద్యాలను వాయించడంలో ప్రతిభ గడించారని విజ్ఞులు పేర్కొంటారు.

**మైసూరు వాసుదేవాచార్య (1865-1961) :** వాసుదేవాచార్యుల వారు కృష్ణరాజ వడయారు ఆస్థానంలో పౌరాణిక విద్వాంసులైన సుబ్రహ్మణ్యాచార్యుల వారి పుత్రుడు. ఈయన 1865లో జన్మించాడు. శతవర్షజీవి. అత్యంత ప్రతిభా వ్యుత్పత్తులు గల వీరు మైసూరులో సుబ్బరాయరు గారి వద్దను, వీణ పద్మనాభయ్య గారి వద్దను ప్రాథమిక విద్యాభ్యాసము చేసి, తదుపరి, పట్నం సుబ్రహ్మణ్యయ్యర్ వద్ద ఆరేళ్ళు శిష్యరికం చేసి, సంగీత శాస్త్ర మర్మాలను గ్రహించారు. మైసూరు వాసుదేవాచార్య విద్వత్తును ప్రశంసించి, వివిధ పరిషత్తులు ఆయనకు వివిధములైన బిరుదులు ప్రదానం చేసి సత్కరించాయి. వాసుదేవా చార్యుల వారు అడయారులోని కళాక్షేత్రంలో సంగీతా చార్యులుగా అనేక సంవత్సరాలు పని చేశారు. వాసుదేవాచార్యుల వారు తెలుగులోను, సంస్కృతంలోను, దాదాపు 300 కీర్తనలనూ, వర్ణాలనూ, రాగమాలికలనూ, స్వరజతులనూ రచించారు. వీరి రచనలు భక్తి రస ప్రధానమైనవి. ఈయన కృతులు *వాసుదేవ కీర్తన మంజరి* పేర ప్రచురితమైనవి. వాసుదేవాచార్యుల వారు వ్యాకరణ, సాహిత్యాలలో కూలంకష జ్ఞానంగల పండితులు.

**హరి నాగభూషణం (1884) :** ఆంధ్రమాత ప్రసాదించిన వాగ్గేయకారులలో హరి నాగభూషణం అత్యంత ప్రఖ్యాతి గడించిన వారు. నాగభూషణం తండ్రి గారైన హరి నరసింహ శాస్త్రిగారు పట్నం సుబ్రహ్మణ్యయ్యర్ వద్ద సంగీతాభ్యాసం చేశారు. మైసూరు వాసుదేవా చార్యులు గారు వీరి సహాధ్యాయులు. నరసింహ శాస్త్రిగారు వయొలిన్ వాద్యంలో సిద్ధహస్తులని పేర్కొంటారు. హరి నాగభూషణానికి వీరే ప్రత్యక్ష గురువులు. నాగభూషణం సంగీత సాహిత్యాలలోను, సంస్కృత, ఆంధ్ర, ఆంగ్ల భాషలలో ప్రజ్ఞాశాలి అయిన పండితులు. వీరికి 'వాగ్గేయకార రత్న', 'సంగీత సాహిత్య భావనాపరాయణ', 'వేదాంత పారీణ', 'గాయక సార్వభౌమ' వంటి అనేక బిరుదులున్నాయి.

పైన సూచించిన బిరుదుల వలన హరి నాగభూషణం సంగీత శాస్త్ర వికాసానికి, సంగీత కచేరి విధాన ప్రభావానికి చేసిన అపారసేవ విశదమగు చున్నది. హరి నాగభూషణం అనేక భక్తి రసాత్మక కీర్తనలూ, కొన్ని తాన వర్ణాలను, మరియు కొన్ని హరి కథలను రచించారు.

**హరి నాగభూషణం తాన వర్ణనలలో అత్యంత ప్రసిద్ధమైనవి:** గమన శ్రమ రాగంలో *నంద గోపాబాల యశోదా తనయా* అనేది ఒకటి. మరియు శంకరాభరణ రాగంలో *శ్యామ*

*సుందరాంగ చలము చేయ మేర గాదురా* అనేది ఒకటి. ఈయన కొన్ని రాగాలను స్వయంగా కల్పించారు. వీరి కీర్తనలలో *త్యాగ* అని స్వనామాంకిత ముద్రగా ప్రయోగించారు.

**రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ :** శర్మ ప్రాకృత, సంస్కృత, కన్నడ, తెలుగు భాషలలో కూలంకష పండితులు. సంగీత విద్వాంసులుగా, సాహిత్య విమర్శకులుగా వీరికి గల ఖ్యాతి చాలా తక్కువ మంది విద్వాంసులకు లభించిందంటే, ఏ మాత్రం అతిశయోక్తి కాదు. అనంతకృష్ణ శర్మగారు మైసూరు విశ్వ విద్యాలయంలో సంస్కృతం లోను, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో సంగీతంలోను ఆచార్యులుగా పనిచేసి కృతకృత్యులైన శేముషీ సంపన్నులు, ఈయన ప్రాచీనాంధ్ర కర్ణాటక తమిళ వాగ్గేయకారుల గాన కళా శిల్ప రహస్యాలను, తమ గురువైన బిడారం కృష్ణప్ప శుశ్రూషలో గ్రహించిన సూక్ష్మగ్రాహి. అనంత కృష్ణశర్మ స్వయంగా *పెనుగొండ, సంధ్యాగేయము,* వంటి ఆధునిక కవితా గేయములను రచించి పాడిన వాగ్గేయ కారులు. తాళ్ళపాక వారి గేయ సహస్రమును, సంస్కరించి, ప్రచురిస్తూ, ఆనాటి రాగముల స్వరూపములను, సంగీత క్రమ పరిణామ వికాసాన్ని పరిశోధనల ద్వారా కనుగొని, ఆకీర్తనలకు స్వర సంపుటాలను పునర్నిర్మించి ప్రకటించారు. శర్మ చేసిన ఈ సంగీత సేవను హర్షించి, ప్రశంసించని సంగీత విద్వాంసులు లేరంటే – అది వారి ఘనతకు తార్కాణం.

**మంగళంపల్లి బాలమురళీకృష్ణ :** బాలమురళీకృష్ణ 1930వ సంవత్సరంలో జన్మించారు. వీరి తండ్రి పట్టాభి రామయ్య గొప్ప సంగీత విద్వాంసులు, గాత్రజ్ఞులే కాక, ఫ్లూటు, వయొలిన్, వీణా వాద్యాలలో ప్రసిద్ధులు. బాలమురళీకృష్ణ తల్లి కూడ వీణావాద్యములో అభినివేశము కలవారు. ఐదారేళ్ళ చిరు ప్రాయంలోనే బాలమురళీకృష్ణకి సంగీతంపై మక్కువ కలిగింది. అది గమనించిన పట్టాభి రామయ్య బాలమురళీకృష్ణని పారుపల్లి రామకృష్ణయ్య పంతులు వద్ద శిష్యునిగా చేర్చారు. దైవదత్తంగా లభించిన ఉపజ్ఞతకు గాయక సార్వభౌములైన పారుపల్లివారి గురుత్వం మెరుగు పెట్టింది. 8 ఏండ్ల ప్రాయము నుండి సంగీత కచేరీలు ప్రారంభించారు. మురళీకృష్ణ గురు పరంపర సోపానాములు వేసుకొంటూ, తిన్నగా త్యాగరాజు వరకు తీసుకు పోతుంది! సామాన్య మాటలలో చెప్పాలంటే బాలమురళీ త్యాగరాజు ప్రశిష్యులు!

అటువంటి వాగ్గేయ కారుల కోవలో పెరిగిన బాలమురళీకృష్ణ స్వయంగా వాగ్గేయ కారుని స్థాయికి యెదిగి, స్వయంగా 72 మేళ కర్త రాగాలలోను, రాగానికి ఒక్కొక్క కృతి చొప్పున *జనకరాజ కృతి* మంజరి అనే గ్రంథాన్ని రచించారు. ఈ గ్రంథానికి పండిత ప్రకాండు లైన కాశీకృష్ణాచార్యుల వారూ, విశ్వనాథ సత్యనారాయణ తొలిపలుకు, పీఠికా వ్రాయుట ముదావహం! ఇప్పటికి దాదాపు 25,000 పైగా కచేరీలు చేసి పండిత, పామర ప్రశంసలను అపరిమితంగా పొందిన బాలమురళీకృష్ణ హిందూస్థానీ సంగీత విద్వాంసులైన పండిత్ భీమసేన జోషికి సహకార వాద్యాన్నందించారు. వారితో జుగళ బందీ గానంలో పాల్గొన్నారు. ఈ బృందంలో పండిత్ హరిప్రసాద్ చౌరసియా, కిశోరి అమోంకర్ లాంటి ఉద్ధండులు పాల్గొనటం విశేషం. బాలమురళీకృష్ణ తెలుగు భాషలోనే కాక కన్నడం, తమిళం, మళయాళం, హిందీ, బెంగాలీ, పంజాబి భాషలలో సహితం గానం చేసి, ఆయా ప్రాంత పండిత, పామరుల ప్రశంసలను అందుకొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా, అనేక దేశాలలో తన గాన మాధుర్యం చవిజూపి, రసికులను ఆనంద సాగరంలో ముంచెత్తారు. ఇది తెలుగు వారంతా ఆనందించ వలసిన విషయం.

బాలమురళీకృష్ణ తెలుగు, సంస్కృత, తమిళ భాషల్లో షుమారు 400 కీర్తనలు రచించారు. ఇంకా చెప్పాలంటే బిరుదులు, గౌరవ పట్టాలు, సన్మానాలు 16వేల గోపికలై వీరిని వీడజాలని కౌగిలిలో బిగించాయి. బిరుద పరంపరలో విశేషించి పేర్కొన దగినవి మద్రాసు మ్యూజిక్ అకాడమీ వారి అధ్యక్ష పదవితో కూడిన 'సంగీత కళానిధి', ఆంధ్ర విశ్వవిద్యాలయము వారి 'కళాప్రపూర్ణ', భారత ప్రభుత్వ 'పద్మ విభూషణ్', ఫ్రెంచి ప్రభుత్వ 'షెవలియర్' పేర్కొన దగినవి. దేశంలోని అనేక సంగీత విద్యాపీఠాలకు వీరు ఆస్థాన విద్వాంసులు. ఇది అత్యంత గర్వకారకము.

బాలాంత్రపు రజనీకాంత రావు తమ పుస్తకము లోని చివరి అధ్యాయములో ఆధునిక సాహిత్య పరులలో గేయ కర్తలు అనే విషయాన్ని చర్చిస్తూ – అతి ముఖ్యులైన గేయకర్తలను గూర్చి ప్రస్తావించారు. ముఖ్యంగా గురజాడతో ప్రారంభించి ఆధునిక గేయ కర్తలలో బహువిధ గేయాలను రచించి దేశ హృదయాన్ని చూరగొన్న కవి త్రయాన్ని : బసవరాజు అప్పారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, నండూరి వేంకట సుబ్బారావుల విశిష్టతను వివరించారు.

విప్లవ పంథాలకు దారిజూపిన శ్రీశ్రీ గేయాలకు, అదే ధోరణిలో వ్రాసిన అనిశెట్టి గేయాలకు యువ లోకంలో ప్రత్యేక అభిమానం లభించిన విషయాన్ని వక్కాణించారు.

సుకుమార భావనా, కోమల పద శిల్పముగల వేదుల వారి గేయాలు, పుట్టపర్తి నారాయణాచార్యుల వారి పదాలు, విస్తృత లోకానుభవమూ, రచనా శిల్పంతో, కొత్త పోకడలు గల నార్ల వేంకటేశ్వర రావు గేయాలు, ఆంధ్ర లలిత గాయక లోకానికి ఎన్నో కొత్త వరుసలను ప్రసాదించి, తెలంగాణా వీణ మ్రోగించిన దాశరథీ, నారాయణ రెడ్డిల గేయాలను, తాపీ ధర్మారావు, సముద్రాల రాఘవాచార్యులు, పింగళి, మల్లాది, సదాశివ బ్రహ్మం, ఆత్రేయ, కొసరాజు గేయాలను రచించి తెరపై వెలయించిన విధానాన్ని విశ్లేషించారు.

గ్రంథం ముగింపులో అత్యంత నమ్రతతో రచయిత స్వయంగా చేసిన కృషి వివరించారు. ఈ ఉత్తమ రచనలను, సంగీత సాహిత్య విద్యాంసులే కాక, సంగీతాన్ని అభ్యసించేవారు, సంగీత విషయాలు తెలుసుకునే కుతూహలం కలవారూ – చదువుటయే గాక, సద్వినియోగ పరచు కొంటారని ఆశిస్తూ ఈ వ్యాసంలో సూచించిన ముఖ్య విశేషాలను సింహావలోకనం చేసుకొందాము.

**సింహావలోకనం :** తెలుగు వారు మొదటి నుండియు సంగీతజ్ఞులన్న విషయం, ఈ పుస్తకంలోని వివరాలు స్పష్ట పరుస్తాయి. తెలుగు వారిలో కొందరు లక్షణకర్తలు గాను, కొందరు లక్ష్యకర్తలు గాను, మరి కొందరు కేవలం ప్రయోక్తలు గాను ప్రఖ్యాతి పొందారు. ఈ విషయం ఉదాహరణ సహితంగా తమ పరిశోధనాంశములు జతపరచి సామాన్య పాఠకులకు అర్థమయ్యే శైలిలో విశ్లేషించారు రచయిత రజనీకాంత రావు.

లక్షణకర్తలలో జాయప సేనాని, కల్లి నాథుడు, శార్ఙ్గదేవుడు, సింగ భూపాలుడు, సంగీత శాస్త్రానికి సంబంధించిన స్వతంత్ర గ్రంథాలే కాక వ్యాఖ్యలు వ్రాసిన లాక్షణికులు. అన్నమయ్య *సంకీర్తన లక్షణ* అనే గ్రంథాన్ని రచించినట్లుగా పేర్కొన బడినది. వీరు గాక, అహోబల పండితుడు, గోవింద దీక్షితులు, పోలూరు గోవింద కవి, వేంకటమఖి, సుబ్బరాయ దీక్షితుల పేర్లు ఉల్లేఖించ బడినవి.

లక్షణ కర్తలు, వాగ్గేయకారుల గూర్చిన చర్చలో అనేక మంది ప్రముఖులను గూర్చి వివరాలు పొందు పరచారు రచయిత. ప్రత్యేకించి జయదేవుడు, లీలాశుకుడు, పురందర దాసు, శివనారాయణ తీర్థులు, సిద్ధేంద్ర యోగిని గూర్చి విపులంగా చర్చించారు. భజన సాంప్రదాయానికి చెందిన ముఖ్యులను గూర్చిన చర్చలో భద్రాచల రామదాసు కీర్తనలను గూర్చి చర్చించారు.

**సంగీత మూర్తి త్రయం :** త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రి గారలు సంగీత శాస్త్ర వికాసానికి చేసిన సేవలు, కర్ణాటక సంగీతం పైన వారి ప్రభావాన్ని చక్కగా విశద పరుచుట జరిగింది. ఆధునిక వాగ్గేయ కారులలో హరినాగభూషణం, ఆదిభట్ల నారాయణదాసు, మహాకవి దాసు శ్రీరాములు, మైసూరు వాసుదేవాచార్యులు గణనీయులని వెల్లడించారు. అత్యాధునికులలో రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ, బాలమురళీకృష్ణలను అత్యంత ప్రముఖంగా చిత్రించారు.

ఇటీవల కాలంలో వస్తు వైవిధ్యంలో కొత్త తీరులు ఎన్నో వచ్చాయి. ఈ మార్పుకు కారకులైన వాగ్గేయ కారులను గురించిన వివరణ చివరి అధ్యాయంలో పొందుపరచారు రచయిత. స్వగతంతో అత్యంత ఆకర్షణీయ పద్ధతిలో ముగించారు ఈ పుస్తకాన్ని గ్రంథ కర్త రజనీకాంత రావు.

ఇంతటి మహత్తరమైన గ్రంథాన్ని గురించి వివరణ వ్రాయటం సులభమైన పనికాదు. కఠినమైన ఈ కార్యానికి సంగీత, సాహిత్యాలలో అభినివేశం ఆవశ్యకం. ఈ పనికి సమర్థత చేకూర్చుకునే ప్రయత్నంలో సంగీత శాస్త్రానికి సంబంధించిన అనేక రచనలు చదువ వలసి వచ్చింది. 'నే చదివినవి పెక్కులు' వానిలోని మర్మం మాత్రం గ్రహించ గల్గితే, అత్యంత సంతోషం. అన్యథా, విజ్ఞులు మన్నించి క్షమింప ప్రార్థన.

ఈ వ్యాసం చదివిన తరువాత కొద్దిమందిలో అయినా మూల గ్రంథాన్ని చదివే ఉత్సుకత కలిగితే – ఈ వ్యాసకర్త శ్రమ ఫలించిందని సంతోషిస్తాడు. ఈ రచనకు అనేక వ్యాసములు ఉపకరించినవి. ఆయా రచయితలకు ఇందు మూలమున కృతజ్ఞతలు తెలియజేయడమైనది.

మి

*(అయిపోయింది...)*

ప్రొఫెసర్ రావినూతల సత్యనారాయణ
ఫోన్ : 9618524702



# పూరించిన తెలుగు శంఖం

**– సి. ధర్మారావు**

**జా**తుల జయకేతనాలు భాషలు. వాటి సంస్కృతుల సమహారాలు భాషలు. జాతులు నశిస్తే, వాటి భాషలు నశించటం ఎంత నిజమో, భాషలు నీరసపడితే, జాతులు నీరసపడటమూ అంత నిజం. గత 3 శతాబ్దాల్లో ప్రపంచంలోని సగం భాషలు – రమారమి 3 వేల భాషలు కనుమరుగయ్యాయని ఐ.రా.స. వారి యునెస్కో హెచ్చరిస్తున్నది. ప్రతి ఏటా ఫిబ్రవరి 21ని అంతర్జాతీయ మాతృభాషా దినంగా పాటించమని చెప్పటం ద్వారా, ఈ ప్రమాద ఘంటికలను మనకు నిరంతరం వినిపిస్తున్నది. చిన్న భాషలు ఎట్లా అంతరిస్తాయి? కరవు, కాటకాలు, ఇతర ప్రకృతి ఉత్పాతాలవల్ల మూకవలసల్లో జాతులు చెల్లాచెదురైనప్పుడు ఇది జరుగుతుంది. ఇది అమాంతం ఒక్కసారిగా ముంచుకొచ్చే ముప్పు. పెద్ద భాషలకొచ్చే ప్రమాదం ఇట్లా ఉండదు. అది పూర్తిగా రాజకీయ, ఆర్థిక ఆధిపత్యాల వల్ల కలుగుతుంది. నిన్న మొన్నటి వరకు ఉన్న సామ్రాజ్యవాద దశలో పాలిత జాతుల భాషలు బలహీనపడ్డాయి. ఇప్పటి మాయామేయ 'మార్కెటు' శకంలో ఆర్థిక ఆధిపత్య జాతుల భాషలు బలహీనుల భాషల్ని బలికొంటాయి. చాపకింద నీరులాగా ఈ విధ్వంసం క్రమంగా జరుగుతుంది. బ్రిటీషు భాషావేత్త డేవిడ్ క్రిస్టల్ ఈ మధ్య మనదేశం వచ్చినప్పుడు ఒక మాటన్నాడు. విశ్వభాష (గ్లోబల్ లాంగ్వేజి) గా విస్తరిస్తున్న ఇంగ్లీషు ప్రభావం వల్ల ఈ శతాబ్దంలోనే కొన్ని వందల భాషలు కన్నుమూయడం ఖాయం అన్నాడు. ఎలక్ట్రానిక్ విప్లవం దీన్ని త్వరితపరుస్తుందట.

మన తెలుగు స్వరాష్ట్రంలో ఏడున్నర కోట్లమంది, వెలుపల మరో అంత జనాభా – మొత్తం 15 కోట్లమంది మాట్లాడే పెద్ద భాషే. అయితే మన కళ్ళముందే – మన బడిపిల్లల భాషనుంచి ఎన్ని పదాలు జారిపోతున్నవో గదా. గంట, గరిటె, బడి, బంతి, బుట్ట, జోడు, చెప్పులు, చొక్కా లాగు, పావు, ముప్పావు వంటి మాటలు వాళ్లకి తెలియవు. వాడరు. బడిపిల్లలు సరే, మన వంట గదుల్లో కూడ అన్నం, కూర, పచ్చడి, పప్పు, పులుసు, వేపుడు, ఆఖరికి మంచి నీళ్ళు కూడా కరువైపోతున్నాయి. ఇక బడుగు వర్గాల్లో ఉన్న నుడికారాల సంపద లిఖితంగా నమోదు కాకుండా ఎంత పోగొట్టుకుంటున్నాయో లెక్కలేదు. కళాశాల, వృత్తి విద్యల్లో ఉన్న విద్యార్థులు పొంకంగా నాలుగు వాక్యాలు తెలుగులో – ఆ మాటకొస్తే ఇంగ్లీషులో గాని – రాయలేకపోతున్నారు. విలువైన తెలుగు సాహిత్యం సృష్టించిన కవులూ, కథకులూ, విజ్ఞానఖనులూ మనకున్నారు. వాళ్ల రచనల్నే తమ ఇళ్లల్లో పిల్లలు చదివి ఒంటబట్టించుకుంటున్నారని చెప్పగలమా? శ్రీశ్రీ, కుటుంబరావు, విశ్వనాథుల్ని వాళ్ళెరుగుదురా? ఈ నాడు ఎన్ని తెలుగు కుటుంబాల్లో ఆధునిక సాహిత్య గ్రంథాలు కనబడతాయి? 50 ఏళ్ళు దాటిన వాళ్ళే కొద్దో గొప్పో తెలుగు పాఠకులు. ఈ తరం గడిచిపోయి, కొత్త తరాలు వచ్చేనాటికి ఈ పుస్తకాలతో పని ఉండదు. కొత్త పుస్తకాలు రాసే ప్రయాస గాని ప్రచురించే శ్రమగాని ఉండదు. అంటే, బహుశా, ఇప్పటివారే ఆఖరితరం తెలుగు రచయితలేమో!

శిశువుకు తల్లి స్తన్యంపైన, ప్రాథమిక విద్యార్థికి తన మాతృభాషపైన అలిఖితమైన హక్కు ఉన్నది. తన భాష ద్వారానే పిల్లవాడు తన ఇంటి పరిసరాల్ని, గ్రామాన్ని ప్రాంతాన్నీ ప్రేమిస్తాడు. ఈ దశలో అతగాడికి పరాయి భాషలో చదువు చెప్పటం అంటే, అతన్ని తన వాళ్లనుంచి, తన పరిసరాల్నుంచి, తన జాతి నుంచి వేరుపరచటమే.

ఇట్లా ఇప్పటికే రాష్ట్రంలో నాలుగోవంతు పిల్లల్ని దూరం చేశాం. ఒక వేమన పద్యం, ఒక సుమతీ సూక్తి ఎరగని వాడు తన జాతిని ప్రేమించగలడా? ఎంత మన రాష్ట్ర ప్రభుత్వం ఘోషించినా, మన తెలుగు 'ఎన్నారై'లు ఇక్కడ భారీ పెట్టుబడులు ఎందుకు పెట్టడంలేదు? కర్ణాటకలో,

చెన్నైలో కొంత మెరుగ్గా ఎందుకు పెడుతున్నారు? జవాబు సులభం. మన పిల్లలకి మన భాషను, మన జాతిని ప్రేమించటం మనం నేర్పలేదు గనుక. వాళ్లని శుద్ధ మార్కెటు దినుసులుగా, స్వార్థ జీవులుగా మలిచి మరీ పంపించాం గనుక. ఈ సంగతి కిందటి ముఖ్యమంత్రికి ఎంత చెప్పీ ఒప్పించటం మా తరం కాలేదు. ఇప్పుడు మరొక గట్టి ప్రయత్నం చేయాలి.

కెన్యా మహాకవి, రచయిత గూగీ 17 సంవత్సరాల పాటు తాను ఇంగ్లీషు రచనలు చేసినందుకు సిగ్గుతో చితికిపోయానన్నాడు. బిలియన్ల మాట్లాడే భాషను వదిలేసి, రెండు మిలియన్లు మాత్రమే మాట్లాడే తన మాతృభాష 'గికూయి'నే నమ్ముకున్నాడు. తనకిది పునర్జన్మ. ఇప్పుడు తన జాతి రుణం తీర్చుకుంటున్నానన్నాడు. గాంధీజీ తన ఆత్మకథను గుజరాతీలోను, టాగోరు 'గీతాంజలి'ని తన వంగ భాషలోను రాసుకున్నారని మనకు తెలుసు. విజ్ఞులకి మాతృభాష విషయమై ఇంతకంటే వివరించాల్సిన పనిలేదు. తెలుగు భాషోద్యమ సమాఖ్య మన భాషా దుస్థితికి విరుగుడుగా, ప్రభుత్వానికి రెండు మౌలిక ప్రతిపాదలను చేసింది. మొదటిది - రాష్ట్రంలోని మొత్తం ప్రాథమిక విద్యంతా - అంటే శిశు విద్యనుంచి 5వ తరగతి వరకు - మాతృభాషల్లోనే బోధించడం. రాష్ట్రంలో ఒక భాషా విధానమంటూ ప్రకటించి, దాని అమలుకు ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖను భాషకోసం ఏర్పరచటం రెండోది. ఇవి సాధించగలిగితే, మాతృభాషను కొంతవరకైనా దక్కించు కున్నవాళ్ళమవుతాం. దీనికే ఈ ప్రభుత్వాలని ఒప్పించటం భగీరథ ప్రయత్నం అవుతున్నది. రాష్ట్రంలో వేలాది కవులు, రచయితలు, శాస్త్రవేత్తలు, అధ్యాపకుల సహకారం ఈ ప్రయత్న సాఫల్యానికి ప్రాణావసరమని గట్టిగా మనవి చేస్తున్నాను.

తెలుగు భాషను ఆధునిక విజ్ఞాన వాహికగా, ఉన్నత సాహిత్యాభిరుచుల కాణాచిగా సగర్వంగా నిలబడేట్టు ఏం చెయ్యాలో ఒక బృహత్ ప్రణాళికనే భాషాప్రియులు, జాతి హితపరులు రచించుకోవాలి. మి

*చలసా ధర్మారావు ఇటీవలే కాలధర్మం చెందారు.*

---

- నవ్వులు పూయని రోజు దుర్దినమే...
- మనం ఎక్కువ ఆలోచిస్తాం; తక్కువగా ఫీలవుతాం...
- సుఖాలకు అలవాటు పడటం- విచారకరం ...
- ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదు. నీ కష్టాలు కూడా...
- దేవునితో నాకు పేచీ లేదు. సాటి మనిషితోనే...
- జీవితం దగ్గరగా చూస్తే- ఎంతో విషాదం. కాని దూరపు కొండలు ఎప్పుడూ పచ్చగానే ఉంటాయి...
- మనసారా నవ్వు-నీ బాధను వెలికి తీసి ఆడుకోవచ్చు...
- ఓటమి - ముఖ్యం కాదు. నిన్ను నీవు ఎగతాళి చేసు కోవటానికి ఎంతో ధైర్యం కావాలి...
- నీ మానానికి నిన్ను వదిలేస్తే - జీవితం హాయిగా ఉంటుంది...
- కళా సృష్టిని ఆస్వాదించలేనపుడు... ఇంకొకరు చెప్పినా దాని అందం తెలియదు.



- నేను ఇలాగే ఉంటాను. నాలాగే ఉంటాను. అదే బఫూన్ లాగా. అందుకనే నేను రాజకీయాలకు అతీతంగా ఉన్నా...
- మామూలు జనానికి ఏం కావాలో తెలియదు. కాని ఏది అవసరం లేదో తెలుసు...
- మన అహంకారం మనల్ని రాజ్యభ్రష్టులయిన చక్రవర్తుల్ని తలపిస్తుంది...
- నిరాశ మత్తుమందు లాంటిది. అది నీ బుద్ధిని నిర్లక్ష్యంలోకి తోసి వేస్తుంది... మి

# చదవండి...

- ఎన్నార్కె




✦ **పదాల పరిమళాలు :** విద్యార్థులకు సాహిత్య వ్యాసాలు. రచయిత్రి రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి. పాఠశాల విద్యార్థులకు జీవితం పై అవగాహన కలిగించే చక్కటి, చిక్కటి చిన్న రచనలు.

*పేజీలు : 150, వెల : ₹ 100/-*




✦ **కట్టెపల్క:** రచయిత కందుకూరి అంజయ్య. అణచివేత, అసమానతలపై రచయిత సంధించిన అస్త్రం. మట్టివాసన మానవత్వపు పరిమళాలతో మనల్ని ఆఘ్రాణించమంటాయి ఈ కవితలు. అన్నవరం శ్రీనివాస్ వేసిన అందమైన ముఖచిత్రం బాగుంది.

*పేజీలు : 70, వెల : ₹ 60/-, ప్రతులకు : కందుకూరి అంజయ్య, 10-4-311, సుభాష్ నగర్, కరీంనగర్.*




✦ **తెలుగదేల యన్న :** విశిష్ట సంపుటి. పేరుకు తగ్గట్టుగా నున్న వ్యాస మంజరి. 40 మంది రచయితలు వ్రాసిన వ్యాసాలు. అనుబంధాల పేరుతో తెలుగు మాండలిక సొగసులు, యానం సోయగాలుగా మరో డజను కథలు - వ్యాసాలు ప్రచురించారు. తెలుగు భాషకు సంబంధించి ఇది ఒక సమగ్రమైన వ్యాస సంపుటి. వీనిని సంకలనం చేసిన వారు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వాధ్యక్షులయిన ఎ.బి.కె ప్రసాద్. చారిత్రక పరిశోధకులు. భాషాభిమానులకే కాదు పోటీ పరీక్షలకు వ్రాసే విద్యార్థులు కూడా తప్పక చదవ వలసిన పుస్తకం.

*పేజీలు : 377, వెల : ₹ 200/-*



✦ **చింతల చెట్టు :** వచన కవిత్వం సహజ ప్రకృతి పట్లా, స్నేహ సుగంధాల మానవీయత పట్లా రచయిత్రి సింహాద్రి పద్మ కలం నుంచి జాలువారిన కవితా ఖండికలు.

*పేజీలు : 81, వెల : ₹ 50/-*



✦ **కల్నల్ సి.కె.నాయుడు :** భారతీయ క్రికెట్ చరిత్రలో ప్రసిద్ధమైన మన తెలుగు వాడు నాయుడు. ఆయన క్రికెటర్ గానే తప్ప ఆయన జీవన విశేషాలు ఎవరికి తెలియదు. వాటన్నిటినీ సేకరించి ఒక చక్కటి పూలమాలగా మార్చి అల్లారు. నిత్యం క్రికెట్‌ను శ్వాసించే సి. వెంకటేష్. అతని చేతిలో ఇది సమగ్ర రూపం దిద్దుకుంది. క్రికెట్ అభిమానులే కాదు, అందరూ చదవదగ్గ, చదివింపజేసే రచన.

*పేజీలు : 130, వెల : ₹ 95/- స్వల్పం, ప్రతులకు : విశాలాంధ్ర నవోదయ బుక్ హౌస్‌లు.*




✦ **నన్ను సాయిబును చేసింది వాళ్ళే :** రచయిత షేక్ కరీముల్లా. షేక్ కరీముల్లా ఇస్లాం వాదం అంటూ ఒక సాహిత్య ప్రక్రియను ప్రవేశ పెట్టిన వారిలో ప్రథములు. ముస్లిం సమాజాన్ని నేరస్థుల సమాజంగా ముద్ర వేస్తున్న ఈ సమయంలో ముస్లింలోని మానవత్వ వాదునిగా అన్ని మతాలలోనూ మత తత్వ వాదులు, ఉగ్రవాదులు నశించాలంటూ రచన సాగించారు.

*పేజీలు : 100, వెల : ₹ 50/- ప్రతులకు : ప్రముఖ పుస్తక విక్రయకేంద్రాలు.*



✦ **అలనాటి నెల్లూరు :** ఆ ఊరితో ప్రత్యక్షంగా నున్న అనేక ఘటనల, సంఘటనల సమాహారమిది. ఎంత ఓర్పు, చిత్తశుద్ధి, జిజ్ఞాస, చారిత్రక అభిలాష ఉంటే తప్ప ఇటువంటి రచనలు చేయడం జరగని పని. ఈతకోట సుబ్బారావు గారి కృషి, పట్టుదల ఇందులో కనిపిస్తుంది. ఇది చదవిన తరువాత మిగిలిన జిల్లా వాళ్ళు కూడా ఇలా వ్రాస్తే బాగుంటుందని స్ఫూర్తి నిచ్చేలా ఉంది ఈ పుస్తకం.

*పేజీలు : 150, వెల : ₹ 200/- పాలపిట్ట ప్రచురణ.*




✦ **చాణక్య నీతి మాలికలు :** రచయితలు యల్లాప్రగడ ప్రభాకరరావు, పంగులూరి హనుమంతరావు. రాజనీతిని, సామాజిక నీతిని బహుముఖాలుగా అందించి చరితార్థులుగా ప్రసిద్ధి బడసారు. రాజగురువైన చాణక్యులు. ఈ నీతి మాలికలను అట వెలది, తేటగీతిలలో అందంగా మన కందించారు గ్రంథ కర్తలు.

*పేజీలు : 130, వెల : ₹ 120/-, ప్రతులకు : 040-24141560.*




✦ **జగన్నాథ కథచక్రాల్ :** రచయిత జాగన్నాథశర్మ. నవ్య వీక్లీలో ప్రచురితమైన నూరు మొదటి పేజీ కథలు. కథలు చిన్నవే. ప్రతికథలోనూ పరిమాణంలో ఇమడ లేనంత మానవత్వం దాగుంది. విషయం రీత్యా, శిల్పరీత్యా అమృత గుళికలు లాంటి కథలు.

*పేజీలు 280, వెల : ₹ 160/-, ప్రతులకు - ఫోన్ : విశాలాంధ్ర బుక్ హౌస్*



✦ **నీటి చుక్కలు - నేటి రైతు వెతలు :** సుప్రసిద్ధ సంపాదకులు, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘ పూర్వాధ్యక్షులయిన ఎ.బి.కె. సంకలనం లో వెలువడిన రచనిది. ప్రవహించే బంగారంగా సర్ ఆర్థర్ కాటన్ చే పిలువ బడిన నదీజలాలు, ప్రభుత్వ పనితీరు, ఈ రెంటి మధ్యన నలుగుతున్న బక్కరైతన్న వెతలను, వ్యవసాయ సాధక బాధకాలను గుర్తెరిగిన రైతు బాంధవులయిన రచయితల వ్యాసాలు వంద వరకూ మనల్ని చదివింపజేస్తుంది. మన దేశానికి రైతు వెన్నెముక అన్నది మాటలలోనే కాదు, చేతలలోను మనమతనిని అన్ని విధాలా ఆదుకోవాలని సూచిస్తుంది ఈ పుస్తకం. విషయంతో పోలిస్తే వెల స్వల్పమనే చెప్పాలి.

*పేజీలు : 500, వెల : ₹ 200/- విశాలాంధ్ర నవోదయ బుక్ హౌస్‌లు.*




✦ **తెలుగు కోయిల తేనె పిలుపు :** తమిళనాడు లోని హోసూరు ప్రాంతంలో వెలువడిన తెలుగు వారి కవితలు. సంకలన కర్త డా॥ ఎన్. వసంత్ పరరాష్ట్రంలోని వారి తెలుగు భాషా అభిమానాన్ని చూపుతున్నాయి ఈ రచనలు. బస్తి యువక బృందం ప్రచురణ.

*పేజీలు : 70, వెల : ₹ 30/-, ప్రతులకు : బస్తి యువక బృందం, 2/1097/, బస్తి, ఆవులపల్లి రోడ్డు, హోసూరు - 635109 క్రిష్ణగిరి జిల్లా తమిళనాడు.*




✦ **స్వరగంగ :** ఎం.ఎస్.సుబ్బులక్ష్మి ఎం.ఎస్. ఫౌండేషన్ పక్షాన లకుమ చేసి స్వరగంగ ప్రవాహం. ఎం.ఎస్. పట్ల అభిమానంతో, చిత్తశుద్ధితో లకుమ బూదేశ్వరరావు సమర్పించిన వ్యాస సంపుటి. ఎం.ఎస్. అభిమానులకిదొక చిరస్మరణీయమైన కానుక. ప్రసిద్ధ చిత్రకారులు వేసిన ఆమె చిత్రాలు పుస్తకానికి మరింత శోభనిచ్చాయి.

*పేజీలు : 300, వెల : ₹ 30/-, ప్రతులకు : ఫోన్: 8985924948*




ఎవ్వరీమె...
ఆమె... తల్లి, చెల్లి, కూతురు, తెలివిగల, దయగల నిపుణురాలు.
పనిచేసే వనిత, చూడండి చెప్పులైనా లేవు.
ఆర్ద్రమైన భక్తురాలు.
ఆమె-ఆశ, అందం, శక్తి, నీకు జీవితాన్నివ్వగలదు.
గౌరవాన్నివ్వ గలదు. ప్రేమించ గలదు.
నిన్ను తీర్చి దిద్దగలదు.
నీ కోసం యుద్ధం చేయగలదు. ఆమె అంతులేని ఓర్పు గలది.
ఆమె ఆడది... నీ నుంచి ఏదైనా పొందగల అర్హత కలది!!

---

## 100 బి.సి. నుంచి ఇప్పటికీ...

పేదలు పని చేస్తూనే ఉన్నారు.
ధనికులు శ్రమను దోస్తూనే ఉన్నారు.
సైనికులు రెండు వర్గాలను రక్షిస్తున్నారు.
సామాన్య ప్రజలు పన్నులు చెల్లిస్తూనే ఉన్నారు.
సోమరిపోతులు అందరి బదులు విశ్రాంతి తీసుకుంటూనే ఉన్నారు.
తాగుబోతులు అందరి తరఫునా తాగుతూనే ఉన్నారు.
వడ్డీ వ్యాపారి అందరినీ దోచుకుంటూనే ఉన్నాడు.
న్యాయవాది అందరిని తప్పుదారి పట్టిస్తూనే ఉన్నాడు.
వైద్యుడు రోగుల్ని చంపుతూనే ఉన్నాడు.
కాటికాపరి అంతిమ సంస్కారాలు చేస్తూనే ఉన్నాడు.
రాజకీయ నాయకుడు హాయిగా బతుకుతూనే ఉన్నాడు.
అప్పటి నుంచీ ఇప్పటికీ ఇవి కొనసాగుతూనే ఉన్నాయి...





ఆనందహేల

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2012-14




మధూహాలు